అనుదినం... జనస్వరం
www.navatelangana.com
నవతెలంగాణ
శుక్రవారం 15-9-2023
సమగ్ర తెలుగు దినపత్రిక
సంపుటి : 9 సంచిక : 256
Published from Hyderabad, Rangareddy, Khammam, Karimnagar
16 పేజీలు వెల : 6.50

అనుదినం... జనస్వరం

నవతెలంగాణ

www.navatelangana.com

శుక్రవారం 15-9-2023 సమగ్ర తెలుగు దినపత్రిక

సంపుటి : 9 సంచిక : 208 | Published from Karimnagar, Rangareddy, Hyderabad, Khammam | 12 పేజీలు వెల : 6.50 | 12 పేజీలు వెల : 6.50



రబ్బరు రైతులను కాపాడాలి

ఏఐకేఎస్ ఆధ్వర్యంలో రైతుల పార్లమెంట్ మార్చ్ 2లో..

కాంగ్రెస్ కసరత్తు

రంగంలోకి ఎన్నికల కమిటీలు.. సమావేశాలతో బిజీబిజీ

- మ్యానిఫెస్టో, కమ్యూనికేషన్ కమిటీపై ప్రత్యేక దృష్టి
- ఆ 'ఐదు' హామీలపై స్పెషల్ ఫోకస్
- ప్రతిష్టాత్మకంగా సీడబ్ల్యూసీ సమావేశాలు
- విజయభేరికి భారీగా జనసమీకరణ



నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

కాంగ్రెస్ పార్టీ ఇప్పటిదాకా సభలు, పాదయాత్రలు, ఇతర పార్టీ నేతల చేరికలపై దృష్టి సారించింది. వాటిని కొనసాగిస్తూనే...అంతర్గతంగా యావత్ పార్టీని ఎన్నికలకు సిద్ధం చేస్తున్నది. రాష్ట్రస్థాయి నేతలందరికీ వివిధ కమిటీల్లో బాధ్యతలు అప్పగించింది.ఎన్నికల ప్రక్రియతోపాటు సీడబ్ల్యూసీ సమావేశాలను ఆయా కమిటీలు ప్రతిష్టాత్మకంగా తీసుకుంటున్నాయి. అందులో భాగంగా గత రెండు రోజులుగా ఆయా కమిటీలు సమావేశమై ప్రాథమిక చర్చ ప్రారంభించాయి. దీంతో గాంధీభవన్ రద్దీగా మారింది. అన్ని కమిటీల్లో కెల్ల మ్యానిఫెస్టో కమిటీకి, కమ్యూనికేషన్ అండ్ మీడియా కమిటీకి అత్యంత ప్రాధాన్యత ఇస్తోంది. ఇప్పటికే మ్యానిఫెస్టో కమిటీ సమావేశమై వివిధ వర్గాలతో చర్చలు ప్రారంభించింది. ఈనెల 17న విజయభేరి సభలో ఐదు హామీలపై ఇప్పటికే కసరత్తు పూర్తి చేసి అధిష్టానానికి పంపించినట్టు తెలిసింది. వాటిని పార్టీ అత్యంత గోప్యంగా ఉంచుతున్నది. దీనిపై మ్యానిఫెస్టో కమిటీ చైర్మెన్ శ్రీధర్‌బాబు మాట్లాడుతూ తినబోతు రుచులు ఎందుకు? సోనియాగాంధీ ప్రకటించిన తర్వాత ఇంటింటికి చేర్చుతామని ఆయన నవతెలంగాణకు చెప్పారు. సీడబ్ల్యూసీ సమావేశాలతోపాటు ఎన్నికల సమరంలో పార్టీకి, ప్రజలకు కమ్యూనికేషన్, మీడియా పాత్ర కీలకమని భావిస్తున్నది. అందుకే కమ్యూనికేషన్ అండ్ మీడియా కమిటీ చైర్మెన్‌గా సీనియర్ నేత కుసుమకుమార్‌ను నియమించింది. ఎన్నికల్లో పార్టీ ఇచ్చే హామీలు, బీఆర్ఎస్, బీజేపీని ఎదుర్కొని, వాటికి ధీటైన సమాధానం ఇచ్చేందుకు సోషల్ మీడియాను ప్రముఖంగా ఉపయోగించుకోవాలని భావిస్తోంది. రాష్ట్రస్థాయి నుంచి గ్రామస్థాయి వరకు సోషల్ మీడియా బాధ్యులను నియమిస్తోంది. పార్టీ ఏదైనా ఒక ప్రకటన విడుదల చేసిన వెంటనే అది మారుమూల పల్లెలకు చేరేలా పక్కా ప్లాన్ చేస్తోంది. అధికార పార్టీ వైఫల్యాలను, బీజేపీ విద్వేషపూరిత వ్యాఖ్యలను ఎప్పటికప్పుడు ఎండగట్టేందుకు కార్యాచరణ రూపొందిస్తుంది. తద్వారా ప్రజలకు మరింత దగ్గరై...ఓటర్లను ఆకర్షించేలా ప్రణాళికలు ...11లో

ప్రతి కార్యకర్త తుక్కుగూడకు తరలిరావాలి : ఉత్తమ్

ఈ నెల17న తుక్కుగూడలో జరగబోయే విజయభేరి సభకు ప్రతి కార్యకర్త తరలిరావాలని ఎంపీ ఎన్ ఉత్తమ్ కుమార్‌రెడ్డి తెలిపారు. మొదటిసారి సీడబ్ల్యూసీ సమావేశాల ద్వారా హైదరాబాద్‌లో జరుగుతున్నాయని తెలిపారు. విజయ భేరి సభలో సోనియగాంధీ ఐదు హామీలను విడుదల చేస్తారని, ఈ సభకు ఏఐసీసీ అధ్యక్షులు మల్లిఖార్జున ఖర్గే, సోనియా, రాహుల్, ప్రియాంక గాంధీ హాజరవుతారని తెలిపారు.

పది రోజుల్లో నివేదిక ఇస్తాం : ప్రేమ్‌సాగర్ రావు

కాంగ్రెస్ పార్టీ అధికారం లోకి తీసుకురావడానికి అవసరమైన పక్కా వ్యూహాన్ని తయారు చేస్తున్నామని టీపీసీసీ స్ట్రాటజీ కమిటీ చైర్మెన్ ప్రేమ్‌సాగర్‌రావు వెల్లడించారు. ఆ నివేదికను పది రోజుల్లో అధిష్టానానికి అందజేస్తామన్నారు. తొమ్మిదిన్నరేండ్లలో బీఆర్ఎస్ ఇచ్చిన హామీలను అమలు చేయలేదన్నారు. సీఎం కేసీఆర్ పాలనలో ప్రజలు అనేక ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.

తప్పనిసరిగా హాజరుకండి

- పార్లమెంట్ సభ్యులకు కాంగ్రెస్, బీజేపీ విప్‌లు జారీ



వివరాలు 11లో..

కేంద్ర న్యాయశాఖ మంత్రి నెం.1 అవినీతి పరుడు

- అర్జున్ రామ్ మేఘ్వాల్ పై బీజేపీ సీనియర్‌నేత కైలాష్ మేఘ్వాల్ ఆరోపణ
- సస్పెండ్ చేసిన బీజేపీ
- కేంద్ర మంత్రి అవినీతిపరుడని విమర్శించడమే నేరం



వివరాలు 11లో..

కవితకు మరోసారి ఈడీ నోటీసు

- నేడు విచారణకు రావాలని పిలుపు




వివరాలు 11లో..

బీఆర్ఎస్ డైలమా

'ఇండియా'నూ కావాలందామా.. 'భారత్'కే జై కొడదామా?

- ఎటూ తేల్చుకోలేని బీఆర్ఎస్
- నేటి పార్లమెంటరీ పార్టీ సమావేశంలో స్పష్టత వచ్చే అవకాశం



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

'ముందు నుయ్యి.. వెనుక గొయ్యి...' అన్నట్టుగా ఉంది అధికార బీఆర్ఎస్ పరిస్థితి. కేంద్రంలోని బీజేపీ సర్కారుకు వ్యతిరేకంగా ప్రతిపక్షాలన్నీ ఏకమై 'ఇండియా' కూటమిని ఏర్పాటు చేసిన దరిమిలా... కక్కలేక మింగలేక కుడితిలో పడ్డ మోడీ సర్కార్ 'భారత్' అనే కొంగొత్త ఎజెండాను ముందుకు తెచ్చింది. మన దేశం పేరును ఇండియాగా కాకుండా భారత్‌గా మారుస్తామంటూ జీ-20 సమావేశాల సందర్భంగా చెప్పకనే చెప్పింది. ఇది రేపు పార్లమెంటులో చర్చకొస్తే ఏం చేయాలి..? అన్నది బీఆర్ఎస్‌కు సమస్యగా ఉన్నది. దీనిపై ఇప్పటికే అన్ని పార్టీలూ తమ తమ వైఖరులను స్పష్టం చేశాయి. కేంద్ర వైఖరికి అనుకూలంగానో, వ్యతిరేకంగానో తమ తమ అభిప్రాయాలను వెల్లడించాయి. కానీ బీఆర్ఎస్ మాత్రం ఇప్పటికీ తన వైఖరిని స్పష్టం చేయకపోవటం గమనార్హం. ఇటీవల మారిన రాజకీయ పరిణామాల రీత్యా కమలానికి గులాబీ దగ్గరవుతోంది. మేం తటస్థం అని ఎంత చెప్పినా ప్రజలు నమ్మే స్థితిలో లేరు. ఈ నేపథ్యంలో సీఎం కేసీఆర్... ఇండియాకు కాకుండా భారత్‌కే జై కొడతారనే వాదనలు బలంగా వినబడుతున్నాయి. అయితే ఇక్కడ కారు పార్టీకి ఒక సమస్య ఎదురవుతుందని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. బీఆర్ఎస్ భారత్‌కు జై కొడితే... బీజేపీకి అది మరింత సాగిలబడిందనే సంకేతాలు వెలువడతాయి. అలాగాకుండా ఇండియా పేరే కొనసాగాలని కోరితే కమలం పార్టీతో కారు పార్టీకి మరిన్ని తలనొప్పులు తప్పవు. ఇప్పటికే ఢిల్లీ లిక్కర్ కేసులో ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవితకు ఈడీ మరోసారి నోటీసులు జారీ చేసిన విషయం విదితమే. అయితే కేవలం బీజేపీ, బీఆర్ఎస్‌కు మధ్య ఎలాంటి బంధమూ లేదని చెప్పేందుకే ఈ నోటీసులు ఇచ్చారనే చర్చ కూడా కొనసాగుతున్నది. అందువల్ల ఈ తతంగం 'నామ్ కే వాస్తే'గా ఉండాలన్నా, ముున్ముందు మోడీ సర్కార్‌తో ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఉండాలన్నా కచ్చితంగా బీఆర్ఎస్... భారత్‌కే జై కొట్టాల్సి ఉంటుందనే వాదనలు కూడా వినబడుతున్నాయి. ఇందుకు సంబంధించి గురువారం హైదరాబాద్‌లో నిర్వహించే బీఆర్ఎస్ పార్లమెంటరీ పార్టీ సమావేశంలో స్పష్టత వస్తుందా..? లేదా..? అన్నది చూడాలి.

జమిలితో అయోమయం

జమిలీ ఎన్నికలొస్తాయనే వార్తలు, ఊహాగానాలతో బీఆర్ఎస్ ఉక్కిరిబిక్కిరవుతోంది. అసెంబ్లీ ఎన్నికల కోసం మూణ్నెల్ల ముందే తొందరపడి తొలి జాబితాను ప్రకటించటంతో బీఆర్ఎస్‌కు చెందిన సిట్టింగ్ ఎమ్మెల్యేలు, సీనియర్లు ఇప్పుడు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఒకవైపు అసమ్మతి అదుపులోకి రాకపోగా.. మరోవైపు ఎన్నికల దాకా క్యాడర్‌ను, లీడర్లను 'జాగ్రత్తగా చూసుకోవాల్సి రావటం' తమకు తలకు మించిన భారంగా మారుతోందని వాపోతున్నారు. ఇలాంటి పరిస్థితుల్లో జమిలీ ఎన్నికలకు కేంద్రం పచ్చజెండా ఊపితే... శాసనసభ ఎన్నికలు మరో రెండు మూడు నెలలు వాయిదా పడటం ఖాయం. అదే జరిగితే తొలి జాబితాలోని అభ్యర్థులకు ఐదారు నెలలపాటు 'పైసల' పాట్లు తప్పవు. ఇది తలుచుకుంటేనే భయంగా ఉందని బీఆర్ఎస్‌కు చెందిన ఓ సీనియర్ నేత ఆవేదన వ్యక్తం చేశారు. 'షెడ్యూల్ ప్రకారం ఎన్నికలు జరిగితే ఓకే. అలాగాకుండా జమిలీ ఎన్నికలు వస్తే మాత్రం గెలుపు మాకు తలకు మించిన భారమవుతుంది. మేం ఎక్కువ కష్టపడాల్సి వస్తుంది. ఇది మా పార్టీకి ఇబ్బందికర పరిణామమే...' అని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు.

చరిత్రను వక్రీకరిస్తే కాలగర్భంలో కలుస్తారు

ఇచ్చిన హామీలు అమలు చేయని పాలక పార్టీలను నిలదీయండి : జూలకంటి పిలుపు

- సీపీఐ(ఎం)లో పెద్దఎత్తున చేరిన యువకులు, మహిళలు



నవతెలంగాణ- అడవిదేవులపల్లి

చరిత్రను వక్రీకరిస్తే కాలగర్భంలో కలిసిపోతారని మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి అన్నారు. నల్లగొండ జిల్లా దామరచర్ల, అడవిదేవులపల్లి మండలాల్లో ప్రజా సమస్యల అధ్యయనం కోసం ప్రజా చైతన్య యాత్ర కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా జూలకంటి రంగారెడ్డి నాయకత్వంలో మహిళలు, యువకులు పెద్దఎత్తున సీపీఐ(ఎం)లో చేరారు. అనంతరం జూలకంటి మాట్లాడుతూ.. పాలక పార్టీలు ఇచ్చిన హామీలు నెరవేర్చకపోతే ఆ పార్టీల నేతలను ఎక్కడికక్కడ నిలదీయాలని ప్రజలకు పిలుపునిచ్చారు. బీఆర్ఎస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ...11లో

సనాతన ధర్మాన్ని నాశనం చేస్తున్నారు


ప్రతిపక్షాలపై మోడీ విమర్శలు.. మండిపడిన కాంగ్రెస్



భోపాల్ : అహంకారపూరితమైన ప్రతిపక్ష కూటమి సనాతన ధర్మాన్ని నాశనం చేయాలని ప్రయత్నిస్తోందని ప్రధాని నరేంద్ర మోడీ విమర్శించారు. స్వామి వివేకానంద, లోకమాన్య తిలక్ వంటి వారికి సనాతన ధర్మం స్ఫూర్తినిచ్చిందని గుర్తు చేశారు. మధ్యప్రదేశ్‌లోని బినాలో పారిశ్రామిక ప్రాజెక్టులను గురువారం ప్రారంభించిన అనంతరం జరిగిన కార్యక్రమంలో మోడీ ప్రసంగించారు. 'ఈ రోజు వారు బహిరంగంగా సనాతన ధర్మాన్ని లక్ష్యంగా చేసుకోవడం మొదలు పెట్టారు. రేపు మనపై దాడులు పెంచుతారు. దేశంలోని సనాతనవాదులు, దేశాన్ని ప్రేమించే వారు జాగరూకతతో వ్యవహరించాలి' అని ప్రజలను కోరారు. మధ్యప్రదేశ్‌లో బీజేపీ నేతృత్వంలోని ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి ప్రాజెక్టులకు కోట్లాది రూపాయలు ఖర్చు చేస్తున్నారని, అనేక రాష్ట్రాల వార్షిక బడ్జెట్ల కేటాయింపుల కంటే ఇది అధికమని ఆయన చెప్పారు. రాష్ట్రాన్ని గతంలో పరిపాలించిన కాంగ్రెస్ ప్రభుత్వాలు అవినీతి, నేరాలు తప్ప సాధించిందేమీ లేదని ...11లో

చంద్రబాబు బెయిల్ కేసు 20కి వాయిదా

టీడీపీతో కలిసే పోటీ : స్పష్టతనిచ్చిన జనసేన అధినేత పవన్‌కళ్యాణ్



అమరావతి : ఇరిగేషన్ ప్రాజెక్టుల సందర్శనకు వెళ్లేప్పుడు జరిగిన ఘటన నేపథ్యంలో అన్నమయ్య జిల్లా ముదివేడు పోలీసులు నమోదు చేసిన కేసులో ముందస్తు బెయిల్ ఇవ్వాలని కోరుతూ టిడిపి అధినేత చంద్రబాబు నాయుడు దాఖలు చేసిన పిటిషన్‌పై హైకోర్టు విచారణ ఈ నెల 20కి వాయిదా పడింది. ఈ వ్యవహారంపై సమగ్ర వివరాలతో కౌంటర్ దాఖలు చేయాలని పోలీసులను ఆదేశించింది. ప్రతివాదులైన ముదివేడు పోలీస్ స్టేషన్ హౌస్ ఆఫీసర్, అన్నమయ్య జిల్లా ఎస్పీకి నోటీసులు జారీ చేస్తూ జస్టిస్ కె సురేష్‌రెడ్డి గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. ముదివేడు పోలీసులు తనపై కేసు (79/2023) నమోదుచేశారని, ఈ కేసులో బెయిల్ ఇవ్వాలని చంద్రబాబు పిటిషన్ దాఖలు ...11లో

బీహార్‌లో బోటు బోల్తా..



12 మంది గల్లంతు

పాట్నా : బీహార్‌లోని ముజఫర్ పూర్ జిల్లా బాగ్మతి నదిలో గురువారం ఘోర ప్రమాదం జరిగింది. 30 మంది విద్యార్థులతో వెళ్తున్న బోటు నదిలో బోల్తాపడింది. ఈ ఘటనలో ఆరుగురు చిన్నారులుసహా 12 మంది గల్లంతైనట్టు అధికారులు తెలిపారు. గైఘాట్‌లోని బెనియాబాద్ ఒపి ప్రాంతంలోని మధుపూర పట్టి ఘాట్ వద్ద బోటు బోల్తా పడినట్టు అధికారులు తెలిపారు. నదికి ఆవతల ఉన్న పాఠశాలకు వెళ్లేందుకు విద్యార్థులు బయల్దేరారని, బోటు బ్యాలెన్స్ కోల్పోవ డంతో బోల్తా పడిందని పేర్కొన్నారు. స్థానిక పోలీసులతోపాటు ఎన్‌డిఆర్ఎఫ్, ఎస్‌డిఆర్ఎఫ్ బృందాలు ఘటనా స్థలంలో సహాయక చర్యలు ప్రారంభిం చాయి. బీహార్ ముఖ్యమంత్రి నితీష్‌కు మార్ మీడియాతో మాటా ్లడుతూ ఘటనా స్థలానికి జిల్లా సీనియర్ అధికారులను పంపించామని తెలిపారు. రెస్క్యూ ఆపరేషన్ జరుగుతోందని, బాధిత కుటుంబాలను అన్ని విధాలా ఆదుకుంటామని చెప్పారు. 20 మందిని రక్షించామని, మిగిలిన వారి ఆచూకీ కోసం రెస్క్యూ ఆపరేషన్ కొనసాగిస్తున్నా మని ఎన్‌డిఆర్ఎఫ్ అధికారి రణదీర్‌సింగ్ తెలిపారు.

ఆర్టీసీ బిల్లుకు గవర్నర్ ఆమోదం



- ధన్యవాదాలు తెలిపిన కార్మిక సంఘాలు
- పెండింగ్‌లోనే ప్రయివేటు యూనివర్సిటీల బిల్లు

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ (టీఎస్ఆర్టీసీ)ను ప్రభుత్వంలో విలీనం చేసే బిల్లుకు గవర్నర్ తమిళిసై సౌందరరాజన్ గురువారం ఆమోదముద్ర వేశారు. ఆమె చేసిన 10 సిఫారసుల విషయంలో ప్రభుత్వ స్పందనపై సంతృప్తి ...2లో


ఆగని మృత్యుఘోష

లిబియా జల ప్రళయంలో 20 వేలకు చేరిన మృతుల సంఖ్య



డెర్నా : ఆఫ్రికా దేశమైన లిబియాలో తుఫాను, వరదలు భీభత్సం సృష్టించాయి. జల ప్రళయంలో వేలాది మంది మరణించారని అధికారులు తెలిపారు. మృతుల సంఖ్య 20,000 చేరినట్టు అంచనా వేస్తున్నారు. డెర్నా వీధులన్నీ మృతదేహాలతో నిండిపోయాయి. తమ ఆప్తుల కోసం శవాల గుట్టల మధ్య కలియ తిరుగుతున్న దృశ్యాలతో ఆ ప్రాంతం హృదయవిదారకంగా మారింది. ఆదివారం రాత్రి లిబియా తీర ప్రాంతాన్ని తాకిన డేనియల్ తుఫాను కొన్నిగంటల వ్యవధిలోనే తీవ్ర రూపం దాల్చింది. దీంతో ఆకస్మిక వరదలతో రెండు డ్యాములు కొట్టుకుపోయాయి. తీరప్రాంతాలపై ...11లో

ఆవిరి యంత్రం టూ ఆధునిక కంప్యూటర్



కొత్త పుంతలు తొక్కుతున్న ఇంజినీరింగ్ రంగం

- మోక్షగుండం విశ్వేశ్వరయ్య విశిష్ట సేవలు
- పారిశ్రామిక విప్లవానికి నాంది ఆవిరి యంత్రం
- నేడు జాతీయ ఇంజినీర్స్ డే

మేకల కృష్ణ

'ఇంజినీరింగ్ అంటే శాస్త్ర సాంకేతిక పరిజ్ఞానాన్ని నిజజీవితంలో అవసరమైన నిర్మాణాలు, వ్యవస్థలు, యంత్రాలు, వస్తువులు, పదార్థాలను తయారు చేయడానికి ఉపయోగించే ఒక అధ్యయన శాస్త్రం. ఇంజినీరింగ్ పదం ఇంజన్ నుంచి వచ్చింది. పారిశ్రామిక విప్లవానికి నాంది పలికిన ఆవిరి యంత్రం మొదలుకొని నేటి ఆధునిక సాఫ్ట్‌వేర్ ఇంజినీరింగ్ ద్వారా అందించే వస్తువులను ఆధునిక సమాజం తన దైనందిన జీవితంలో ఉపయోగిస్తుంది. యంత్రాలు, వంతెనలు, భవనాలు, వాహనాలు, ప్రాజెక్టులు, రహదారులు, కంప్యూటర్లు ఇలా అన్నీ ఇంజినీరింగ్ సృష్టించిన అద్భుతాలే. అందుకే ఇంజినీరింగ్ రంగం ఎంతో విశాలమైనదిగా చెప్పవచ్చు. ప్రాచీన కాలంలో మన పూర్వీకులు తయారు చేసిన చక్రం, పుల్లీ, లివరు మొదలు భవనాలు, గృహోపకరణాలు, రోడ్లు, రైళ్లు, అంతరిక్ష నౌకల వరకు ఇంజినీరింగ్ వినియోగం విస్తరిస్తూ వచ్చింది. మానవ జీవితంలో ఎంతో విశిష్టతను సంతరించుకున్న ఇంజినీరింగ్ రంగంలో విశిష్ట సేవలందించిన ప్రముఖ సివిల్ ఇంజినీర్ మోక్షగుండం విశ్వేశ్వరయ్య పేరిట సెప్టెంబర్ 15న మన దేశంతో పాటు ఇతర దేశాల్లో ఇంజినీర్స్ డేగా జరుపుకుంటున్నాం.

ఇంజినీర్స్ డే..

మైసూర్ రాజ్యంలోని ముద్దెనహళ్లిలో 1861 సెప్టెంబర్ 15న జన్మించిన మోక్షగుండం విశ్వేశ్వరయ్య ...2లో

ఆర్టీసీ బిల్లుకు గవర్నర్ ఆమోదం

(మొదటిపేజీ తరువాయి)

చెంది ఆ బిల్లును ఆమోదిస్తూ సంతకం చేశారు. ఈ సందర్భంగా ఆర్టీసీ ఉద్యోగులకు ఆమె అభినందనలు తెలిపారు. దీంతో ఆర్టీసీ కార్మికులు ఇక ప్రభుత్వ ఉద్యోగులుగా మారనున్నారు. ఆర్టీసీ కార్మికులను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తిస్తూ శాసన సభలో ప్రభుత్వం ప్రవేశపెట్టిన బిల్లును గవర్నర్ ఆమోదం కోసం రాజ్‌భవన్‌కు పంపిన విషయం తెలిసిందే. అయితే గవర్నర్ కొన్ని అంశాలపై అధికారులను, న్యాయ నిపుణులను వివరణ అడిగారు. అంతేకాకుండా 10 సిఫారసులు చేశారు. వీటిపై ప్రభుత్వ వివరణతో సంతృప్తి చెందిన తమిళిసై గురువారం బిల్లుకు ఆమోదం తెలిపారు. దీంతో తెలంగాణ ఆర్టీసిలో పనిచేస్తున్న మొత్తం 43,373 మంది కార్మికులు ప్రభుత్వోద్యోగులుగా మారనున్నారు.

ప్రజారవాణా వ్యవస్థను పటిష్ఠం చేసేందుకు, సేవలను ఇంకా విస్తృత పరిచేందుకు సంస్థలో పనిచేస్తున్న వారందరినీ ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని ఇటీవల మంత్రి మండలి నిర్ణయించిన సంగతి తెలిసిందే. ఆర్టీసీ కార్మికులు గతంలో సమ్మె చేసిన అంశాన్ని పరిగణనలోకి తీసుకొని ఈ సానుకూల నిర్ణయం వెలువరించింది. దీనిపై విధివిధానాలు, నిబంధనలను రూపొందించేందుకు రాష్ట్ర ఆర్థికశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అధ్యక్షతన ఆర్‌అండ్ బీ, రవాణాశాఖ,జిఎడి శాఖ కార్యదర్శులు, కార్మికశాఖ ప్రత్యేక కార్యదర్శి సభ్యులుగా కమిటీని ఏర్పాటు చేసింది. దీనికి సంబంధించిన బిల్లును వర్షాకాల సమావేశాల్లో ప్రవేశపెట్టి.. తుది ఆమోదం కోసం గవర్నర్‌కు పంపింది. తాజాగా ఈ బిల్లుకు గవర్నర్ ఆమోదం తెలిపారు.

గవర్నర్ ఆర్టీసీ బిల్లుకు ఆమోదం తెలపడం పట్ల కార్మిక సంఘాలు హర్షం వ్యక్తం చేశాయి. టీఎస్‌ఆర్టీసీ స్టాఫ్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ (ఎస్‌డబ్ల్యూఎఫ్) అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు వీరాంజనేయులు, వీఎస్ రావు, టీఎమ్‌యూ వ్యవస్థాపక అధ్యక్షులు అశ్వత్థామరెడ్డి, టీజేఎమ్‌యూ ప్రధాన కార్యదర్శి కే హన్మంతు, ఎన్‌ఎమ్‌యూ అధ్యక్షులు పీ కమాల్‌రెడ్డి, ఎంప్లాయీస్ యూనియన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు బాబు, కే రాజిరెడ్డి, టీఎమ్‌యూ ప్రధాన కార్యదర్శి థామస్‌రెడ్డి తదితరులు వేర్వేరు ప్రకటనల్లో గవర్నర్‌కు కృతజ్ఞతలు తెలిపారు. ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేయడంకంటే ముందు పలు సమస్యల్ని పరిష్కరించాల్సి ఉందనీ, వాటిపై ప్రభుత్వం సానుకూలంగా స్పందించాలని విజ్ఞప్తి చేశారు. దీనిపై ప్రభుత్వం సాధ్యమైనంత త్వరగా గెజిట్ విడుదల చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా టీఎస్‌ఆర్టీసీ చైర్మెన్ బాజిరెడ్డి గోవర్థన్ గవర్నర్‌కు కృతజ్ఞతలు, సీఎం కేసీఆర్‌కు ధన్యవాదాలు తెలిపారు.

ప్రయివేటు వర్సిటీల బిల్లు ఏమైంది?

రాష్ట్రంలో ఐదు ప్రయివేటు విశ్వవిద్యాలయాల ఏర్పాటుకు సంబంధించిన బిల్లును శాసనసభ, శాసనమండలి రెండోసారి ఆమోదించి గవర్నర్ ఆమోదం కోసం పంపించాయి. గతనెల ఐదో తేదీన ఆ బిల్లును పంపినా ఇంత వరకు గవర్నర్ ఆమోదముద్ర వేయలేదు. అయితే టీఎస్‌ఆర్టీసీ కార్మికులను ప్రభుత్వ ఉద్యోగులుగా మారుస్తూ అసెంబ్లీ ఆమోదించిన బిల్లును గవర్నర్ ఆమోదించడం గమనార్హం.

ఈ నేపథ్యంలో గవర్నర్ వద్ద పెండింగ్‌లో ఉన్న ప్రయివేటు విశ్వవిద్యాలయాల బిల్లు ఏమైందన్నది ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది. ఆ బిల్లు ఆమోదం కోసం వేలాది మంది విద్యార్థులు ఎదురుచూస్తున్నారు. రాష్ట్రంలో 2021-22 విద్యా సంవత్సరంలో మహీంద్రా, మల్లారెడ్డి, వాక్సన్, అనురాగ్, ఎస్‌ఆర్ విద్యా సంస్థలు ప్రయివేటు విశ్వవిద్యాలయాలను నెలకొల్పాయి.

గతేడాది సెప్టెం బర్ 13న రాష్ట్రంలో మరో ఐదు ప్రయివేటు విశ్వవిద్యాలయాలను నెల కొల్పుతూ ప్రవేశపెట్టిన బిల్లుకు శాసనసభ, శాసనమండలి ఆమోదం తెలి పాయి. అందులో శ్రీనిధి విశ్వవిద్యాలయం (ఘట్‌కేసర్), గురునానక్ విశ్వవిద్యాలయం (ఇబ్రహీంపట్నం), నిక్‌మర్ కన్‌స్ట్రక్షన్ విశ్వవిద్యాలయం (శామీర్‌పేట), ఎంఎన్‌ఆర్ విశ్వవిద్యాలయం (సంగారెడ్డి), కావేరి విశ్వవిద్యాలయం (గౌరారం) ఉన్నాయి. రాష్ట్ర ప్రభుత్వం ఈ బిల్లును గవర్నర్ ఆమోదం కోసం పంపించింది. కానీ ఆమె ఆమోదించకుండా రాష్ట్ర ప్రభుత్వానికి తిరిగి పంపించారు. అయితే గతనెల ఐదో తేదీన ఐదు ప్రయివేటు విశ్వవిద్యాలయాల బిల్లును రాష్ట్ర ప్రభుత్వం మళ్లీ ప్రవేశపెట్టి శాసనసభ, శాసనమండలి ఆమోదం పొందింది. దాన్ని గవర్నర్ ఆమోదానికి తిరిగి పంపించింది.

దానిపై ఇంకా నిర్ణయం తీసుకోలేదు. అయితే రెండోసారి అసెంబ్లీ ఆమోదించిన బిల్లును గవర్నర్ తప్పనిసరిగా ఆమోదించాల్సి ఉంటుందని నిబంధనలు చెప్తున్నాయి. అయినా ఇంకా ఆ బిల్లును గవర్నర్ ఆమోదించకపోవడంతో వేలాది మంది విద్యార్థులు ఆందోళన చెందుతున్నారు. మరోవైపు అనుమతి లేకుండానే అడ్మిషన్లు చేపట్టిన గురునానక్, శ్రీనిధి ప్రయివేటు విశ్వవిద్యాలయాల్లో 3,177 మంది విద్యార్థులు చేరిన విషయం తెలిసిందే. ఆ బిల్లును గవర్నర్ ఆమోదించకపోవడంతో వారి భవిష్యత్తు ఆగమ్యగోచరంగా మారింది. వారిని ఇతర విశ్వవిద్యాలయాలు, కాలేజీల్లో సర్దుబాటు చేయాలని ప్రభుత్వం నిర్ణయించినా ఇంతవరకు అందుకు సంబంధించిన ఉత్తర్వులు విడుదల కాలేదు.

కౌంటర్ వేసే తీరిక లేదా?

- ప్రభుత్వాన్ని ప్రశ్నించిన హైకోర్టు

నవతెలంగాణ -హైదరాబాద్

నోటరీ చేసిన ఇండ్ల స్థలాలను రెగ్యులరైజేషన్‌కు వీలుగా జులై 26న ఇచ్చిన జీవో 84ను సవాల్ చేసిన పిల్‌లో కౌంటర్ దాఖలు చేసే తీరిక కూడా లేదా అని హైకోర్టు రాష్ట్ర ప్రభుత్వాన్ని ప్రశ్నించింది. గత ఆదేశాలకు అనుగుణంగా కౌంటర్ పిటిషన్ దాఖలు చేయకపోవడంపై అసంతృప్తిని వెలిబుచ్చింది. గత విచారణలో రెండు వారాల గడువు అడిగితే ఇచ్చామనీ, ఇప్పుడు మళ్లీ మూడు వారాల గడువు కోరడం ఏమిటని ప్రశ్నించింది. వారం రోజులే గడువు ఇస్తున్నట్టు చెప్పింది. జీవో 84ను సవాల్ చేస్తూ భాగ్య నగర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ వేసిన పిల్‌ను చీఫ్ జస్టిస్ అలోక్ అరధే, జస్టిస్ శ్రవణ్‌కుమార్‌ల డివిజన్ బెంచ్ గురువారం మరోసారి విచారించింది. నోటరీ జాగాలను రెగ్యులరైజ్ చేస్తే భూదందాలు, కబ్జాదారుల ఆగడాలు పెరిగిపోతాయని పిటిషనర్ లాయర్ ఆందోళన వ్యక్తం చేశారు. 125 చదరపు గజాలు, అంతకంటే తక్కువ ఉన్న స్థలాలు, అందులో కట్టుకున్న ఇళ్లను రెగ్యులరైజ్ చేయాలన్న జీవోను కొట్టేయాలనీ, ఈలోగా జీవోపై స్టే ఇవ్వాలని కోరారు. విచారణ తిరిగి 21కి వాయిదా పడింది.

రబ్బరు రైతులను కాపాడాలి

స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందాలను రద్దు చేయాలి

- కంపెనీలకు సీసీఐ విధించిన రూ.1,788 కోట్ల జరిమానాను రైతులకు చెల్లించాలి
- రబ్బర్‌ను వ్యవసాయ పంటగా మార్చాలి
- కిలోకు రూ. 300 ధరను వెంటనే ప్రకటించాలి
- ఏఐకేఎస్ ఆధ్వర్యంలో రైతుల పార్లమెంట్ మార్చ్

న్యూఢిల్లీ: రబ్బరు రైతులను, జాతీయ ప్రయోజనాలను కాపాడేందుకు స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందాలను రద్దు చేయాలని ఏఐకేఎస్ నేతలు డిమాండ్ చేశారు. రబ్బరును వ్యవసాయ పంటగా మార్చాలని కోరారు. అఖిల భారత కిసాన్ సభ (ఏఐకేఎస్)కు అనుబంధంగా ఉన్న కేరళ, త్రిపుర, తమిళనాడు, కర్నాటక నుంచి వందలాది మంది రబ్బరు రైతులు తాము ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారం కోసం జంతర్ మంతర్ వద్ద గురువారం పార్లమెంట్ మార్చ్ చేపట్టారు. ధర్నాలో ఏఐకేఎస్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు అశోక్ ధావలే, విజూ కృష్ణన్, ఉపాధ్యక్షులు ఇపి జయరాజన్, హన్నన్ మొల్లా, కోశాధికారి పి కృష్ణ ప్రసాద్, సంయుక్త కార్యదర్శులు వల్సన్ పనోలి, పబిత్రాకర్, ఎం.విజయకుమార్, రబ్బర్ సబ్ కమిటీ ఉపాధ్యక్షుడు జార్జి మాథ్యూ, కమిటీ సభ్యులు ఎన్ రవి, ఏఐఏడబ్ల్యూయూ ప్రధాన కార్యదర్శి బి. వెంకట్, సంయుక్త కార్యదర్శి విక్రమ్ సింగ్ మాట్లాడారు.

విధానపరమైన సంక్షోభం రబ్బరు రైతులకు కష్టాలను తెచ్చిపెట్టిందని తెలిపారు. రబ్బరు రైతులు ఎదుర్కొంటున్న దుర్భర పరిస్థితులకు కారణమైన బీజేపీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వ కార్పొరేట్ అనుకూల విధానాలను విమర్శించారు. ఆసియన్ దేశాలతో స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందానికి ప్రత్యేక సూచనలు చేయబడ్డాయనీ, దీనిని బీజేపీ ప్రభుత్వం ప్రారంభించగా.. చివరకు 2009లో కాంగ్రెస్ ప్రభుత్వం సంతకం చేసిందని గుర్తుచేశారు. ఈ స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం ఫలితంగా థాయ్‌లాండ్, మలేషియా, వియత్నాం, ఇతర దేశాల నుంచి సుంకం లేని రబ్బరు దిగుమతులు విపరీతంగా పెరిగాయని అన్నారు. భారతదేశంలోకి సహజ రబ్బరు దిగుమతులు 2005-06లో 45 మెట్రిక్ టన్నుల నుంచి 2022-23 నాటికి 5.28 లక్షల మెట్రిక్ టన్నులకు పెరిగాయని తెలిపారు. దేశంలోనే అత్యధికంగా రబ్బరు ఉత్పత్తి చేసే రాష్ట్రమైన కేరళలోని రబ్బరు రైతులకు ఆసియాన్ ఒప్పందం వల్ల ఎంతో మేలు జరుగుతుందని ప్రభుత్వం హామీ ఇచ్చినప్పటికీ ఎంఆర్‌ఎఫ్ వంటి టైర్ తయారీ దిగ్గజాలు మాత్రమే ఫ్రీ ట్రేడ్ నుంచి లాభపడ్డాయని తెలిపారు.

కనీసం కిలోకు రూ. 300 చొప్పున సరసమైన ధరను వెంటనే ప్రకటించాలని డిమాండ్ చేశారు. మోడీ పాలనలో కార్పొరేట్ అనుకూల విధానాలు ఉత్పత్తి వ్యయాన్ని గణనీయంగా పెంచుతున్నాయని, ప్రస్తుతం అతి తక్కువ ధరతో మనుగడ సాగించడం అసాధ్యమని అన్నారు. మరోవైపు రబ్బర్ బోర్డును నిర్వీర్యం చేసి తీవ్ర కార్పొరేట్ నియంత్రణకు బాటలు వేసే పనిలో మోడీ పాలన సాగుతున్నదని విమర్శించారు. రబ్బర్ (ప్రమోషన్ అండ్ డెవలప్‌మెంట్) బిల్లు-2023 బీజేపీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వ కార్పొరేట్ అనుకూల విధానానికి స్పష్టమైన ఉదాహరణ అని స్పష్టంచేశారు.

దిగ్గజ టైర్ల బహుళ జాతి కంపెనీల నీచమైన డిజైన్‌లు రబ్బరు రైతుల జీవనోపాధిని దెబ్బతీస్తున్నాయని విమర్శించారు. 2022లో మార్కెట్‌లో అవకతవకలకు పాల్పడినందుకు కాంపిటీషన్ కమిషన్ ఆఫ్ ఇండియా (సీసీఐ) ఆయా కంపెనీలకు రూ.1,788 కోట్ల జరిమానా విధించినప్పుడు టైర్ కంపెనీల చెడు ఆట స్పష్టంగా కనిపించిందని పేర్కొన్నారు.

ఒకవైపు రబ్బరు రైతులు, కార్మికులు జీవనోపాధి కోసం పోరాడుతుండగా, మరోవైపు ఎంఆర్‌ఎఫ్, అపోలో, జెకె, సీఐఏటీ, బిర్లా వంటి ప్రముఖ టైర్ కంపెనీలు సంపదను పోగుచేసుకుంటున్నారని అన్నారు. ఏఐకేఎస్ గతంలో డిమాండ్ చేసిన విధంగా సీసీఐ జరిమానా మొత్తాన్ని రబ్బరు రైతులకు చెల్లించాలని ఏఐకేఎస్ నేతలు పునరుద్ఘాటించారు.

కాంగ్రెస్ తన్నుల పార్టీ.. బీఆర్ఎస్ టన్నుల పార్టీ

ధాన్యం, డాక్టర్ల ఉత్పత్తిలో తెలంగాణ నెంబర్ వన్

- పనిచేసేవాళ్లు కావాలా? పగోళ్లు కావాలా..?
- ఖమ్మంలో మెడికల్ కళాశాల ప్రారంభోత్సవంలో మంత్రి హరీశ్‌రావు
- మద్దులపల్లిలో నర్సింగ్ కళాశాలకు శంకుస్థాపన
- చంద్రబాబు అరెస్టును ఖండిస్తున్నా: మంత్రి పువ్వాడ



నవతెలంగాణ- ఖమ్మం ప్రాంతీయ ప్రతినిధి

'కాంగ్రెస్ తన్నుల పార్టీ.. మాది టన్నుల పార్టీ' అని ఆర్థిక, వైద్యారోగ్య శాఖ మంత్రి తన్నీరు హరీశ్‌రావు అన్నారు. 50 ఏండ్ల కాంగ్రెస్ పార్టీ హయాంలో నీళ్ల, ఎరువులు, కరెంట్ కోసం రైతులు తన్నుకున్నారని తెలిపారు. అధికారం కోసం ఇప్పుడా పార్టీ నేతలు పగటి కలలు కంటున్నారన్నారు. అప్పుడే పదవుల కోసం కుర్చీల కోట్లాటలు మొదలయ్యాయని తెలిపారు. ధాన్యం, డాక్టర్ల ఉత్పత్తిలో తెలంగాణ నెంబర్ వన్‌గా ఉందన్నారు. ప్రపంచం లోనే అతిపెద్ద ఎత్తిపోతల పథకం పాలమూరు రంగారెడ్డిని ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర రావు ప్రారంభిస్తుంటే...ఆ ప్రాజెక్టు రాకుండా రకరకాల అడ్డంకులు సృష్టించిన కాంగ్రెస్.. నేడు ఏకంగా ఆ ప్రాజెక్టే దండగ అనే రీతిలో మాట్లాడు తొందన్నారు. గురువారం ఖమ్మం జిల్లా పర్యటనకు వచ్చిన మంత్రి హరీశ్.. పాత కలెక్టరేట్, ఆర్‌అండ్‌బీ బిల్డింగ్స్ సముదాయంలో నూతనంగా ఏర్పాటు చేసిన ప్రభుత్వ మెడికల్ కళాశాలతో పాటు ఖమ్మం రూరల్ మండలం మద్దులపల్లిలో నర్సింగ్ కళాశాల కు శంకుస్థాపన, మమత మెడికల్ కళాశాల సిల్వర్ జూబ్లీ వేడుకల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి పువ్వాడ ఇంట్లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మంత్రి హరీశ్‌రావు కాంగ్రెస్‌తో పాటు విపక్షాలపై మండిపడ్డారు.

చంద్రబాబు అరెస్టును ఖండిస్తున్నాం: మంత్రి పువ్వాడ

నేడు క్షణాల్లో మెడికల్ కళాశాలలకు అనుమతు లిస్తుంటే.. నాడు లెటర్ ఆఫ్ ఇండెంట్ ఇస్తే.. లెటర్ ఆఫ్ పర్మిషన్ ఇవ్వకపోయేవారని మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ గుర్తు చేశారు. మమత మెడికల్ కళాశాల సిల్వర్ జూబ్లీ వేడుకల్లో ఆయన మాట్లా డారు. తన మమత మెడికల్ కళాశాలకు ఇలాంటి ఇబ్బందులే తలెత్తితే కేంద్ర మాజీ మంత్రి వెంకయ్య నాయుడి సహకారంతో నాటి ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు సహాయం చేశారన్నారు. ఇప్పుడు ఈ కళాశాల నిలదొక్కుకోవడానికి కేసీఆర్ దోహదపడుతున్నారని తెలిపారు. ఏపీలో కక్ష పూరితంగా వ్యవహరిస్తూ అక్రమ కేసులు బనాయిస్తున్నారని తెలిపారు. చంద్రబాబు అరెస్టును ఖండిస్తున్నామన్నారు. విపక్ష నేతలు పిండం పెడతా మన్నా పెద్దాయన కేసీఆర్ ఎలాంటి కక్షపూరిత చర్యలకు దిగలేదన్నారు. ఏపీ, తెలంగాణ పాలనా వైరుధ్యానికి ఇది నిదర్శనమన్నారు. 85వ వసంతం లోకి అడుగిడిన మమత మెడికల్ కళాశాల ఫౌండర్ పువ్వాడ నాగేశ్వరరావుకు మంత్రి హరీశ్‌రావు జన్మ దిన శుభాకాంక్షలు తెలిపారు. ముందుగా మమత మెడికల్ కళాశాల చైర్మెన్ పువ్వాడ జయశ్రీ అతిథులను వేదిక మీదకు ఆహ్వానించారు. నర్సింగ్ కళాశాల శంకుస్థాపనకు వచ్చిన అతిథులకు పాలేరు ఎమ్మెల్యే కందాల ఉపేందర్‌రెడ్డి ఆహ్వానం పలికారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ ఎంపీ నామ నాగేశ్వర రావు, బండి పార్థసారథిరెడ్డి, వద్దిరాజు రవిచంద్ర, ఎమ్మెల్సీలు పల్లా రాజేశ్వర్‌రెడ్డి, తాతా మధుసూదన్, ఎమ్మెల్యేలు వనమా వెంకటేశ్వర్లు, హరిప్రియ, సండ్ర వెంకటవీరయ్య, మెచ్చా నాగేశ్వరరావు, జడ్పీ చైర్మెన్ లింగాల కమల్‌రాజ్, మేయర్ పునుకొల్లు నీరజ, డీసీసీబీ, డీసీఎంఎస్, రాష్ట్ర విత్తనాభివృద్ధి సంస్థ, సుడా చైర్మెన్లు కూరాకుల నాగభూషణం, రాయల శేషగిరిరావు, కొండబాల కోటేశ్వరరావు, బచ్చు విజయ్‌కుమార్, ఖమ్మం మార్కెట్ కమిటీ చైర్మెన్ దోరేపల్లి శ్వేత, వివిధ డివిజన్‌ల కార్పొరేటర్లు తదితరులు పాల్గొన్నారు.

రాబోయే ఎన్నికల్లో నోబెల్స్.. గోబెల్స్ మధ్య పోటీ

రానున్న ఎన్నికల్లో చేసిన పనులు చెప్పుకునే బీఆర్ఎస్ నోబుల్స్‌కు, అబద్ధాలు చెప్పే గోబెల్స్ కాంగ్రెస్‌కు మధ్య పోటీ అని వ్యాఖ్యానించారు. వంద అబద్ధాలాడినా జనబలం కాంగ్రెస్‌కు లేదన్నా రు. బీఆర్ఎస్‌కు తెలంగాణ ప్రజలే హైకమాండైతే.. కాంగ్రెస్ బెంగళూరు, ఢిల్లీ చుట్టూ తిరుగుతుంద న్నారు. మత కల్లోహాలు సృష్టించయినా పదవుల్లోకి రావాలనే ఆకాంక్ష కాంగ్రెస్‌ది అన్నారు. ఈ విద్యా సంవత్సరంలో దేశవ్యాప్తంగా 57శాతం ఎంబీబీఎస్ సీట్లు ప్రారంభమైతే ఒక్క తెలంగాణలోనే 43శాతం ప్రారంభమయ్యాయని తెలిపారు. తెలంగాణ రాకముందు 250 సీట్లు ఉంటే నేడు ఏటా పదివేల మంది వైద్య విద్యార్థులను తయారు చేస్తున్నామన్నారు. శుక్రవారం మధ్యాహ్నం 12 గంటలకు హైద రాబాద్ నుంచి ఖమ్మం మెడికల్ కళాశాలలో క్లాస్‌ల ను సీఎం కేసీఆర్ ప్రారంభిస్తారని తెలిపారు. వచ్చే వర్షాకాలం నాటికి సీతారామ పూర్తి చేసి పాలేరు నుంచి గోదావరి జలాలు అందిస్తామని, ఇక ఖమ్మం డిక్షనరీలో కరువు అనే పదం లేకుండా చేస్తామన్నా రు. ఆర్టీసీ బిల్లుకు గవర్నర్ ఆమోదం తెలపడంతో కార్మికులు ప్రభుత్వ ఉద్యోగులుగా మారారన్నారు.

ఐసీడీఎస్ కార్యాలయాల ముట్టడి

కొనసాగుతున్న అంగన్‌వాడీల సమ్మె

- ఖమ్మంలో మంత్రుల పర్యటన సందర్భంగా అరెస్టులు
- నిరసనగా పోలీస్‌స్టేషన్ ఎదుట ఆందోళన
- పలు రాజకీయ పార్టీలు, ప్రజాసంఘాల మద్దతు



నవతెలంగాణ- విలేకరులు

తమ సమస్యల పరిష్కారం.. ఉద్యోగ భద్రత, కనీస వేతనం కోసం అంగన్‌వాడీలు చేపట్టిన సమ్మె కొనసాగుతోంది. గురువారం రాష్ట్ర వ్యాప్తంగా ఐసీడీఎస్ కార్యాలయాలను ముట్టడించారు. వీరికి పలు రాజకీయ పార్టీలు, సంఘాల నేతలు మద్దతు తెలిపారు. ఖమ్మంలో మంత్రుల పర్యటన నేపథ్యంలో యూనియన్ జిల్లా కార్యదర్శిని పోలీసులు అరెస్టు చేశారు. ఆదిలాబాద్ కలెక్టరేట్ ఎదుట సమ్మె నాలుగో రోజుకు చేరుకుంది. సమ్మెలో భాగంగా పొలాల అమావాస్య పండుగను పురస్కరించుకుని బోనాల జాతర చేపట్టారు. అంగన్‌వాడీలు నెత్తిన బోనాలు ఎత్తుకుని శోభాయాత్రగా తరలివెళ్లి అమ్మవారికి సమర్పించారు. యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు కె.సునీత మాట్లాడుతూ.. పండుగను కుటుంబ సభ్యులతో కలిసి నిర్వహించుకుంటామని, తమ సమస్యల పరిష్కారం కోసం సమ్మె చేపట్టడంతో ప్రస్తుతం అలా జరుపుకోలేకపోతున్నామని చెప్పారు. తమ న్యాయమైన డిమాండ్లను పరిష్కరించడంలో ప్రభుత్వం విఫలమైందని విమర్శించారు.

ఖమ్మం జిల్లాలో మంత్రులు తన్నీరు హరీశ్‌రావు, పువ్వాడ అజయ్‌కుమార్ పర్యటన సందర్భంగా అంగన్వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి బి.కోటేశ్వరీని నేలకొండపల్లి పోలీసులు ముందస్తుగా అరెస్టు చేశారు. అక్రమ అరెస్టును నిరసిస్తూ నేలకొండపల్లి పోలీస్ స్టేషన్ ఎదుట సీఐటీయూ, అంగన్వాడీ యూనియన్ ఆధ్వర్యంలో ఆందోళన చేపట్టారు. భద్రాచలం రూరల్‌లో పట్టణంలోని అంబేద్కర్ సెంటర్‌లో సమ్మె శిబిరాన్ని సీఐటీయూ జిల్లా అధ్యక్షులు కె.బ్రహ్మాచారి ప్రారంభించారు. బూర్గంపాడులో చెవిలో పూలు పెట్టుకుని అంగన్వాడీలు నిరసన తెలిపారు. అశ్వారావుపేట, దమ్మపేట మండలాల్లో సమ్మెకు సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి అన్నవరపు కనకయ్య మద్దతు తెలిపారు. రంగారెడ్డి జిల్లా చేవెళ్లలో ఐసీడీఎస్ కార్యాలయం ఎదుట పెద్దఎత్తున నిరసన తెలిపారు. సీఐటీయూ, కాంగ్రెస్ నాయకులు మద్దతు తెలిపారు. షాద్‌నగర్‌లో సమ్మెకు సీఐటీయూ జిల్లా అధ్యక్షులు రాజు మద్దతు తెలిపి మాట్లాడారు. రాజేంద్రనగర్ ఐసీడీఎస్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. సీడీపీఓ అధికారులకు వినతి పత్రం అందజేశారు. వికారాబాద్ జిల్లా మోమిన్‌పేట మండల కేంద్రంలో అంగన్‌వాడీలు మానవహారంగా ఏర్పడి నిరసన తెలిపారు. తాండూర్ ఐసీడీఎస్ కార్యాలయం ఎదుట ధర్నా చేశారు. అంగన్‌వాడీలను వేధింపులకు గురి చేయొద్దని సీడీపీఓకు వినతిపత్రం అందజేశారు. యాదాద్రిభువనగిరి జిల్లా ఆలేరు పట్టణ కేంద్రంలోని ఐసీడీఎస్ కార్యాలయాన్ని ముట్టడించారు. నల్లగొండ జిల్లా మునుగోడులోని సీడీపీఓ కార్యాలయం ఎదుట అంగన్‌వాడీ కార్యకర్తలు చేపట్టిన సమ్మెనుద్దేశించి సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షులు తుమ్మల వీరారెడ్డి మాట్లాడారు. నల్లగొండ సీడీపీఓ కార్యాలయాన్ని ముట్టడించారు. రంగారెడ్డి జిల్లాలోని సరూర్‌నగర్ సీడీపీఓ కార్యాలయాన్ని సీఐటీయూ ఆధ్వర్యంలో హయత్‌నగర్ ప్రాజెక్ట్ అంగన్వాడీ వర్కర్స్, ఆయాలు ముట్టడించారు. ఈ సందర్భంగా సీఐటీయూ రంగారెడ్డి జిల్లా ప్రధాన కార్యదర్శి చంద్రమోహన్ మాట్లాడుతూ.. అంగన్వాడీలు అడుగుతున్నది గొంతెమ్మ కోరికలు కాదని.. వారికి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. బడంగ్‌పేట్ మేయర్ పారిజాత నర్సింహారెడ్డి, కార్పొరేటర్లు సుదర్శన్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు. మేడ్చల్ మల్కాజిగిరి జిల్లాలోని అల్వాల్‌లో సీడీపీఓ కార్యాలయం(యాప్రల్) ముందు నిరసన వ్యక్తం చేశారు.

గౌలిదొడ్డిలో కొత్త గ్లామ్ స్టూడియో ప్రారంభం

హైదరాబాద్ : ప్రముఖ సెలూన్ బ్రాండ్ అయిన గ్లామ్ స్టూడియోస్ హైదరాబాద్‌లోని గౌలిదొడ్డిలో తన కొత్త సెలూన్‌ను ప్రారంభించింది. తమ బ్రాండ్ ఇప్పటికే దేశంలో 250కి పైగా సెలూన్‌లను కలిగి ఉందని పేర్కొంది. రాబోయే మూడు ఏండ్లలో ప్రపంచ వ్యాప్తంగా సెలూన్‌లలో అతిపెద్ద బ్రాండ్‌గా అవతరించాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు తెలిపింది. హైఎండ్, అత్యాధునిక సెలూన్ పరికరాలు, ఫిక్చర్‌లను కలిగి ఉన్న తన సెలూన్, వినియోగదారుల డబ్బుకు ఉత్తమమైన విలువను అందిస్తుందని సెలూన్ ఫ్రాంచైజీ యాజమాని కష్ణ కిషోర్ పేర్కొన్నారు.

ఆవిరి యంత్రం టూ ఆధునిక కంప్యూటర్

(మొదటిపేజీ తరువాయి)

బెంగుళూరులో ప్రాథమిక విద్యనభ్యసించారు. మద్రాస్ విశ్వవిద్యాలయం నుంచి బీఎస్సీ డిగ్రీ పొందారు. పూణేలో సివిల్ ఇంజినీరింగ్ చదివి డిప్లమా పొందారు. బ్రిటీష్ ఇండియా ప్రభుత్వంలో పనిచేశారు. 1899లో ఇండియన్ ఇరిగేషన్ కమిషన్‌లో చేరమని ఆహ్వానించబడ్డారు. అక్కడ దక్కన్ పీఠభూమిలో ఒక క్లిష్టమైన నీటిపారుదల వ్యవస్థను అమలు చేశారు. 1903లో పూణే సమీపంలోని ఖడక్వాస్లా డ్యామ్ వద్ద మొదటి సారి ఆటోమేటిక్ వీర్ వాటర్ ఫ్లడ్‌గేట్‌ల వ్యవస్థను రూపొందించారు. ఆ గేట్లు రిజర్వాయర్‌లో నిల్వ స్థాయిని గరిష్ఠ స్థాయికి పెంచడంతో డ్యామ్‌కు ఎలాంటి నష్టం వాటిల్లలేదు. అదే వ్యవస్థను గ్వాలియర్‌లోని టిగ్రా డ్యామ్ వద్ద, తర్వాత కర్నాటకలోని మైసూర్ వద్ద ఉన్న కేఆర్ఎస్ డ్యామ్ వద్ద కూడా ఏర్పాటు చేశారు. ఆ తర్వాత కొల్హాపూర్ సమీపంలోని లక్ష్మీ తలవ్ డ్యామ్‌కి చీఫ్ ఇంజనీర్ అయ్యారు. 1909లో మైసూర్ రాష్ట్ర చీఫ్ ఇంజనీర్‌గా చేరారు. తుంగభద్ర డ్యామ్‌కు ఇంజనీర్ల బోర్డు చైర్మెన్‌గా కూడా పనిచేశారు. 1912లతో మైసూర్ దివాన్‌గా నియమించబడ్డారు. మైసూర్ అన్ని రంగాల్లో అభివృద్ధి చెందడంలో విశ్వేశ్వరయ్య సృజనాత్మక ప్రతిభ దాగి ఉంది. పరిశ్రమల ఏర్పాటు, రోడ్ల నిర్మాణంలో ఆయన కీలక పాత్ర పోషించారు. అందుకే ఆయనకు 1955లో భారత అత్యున్నత పౌర పురస్కారమైన భారత రత్న ఇవ్వబడింది. లండన్ ఇతర దేశాల్లోనూ ఆయన అనేక పురస్కారాలను అందుకున్నారు.

ప్రాచీన కాలం నుంచి ఆధునిక సమాజం వరకు..

ప్రపంచ ప్రాచీన వింతలుగా పేర్కొనబడుతున్న పిరమిడ్లు, వేలాడే ఉద్యానవనాలు, ఫారోస్ లైట్ హౌస్, దయానా దేవాలయంతో పాటు అనేక కట్టడాలు అనాటి ఇంజినీరింగ్ విద్యకు తార్కానాలుగా నిలుస్తాయి. నవీన వింతల్లో చెప్పబడే తాజ్ మహాల్, చైనా వాల్, మాక్జిమస్ సర్కస్, బాసిలికా చర్చి, పిసా వాలుతున్న గోపురం వంటి అత్యద్భుతాలెన్నో ఇంజినీరింగ్ నిపుణుల సృజనశీలతకు నిదర్శనాలుగా నిలుస్తున్నాయి. 1698లో ఆవిరి యంత్రంతో పునాదులు పడిన పారిశ్రామిక విప్లవం అంతటితో ఆగిపోలేదు. మెకానికల్ ఇంజినీరింగ్ కొత్త పుంతలు తొక్కి అనేక ఆధునిక యంత్రాల తయారీకి నాంది పలికింది. ఆ తర్వాత రసాయనాల కోసం కెమికల్ ఇంజినీరింగ్, ఖనిజాల కోసం మెటలర్జికల్ ఇంజినీరింగ్ ప్రత్యేతలను సంతరించుకున్నాయి. 1800లో సాధించబడిన ఎలక్ట్రిసిటీ పరిశోధనలతో ఎలక్ట్రికల్ ఇంజినీరింగ్ ఆ తర్వాత ఎలక్ట్రానిక్స్, ఏరోస్పేస్ ఇంజినీరింగ్ ప్రత్యేకంగా చెప్పకోదగినవి. అనేక ఆవిష్కరణలతో ముందుకు సాగుతూ కంప్యూటర్ ఇంజినీరింగ్‌తో సమాచార, సంచార, సాంకేతిక రంగాలు సృష్టించబడ్డాయి. తొలుత సాధారణ విద్యతో మొదలై ఐటీఐ, పాలిటెక్నిక్, ఉన్నత విద్యను దాటి 21వ శతాబ్దంలో ఇంజినీరింగ్‌లో ఉన్నత విద్య సామాన్య వృత్తి విద్యగా మారింది.

సివిల్, ఎలక్ట్రానిక్స్, కమ్యూనికేషన్స్, కెమికల్, ఏరోనాటికల్, ఆటోమొబైల్, సాఫ్ట్‌వేర్ ఇలా అనేక ఇంజినీరింగ్ కోర్సులు వచ్చాయి. ఆర్టిఫిషల్ ఇంజినీరింగ్‌తో ప్రపంచంలో అనేక అద్భుతాలు సృష్టించబడుతున్నాయి.

అప్పంపల్లి ఓ మానని గాయం

పోలీసులకు ఎదురొడ్డి నిలిచిన గ్రామం

నైజాం రజాకార్లకు వ్యతిరేకంగా పోరాడి 11మంది వీరమరణం




- 76 ఏండ్లు దాటినా నేటికీ అందని సహాయం

నవతెలంగాణ-
మహబూబ్‌నగర్ ప్రాంతీయ ప్రతినిధి

అప్పంపల్లి పొలిమేరలోకి అడుగుపెట్టగానే మాయని గాయమేదో మనస్సుకు తాకుతున్నట్టు అనిపిస్తుంది. ఊరిలోకి పాదం మోపగానే వీరుల జ్ఞాపకాలు తట్టిలేపుతాయి. అమరుల త్యాగాలు యాదికొస్తాయి. నైజాం రజాకార్ల రాక్షస క్రీడకు సజీవ సాక్ష్యంగా రాగిచెట్టు నేటికీ ఉంది. దొరల గడీలో దొంగచాటుగా ఉండి కాల్పులు జరిగిన కిటికీ నేటికీ అద్దం పడుతోంది. నాటి నైజాం పోలీసుల రాక్షస క్రీడ గుర్తొస్తే రక్తం సలసల కాగుతుంది. ఈ రాక్షస క్రీడలో 11 మంది బలయ్యారు. తెలంగాణ విముక్తికోసం పోరాటం చేసి ప్రాణాలర్పించిన వారి స్ఫూర్తికి ప్రతీకగా నేటికీ అప్పంపల్లి వెగులు చిమ్ముతూనేవుంది.

మహబూబ్‌నగర్ జిల్లా చిన్నచింతకుంట మండలం అప్పంపల్లి గ్రామంలో అక్టోబరు 7న 11 మందిని నైజాం పోలీసులు, రజాకార్లు పొట్టన పెట్టుకున్నారు. దేశానికి స్వాతంత్ర్యం వచ్చినా తెలంగాణ ప్రాంతం ఇంకా నైజాం నవాబుల చేతులో బందీగా ఉండటాన్ని నిరసిస్తూ.. వీరు ఆందోళనలు నిర్వహించారు. తెలంగాణకు స్వాతంత్ర్యం కావాలని కర్నూల్ జిల్లా కాల్వ బుగ్గ దగ్గర ఉద్యమకారులకు శిక్షణ ఇచ్చేవారు. అక్కడ శిక్షణ పొందిన వారు అప్పంపల్లి, చింతకుంట, వడ్డెమాను తదితర గ్రామాల్లో ప్రజలను సమీకరించి చైతన్యం చేసేవారు. ఇది పసిగట్టిన నైజాం సర్కార్ పోలీసులు ఉద్యమాలను అణచివేయడానికి అప్పంపల్లి చేరుకున్నారు. విషయం తెలుసుకున్న ప్రజలు పోలీసులను ఎదుర్కోవడానికి కారం పొడి, దుడ్డు కర్రలతో సిద్ధం కాగా, పోలీసులు గడీలో నుండే గాలిలోకి కాల్పులు జరిపారు. ప్రతిగా అప్పంపల్లి గ్రామస్తులు రాగిచెట్టు దగ్గరకు వచ్చి గడీలో ఉన్న పోలీసులను గడ్డి వేసి కాల్చే ప్రయత్నం చేశారు. ఇది గమనించిన పోలీసులు 11మందిని కాల్చేశారు. చనిపోయిన వారిలో తంగెడి రాంరెడ్డి, లక్ష్మారెడ్డి, బాల్‌రెడ్డి, చాకలి కుర్మన్న, పోతురాజు ఈశ్వరయ్య, కటికె నాన్నెమ్మ, హరిజన తిమ్మన్న, గొల్ల గజ్జలన్న, వడ్డెమాను నర్సన్న, కుర్వసాయన్న ఉన్నారు. వీరితోపాటు 25 మందికి తీవ్ర గాయాలయ్యాయి. అయినా.. గ్రామస్థులు బెదరకుండా ఉద్యమానికి నాయకత్వం వహిస్తున్న బెల్లం నాగన్న, నెల్లికొండి కిష్టారెడ్డిని పోలీసులకు చిక్కకుండా ఇతర ప్రాంతానికి తరలించారు.



అప్పంపల్లి బాధితులను ఆదుకోవాలి



తెలంగాణ కోసం ప్రాణ త్యాగాలు చేసిన వారిని కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు మరిచిపోతున్నాయి. ప్రాణ త్యాగాలు చేసిన వారి కుటుంబాలు వీధిన పడ్డాయి. తెలంగాణ సాయుధ పోరాటంలో భాగస్వాములైన అమరుల కుటుంబాలను ఆదుకోవాలి. అప్పంపల్లిలో నైజాం రజాకార్లకు వ్యతిరేకంగా పోరు చేసిన వారి కుటుంబాలకు న్యాయం చేయాలి.

గుముడాల చక్రివర్తి గౌడ్, ఉపాధ్యాయుడు, అప్పంపల్లి

ఏ ప్రభుత్వమూ మాకు ఇచ్చిందేమీ లేదు.

ఉద్యమంలో మా కుటుంబం పాల్గొంది. ఆర్థికంగా చితికిపోయాం. మా నాన్న జైలుపాలు అయ్యాడు. మానాన్నను చంపాలని అనేక సార్లు ఊర్లో కాపలా పెట్టారు. గ్రామస్థులే ఆయన్ను కాపాడుకున్నారు. ఉన్న భూమి మొత్తం అమ్మి కేసుల చుట్టూ తిరిగాడు. ఇప్పుడు మాకు కనీసం తిండికి కూడా ఇబ్బంది ఉంది. నాకు 65 ఏండ్లు దాటినా పింఛను లేదు. ఏ ప్రభుత్వమూ ఆదుకోలేదు.

బెల్లం ఆంజనేయులు, అప్పంపల్లి,
సీసీ కుంట- మహబూబ్‌నగర్ జిల్లా

అవి మోడీ నోటీసులు

- రాజకీయ కక్షతోనే ఈడీ నోటీసులు
- టీవీ సీరియల్‌లా ఏడాది నుంచి సాగదీత : ఎమ్మెల్సీ కవిత



నవతెలంగాణ-కంఠేశ్వర్

తనకు వచ్చినవి ఈడీ నోటీసులు కాదని, మోడీ నోటీసులని, రాజకీయ కక్షతో పంపించిన నోటీసు కాబట్టి దానిపై పెద్దగా స్పందించాల్సిన అవసరం లేదని ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత అన్నారు. ఈడీ నోటీసును తమ పార్టీ న్యాయ విభాగానికి ఇచ్చామని, ఆ విభాగం ఎలా చెబితే అలా ముందుకెళ్తామని తెలిపారు. గురువారం ఆమె నిజామాబాద్‌లో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఈ వ్యవహారంపై పెద్దగా ఆలోచించవద్దని, గతేడాది కాలంగా టీవీ సీరియల్ లాగా సాగదీస్తున్నారని, ఎన్నికలు వస్తున్నాయి కాబట్టి మళ్లీ ఒక కొత్త ఎపిసోడ్ రిలీజ్ చేయడానికి ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. 2జీ కేసు కూడా ఇంత కాలం సాగలేదని, కేవలం రాజకీయ దురుద్దేశాలతోనే ఈడీ నోటీసులు పంపించిందని స్పష్టం చేశారు. తెలంగాణ ప్రజలు కూడా దీన్ని సీరియస్‌గా తీసుకోవడం లేదన్నారు. ఏ రాష్ట్రంలో ఎన్నికలు జరగబోతున్నా ఇదే తీరుతో వ్యవహరించడం బీజేపీ విధానమని విమర్శించారు. సీఎం కేసీఆర్‌కు వస్తున్న ఆదరణను చూసి కాంగ్రెస్, బీజేపీ భయపడుతున్నాయని, తెలంగాణలో మరో సారి కేసీఆర్ సీఎం కాబోతున్నారని తెలిపారు. దేశ ప్రజలు కూడా కేసీఆర్ పట్ల సానుకూలంగా ఉన్నారని చెప్పారు. కాబట్టి రకరకాల ఆరోపణలు వస్తాయని, కానీ తాము ఏ పార్టీకీ బీ టీమ్ కాదని తేల్చిచెప్పారు.

28 నుంచి మధ్యాహ్న భోజన కార్మికుల నిరవధిక సమ్మె

- విద్యాశాఖకు సమ్మె నోటీసు ఇచ్చిన సీఐటీయూ

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

ఈ నెల 28 నుంచి మధ్యాహ్న భోజన కార్మికులు నిరవధిక సమ్మెలోకి వెళ్లనున్నారు. ఈ మేరకు గురువారం హైదరాబాద్‌లో విద్యాశాఖ కమిషనర్ కార్యాలయంలో ఉన్నతాధికారులకు సమ్మె నోటీసును తెలంగాణ మధ్యాహ్న భోజన పథకం కార్మికుల యూనియన్(సీఐటీయూ అనుబంధం) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్వీ.రమ, రాష్ట్ర కమిటీ సభ్యులు వై.సోమన్న అందజేశారు. ప్రధానంగా మధ్యాహ్న భోజన కార్మికులకు పెంచిన వేతనాల చెల్లింపునకు బడ్జెట్ విడుదల చేయాలనీ, కొత్త మెనూకు బడ్జెట్ కేటాయించి పాత బిల్లులను విడుదల చేయాలనీ, మధ్యాహ్న భోజన పథకం నిర్వహణ బాధ్యతను ఎన్జీఓ సంస్థలకు అప్పగించడాన్ని ఆపేయాలని డిమాండ్ చేస్తూ సమ్మెలోకి వెళ్లబోతున్నట్టు ఈ సందర్భంగా వారు ప్రకటించారు. గుడ్లకు అదనంగా బడ్జెట్ కేటాయించాలని కోరారు. కార్మికులను అక్రమంగా తొలగించడాన్ని ఆపడంతో పాటు రాజకీయ వేధింపులకు అడ్డుకట్ట వేయాలని విన్నవించారు. వారికి వెంటనే గుర్తింపు కార్డులు ఇవ్వాలని కోరారు. వంట షెడ్లు, వంట పాత్రలు, తదితర మౌలిక సదుపాయాలు కల్పించాలన్నారు. యూనిఫామ్‌లు ఇవ్వాలనీ, ప్రమాదబీమా, పీఎఫ్, ఈఎస్ఐ, షరతుల్లేని బ్యాంకు రుణ సదుపాయం వంటి సౌకర్యాలను కల్పించాలని కోరారు.

నాడు మాట ఇచ్చాం...నేడు నిలబెట్టుకుంటున్నాం

పాలమూరు రంగారెడ్డి ఎత్తిపోతలతో జిల్లా సస్యశ్యామలం : మంత్రి నిరంజన్‌రెడ్డి



నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

పాలమూరు రంగారెడ్డి ఎత్తిపోతల పథకం నిర్మిస్తామంటూ 'నాడు మాట ఇచ్చాం...నేడు నిలబెట్టుకున్నాం' అని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి పేర్కొన్నారు. జూరాల బ్యాక్ వాటర్ నుంచి పాలమూరు రంగారెడ్డి ఎత్తిపోతల అనే వాదన హాస్యాస్పదమని ఒక ప్రకటనలో తెలిపారు. జూరాల రిజర్వాయర్ సామర్థ్యం 9 టీఎంసీలు .. అందుబాటులో ఉండేది 6 టీఎంసీలేనని పేర్కొన్నారు. ఆ నీటిని ఎత్తిపోయడం సాధ్యమయ్యేపనేనా? అని ప్రశ్నించారు. తెలంగాణ ఉద్యమాన్ని పక్కదారి పట్టించడం, పాలమూరు ప్రజలను మోసం చేయడమే లక్ష్యంగా నాటి సీఎం కిరణ్ కుమార్ రెడ్డి హడావిడిగా దాన్ని ప్రకటించారని గుర్తు చేశారు. సీఎం కేసీఆర్ ముందుచూపుతో 263 టీఎంసీల సామర్థ్యం గల శ్రీశైలం బ్యాక్ వాటర్ ప్రాంతం నుంచి పాలమూరు రంగారెడ్డి ఎత్తిపోతలకు నీళ్ల తీసుకుంటున్నారని వివరించారు. దశాబ్దాలపాటు జూరాలను నిర్మించిన వారు భీమా, కల్వకుర్తి, నెట్టెంపాడు ఎత్తిపోతలను సాగదీసి పాలమూరును ఎండబెట్టి ప్రజలను వలసలపాలు చేసిన వారికి పాలమూరు రంగారెడ్డి ఎత్తిపోతల పథకం గురించి మాట్లాడే హక్కు లేదని విమర్శించారు. పూర్తిగా రాష్ట్ర ప్రభుత్వ నిధులతోనే ఆ ఎత్తిపోతల పథకాన్ని నిర్మించినట్టు తెలిపారు. ఇచ్చిన మాట ప్రకారం పాలమూరు రంగారెడ్డి అందుబాటులోకి వస్తోందని చెప్పారు. ప్రాజెక్టు పూర్తికాకుండా కేసులు వేసి అడ్డుకున్న వారే ఇప్పుడు పాలమూరు రంగారెడ్డి పూర్తవుతుండడాన్ని చూసి కన్నీళ్లు పెట్టుకుంటున్నారని ఎద్దేవా చేశారు. పాలమూరు ప్రజల గుండెల్లో ముఖ్యమంత్రి కేసీఆర్ చిరస్థాయిగా నిలిచిపోతారని తెలిపారు. ఈనెల 16న నార్లాపూర్ పంప్ హౌస్ వెట్ రన్, కొల్లాపూర్‌లోని సీఎం బహిరంగసభకు పాలమూరు ప్రతి పల్లె నుంచి కదిలిరావాలని పిలుపునిచ్చారు.

మధ్యాహ్న భోజన కార్మికుల సమ్మెతో.. మధ్యాహ్నం ఇంటి భోజనమే..

- హాస్టల్ విద్యార్థులు 1.5కి.మీ నడిచి హాస్టల్‌కు..
- మీడియా రాకుండా ఆంక్షలు



నవతెలంగాణ-రామారెడ్డి

పెండింగ్‌లో ఉన్న బిల్లులు వెంటనే చెల్లించాలని, మెస్ చార్జీలు పెంచాలని తమ డిమాండ్ల కోసం మధ్యాహ్న భోజన నిర్వాహకులు సమ్మెకు వెళ్లగా, విద్యార్థులు ఇంటి నుంచే మధ్యాహ్నం భోజనం తీసుకెళ్లి భోజనం చేస్తున్నారు. నిజామాబాద్ జిల్లా రామారెడ్డి మండల కేంద్రంలోని పాఠశాలలో మధాహ్న భోజన కార్మికులు సమ్మెలో ఉండటంతో విద్యార్థులు ఇంటినుంచే భోజనం తెచ్చుకొని తింటున్నారు. సమ్మెను దృష్టిలో ఉంచుకొని పాఠశాలలో విద్యార్థుల భోజన దృశ్యాలను తీయకుండా ప్రభుత్వం.. ప్రధానోపాధ్యాయులకు సూచించినట్టు రామారెడ్డి కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు రాజులు తెలిపారు. కాగా, మండలకేంద్రంలోని షెడ్యూల్ కులాల వసతి గృహంలో ఉంటున్న విద్యార్థులు ఇదే పాఠశాలలో చదువుతున్నారు. కాగా, వసతి గృహము నుంచి పాఠశాలకు దాదాపు 1.5 కిలోమీటర్ దూరం ఉండటం, మధ్యాహ్నం ఒక గంట లోపల నడుచుకుంటూ వెళ్లి, భోజనం చేసి మళ్ళీ తిరిగి రావాలంటే ఇబ్బందిగా ఉందని, సమయం సరిపోవటం లేదని విద్యార్థులు ఇబ్బంది పడుతున్నారు. వసతి గృహం విద్యార్థులకు భోజనం పాఠశాలలోనే అందించాలని విద్యార్థులు కోరుతున్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించి మధ్యాహ్న భోజనం అందేలా చర్యలు తీసుకోవాలని విద్యార్థి తల్లిదండ్రులు, విద్యార్థులు కోరుతున్నారు. ప్రజలకు, ప్రభుత్వానికి వారధిగా ఉండే మీడియాను దూరం ఉంచడంపై పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

రాష్ట్రంలోని గ్రామాలు దేశానికి ఆదర్శం

- కేంద్రం సహకరిస్తే మరింత వేగంగా గ్రామాల అభివృద్ధి : మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు
- రాష్ట్ర స్థాయి స్వచ్ఛ సర్వేక్షణ్-2023 అవార్డుల ప్రధానోత్సవం



నవతెలంగాణ-రాజేంద్రనగర్

రాష్ట్రంలో గ్రామాల్లో జరుగుతున్న అభివృద్ధి భారతదేశానికే ఆదర్శంగా నిలుస్తుందని పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు అన్నారు. రంగారెడ్డి జిల్లా రాజేంద్రనగర్‌లోని గ్రామీణాభివృద్ధి సంస్థలో నిర్వహించిన రాష్ట్ర స్థాయి స్వచ్ఛ సర్వేక్షణ్-2023 అవార్డుల ప్రధానోత్సవానికి మంత్రి హాజరై మాట్లాడారు. తెలంగాణ ఏర్పడిన తర్వాత సీఎం కేసీఆర్ పంచాయతీరాజ్ శాఖలోని చట్టాల్లో సమూల మార్పులు చేసి గ్రామీణ ప్రాంత అభివృద్ధికి కృషి చేశారన్నారు. రూ.35వేల కోట్లతో ఇంటింటికీ తాగునీరు అందించిన ఘనత కేసీఆర్‌కే దక్కుతుందన్నారు. 60 ఏండ్ల కాంగ్రెస్ పాలనలో గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో నీటి కష్టాలు వర్ణనాతీతమని తెలిపారు. కేంద్రం పూర్తిగా సహకరిస్తే గ్రామీణ ప్రాంతాలు మరింత వేగంగా అభివృద్ధి జరుగుతాయని తెలిపారు. రాష్ట్రానికి నిధుల కేటాయింపుల్లో కేంద్రం పూర్తిగా పక్షపాత ధోరణితో వ్యవహరిస్తుందన్నారు. స్వచ్ఛ సర్వేక్షణ్ అవార్డుల్లో కూడా రాష్ట్రానికి అన్ని రంగాల్లో అవార్డు లభించడం గొప్ప విషయమని తెలిపారు. ఉత్తమ గ్రామపంచాయతీ అవార్డు పొందిన గ్రామాలకు వెంటనే రూ.10 లక్షల నిధులు మంజూరు చేయాలని అధికారులను ఆదేశించారు. అదేవిధంగా అక్టోబర్ 2న కేంద్రం ప్రకటించే అవార్డుల్లో తెలంగాణ రాష్ట్రానికే అన్ని అవార్డులు వస్తాయని స్పష్టం చేశారు.

రంగారెడ్డి జిల్లా కందుకూర్ మండలం నేదున్నూర్ గ్రామం రాష్ట్ర స్థాయిలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచి ఉత్తమ గ్రామంగా ఎంపికైనందున జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ అధికారి ప్రభాకర్, గ్రామ సర్పంచ్, పంచాయితీ కార్యదర్శి, సంబంధిత మండల ఎంపీడీఓలు, ఎంపీఓలను మంత్రి అభినందించారు. అనంతరం ఉత్తమ గ్రామపంచాయతీ అవార్డును అందజేశారు. కార్యక్రమంలో రాష్ట్ర పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ సందీప్ కుమార్ సుల్తానియా, పంచాయత్ రాజ్ సంచాలకులు హన్మంతరావు, సెర్ప్ సీఈఓ గౌతమ్, ఎస్‌బీఎం డైరెక్టర్ సురేష్‌బాబు, సంబంధిత అధికారులు, గ్రామాల సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు, సంబంధిత మండలాల ఎంపీడీఓలు, ఎంపీఓలు, డీపీఓలు డీఆర్డీఓలు, తదితరులు పాల్గొన్నారు.

అంగన్వాడీ ఉద్యోగుల న్యాయమైన సమస్యలు పరిష్కరించాలి.


- సమ్మెకు వ్యవసాయ మార్కెట్ సెక్యూరిటీ గార్డ్స్ యూనియన్ సంపూర్ణ మద్దతు

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

తమను పర్మినెంట్ చేయాలనీ, పెన్షన్, ఇఎస్ఐ, ఉద్యోగ భద్రత కల్పించి రిటైర్డ్‌బెనిఫిట్స్, వేతనంలో సగం పెన్షన్, సుప్రీం కోర్టు తీర్పు ప్రకారం గ్రాట్యూటీ చెల్లింపు, తదితర డిమాండ్లను నెరవేర్చాలని అంగన్వాడీ ఉద్యోగులు చేస్తున్న సమ్మెలో న్యాయముందని వ్యవసాయ మార్కెట్ సెక్యూరిటీ గార్డ్స్ యూనియన్(సీఐటీయూ అనుబంధం) రాష్ట్ర అధ్యక్షులు తుమ్మల సాంబయ్య, ప్రధాన కార్యదర్శి యాటల సోమన్న పేర్కొన్నారు. వారి కోర్కెలను నెరవేర్చాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అంగన్వాడీల సమ్మెకు తమ యూనియన్ సంపూర్ణ మద్దతు ప్రకటిస్తున్నదని తెలిపారు. మార్కెట్ యార్డుల్లో పనిచేసే సెక్యూరిటీ గార్డులందరూ అంగన్వాడీల పోరాటానికి సంఘీభావం తెలపాలని పిలుపునిచ్చారు. అంగన్వాడీలను భయభ్రాంతులకు గురిచేసి సమ్మె విచ్ఛిన్నానికి ప్రభుత్వం కుట్ర చేయడాన్ని ఖండించారు. ఇప్పటికైనా ప్రభుత్వం బేషజాలకు పోకుండా సమ్మె చేస్తున్న యూనియన్లతో చర్చలు జరిపాలని సూచించారు. సమ్మెకు ఉద్యోగులు, ప్రజలు, ప్రజాతంత్రవాదులు అండగా నిలవాలని విజ్ఞప్తి చేశారు.

లోన్‌యాప్ నిర్వాహకుల వేధింపులు

- సింగరేణి ఉద్యోగి ఆత్మహత్య



నవతెలంగాణ - పెద్దపల్లి టౌన్

లోన్‌యాప్ నిర్వాహకుల వేధింపులు భరించలేక సింగరేణి ఉద్యోగి ఆత్మహత్య చేసుకున్నాడు. పెద్దపల్లి జిల్లా ఓదెల మండలం కొల్లూరు గ్రామానికి చెందిన వంశీకృష్ణ(23) సింగరేణిలో ఉద్యోగం చేస్తూ తల్లిదండ్రులతో కలిసి పెద్దపల్లిలో నివాసం ఉంటున్నాడు. ఆర్థిక అవసరాల నేపథ్యంలో ఆన్‌లైన్ యాప్ ద్వారా రుణం తీసుకొని ఇప్పటికే రూ.రెండున్నర లక్షలు చెల్లించాడు. అయినా లోన్‌యాప్ నిర్వాహకుల వేధింపులు తీవ్రమయ్యాయి. దీంతో మనస్తాపానికి గురైన వంశీకృష్ణ గురువారం ఆత్మహత్య చేసుకున్నాడు. లోన్‌యాప్ నిర్వాహకులపై కఠిన చర్యలు తీసుకోవాలని కుటుంబీకులు డిమాండ్ చేశారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్టు పెద్దపల్లి పోలీసులు తెలిపారు.

ఎయిర్‌పోర్టులో 1,218 గ్రాముల బంగారం పట్టివేత

ఇద్దరు ప్రయాణికుల అరెస్టు



నవతెలంగాణ-శంషాబాద్

విదేశాల నుంచి అక్రమంగా తరలిస్తున్న 1,218 గ్రాముల బంగారాన్ని శంషాబాద్ ఎయిర్‌పోర్టులో కస్టమ్స్ అధికారులు గురువారం పట్టుకున్నారు. ఈ ఘటనలో ఇద్దరు ప్రయాణికులను అదుపులోకి తీసుకున్నారు. కస్టమ్స్ అధికారులు తెలిపిన వివరాల ప్రకారం.. కౌలాలంపూర్ నుంచి శంషాబాద్ ఎయిర్‌పోర్టుకు వచ్చిన ఒక ప్రయాణికుడిని అనుమానంతో అధికారులు తనిఖీ చేయగా.. రూ.38.62 లక్షల విలువైన 636 గ్రాముల బంగారం లభించింది. నిందితుడు ఫ్యాన్‌లో దాచుకొని బంగారాన్ని తరలిస్తుండగా పట్టుకున్నారు. మరో ఘటనలో రియాద్ నుంచి వస్తున్న మరో ప్రయాణికుడిని కస్టమ్స్ అధికారులు తనిఖీ చేశారు. 5 బంగారు బిస్కెట్లను ప్యాంట్‌లో దాచుకొని వస్తుండగా పట్టుకున్నారు. 582 గ్రాముల బంగారం.. దాని విలువ సుమా రు రూ. 35.35లక్షలు ఉంటుందని అధికారులు అంచనా వేశారు.నిందితుల్ని అదుపులోకి తీసుకొని విచారిస్తున్నారు.

తెలంగాణ సాయుధ పోరాట వారసులు కమ్యూనిస్టులే

- బీజేపీ చరిత్రను వక్రీకరిస్తున్నది : సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు ఎం డీ అబ్బాస్

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

తెలంగాణ సాయుధ రైతాంగ పోరాట వారసులు కమ్యూనిస్టులేనని సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు ఎండీ అబ్బాస్ అన్నారు. గురువారం హైదరాబాద్ సౌత్ జిల్లాలోని చార్మినార్ వద్ద తెలంగాణ సాయుధ పోరాట వార్షికోత్సవాల సందర్భంగా జరిగిన సభలో ఆయన మాట్లాడారు. వెట్టి చాకిరికి వ్యతిరేకంగా, దున్నేవారికే భూమి కోసం సాగిన వీరోచిత తెలంగాణ సాయుధ పోరాటాన్ని నడిపిన ఘన చరిత్ర కమ్యూనిస్టులదని చెప్పారు. దీనికి మతరంగు పులమడానికి బీజేపీ చేసే ప్రయత్నాలను తిప్పికొట్టాలని ఆయన పిలుపునిచ్చారు. 1946-51 మధ్య సాగిన వీరోచిత తెలంగాణ సాయుధ పోరాటానికి ప్రపంచ స్థాయి పోరాటాలలో ఒకటిగా గుర్తింపు వచ్చిందని తెలిపారు. హిందూ భూస్వాములు ముస్లిం రజాకార్లు ఒక్కటై పేద రైతుల్ని చిత్రహింసలు పెట్టారనీ, దీంతో అన్ని కులాలు, మతాల ప్రజలను సాయుధులుగా తీర్చిదిద్ది కమ్యూనిస్టులు పోరాటాన్ని నిర్వహించారని చెప్పారు. ఈ పోరాటం వల్ల 10లక్షల ఎకరాల భూములు పేదలు స్వాధీనం చేసుకున్నారన్నారు. సుదీర్ఘ పోరాటంలో 4 వేల మంది ప్రాణాలు త్యాగం చేశారని చెప్పారు. 10వేల గ్రామాలు విముక్తి అయ్యాయని తెలిపారు. ఆనాటి పోరాట ఘటనలకు, బీజేపీ,ఎంఐఎం పార్టీలు మతం రంగు వేయాలని చూస్తున్నాయని గుర్తుచేశారు. పాత బస్తీలో ఉన్న నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పించడం, వారికి మౌలిక వసతులు కల్పించడంపై శ్రద్ధ పెట్టాలని సూచించారు. స్థానిక ప్రజల సమస్యల పరిష్కారానికి సీపీఎం శక్తి మేరకు పోరాడుతున్నదని చెప్పారు. కార్యక్రమంలో జిల్లా నాయకులు ఎం. మీన, జీ.విఠల్, పి .నాగేశ్వర్, అబ్దుల్ సత్తార్, ఎం.లక్ష్మమ్మ, శ్రావణ్‌కుమార్, ఎం.బాలునాయక్, ఎ కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

కేటీఆర్ X రేవంత్‌రెడ్డి

కొడంగల్‌లో గెలుపే లక్ష్యంగా ప్రయత్నాలు

ఆ రెండు పార్టీల రాష్ట్ర నాయకత్వాలకు అగ్ని పరీక్ష

- రేవంత్‌రెడ్డికి ఉచ్చుబిగించేందుకు బీఆర్ఎస్ వ్యూహం
- గెలుపు బాధ్యతలు హరీశ్ నుంచి కేటీఆర్‌కు..!





అసెంబ్లీ ఎన్నికల్లో కొడంగల్ నియోజకవర్గాన్ని కైవసం చేసుకోవడం బీఆర్ఎస్, కాంగ్రెస్ అగ్రనాయకత్వానికి సవాల్‌గా మారింది. కొడంగల్ నియోజకవర్గం నుంచి కాంగ్రెస్ అభ్యర్థిగా పీసీసీ అధ్యక్షులు రేవంత్‌రెడ్డి బరిలో నిలిచేందుకు సిద్ధమయ్యారు. ఈ ప్రాంతంలో రేవంత్‌ను ఓడించాలన్నదే లక్ష్యంగా బీఆర్ఎస్ పావులు కదుపుతోంది. కొడంగల్‌ను మరోసారి కైవసం చేసుకోవడానికి బీఆర్ఎస్ కేటీఆర్‌ను రంగంలోకి దించేందుకు రెడీ అయినట్టు ఆ పార్టీ శ్రేణులు చెబుతున్నాయి. దాంతో కొడంగల్ రాజకీయం రేవంత్ వర్సెస్ కేటీఆర్ అన్న చందంగా ఉత్కంఠ భరితంగా మారింది.

నవతెలంగాణ-రంగారెడ్డి ప్రాంతీయ ప్రతినిధి

రాష్ట్రంలో అసెంబ్లీ ఎన్నికల సమయం దగ్గర పడుతున్న కొద్ది రాజకీయాల్లో రోజుకో పరిణామం చోటు చేసుకుంటుంది. ప్రస్తుతం అధికారంలో ఉన్న బీఆర్ఎస్‌కు ప్రత్యామ్నయంగా కాంగ్రెస్ ఊహించని వేగంతో పుంజుకున్నది. ఎదురేలేదనుకున్న అధికారపక్షానికి గుబులు పుట్టిస్తున్నది. ఈ నేపథ్యంలో కాంగ్రెస్ ప్రధాన నాయకులు బరిలో నిలిచే నియోజకవర్గాల్లో బీఆర్ఎస్ ఇప్పటి నుంచే ప్రత్యేక ప్రణాళికలు సిద్ధం చేస్తోంది. ప్రత్యేకించి రేవంత్‌రెడ్డి టార్గెట్‌గా కొడంగల్‌పై కేంద్రీకరించింది. కొడంగల్ నియోజవకవర్గం నుంచి టీపీసీసీ అధ్యక్షులు రేవంత్‌రెడ్డి తప్ప మరో దరఖాస్తు రాలేదు. దాంతో అప్పటి దాకా రేవంత్‌రెడ్డి మల్కాజిగిరి, ఎల్బీనగర్ ప్రాంతాల నుంచి పోటీ చేస్తారన్న వార్తలకు చెక్ పెట్టినట్టయింది. దీనికి తోడు రేవంత్‌రెడ్డి కచ్చితంగా కొడంగల్ అసెంబ్లీ నియోజకవర్గం నుంచే బరిలో నిలుస్తానని కార్యకర్తల సమావేశంలో స్పష్టం చేశారు. దాంతో రేవంత్‌రెడ్డికి చెక్‌పెట్టడమే లక్ష్యంగా బీఆర్ఎస్ పావులు కదుపుతోంది.

గత అసెంబ్లీ ఎన్నికల్లో కూడా రేవంత్‌రెడ్డి ఓటమిని ప్రతిష్టాత్మకంగా తీసుకున్న కేసీఆర్ బీఆర్ఎస్‌కు ట్రబుల్ షూటర్‌గా ఉన్న హరీశ్‌రావుకు తోడు తన ప్రత్యేక బలగాలను రంగంలోకి దింపిన విషయం తెలిసిందే. హరీశ్‌రావు తమ రాజకీయ వ్యూహాలతో పాటు అంగబలం, అర్థబలం, అధికార బలం ప్రయోగించి స్వల్ప మెజార్టీతో ప్రస్తుత ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డిని గట్టెక్కించారు. అయితే ప్రస్తుతం కొడంగల్ నుంచి రేవంత్‌రెడ్డిని ఓడించే బాధ్యతను కేటీఆర్‌కు అప్పగించనున్నట్టు ఆ పార్టీ శ్రేణులు తెలుపుతున్నాయి. ప్రస్తుతం రాష్ట్రంతో పాటు కొడంగల్ నియోజకవర్గంలో కాంగ్రెస్ వేవ్ కొనసాగుతున్న పరిస్థితులను గమనించిన కేటీఆర్ ఇప్పటికే అండర్ గ్రౌండ్ వర్క్ మొదలు పెట్టినట్టు తెలుస్తోంది. రాబోయే కాలంలో కాబోయే సీఎం అన్న మార్కును చాటుకున్న కేటీఆర్‌కు ఇప్పుడు కొడంగల్ గెలుపు అగ్నిపరీక్ష కానుంది.

కొడంగల్ గెలుపు కాంగ్రెస్ కీలకం

రాష్ట్రంలో కాంగ్రెస్ గట్టెక్కించేందుకు టీపీసీసీ అధ్యక్షుని గెలుపు కాంగ్రెస్‌కు కీలకం. రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి తేవడంతో పాటు రేవంత్‌రెడ్డికి తన గెలుపు కూడా కీలకం. అందుకే కొడంగల్‌పై ఫోకస్ పెట్టి రేవంత్‌ను నియోజకవర్గానికే పరిమితం చేయడం ద్వారా అతన్ని రాష్ట్రవ్యాపిత ప్రచారాన్ని, ప్రభావాన్ని అడ్డుకోవాలన్నది బీఆర్ఎస్ వ్యూహం. అయితే ఈ సవాల్‌ను ఎదుర్కోవడానికి రేవంత్ సైతం సిద్ధమైనట్టు తెలుస్తోంది. నియోజకవర్గంలో కాంగ్రెస్‌కున్న బలమైన ఓటు బ్యాంకును కాపాడుకోవడంతోపాటు పెద్ద సంఖ్యలో బీఆర్ఎస్ నాయకులను పార్టీలోకి చేర్చుకోవడం, స్థానిక సంస్థల ప్రజా ప్రతినిధులకు టచ్‌లోకి వెళ్లి వారిని మచ్చిక చేసుకోవడంలో రేవంత్‌రెడ్డి తీవ్ర కృషి చేస్తున్నారు. ఎవరి ప్రయత్నాలు ఫలిస్తాయో.. ఎవరి పంతం నెగ్గుతుందో చూడాలి మరి.



పుతిన్‌తో కిమ్ కీలక భేటీ!

న్యూఢిల్లీ జి-20 సమావేశంలో ఆశించిన విధంగా రష్యాను ఖండిస్తూ తీర్మానం చేయకపోవటంతో ఉక్రోషానికి గురైన ఉక్రెయిన్ నోరు పారవేసుకుంది. శిఖరాగ్ర సభ జరిగిన వెంటనే తీర్మానంలో గర్వపడాల్సిందేమీ లేదని వెంటనే విదేశాంగ మంత్రి ప్రకటించగా జెలెనెస్కీ సలహాదారు బుధవారంనాడు నోరు పారవేసుకున్నాడు. భారత్, చైనా దేశాలకు మేథోపరమైన సత్తాలేదని, తమ చర్యల పర్యవసానాలేమిటో విశ్లేషించుకోవటంలో విఫలమైనట్లు వ్యాఖ్యానించాడు. వారు శాస్త్రరంగంలో పెట్టుబడులు పెట్టవచ్చు, భారత్ చంద్రుడి మీదకు రోవర్‌ను పంపింది. అది ఇప్పుడు అక్కడ తిరుగుతోంది. అంతమాత్రాన ఆధునిక ప్రపంచం గురించి భారత్‌కు గ్రహింపు ఉందనేందుకు అది సూచిక కాదు అన్నాడు. నాటో కూటమి దేశాల పంజరంలో ఉక్రెయిన్ చిలకగా మారిన సంగతి తెలిసిందే. ఢిల్లీ సభలో తీర్మానం ఆమోదం పొందకపోతే నరేంద్రమోడీకి అవమానం, పశ్చిమ దేశాలు కోరుకున్నట్లుగా రష్యాను విమర్శిస్తూ తీర్మానంలో పొందుపరిస్తే ఏకీభావం ఉండదు, అసలు ప్రకటనలేకపోతే పరువు తక్కువ. అందువలన రష్యా పేరులేకుండా రాజీగా ఉక్రెయిన్ సంక్షోభంతో తలెత్తిన పరిస్థితి మీద ఆందోళన వెల్లడించారు. పశ్చిమ దేశాలు మింగా కక్కలేని పరిస్థితిలో తమ కూటమిలోకి భారత్‌ను లాక్కుపోవాలన్న ఎత్తుగడకు అనుగుణంగా రాజీపడి అంగీకరించాల్సి వచ్చింది.


ఉక్రెయిన్ మీద సైనిక చర్య అంశంలో తటస్థ వైఖరితో ఉన్నప్పటికీ చైనా నాయకత్వం ఇటీవలి కాలంలో రష్యాకు అనేక విధాలుగా దగ్గర అవుతున్న సంగతి తెలిసిందే. అందువలన చైనా మీద పట్టలేని ఆగ్రహం కలిగి ఉండటం అర్థం చేసుకోవచ్చు. కానీ భారత గడ్డమీద తీర్మానం ఆమోదించినందున మన దేశాన్ని కూడా తూలనాడారాన్నది వేరే చెప్పనవసరం లేదు. దీని మీద మనదేశం వెంటనే స్పందించలేదు గానీ సంజాయిషీ ఇవ్వాలని వెంటనే చైనా డిమాండ్ చేసింది. దాంతో 24 గంటలు గడవక ముందే గురువారంనాడు ఉక్రెయిన్ వివరణ ఇచ్చుకుంది. పోనీ దానిలోనైనా నిజాయితీ ఉందా అంటే అదీ లేదు. మరో రూపంలో నిందను సమర్ధించుకుంది. తుర్కియే, భారత్, చైనా ఇతర ప్రాంతీయ శక్తులు ఆధునిక ప్రపంచంలో తమ ప్రపంచ పాత్ర గురించి అవి చెప్పుకుంటున్నది సమర్థనీయమే. ఈ పాత్ర రష్యా కంటే మరింత దీర్ఘ, విస్తృతమైనదే కావచ్చుగానీ ప్రాంతీయ జాతీయ ప్రయోజనాలకంటే ప్రపంచ ప్రయోజనాలు విశాలమైనవంటూ ముక్తాయించిన తీరు అంతకు ముందు చేసిన విమర్శను పునరుద్ఘాటించటం తప్ప మరొకటి కాదు. పశ్చిమ దేశాల పెంపుడు చిలక ఇలా నోరుపారవేసుకుందంటే దాని యజమానుల మద్దతు లేకుండా అలా మాట్లాడి ఉండదన్నది స్పష్టం.

ఉక్రెయిన్ సంక్షోభం మొదలై గురువారం నాటికి 568రోజులు నిండాయి. దాన్ని పరిష్కరించేందుకు పశ్చిమ దేశాలకు ఏ మాత్రం చిత్తశుద్ధి ఉన్నప్పటికీ అది అసాధ్యం కాదు. కానీ అవి అందచేస్తున్న ఆధునిక అస్త్రాలతో జెలెనెస్కీ సేనలు దాడులకు పాల్పడుతున్నాయి. 2014 నుంచి రష్యా ఆధీనంలోకి వచ్చిన క్రిమియా ద్వీప తీరంలోని నల్ల సముద్రంలో రష్యా నౌకా దళం మీద ఆధునిక డ్రోన్లతో దాడులకు పాల్పడటం, వాటికి ప్రతిగా రష్యా క్షిపణి ప్రయోగం జరుగుతున్నది. బుధవారంనాడు వ్లదిమిర్ పుతిన్, ఉత్తర కొరియా అధినేత కిమ్ జోంగ్ అన్ రష్యాలోని తూర్పు అమూర్ ప్రాంతంలో ఉన్న వాస్టోచినీ కాస్మోడ్రోమ్ (అంతరిక్ష కేంద్రం) వద్ద నాలుగు గంటల పాటు భేటీ జరిపారు. నాలుగు సంవత్సరాల తరువాత ఈ ఇద్దరి నేతల మధ్య జరిగిన సమావేశం పశ్చిమ దేశాలకు ఒక హెచ్చరిక అని పరిశీలకులు చెబుతున్నారు. ఉక్రెయిన్ పేరు ప్రస్తావించకుండానే రష్యా జరుపుతున్న సామ్రాజ్యవాద వ్యతిరేక పోరుకు తాము ఎల్లవేళలా గట్టి మద్దతు ఇస్తున్నట్లు కిమ్ ప్రకటించాడు. ఈ భేటీ గురించి సహజంగానే అమెరికా, బ్రిటన్ గుండెలు బాదుకున్నాయి. రష్యాకు గనుక ఉత్తర కొరియా ఆయుధాలను విక్రయిస్తే తాము గట్టిగా వ్యవహరిస్తామని అమెరికా బెదిరించింది. సంక్షోభంలోకి బ్రిటన్ దిగుతోంది, దాని బదులు ఉక్రెయిన్‌కు ఆయుధాలను మరింత వేగంగా అందించాలని మాజీ ప్రధాని బోరిస్ జాన్సన్ అన్నాడు. వారు కోరుతున్నది ఆయుధాలు, మన కాళ్లకు బురద ఎందుకు అని ప్రశ్నించాడు. ఇవి ఉడుత ఊపులు తప్ప చేసేదేమీలేదని విశ్లేషకులు పేర్కొన్నారు. నిరంతరం ఉక్రెయిన్ ఆయుధాలు విక్రయిస్తున్న అమెరికాకు ఇతర దేశాలను తప్పు పట్టే నైతిక హక్కు ఎక్కడుంది? ఇప్పటికైనా మంటను ఎగదోయటం మానుకొని పరిష్కారానికి పూనుకోవాలని ప్రపంచ శాంతి శక్తులు ఒత్తిడి తేవాలి.

సంపాదకీయం

మహత్తర పోరాటానికి మతం రంగు - బీజేపీ వికృత విన్యాసం

దేశంలో మతద్వేషాన్ని రెచ్చగొట్టి, శవాల దిబ్బలమీద నడుచుకొంటూ ఢిల్లీ పీఠమెక్కిన బీజేపీ తన అధికారాన్ని నిలుపుకొనేందుకు సందర్భం వచ్చినప్పుడల్లా హిందూ,ముస్లింల మధ్య విభజన విద్వేషాన్ని సృష్టిస్తూనే ఉంది. పశువధ సాకుతో హత్యాకాండ, హిజాబ్ పేరుతో వివాదం, లవ్ జిహాద్ అంటూ ఒక అపోహ. మణిపూర్‌లో జాతి విద్వేషాలు, కనీవినీ ఎరుగని రీతిలో, సంఖ్యలో హత్యలు, మానవహక్కుల హననం. ముస్లింల భవనాలను పనిగట్టుకొని కూల్చే బుల్డోజర్ బాబా దుర్మార్గం. యూనిఫాం సివిల్ కోడ్, ముస్లిం జనాభా శాతం పెరిగిపోతుందన్న పుకార్లు. ఛత్రపతి శివాజీ, మహారాణా ప్రతాప్‌లు ముస్లిం ద్వేషులన్నట్లు ముద్ర వేయడం, వినాయకచవితి ఉత్సవాలని మతద్వేషానికి ఉపయోగించడం, అభ్యుదయానికి ఆటంకంగా నిలిచే సనాతనధర్మాన్ని ప్రశ్నించే వారి కండ్లు పీకేస్తామనే ప్రలాపాలు. ఉదయనిధి స్టాలిన్ చేసిన వ్యాఖ్యలపై ఏకంగా కేంద్రమంత్రి వర్గ సమావేశంలో చర్చించడం, విమర్శకులపైకి ఒంటికాలితో లేవమని ప్రధాని స్వయంగా తమ మంత్రులకు పిలుపునివ్వడం వగైరాలన్నీ మతం పేరుతో మెజారిటీ ప్రజలను బుట్టలో వేసుకోనే ఎత్తుగడలే. ఆ కోవలోనిదే నిజాంకు వ్యతిరేకంగా తెలంగాణలో జరిగిన మహత్తర సాయుధ రైతాంగ పోరాటానికి మతం రంగు పులిమే వికృత విన్యాసం కూడా.



ఎస్. వినయకుమార్

> నిజాం నవాబుకు వ్యతిరేకంగా పోరాడిన వారిలో ముస్లిం పాత్రికేయులు కూడా ఉన్నారు. సోవియట్ యూనియన్ స్ఫూర్తితో ముస్లిం పాత్రికేయులు ఉత్తర భారతదేశం నుండి వచ్చి ఇక్కడ ఊర్దూ పత్రికలు నెలకొల్పారు. బ్రిటిష్ పాలకులకు నిజాం ఇచ్చే మద్ధతుపై, నిజాం విధానాలపై ప్రశ్నలు లేవనెత్తేవారు. 1891లో నిజాంకు వ్యతిరేకంగా ఏదీ రాయరాదని, ఆ మేరకు ఒక హామీ పత్రం రాసివ్వాలని సంపాదకులకు తాఖీదులు జారీ అయ్యాయి. షౌకతుల్ ఇస్లాం అనే సంపాదకుడు దానికి నిరాకరించాడు. ఫలితంగా ఆయన పత్రిక మూతబడింది. మరికొన్ని ఊర్దూ పత్రికలకు, దక్కన్ స్టాండర్డ్ అనే ఇంగ్లీషు పత్రికకూ అదే గతి పట్టింది.

నిజాం ఫ్యూడల్ పాలనకు, దొరల భూస్వామ్య పీడనకు వ్యతిరేకంగా ఐదేండ్ల పాటు అంకురిత త్యాగాలతో దీక్షా సాహసాలతో సాగింది సాయుధ పోరాటం. భూమి కోసం, వెట్టిచాకిరి విముక్తి కోసం జరిగిన పోరాటం. హైదరాబాద్‌లో సింహాసనం మీద కూర్చున్నది నిజాం ముస్లిమే కావచ్చు. కాని ఆయన పాలనను నిలబెట్టింది దొరలు, జాగీర్దార్లు, దేశ్‌ముఖ్‌లు, పటేల్ పట్వారీలే! వారంతా మెజారిటిగా హిందువులే. నిజాంతో పాటు వారు రైతులను, కూలీలను, వృత్తిదార్లను, చిన్న వ్యాపారులను నిర్దయంగా దోచుకొని పీల్చిపిప్పి చేసిన వారే. వారికి నిజాం మద్దతు ఇచ్చాడు. వారు నిజాంను మోశారు. ఆనాటి దోపిడీ, పీడనల నుండి బయటపడేందుకు ప్రజలు తమ స్థాయిల్లో చేసిన ఆ పోరాటాలను ఎక్కడికక్కడ అణిచి వేసేందుకు పూనుకొన్నది హిందూ జమీందార్లు, భూస్వాములే. ఆ దొరలను ఏనాడు పలెత్తు మాట అనని వారికి వారసులే నేటి ఈ బీజేపీ-ఆరెస్సెస్ నేతలు. ఆనాటి వాస్తవాలను కప్పిపుచ్చి తెలంగాణ సాయుధ పోరాటాన్ని ముస్లిం వ్యతిరేక పోరాటంగా చిత్రించడానికి ప్రయత్నిస్తున్నారు.

దొరలకు వ్యతిరేకంగా చాకలి ఐలమ్మ చేసిన పోరాటాన్ని కించపర్చుతూ కొన్నాళ్ల క్రితం కాషాయ పార్టీ నాయకుడు ప్రకాశ్‌రెడ్డి చేసిన వ్యాఖ్య ఆ పూర్వ రంగం నుండి వచ్చిందే.

నిజాం పాలనను ముస్లిం పాలనగా చిత్రీకరించడంలోనే పెద్ద అబద్ధం దాగి ఉంది. ఆ మాటకొస్తే మధ్య యుగాల్లోనూ, ఆ తర్వాత కూడా పాలకుడు ముస్లిం అయినా హిందువు అయినా తన మతం వారిపై మాత్రమే ఆధారపడి పాలన చేయలేదు. తమ మతానికి చెందిన రైతులను, కూలీలను వారు దోపిడీ నుండి మినహాయించిందీ లేదు. గ్రామాల్లోని రైతులకు, కూలీలకు ఇతర గ్రామీణ జనానికి అక్కడి దొరనే నిజాం.



అసమానతలు, అవమానాలకు ఆస్తులు కులం, ప్రాతిపదిక కావచ్చు గానీ మతం ఎప్పుడూ ప్రాతిపదికకాదు. ఏదొర, ఏ నవాబు, ఏ రాజు సహ మతస్తుల మానవ హక్కులను కూడా గౌరవించ లేదు.

హైదరాబాద్‌ను పాలించిన అసఫ్ జాహీలు (నిజాములు) వారికి ముందు కుతుబ్ షాహీలు మతం చేత ముస్లింలైనంత మాత్రాన పాలనలో హిందువులు భాగం కాకుండా పోలేదు. కుతుబ్‌షాహిల్లో అత్యంత ప్రముఖుడైన కులీ కుతుబ్ షా భాగమతి అనే హిందూ స్త్రీని పెండ్లాడాడు. అంటే 'లవ్ జిహాద్' చేశాడన్న మాట. వారు చివరి దాకా కలిసే జీవించారు. దాయాదుల వల్ల తన ప్రాణానికి ప్రమాదం ఎదురైనప్పుడు ఆయన పూర్వీకుడు ఇబ్రహీం విజయనగరం వెళ్లి హిందూ రాజు ఆశ్రయం పొందాడు. అదునుజూసి విజయనగరం రాజు సహాయంతో గొల్కొండ కోటలోకి దూసుకొచ్చి సింహాసనాన్ని ఆక్రమించాడు. కుతుబ్‌షాహిల్లో చివరివాడయిన అబ్దుల్లా (తానాషా) ఆస్థానంలో హిందువులైన అక్కన్న మాదన్నలు ఉన్నత పదవుల్లో ఉంటూ రాజ్యపాలనలో కీలక పాత్రలు పోషించారు. కుతుబ్ షాహీలు ముస్లింలే అయినా మొఘల్ చక్రవర్తులు షాజహాన్, ఆ తర్వాత ఔరంగజేబు గొల్కొండ రాజ్యం కబళించడానికి యుద్ధం చేయకుండా ఊరుకోలేదు. మొదట షాజహాన్ తన కుమారుడైన ఔరంగజేబు నాయకత్వం కింద సైన్యాన్ని పంపి గొల్కొండ స్వాధీనానికి విఫల ప్రయత్నం చేశాడు. తాను చక్రవర్తి అయ్యాక ఔరంగజేబు స్వయంగా భారీ సైన్యంతో వచ్చి నెలరోజులకు పైగా యుద్ధం సాగించి చివరికి గోల్కొండ కోటను స్వాధీనం చేసుకొన్నాడు. ఆ యుద్ధంలో అక్కన్న మాదన్నలు తమ ప్రాణాలర్పించారు.

6వ నిజాం మీర్ అక్బర్ అలీ ఖాన్ సికందర్ ఝా దగ్గర హిందువైన చందులాల్, దివాన్‌గా పనిచేశాడు. నిజాం ఇంగ్లీషు వారి అడుగులకు మడుగు లొత్తుతున్నాడని రొహిల్లా ముస్లింలు 1857లో తిరగబడ్డారు. మౌల్వీ అల్లా ఉద్దీన్, తుర్రెబాజ్ ఖాన్ నాయకత్వంలో హైదరాబాద్‌లోని బ్రిటిష్ ప్రతినిధి అధికార నివాసం రెసిడెన్సీ (ప్రస్తుతం కోఠీ, ఉమెన్స్ కళాశాల) మీద దాడి చేశారు. కాని బ్రిటిష్ నిజాం సైన్యాల దాటికి రోహిల్లాలు నిల్వలేకపోయారు. నిజాం సైన్యాలు నాయకులిద్దరిని అరెస్టు చేశాయి. తుర్రెబాజ్ ఖాన్ పారిపోబోయి నిజాం సైన్యం చేతుల్లో చనిపోయాడని చెప్తారు. మౌల్వీ అల్లా ఉద్దీన్‌కు యావజ్జీవ కారాగార శిక్ష విధించి అండమాన్ జైలుకు పంపారు. 1857 సిపాయిల తిరుగుబాటులో హిందూ ముస్లిం సైనికులు రాజులు, నవాబు కలిసి ఇంగ్లీషు పాలకుల మీద తిరగబడ్డారు. హైదరాబాద్‌లో ముస్లింలే బ్రిటిష్ మీద, ముస్లిం నిజాం మీద తిరుగుబాటు చేశారు.

> రాజు ఏ మతం వాడు అన్న దానితో ప్రజలకు నిమిత్తం లేదు. రాజు ఏ మతం వాడైనా వారికి ఒక్కటే. వారికి ఆ ఊరి దొరే నిజాం, ఆయన చెప్పిందే శాసనం. రాజు మారినా ఊళ్లో ఉండే దొరలు, పటేల్, పట్వారీలు మారరు. వారి దోపిడీ, పీడనలూ ఆగవు. రాజులు, నవాబులకేమో వారు పంపే శిస్తులు ముఖ్యంగానీ, ప్రజల బాగోగులు పట్టవు. కనుక "ఏ రాయి అయితేనేం పళ్లూడ కొట్టుకోవడానికి" అని ప్రజలు భావించే వారు. హైదరాబాద్‌లో నిజాం ఉన్నా గ్రామాల్లోని పీడకుల్లో హిందువులే ఎక్కువ. ఆ పీడనకు వ్యతిరేకంగా సాగిన పోరాటానికి ముస్లిం వ్యతిరేక పోరాటంగా చిత్రించడమంటే పరమత ద్వేషం నూరిపోయడమే.

నిజాం పాలనను నిలబెట్టడంలో హిందువులు అందించిన తోడ్పాటుకు మరో ఉదాహరణ 6వ నిజాం మహబూబ్ అలీ ఖాన్ తన ప్రధానిగా రాజా కిషన్ ప్రసాద్‌ను నియమించుకోవడం. ఆయన అంతకు పూర్వం నిజాం సంస్థానంలోనే పని చేసిన చందులాల్ మనుమడికి మనవడు. చందులాల్ పూర్వీకుడు తోడర్ మల్. అతను చక్రవర్తి అక్బర్ దగ్గర రెవెన్యూ మంత్రిగా కీలక బాధ్యతలు నిర్వహించాడు. అక్బర్ సామ్రాజ్యంలో మరో ముఖ్యమైన వ్యక్తి రాజా మాన్ సింగ్. అక్బర్ భార్య జోధాబాయికి సోదరుడు. అక్బర్ సేనాపతిగా ఆయన అనేక రాజులను ఓడించి అక్బర్ సామ్రాజాన్ని విస్తరించారు. ఆయన లాగే ఎందరో హిందూ సేనానులు అక్బర్ సైన్యంలో పని చేశారు.



నిజాం నవాబుకు వ్యతిరేకంగా పోరాడిన వారిలో ముస్లిం పాత్రికేయులు కూడా ఉన్నారు. సోవియట్ యూనియన్ స్ఫూర్తితో ముస్లిం పాత్రికేయులు ఉత్తర భారతదేశం నుండి వచ్చి ఇక్కడ ఊర్దూ పత్రికలు నెలకొల్పారు. బ్రిటిష్ పాలకులకు నిజాం ఇచ్చే మద్దతుపై, నిజాం విధానాలపై ప్రశ్నలు లేవనెత్తేవారు. 1891లో నిజాంకు వ్యతిరేకంగా ఏదీ రాయరాదని, ఆ మేరకు ఒక హామీ పత్రం రాసివ్వాలని సంపాదకులకు తాఖీదులు జారీ అయ్యాయి. షౌకతుల్ ఇస్లాం అనే సంపాదకుడు దానికి నిరాకరించాడు. ఫలితంగా ఆయన పత్రిక మూతబడింది. మరికొన్ని ఊర్దూ పత్రికలకు, దక్కన్ స్టాండర్డ్ అనే ఇంగ్లీషు పత్రికకూ అదే గతి పట్టింది. అంటే ఇప్పుడు "గోదీ" మీడియా చేస్తున్న పనిచేయడానికి ముస్లిం సంపాదకులు కూడా ఆనాడు నిరాకరించారన్నమాట. రజాకార్ల నాయకుడు కాశీం రజ్వీకి నిజాం మద్దతునివ్వడం చూసి ఎందరో ఉన్నత పదవుల్లోని ముస్లింలు పదవుల నుండి తప్పుకొన్నారు.

ఖాజీ మహ్మద్ అబ్దుల్ గఫార్ ఉత్తరప్రదేశ్ నుండి వచ్చి 'పయ్యాం' అనే పత్రికను స్థాపించాడు. నిజాం పాలనను ఆ పత్రిక వ్యతిరేకించేది. రజాకార్లకు వ్యతిరేకంగా చాలామంది ముస్లిం రిటైర్డ్ అధికార్లు చేసిన ప్రకటనను ఆయన తన పత్రికలో ప్రచురించారు. ఆ పత్రిక పాఠకులకు చేరేలోగా ఆయన రాజ్యం సరిహద్దులు దాటి ప్రాణాలు కాపాడుకొన్నాడు. ఆ పత్రిక మూతబడింది. రజాకార్ల ఆగడాలను ఎండగట్టి వారి చేతుల్లో బలైన సాహసోపేత జర్నలిస్టు షోయబ్-ఉల్లా-ఖాన్ గురించి మనకు తెలుసు. నిజాం వ్యతిరేక పోరాటంలో భాగంగా ఏర్పడిన హైదరాబాదు కామ్రేడ్స్ అసోషియేషన్‌లో మగ్దూం మొహియుద్దీన్, ప్రొ.ఆలం కుంద్‌మిరి, జావేద్ రజ్వీ లాంటి ముస్లింలున్నారు.

తమ రాబడి పెంచుకోవడానికి ముస్లిం నవాబులు పరిసరాల్లోని ఇతర ముస్లిం నవాబులను ఓడించి ఆ రాజ్యాలను తమ రాజ్యంలో కలుపుకొన్నారు. హిందూ రాజులూ అదే పనిచేశారు. ఛత్రపతి శివాజీ కూడా ఎందరో హిందూ రాజులను దుర్గాధిపతులను జయించి తన సామ్రాజ్యాన్ని నిర్మించారు. ఆయన దగ్గర ఎంతో ముస్లింలు విశ్వాసపాత్రులైన అంగరక్షకులుగా, సైన్యాధ్యక్షులుగా పనిచేశారు. ఔరంగజేబు పంపిన అఫ్జల్ ఖాన్ దగ్గరికి సంధి ఆహ్వానంపై శివాజీ వెళుతుండగా తగిన ఆయుధాలు లేకుండా వెళ్లవద్దని శివాజీని కట్టడి చేసిన అంగరక్షకుడు ముస్లిమే. అతను ఊహించినట్లుగానే భారీకాయుడైన అఫ్జల్‌ఖాన్ అలింగనం సాకుతో శివాజీని ఊపిరాడకుండా చేసి చంపాలని ప్రయత్నించాడు. పదునైన ఇనుప గోళ్లను దుస్తుల్లో దాచుకొని వెళ్లిన శివాజీ ఆ గోళ్లతో అఫ్జల్ ఖాన్‌ను చీల్చి చంపేశాడు.

ఔరంగజేబు తరపున ఒక హిందూ రాజు శివాజీపై దండెత్తి వచ్చాడు. శివాజీని ఓడించాలంటే చండియాగం చేయాలని అతనికి బ్రాహ్మణులు సలహా ఇచ్చారు. ఆ రోజుల్లోనే రూ. రెండు లక్షలు ఆయన యాగం కోసం కేటాయించాడు. శివాజీ హిందువే అయినా బ్రాహ్మణులు శివాజీ మరణం కోసం యాగం చేశారు. శివాజీని ఔరంగజేబు అగ్రాకోటలో ఖైదు చేసినప్పుడు ఆయన అంగరక్షకుడైన మదార్ సాబ్ అనే ముస్లిం తన ప్రాణాన్ని ఫణంగా పెట్టి శివాజీని ఖైదు నుండి తప్పించాడు. ఒక దశలో బీజాపూర్ (ప్రస్తుతం విజాపుర) రాజు ఆదిల్ షా దగ్గర పని చేసే వేయిమంది ముస్లిం పఠాన్ల సైన్యం ఆదిల్ షాను వదలి శివాజీ సైన్యంలో చేరారు. ఆ కాలంలో మతం ప్రాతిపదికగా పరిపాలన జరగలేదు కనుక అందులో విచిత్రం ఏమీలేదు. రాజా మహారాణా ప్రతాప్ దగ్గర కూడా ముస్లిం సేనాపతులు ఉండేవారు. వారు మొఘల్ సైన్యాలతో పోరాడి ప్రాణాలర్పించారు.

రాజు ఏ మతం వాడు అన్న దానితో ప్రజలకు నిమిత్తం లేదు. రాజు ఏ మతం వాడైనా వారికి ఒక్కటే. వారికి ఆ ఊరి దొరే నిజాం, ఆయన చెప్పిందే శాసనం. రాజు మారినా ఊళ్లో ఉండే దొరలు, పటేల్, పట్వారీలు మారరు. వారి దోపిడీ, పీడనలూ ఆగవు. రాజులు, నవాబులకేమో వారు పంపే శిస్తులు ముఖ్యంగానీ, ప్రజల బాగోగులు పట్టవు. కనుక "ఏ రాయి అయితేనేం పళ్లూడ కొట్టుకోవడానికి" అని ప్రజలు భావించే వారు. హైదరా బాద్‌లో నిజాం ఉన్నా గ్రామాల్లోని పీడకుల్లో హిందువులే ఎక్కువ. ఆ పీడనకు వ్యతిరేకంగా సాగిన పోరాటానికి ముస్లిం వ్యతిరేక పోరాటంగా చిత్రించడమంటే పరమత ద్వేషం నూరిపోయడమే.

సెల్:9989718311

భగవద్గీత, మనుస్మృతులలో సనాతన సారాంశం!



డాక్టర్ దేవరాజు మహారాజు

కుల వ్యవస్థను సమర్థించుకోవడానికి బ్రాహ్మణార్యులు భగవద్గీతను ప్రచారంలోకి తెచ్చారు. భగవద్గీత ఒకటవ అధ్యాయంలో అర్జునుడు ఒక సందేహం వెలిబుచ్చాడు. ఈ కురుక్షేత్ర యుద్ధంలో చనిపోయిన వారి భార్యలు చరిత్రహీనులవుతారు. ఎందుకంటే భర్తలు లేనందువల్ల వారు ఇతర కులాల వారితో సంబంధాలు పెట్టుకుంటారు. లేదా, వారిని వివాహం చేసుకుంటారు. వర్ణ సంక్రమణం జరుగుతుంది. సంకర జాతి పిల్లలు పుడతారు. ఇక ఈ కురుక్షేత్ర యుద్ధంలో చనిపోయిన మన వీరులకు పిండాలు పెట్టడానికి వారి పిల్లలు ఉండరు కదా? ఆ విధంగా కులం, ధర్మం, నీతి, నియమం అన్నీ నాశనమవుతాయి కదా? అన్నది అర్జునుడి సందేహం.


కృష్ణుడు దానికి నేరుగా సమాధానమివ్వాలి కదా? ఇవ్వడు. విషయాన్ని అటూ ఇటూ తిప్పుతాడు. రెండో అధ్యాయం మూడవ శ్లోకంలో కృష్ణుడు కోపంతో అర్జునుణ్ణి నపుంసకుడా! అని దూషించి, తన కోపాన్ని అదుపులో పెట్టుకుని, మళ్ళీ వెంటనే 'నీకు స్వర్గం ప్రాప్తిస్తుంద'ని ఆశ పెడతాడు (రెండవ శ్లోకం) రెండో అధ్యాయంలో 23, 24, 25 శ్లోకాలలో కృష్ణుడు ఆత్మగురించి మాట్లాడుతాడే గాని, సరైన వివరణ ఏమీ ఇవ్వడు. చనిపోయిన తర్వాత ఆత్మస్వర్గంలో ఎవరితో ఎలా సుఖపడుతుంది? అన్నదానికి జవాబులేదు. మళ్ళీ కొత్త శరీరం పొందడానికి కొత్త తల్లిదండ్రులు అవసరమవుతారు కదా? స్వర్గంలో పురుషులకు అప్సరసలుంటే మరి స్త్రీలకు ఏ ఏర్పాట్లున్నాయో కృష్ణుడు చెప్పలేదు.

భగవద్గీత రెండో అధ్యాయం 31, 38 శ్లోకాలలో వర్ణవ్యవస్థను తనే సృజించానని, దాన్ని నిలపడమే తన ధ్యేయమని కృష్ణుడు బలంగా చెపుతాడు. భగవద్గీతలోని 18వ అధ్యాయంలో తను సృజించిన వర్ణవ్యవస్థను అర్జునుడు అనుసరించాలని ప్రబోధిస్తాడు. కుల నాశనం జరిగితే సనాతన ధర్మం నశించిపోతుందని మనువాదుల భయం అందుకే అలా రాసిపెట్టుకున్నారు.

నేటి మన ఆధునిక ఆలోచనల ప్రకారం వర్ణ వ్యవస్థ, కుల వ్యవస్థ ఎందుకూ పనికిరానివి. మానవత్వాన్ని, ఈ దేశ రాజ్యాంగాన్ని దృష్టిలో పెట్టుకుని మసలుకోవాల్సిందే తప్ప - ఏవో కల్పిత పాత్రలతో మనువాదులు చెప్పించిన వర్ణ వ్యవస్థ, వర్ణ సంకరం, జన్మ పునర్జన్మ దేవుడి మహిమ వంటి మాటలకు ఎలాంటి విలువా, అర్థమూ లేదు. వైదిక మత ప్రబోధకులు కుట్ర పూరితంగా అల్లుకున్న మతగ్రంథాలు ప్రామాణికం కావు. హిందూ మతమనే కాదు, ప్రపంచంలోని అన్ని మతాలూ అబద్ధాలే చెప్పాయి. కనుక, వాటినన్నింటినీ పక్కకు నెట్టేసి, మానవత్వం నిలుపుకునే దిశలో ఆధునికులమైన మనం, సంయమనంతో ప్రయాణించాల్సి ఉంది.

వర్ణ వ్యవస్థను, కుల వ్యవస్థను తనే సృజించానని కల్పిత పాత్ర అయిన ఓ కృష్ణుడితో చెప్పించి, మనువాదులు చేతులు దులుపుకున్నారు. మనుషుల్ని విడగొట్టే ప్రక్రియ భగవద్గీతతో ప్రారంభించి, దాన్ని స్థిరపరిచి, మనుస్మృతిలో వివక్షను తారాస్థాయికి తీసుకెళ్ళారు. వివరంగా విశ్లేషించుకుంటూ ఉంటే, అంతా కళ్ళ ముందే కదలాడుతుంది. అయితే ఇక్కడ దోషులెవరో స్పష్టంగా తెలుస్తూనే ఉంది. తెలిసినా తెలియనట్టే ఉండటం - దోషులను శిక్షించకుండా వదిలేయడం తెలివిగల పనులేం కావుగదా?

మనుస్మృతి రెండవ అధ్యాయం 30వ శ్లోకంలో పది, పన్నెండు రోజుల పిల్లలకు నామకరణం చేయాలని ఉంది. ఇంకా ముందుకు వెళ్ళి 31, 32 శ్లోకాలలో ఎవరికి ఎలాంటి పేరు పెట్టాలో సూచించడం



జరిగింది. ఉదాహరణకు బ్రాహ్మణ పిల్లలకు ఉన్నతమైన పేర్లు పెట్టాలనీ - శూద్రులకు హీనమైన పేర్లు పెట్టాలనీ అందులో రాసి ఉంది. ఆ పేర్లతో వారు జీవితాంతం దీనుల్లాగా, దాసుల్లాగానే బతకాలి. మధ్యలో కొంత వ్యతిరేకత వచ్చినందువల్ల 'వర్ణం జన్మతో కాదు కర్మతో వస్తుంది' అని కొత్త పాట పాడారు. ఇదే నిజమైతే బ్రాహ్మణులు పెట్టుకునే పేర్లు, శూద్రులను పెట్టుకోనిచ్చారా? లేదు కదా? అలాగే దాసులాంటి శూద్రుల పేర్లు బ్రాహ్మణార్యులు ఎందుకు పెట్టుకోలేదూ? జన్మతో కాదు చేసే కర్మతో ఉచ్ఛం, నీచం ఏర్పడుతాయని ఇంకా కతలెందుకు చెప్తారూ? అంబేద్కర్ చదివినంత చదువు బ్రాహ్మణుల్లో ఎవరూ చదవలేదు. ఆయన చేసిన గొప్ప పనులు ఏ బ్రాహ్మణుడూ చేయలేదు. కర్మతో వర్ణం మారుతుందంటే, అంబేద్కర్ తన కర్మ ఫలితంతో ఉన్నతవర్ణం వాడు కావాలి కదా? కాలేదు ఎందుకూ? విసిగి వేసారి ఆయన హిందూ ధర్మమే వద్దనుకుని, ఆరులక్షల మందితో బౌద్ధం స్వీకరించాడు - మళ్ళీ అది వేరే విషయం.

మనుస్మృతి పదవ అధ్యాయంలో 5-6-66-67-68 శ్లోకాలలో వివక్షకు సంబంధించి మరిన్ని విషయాలున్నాయి. బ్రాహ్మణుడు శూద్రజాతికి చెందిన అమ్మాయిని పెండ్లి చేసుకుంటే, పుట్టిన పిల్లవాడు బ్రాహ్మణుడే అవుతాడు. ఒక శూద్రుడు గనక బ్రాహ్మణ స్త్రీని పెండ్లి చేసుకుంటే పుట్టిన పిల్లలు శూద్రులే అవుతారు - ఈ మాత్రం దానికి వర్ణం జన్మతో వస్తుందని ఓ సారి, కర్మతో వస్తుందని మరోసారి చెప్పడం ఎందుకూ? అయినా మహిళలందరినీ శూద్రులుగా పరిగణించిన మనుధర్మ శాస్త్రం చిన్న లాజిక్ మరిచిపోయింది. ప్రపంచ మానవులందరూ స్త్రీలకు పుట్టినవారే. అంటే శూద్రులకు పుట్టినవారే. శూద్రుల పిల్లలు శూద్రులే అవుతారు కదా? అలాంటప్పుడు అందరూ సమానమే. వారి శాస్త్ర ప్రకారం అందరూ శూద్రులే. ఏమైతేనేం? తేడాల్లేవ్. ఇక నిచ్చెన మెట్ల వర్ణ వ్యవస్థ ఎక్కడుంటుందీ? మరో విషయం మనుధర్మ శాస్త్రాన్ని వివిధ భాషల్లోకి అనువదించిన మహనీయులందరూ బ్రాహ్మణార్యులే - అన్నది మనం గమనించుకోవాలి! ఇంకా మరికొన్ని వివరాలు చూద్దాం! శూద్రుల పిల్లలకు ఉపనయనం చేసుకునే అర్హత ఉండదు. ఈ కాలంలో ఎవరైనా చేసుకుంటున్నారంటే వారు తమని తాము అగ్రవర్ణం స్థాయికి తీసుకుపోతున్నారని - పరాయీకరణ చెందుతున్నారనీ అర్థం.

మాంగల్య బ్రాహ్మణస్య సాక్షత్రియస్య బలాన్వితమ్.

వైశ్యస్య ధనసూచంక్తు శూద్రస్యతో జుగుప్సితమ్ మంగళకరమైన పేరు బ్రాహ్మణుడికి, వీరత్వాన్ని సూచించే పేరు క్షత్రియుడికి, ధన సూచికతో వైశ్యుడికి పేర్లు ఉండాలి. శూద్రుడికి నిందా పూర్వకమైన జుగుప్సాకరమైన పేరుండాలి అని అర్థం.

శర్మ వద బ్రాహ్మణస్య స్థాయోద్రజో రక్ష సమవీతమ్
వైశ్యస్య పుష్టి సంయుక్త శూద్రస్య ప్రేశ్య సంయుతమ్

అంటే గోపీనాథ్ శర్మ వంటి పేరు బ్రాహ్మణుడికి, రఘువీర్ సింహ్ వంటి పేరు క్షత్రియుడికి, ఘనశ్యామ్ గుప్త వంటి పేరు వైశ్యుడికీ ఉండాలి. శూద్రుడికి బలరామ్ దాసు వంటి పేరు పెట్టాలి. మొదటి పేరు బలరామ అని పెట్టుకున్నా చివరకు వాడు దాసుడని లేదా బంటు అని స్పష్టంగా తెలిసే విధంగా పేరుండాలి.

వర్ణ వ్యవస్థను రూపొందించడమే కాదు, శతాబ్దాలుగా దాన్ని పరిరక్షించుకునే పనిలో బ్రాహ్మణార్యులు పూర్తిగా నిమగ్నమై ఉన్నారు. అందుకే మనదేశంలో ఒక వ్యక్తి పేరును పూర్తిగా విశ్లేషించుకుంటే అతడి కులం, వర్ణం అన్నీ అర్థమవుతాయి. అలా అర్థమయ్యే విధంగా మనువాదులు డిజైన్ చేశారు.

ఉదాహరణకు ఉత్తర భారతదేశంలో వారి పేర్ల చివరి ద్వివేది, త్రివేది, చతుర్వేది అనేవి ఉంటుంటాయి. అంటే వారి గురించి వారు గొప్పగా, ఘనంగా ప్రకటించుకోవడమన్న మాట. ద్వివేది - రెండు వేదాలు చదివిన వాడు, త్రివేది - మూడు వేదాలు చదివినవాడు. చతుర్వేది - నాలుగు వేదాలు అవుపోసన పట్టినవాడు అని అర్థం. రోజుకు మూడుసార్లు పఠనం చేసేవారు 'త్రిపాఠి' అని పెట్టుకుంటారు. అలాగే యాగాలు, యజ్ఞాలు చేసినవారు 'సోమయాజి' అని పెట్టుకుంటారు. వాళ్ళ జీవితమంతా తమ అగ్రవర్ణ స్థానాన్ని ప్రకటించుకోవడంతోనే సరిపోతుంది. ఆ పరిధిలోనే గిరికీలు కొడుతూ కుంచించుకుపోయి ఉంటుంది.

ఆధునిక విజ్ఞాన శాస్త్రం, గణితం, చరిత్ర అందరికీ అందుబాటులోకి వచ్చిన తర్వాత పరిస్థితులు మారుతూ వచ్చాయి. వేదం, పురాణాలు సంస్కృత భాషా ప్రావీణ్యం, పంచాంగం, జ్యోతిషం, వాస్తు వంటి విషయాలు తెలిసిన వారికి గౌరవమిచ్చారు. కానీ, అది మాత్రమే జ్ఞానం కాదు. అనే విషయం సామాన్య పౌరులు గ్రహిస్తూ వచ్చారు. ఇంకా కొందరు గ్రహించే దశలో ఉన్నారు. గతాన్ని అధ్యయనం చేయడం వల్ల కుట్రలన్నీ వెల్లడయ్యాయి. కుతంత్రాలు బయటపడ్డాయి. మత మౌఢ్యంలోంచి బయటపడి స్వేచ్ఛాలోచనలో జనం విశ్వమానవులుగా ఎదుగుతున్నారు. తాము ఏ కులానికీ ఏ మతానికీ కట్టుబడి లేమని అధికారికంగా "నో కాస్ట్ - నో రిలిజియన్" సర్టిఫికేట్లు తీసుకుని మానవ జాతి అంతా ఒక్కటే అని చాటి చెపుతున్నారు. గతంలో జరిగిన పొరపాట్లను ఎత్తి చూపాలన్నదే - ఈ ప్రయత్నం! తప్పితే, ఒక వర్గం వారిని విమర్శించాలని కాదు. శతాబ్దాల క్రితం జరిగిన పొరపాట్లను సరి చేసుకుందామని చెప్పడం తప్ప, సమకాలీనంలో మన జనాభాలో భాగమైన బ్రాహ్మణవర్గం మీద ఉక్రోషం వెళ్ళగక్కడం కాదు. శతాబ్దాల క్రితం జరిగిన పొరపాట్లకు సమకాలీనంలోని వారు ఏ విధంగానూ బాధ్యులు కారు కదా? అయితే అవే పాత పద్ధతులు వర్ధిల్లాలని తాపత్రయ పడేవారు కొంచెం వారి 'మైండ్ సెట్' మార్చుకుంటే బావుంటుంది.

ఒక శూన్యానికి 'దైవం' అని పేరు పెట్టి, దాన్ని జనానికి మత్తు మందులాగా అలవాటు చేసి ఆ తర్వాత "ఈ భూమి మీద దైవ స్వరూపులు మరెవరో కాదు, బ్రాహ్మణులే" అని తమ గురించి తామే ప్రకటించుకున్నారు కదా? అంటే ఈ శూన్యంలో తమను తాము ప్రతిష్ఠించుకున్నారు. సామాన్య జనం నమ్మి పూజారిని అపర పరమాత్మ స్వరూపుడనుకున్నారు. దైవస్తుతిలో ఎవరైనా ఓ కీర్తన పాడితే ఇక ఏకంగా అతణ్ణి దైవ స్వరూపుడన్నారు. అతను చనిపోలేదు - దైవంలో ఐక్యమై పోయాడు అని అన్నారు. ఇన్నిన్ని అభూత కల్పనల మధ్య సామాన్య జనం ఆలోచించలేక, మెదడ్లు మొద్దుబారిపోయి, తరతరాలుగా వాస్తవాలు గ్రహించలేకపోయారు.

భ్రమలు తొలగాలంటే జీవ పరిణామం, జన్యుశాస్త్రం, ఖగోళశాస్త్రం గురించి కొంత ప్రాథమిక పరిజ్ఞానమైనా తెలుసుకోవాలి. తెలుసుకుంటే ఇంకా పెంచుకోవాలి. కొందరు గౌరవనీయులైన మూర్ఖులుంటారు. అశాస్త్రీయమైన విషయాలకు శాస్త్రీయ వివరణలివ్వాలని ప్రయత్నిస్తుంటారు. వారిని నిర్దాక్షిణ్యంగా పక్కకు తొలగించుకుంటూ - మానవ జాతి అంతా ఒక్కటే - అందరిదీ ఒకేస్థాయి అని ఎలుగెత్తి చాటుకుంటూ ప్రగతి పథంలోకి కదలాలి - మానవవాదులుగా గెలవాలి! మానవవాద ప్రపంచానికి రూపకల్పన చేయాలి!!

- వ్యాసకర్త: కేంద్ర సాహిత్య అకాడమీ విజేత, జీవశాస్త్రవేత్త.

మెయిల్ @నవతెలంగాణ

దేశం గర్వించదగిన ఇంజనీర్ మోక్షగుండం

దేశం గర్వించదగిన గొప్ప ఇంజనీర్ మోక్షగుండం విశ్వేశ్వరయ్య. ఇతను పండితుడు, రాజనీతిజ్ఞుడు. 1955లోనే భారతదేశపు అత్యున్నత పురస్కారమైన భారతరత్న లభించింది. చేసిన సేవలకుగాను బ్రిటిష్ ప్రభుత్వం నైట్ కమాండర్ ఆఫ్ ది ఆర్డర్ ఆఫ్ ఇండియన్ ఎంపైర్' బిరుదునిచ్చి సత్కరించింది. పుట్టింది బెంగళూరులో అయినప్పటికీ వీరి పూర్వీకులు ఆంధ్రప్రదేశ్, ప్రకాశం జిల్లాలోని మోక్షగుండం గ్రామానికి చెందినవారు. పుణెలో ఇంజనీరింగ్ చదివాడు. మైసూరులోని ఆనకట్ట కృష్ణరాజసాగర్‌కు ఛీఫ్ ఇంజనీర్‌గా పనిచేశాడు. తన 23వ యేటా బొంబాయి ప్రజా పనుల శాఖలో అసిస్టెంట్ ఇంజనీర్‌గా చేరిన తరువాత, భారత నీటిపారుదల కమి షన్‌లో చేరవలసినదిగా ఆహ్వానం వచ్చింది. అతను దక్కన్ ప్రాంతంలో చక్కని నీటిపారుదల వ్యవస్థను రూపొందించాడు. నీటి ప్రవాహానికి తగినట్టుగా ఆనకట్టకు ఎటువంటి ప్రమాదం కలగకుండా నీటిని నిల్వచేయగలిగిన ఆటోమాటిక్ వరద గేట్ల వ్యవస్థను నిర్మిం చాడు. 1903లో మొదటిసారిగా దీనిని పూణె దగ్గరి ఖడక్‌వాస్లా వద్ద నెలకొల్పారు. వరద సమయంలో ఆనకట్ట భద్రతను దృష్టిలో ఉంచుకుంటూనే అత్యధిక నీటి నిల్వ చేసే విధానం ఇది. దీని తరువాత గ్వాలియర్ వద్ద అల తిగ్రా వద్ద, మైసూరు వద్ద గల కృష్ణరాజ సాగర్ ఆనకట్టలలోను దీనిని వాడారు. 1906-1907 మధ్య కాలంలో అతన్ని భారత ప్రభుత్వం యెమెన్‌లోని ఆడెన్‌కి పంపించి అక్కడి నీటి పారుదల వ్యవస్థనూ, మురుగు కాలువల వ్యవస్థను రూపకల్పన చేయమని కోరింది. అతను నిర్దేశించిన పథకం ప్రకారం అక్కడ మంచి ప్రాజెక్టు విజయవంతంగా పూర్తి చేయబడింది. హైదరాబాద్ నగరాన్ని మూసీ వరదల నుండి రక్షించడానికి ఒక వ్యవస్థను రూపొందించాడు. విశాఖపట్నం రేవును సముద్రపు కోత నుండి రక్షించే వ్యవస్థను రూపొందించడంలో కూడా అతని పాత్ర ఉంది. కావేరీ నదిపై నిర్మించిన కృష్ణరాజసాగర్ ఆనకట్ట ఆది నుంచి పూర్తివరకు అతని పర్యవేక్షణలోనే రూపు దిద్దుకుంది. అప్పట్లో కృష్ణరాజసాగర్ ఆనకట్ట ఆసియా ఖండంలోనే అతిపెద్దది. 1908లో స్వచ్ఛంద పదవీ విరమణ తరువాత మైసూరు సంస్థానంలో దివానుగా చేరి సంస్థాన అభివృద్ధికి కృషిచేశాడు. 1917లో బెంగళూరులో ప్రభుత్వ ఇంజనీరింగు కాలేజీని స్థాపించడంలో ముఖ్యపాత్ర వహించాడు. తరువాత ఈ కాలేజికి అతను పేరే పెట్టారు. ఎంతో మంది ఇంజనీర్లకు స్ఫూర్తిగా నిలిచిన విశ్వేశ్వరయ్య సెప్టెంబర్ 15 జయంతి సందర్భంగా ఆయన్ను స్మరించుకుందాం.

- కామిడి సతీష్ రెడ్డి, 9848445134

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
కరీంనగర్
శుక్రవారం | సెప్టెంబర్ 15, 2023 | www.navatelangana.com

మెడికల్ కాలేజీల ప్రారంభానికి సర్వం సిద్ధం

- సీఎం చేతుల మీదుగా వర్చువల్ విధానంలో ప్రారంభం కానున్న కరీంనగర్, సిరిసిల్ల కాలేజీలు
- సకల వసతులతో ప్రారంభానికి సిద్ధం చేసిన అధికారులు
- ఇరు జిల్లాల కలెక్టర్లు ఆయా కాలేజీల్లో ఏర్పాట్లు పరిశీలన
- రామగుండం, జగిత్యాలలో రెండో ఏడాదికి చేరిన వైద్య కళాశాలలు
- మరో రెండుకాలేజీల ప్రారంభంతో మెడికో హబ్‌గా ఉమ్మడి కరీంనగర్ జిల్లా
- ఏడాదికి 500 సీట్ల భర్తీతో స్థానిక యువతకు అందుబాటులో వైద్య విద్య
- నాలుగు జిల్లాల్లో కలిపి రోగులకు అందుబాటులోకి రానున్న 1460 పడకల వైద్య సేవలు



కరీంనగర్ మెడికల్ కాలేజీ



సిరిసిల్ల మెడికల్ కాలేజీ భవనం

నవతెలంగాణ - కరీంనగర్ ప్రాంతీయ ప్రతినిధి

నాలుగు మెడికల్ కాలేజీలు, ఏడాదికి 500 సీట్ల భర్తీ, మొత్తం 1460 పడకల సామర్థ్యం ఉన్న వైద్యకళాశాలలతో ఉమ్మడి కరీంనగర్ జిల్లా మెడికోహబ్‌గా మారబోతోంది. ఇప్పటికే రామగుండం, జగిత్యాల కాలేజీలు ఏడాది కిందటే ప్రారంభం కాగా.. కరీంనగర్, రాజన్నసిరిసిల్ల జిల్లాల వైద్య కళాశాలలను నేడు (శుక్రవారం) ముఖ్యమంత్రి కేసీఆర్ వర్చువల్ విధానంలో హైదరాబాద్ నుంచే ప్రారంభించబోతున్నారు. ఇప్పటికే ఈ రెండు కాలేజీల భవనాలను సిద్ధం చేయగా.. ఆ రెండు జిల్లాల కలెక్టర్లు, అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు. కరీంనగర్‌లో మంత్రి గంగుల కమలాకర్‌తో సహా వైద్య ఆరోగ్య శాఖ మంత్రి హరీశ్‌రావు రాబోతున్నారు. రాజన్నసిరిసిల్ల జిల్లాలో మంత్రి కేటీఆర్ హాజరుకానున్నారు. ఏదేమైనా నాలుగు జిల్లాల్లో నాలుగు మెడికల్ కాలేజీల రాకతో ఉమ్మడి జిల్లాలో వైద్య సేవలు మరింత విస్తృతం కానున్నాయి.

వైద్య విద్యలో తెలంగాణ ప్రభుత్వం కొత్త రికార్డు సష్టించింది. ప్రభుత్వ మెడికల్ కాలేజీల ఏర్పాటులో దేశంలోనే అత్యధిక కాలేజీలను నెలకొల్పింది. కొద్ది నెలల క్రితం ఒకే రోజు 8 కాలేజీలు ప్రారంభించిన సీఎం కేసీఆర్ నేడు రాజన్నసిరిసిల్ల, కరీంనగర్ సహా కామారెడ్డి, ఖమ్మం, భూపాలపల్లి, ఆసిఫాబాద్, నిర్మల్, వికారాబాద్, జనగామ జిల్లాల్లో కలిపి 9 కాలేజీలను వర్చువల్ విధానంలో ప్రారంభించబోతున్నారు. ఆ తొమ్మిది కాలేజీల్లో తరగతులను ప్రారంభించనున్నారు. మొత్తంగా రాష్ట్రంలో 26కు మెడికల్ కాలేజీల సంఖ్య చేరబోతోంది. నేడు ప్రారంభిస్తున్న 9 కాలేజీల్లో ఒక్కో దాంట్లో వంద సీట్లు చొప్పున 900 మెడికల్ సీట్లు అందుబాటులోకి వచ్చాయి. 2014లో 5 ప్రభుత్వ వైద్య కళాశాలల ద్వారా 850 ఎంబీబీఎస్ సీట్లు మాత్రమే అందుబాటులో ఉంటే ప్రస్తుతం ఆ సంఖ్య 3,915కు చేరింది. ఉమ్మడి కరీంనగర్ జిల్లా వ్యాప్తంగా సర్కారు మెడికల్ కాలేజీ వల్ల సామాన్యులకు వైద్యం అందుబాటులో రానుంది. కరీంనగర్ 500, రామగుండం 330, సిరిసిల్ల 300, జగిత్యాల 330 పడకలు ఆయా కళాశాలలోల అందుబాటులోకిరానున్నాయి. ఇక మెడికల్ సీట్ల విషయానికొస్తే జగిత్యాల, రామగుండం కాలేజీల్లో 150 చొప్పున భర్తీఅవగా.. కరీంనగర్, సిరిసిల్ల కాలేజీల్లో వంద చొప్పున సీట్లు భర్తీ చేయనున్నారు. ఇప్పటికే సిరిసిల్ల కాలేజీలో 90 మంది విద్యార్థులు జాయిన్ అయ్యారు. ఈ నెల 16 స్టేట్ కోటా, 18వ తేదీన ఆల్ అండియా కోటా కింద మిగతా విద్యార్థులు జాయిన్‌కాబోతున్నారు.

కరీంనగర్‌లో తాత్కాలిక భవనం

కరీంనగర్‌లో ప్రభుత్వ మెడికల్ కాలేజీలో మౌలిక సదుపాయాల కోసం ఇదివరకే నిధులు మంజూరుకాగా అందులో రూ.7కోట్లతో కొత్తపల్లిలోని విత్తన గోదాములో తరగతి గదులు ఏర్పాటు చేసింది. అరకొర వసతుల నడుమే ప్రస్తుతం విద్యార్థులకు సదుపాయాలు ఏర్పాట్లు చేశారు. మరోవైపు సిరిసిల్లలో 36 ఎకరాల్లో రూ.39కోట్లు ఖర్చు చేసి మెడికల్ కాలేజీ భవనాన్ని మూడు అంతస్తులతో నిర్మించారు. ప్రతి అంతస్తులో నాలుగు బ్లాక్‌లుగా విడగొట్టారు.50 మంది ఫ్యాకల్టీ, 38 మంది సీనియర్ రెసిడెంట్ డాక్టర్లు, మిగతా వైద్యులు కలిపి వంద మందివరకు ఉంటారు. వీరితోపాటు నాన్ టీచింగ్ సిబ్బంది 250మంది, మొదటి ఈ సంవత్సరం విద్యార్థులు 100 మంది విద్యార్థులు ఉండనున్నారు. రాజన్నసిరిసిల్ల బైపాస్ రోడ్డులో నిర్మించిన మెడికల్ కాలేజీ భవనానికి అనుబంధంగా సర్దాపూర్ వ్యవసాయ పాలిటెక్నిక్ కాలేజీలో విద్యార్థులకు వసతి ఏర్పాట్లు చేశారు.

ఏడాది కిందటే రామగుండం, జగిత్యాల కాలేజీలు

రెండేండ్ల క్రితం జగిత్యాల, రామగుండం కాలేజీలకు ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇవ్వడంతో ప్రస్తుతం రెండుకాలేజీల్లో రెండో సంవత్సరం తరగతులు కూడా విజయవంతంగా నడుస్తున్నాయి. ఈ రెండుకాలేజీల భవనాల నిర్మాణం కూడా అదేస్థాయిలో ఉంది. ఇక రామగుండం మెడికల్ కాలేజీకి కావాల్సిన నిధులు రూ.510కోట్లు, ఇతర మౌలిక సదుపాయాల ఖర్చును భరించేందుకు సింగరేణి ముందుకు వచ్చింది. దీంతో ఆ కాలేజీ పేరును సింగరేణి ఇనిస్టిట్యూట్ ఆఫ్‌మెడికల్ అండ్ సైన్సెస్ (సిమ్స్)గా మార్చారు. మొత్తం 150సీట్లలో 24 సీట్లు ఆలిండియా రిజర్వేషన్ ప్రకారం కేటాయిస్తారు. జగిత్యాల మెడికల్ కాలేజీలో 150 సీట్లు అందుబాటులోకి వచ్చాయి. కాలేజీ నిర్మాణానికి ప్రభుత్వం రూ.510కోట్లు కేటాయించింది. 27.5ఎకరాల సువిశాల ప్రాంగణంలో కాలేజీ నిర్మాణం జరుగుతోంది. ప్రస్తుతం తాత్కాలిక భవనాల్లో తరగతులు నడుస్తున్నాయి.

రెండు జిల్లాలో కార్యక్రమాల షెడ్యూల్ ఇదే..

- సిరిసిల్ల బైపాస్ రోడ్డు లోఉదయం 11.45 గంటలకు సీఎం కేసీఆర్ గారి చేతుల మీదుగా వర్చువల్ గా ప్రారంభించనున్న మెడికల్ కళాశాల ప్రారంభోత్సవంలో మంత్రి కేటీఆర్ పాల్గొంటారు. మధ్యాహ్నం 12 గంటలకు మెడికల కళాశాల మంజూరు చేసినందుకు గాను సిరిసిల్ల సెస్ కార్యాలయం నుంచి అంబేద్కర్ చౌరస్తా వరకు సీఎం కేసీఆర్‌కు కతజ్ఞత చెబుతూ ర్యాలీ నిర్వహించనున్నారు. మధ్యాహ్నం 12.30గంటలకు అంబేద్కర్ చౌరస్తాలో మంత్రి కేటీఆర్ ప్రసంగిస్తారు.

- కరీంనగర్ జిల్లాలోని కొత్తపల్లిలో ఏర్పాటు చేసిన మెడికల్ కాలేజీ భవనాలను ముఖ్యమంత్రి ప్రారంభించే సందర్భంగా ఇక్కడ మంత్రి గంగుల, వైద్య ఆరోగ్య శాఖ మంత్రి హరీశ్‌రావు సహా జగిత్యాల, పెద్దపల్లి జిల్లాల నేతలూ హాజరుకాబోతున్నారు. ప్రారంభోత్సవం అనంతరం మంత్రులు హరీశ్‌రావు, గంగుల ప్రసంగిస్తారు.

అనభేరి ప్రభాకర్‌రావు స్ఫూర్తితో పోరాడుదాం..

- బీజేపీకి దేశ భక్తులమని చెప్పుకునే హక్కు లేదు
- సీపీఐ(ఎం) కరీంనగర్ జిల్లా కార్యదర్శి మిల్కూరి వాసుదేవరెడ్డి



తిమ్మాపూర్ మండలం పోలంపల్లిలో అనభేరి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న నాయకులు

నవతెలంగాణ - కరీంనగర్/ తిమ్మాపూర్

అనభేరి ప్రభాకర్ రావు స్ఫూర్తితో పోరాడుదామని, స్వాతంత్ర్య ఉద్యమంలో పాల్గొనని బీజేపీకి దేశ భక్తులమని చెప్పుకునే హక్కు లేదని సీపీఐ(ఎం) కరీంనగర్ జిల్లా కార్యదర్శి మిల్కూరి వాసుదేవరెడ్డి అన్నారు. తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట వారోత్సవాల్లో భాగంగా గురువారం స్థానిక వెంకటేశ్వర ఆలయం ఎదుట అనభేరి ప్రభాకర్‌రావు విగ్రహానికి సీపీఐ(ఎం) జిల్లా కమిటీ ఆధ్వర్యంలో పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. అనంతరం ప్రభాకర్‌రావు విగ్రహం వద్ద నుంచి ప్రారంభమైన బైక్ ర్యాలీని సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి జెండా ఊపి ప్రారంభించారు. ఈ బైకు యాత్ర అనబేరి ప్రభాకర్‌రావు స్వగ్రామం తిమ్మాపూర్ మండలం పోలంపల్లి వరకు సాగింది. అక్కడ ప్రభాకర్‌రావు విగ్రహానికి పూలమాలలు వేసి నివాళ్లర్పించారు.అనంతరం నిర్వహించిన సభలో మిల్కూరి వాసుదేవరెడ్డి మాట్లాడుతూ.. బ్రిటీష్ వారి నుంచి స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత కూడా తెలంగాణలో నైజాం నవాబులు పరిపాలించారని, దేశ్‌ముక్‌లు, భూస్వాములు, జాగిరిదారులు తెలంగాణ ప్రజలను చిత్రహింసలు గురిచేశారని అన్నారు. బానిసత్వానికి వ్యతిరేకంగా పేద ప్రజలందరిని ఐక్యం చేసి తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటంలో ముందుండి కామ్రేడ్ అనభేరి ప్రభాకర్‌రావు తుపాకి పట్టి నైజాం నవాబులను ఎదుర్కొని అమరుడయ్యాడని గుర్తు చేశారు. సాయుధ రైతాంగ పోరాటానికి నిజమైన వారసులు ఎర్రజెండా పట్టిన వారేనని అన్నారు. తెలంగాణ సాయుధ రైతాంగ పోరాట యోధులు అనభేరి ప్రభాకర్‌రావు, దొడ్డి కొమురయ్య, పుచ్చలపల్లి సుందరయ్య, భీమ్‌రెడ్డి నరసింహారెడ్డి, చిట్యాల ఐలమ్మను స్ఫూర్తిగా తీసుకోవాలని అన్నారు. ప్రజావ్యతిరేక విధానాలు అవలంభిస్తున్న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపై వారి స్ఫూర్తితో పోరాటం కొనసాగించాలన్నారు. నగరంలోని అన్ని విగ్రహాలను సుందరీకరణ చేసి, వాటర్ ఫౌంటేషన్ ఏర్పాటు చేసి తెలంగాణ సాయుధ పోరాట యోధుడైన అనభేరి ప్రభాకర్‌రావు విగ్రహాన్ని విస్మరించారని, ఇలాంటి వివక్షత తగదని హెచ్చరించారు. ఇప్పటికైనా నగరపాలక సంస్థ మున్సిపల్ కమిషనర్, మేయర్ వెంటనే స్పందించి అనబేరి ప్రభాకర్‌రావు విగ్రహాన్ని ఆధునీకరణ చేసి, ప్రభుత్వమే అధికారికంగా వర్ధంతి, జయంతి కార్యక్రమాలు చేయాలని డిమాండ్ చేశారు. ఈనాడు దేశ భక్తులమని చెప్పుకుంటున్న బీజేపీ నాయకులు అసలు స్వాతంత్ర ఉద్యమంలో పాల్గొనలేదని అన్నారు. భారతదేశ స్వతంత్ర ఉద్యమంలో పాల్గొనక పోగా బ్రిటీష్ వారికి తొత్తులుగా మారి భారత ప్రజలను హింసించారని అన్నారు. బీజేపీ నాయకులు దేశభక్తులు కాదని, పక్కా దేశద్రోహులని అన్నారు. స్వతంత్ర పోరాట చరిత్రను వక్రీకరిస్తూ అసలైన దేశభక్తులం తామే అని జబ్బలు చరుసుకుంటున్నారని ఎద్దేవా చేశారు. హిందుత్వం ముసుగులో దళితులు, గిరిజనులు, అణగారిన వర్గాలను కుల వివక్షతతో గుళ్లల్లోకి రానివ్వలేదని, సమానత్వానికి దూరంగా అణచివేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. బీజేపీ అధికారంలోకి వస్తే సంవత్సరానికి రెండు కోట్ల ఉద్యోగాలు కల్పిస్తామని యువతను మోసం చేసిందని గుర్తు చేశారు. భారతదేశంలోని ప్రభుత్వ రంగ సంస్థలన్నింటిని కార్పొరేట్ శక్తులకు అమ్మివేస్తూ దేశ సంపదను దోచుకుంటున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. తెలంగాణలో అధికారంలో ఉన్న టీఆర్ఎస్ ప్రభుత్వం తాము అధికారంలోకి వస్తే అర్హులైన పేదలకు డబుల్ బెడ్‌రూమ్ ఇండ్లు, ఇంటికో ఉద్యోగం, నిరుద్యోగ భృతి కల్పిస్తామని మభ్యపెట్టి అధికారంలోకి వచ్చిన తర్వాత పేదలపై భారాలు వేస్తూ దళితులను, బీసీలను, మైనార్టీలను మోసం చేసిందన్నారు. కేంద్రంలోని బీజేపీ, రాష్ట్రంలోని టీఆర్ఎస్ రెండు ఒకటేనని, పేదలను దోచుకుంటున్నాయని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవలంభిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలపై సాయుధ రైతాంగ పోరాట అమరవీరుల స్ఫూర్తితో పోరాడాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు వర్ణ వెంకటరెడ్డి, గుడికందుల సత్యం, గీట్ల ముకుందరెడ్డి, జి.బీమాసాహెబ్, జిల్లా కమిటీ సభ్యులు శ్రీనివాస్, ఎడ్ల రమేష్, నరేష్ పటేల్, నాయకులు తిరుపతి, నాగమణి, పుల్లెల మల్లయ్య, రాయికంటి శ్రీనివాస్, కాంపెల్లి అరవింద్, గజ్జల శ్రీకాంత్, శివకుమార్, నవీన్, అభినవ్, జగదీష్, మల్లారెడ్డి, ఆకాష్, రవి, సురేష్ తదితరులు పాల్గొన్నారు.



జెండా ఊపి ర్యాలీ ప్రారంభిస్తున్న మిల్కూరి వాసుదేవరెడ్డి

మీ స్థానిక బిడ్డను.. ఆశీర్వదించండి

- నియోజకవర్గాన్ని మరింత అభివృద్ధి చేస్తా
- చొప్పదండి ఎమ్మెల్యే సుంకె రవిశంకర్



నవతెలంగాణ - చొప్పదండి

ఆశీర్వదించండి.. మీ స్థానిక బిడ్డను ఆదరించండి రాబోయే రోజుల్లో నియోజకవర్గాన్ని మరింత అభివృద్ధి చేస్తానని చొప్పదండి ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ అన్నారు. చొప్పదండి మండలంలోని రాగంపేట గ్రామానికి చెందిన ముదిరాజ్, యాదవ కుల సంఘాల నాయకులు, మహిళా సంఘాల వారు గురువారం చొప్పదండి బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థి, ఎమ్మెల్యే సుంకె రవిశంకర్‌కు మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కాంగ్రెస్, బీజేపీ చేసింది ఏమీ లేదన్నారు. చొప్పదండిని అభివృద్ధి చేసిన ఘనత బీఆర్ఎస్ ప్రభుత్వానిదే అన్నారు. సీఎం కేసీఆర్‌తోనే పచ్చని తెలంగాణ అని, పనిచేసే ప్రభుత్వాన్ని ఆదరించండని కోరారు. ఎన్నికల అప్పుడు వచ్చిపోయే నాయకుడు కావాలా.. ఎల్లవేళలా అందుబాటులో ఉండే నాయకుడు కావాలా మీరే ఆలోచించండి అని అన్నారు. దేశంలో ఎక్కడా లేని విధంగా ప్రతి ఇంటికి సంక్షేమ పథకాలను అందిస్తున్నది తెలంగాణ రాష్ట్రమే అన్నారు. సంక్షేమం, అభివృద్ధిలో దేశంలోనే తెలంగాణ నెంబర్ వన్ రాష్ట్రం అని చెప్పారు. 24 గంటలు మీ అందుబాటులో ఉంటా ఏ కష్టం వచ్చినా మీకు తోడుగ నిలుస్తానని అన్నారు. గ్రామంలోని ముదిరాజ్, యాదవ, మహిళా సంఘ భవనాలకు గ్రామ ప్రజల కోరిక మేరకు 13.20 లక్షల రూపాయల ప్రొసీడింగ్ పత్రాలను అందజేశారు. కార్యక్రమంలో ముదిరాజ్, యాదవ, మహిళా సంఘాల నాయకులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

వైద్యాధికారిపై కఠిన చర్యలు తీసుకోవాలి

రామడుగు ఎంపీపీ కలిగేటి కవితాలక్ష్మణ్

నవతెలంగాణ - రామడుగు

వైద్యాధికారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఎంపీపీ కలిగేటి కవితాలక్ష్మణ్ అన్నారు. రామడుగు మండలం షానగర్ గ్రామంలోని ఆయుర్వేద వైద్యశాలను గురువారం ఆమె సందర్శించి మాట్లాడారు. ఈ నెల 5న వైద్యశాలను సందర్శించిన సమయంలో కొన్ని రోజులుగా వైద్యాధికారి శ్రీదేవి, ఫార్మసిస్ట్ హేమలత ఆస్పత్రికి రాకుండా వారానికి ఒకరోజు వచ్చి రిజిష్టర్లో సంతకాలు చేస్తున్నట్టు గుర్తించినట్టు చెప్పారు. ఈ విషయంపై సంబంధిత వైద్యాధికారి, ఫార్మసిస్ట్‌పై చర్యలు తీసుకోవాలని పై అధికారులకు సూచించినా చర్యలు తీసుకోలేదన్నారు. గురువారం మళ్లీ వైద్యశాలను సందర్శించగా వైద్యాధికారి శ్రీదేవి, ఫార్మాసిస్టు ఇద్దరూ ఒకే రోజు సెలవుపై వెళ్లి, కొన్ని రోజులుగా వైద్యశాలకు రావడం లేదని గుర్తించినట్టు చెప్పారు. షానగర్ ఆయుర్వేద వైద్యశాలకు ప్రజల్లో మంచి ఆదరణ ఉండటంతో అనేకమంది రోగులు వైద్యశాలకు వచ్చి వైద్యాధికారి, ఫార్మసిస్ట్ లేకపోవడంతో మందులు తీసుకోకుండానే వెనుతిరిగి వెళ్లిపోతున్నారని వాపోయారు. వెంటనే సంబంధిత అధికారులు దృష్టి సారించి వైద్యాధికారి, ఫార్మసిస్ట్‌పై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

భవన నిర్మాణ కార్మికులకు గృహలక్ష్మి మంజూరు చేయాలి

కార్మిక సంఘం మండల అధ్యక్షుడు రావు ఎల్లయ్య

నవతెలంగాణ ఇల్లందకుంట



సమావేశంలో మాట్లాడుతున్న మండల అధ్యక్షుడు

భవన నిర్మాణ కార్మికులకు గృహలక్ష్మి మంజూరు చేయాలని బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ (సీఐటీయూ) మండల అధ్యక్షుడు రావు ఎల్లయ్య డిమాండ్‌చేశారు. గురువారం నిర్వహించిన యూనియన్ సమావేశంలో ఆయన మాట్లాడారు. భవన నిర్మాణ రంగంలో పనిచేసే ప్రతి ఒక్క కార్మికుడు పేదరికంలో ఉన్న వారేనని అన్నారు. వారిని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం గుర్తించి వారికి డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు, లేదా గృహలక్ష్మి పథకాన్ని మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో నాయకులు కృష్ణమూర్తి, ప్రభాకర్, కుమారస్వామి, కుమార్, గణపతి, తదితరులు పాల్గొన్నారు.

కాసీంపేట, వెలిగాల గ్రామాలకు స్వచ్ఛ సర్వేక్షన్ అవార్డులు

నవతెలంగాణ - కరీంనగర్/గన్నేరువరం



మంత్రి చేతుల మీదుగా అవార్డు తీసుకుంటున్న కాసీంపేట సర్పంచ్

స్వచ్ఛ సర్వేక్షన్ గ్రామీన్-2023 అవార్డులు జిల్లాలో ఉన్నత ప్రతిభ కనబరిచిన రెండు గ్రామాలు దక్కించుకున్నాయి. 2000లోపు జనాభా ప్రతిపదికనలో గన్నేరువరం మండలం కాసీంపేట గ్రామాన్ని రెండో స్థానం, 5000పైగా జనాభా ప్రాతిపదికన రామడుగు మండలం వెలిచాల గ్రామాన్ని 5వ స్థానంలో గుర్తించి తెలంగాణ రాష్ట్ర గ్రామీణాభివృద్ధి శిక్షణ కేంద్రం హైదరాబాద్‌లో రాష్ట్ర స్థాయిలో కార్యక్రమాన్ని ఏర్పాటు చేసి పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకరరావు చేతుల మీదుగా అవార్డులు అందజేశారు. ఈ సందర్భంగా వెలిచాల సర్పంచ్ వీర్ల సరోజన, కాసీంపేట సర్పంచ్ గంప మల్లీశ్వరి, పంచాయతీ కార్యదర్శులు అరుణ్, ఆనంద్‌ను సన్మానించారు. కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర ప్రిన్సిపల్ సెక్రటరీ, పీఆర్ అండ్ ఆర్డీ కమిషనర్, పీఆర్ అండ్ ఆర్డీ, సీఈఓ సెర్ప్, స్పెషల్ కమిషనర్, ఇతర రాష్ట్ర స్థాయి అధికారులు, కరీంనగర్ జిల్లా నుంచి జిల్లా పంచాయతీ అధికారి వీర బుచ్చయ్య, జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి ఎల్.శ్రీలత, జెడ్పీ ముఖ్య కార్యనిర్వహణ అధికారిటి పవన్‌కుమార్, రామడుగు ఎంపీడీఓ భాస్కర్‌రావు, గన్నేరువరం ఎంపీడీఓ స్వాతి, మండల పంచాయతీ అధికారులు రాజశేఖర్‌రెడ్డి, నర్సింహారెడ్డి, స్వచ్ఛ భారత్ జిల్లా కన్సల్టెంట్లు రమేష్, వేణు, గ్రామ పంచాయతీ సెక్రెటరీ ఆనంద్ పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి కృషిచేయాలి

నవతెలంగాణ - వీణవంక



శ్యాంసుందర్‌రెడ్డిని సన్మానిస్తున్న సదయ్య

కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి ప్రతీ ఒక్కరూ కృషి చేయాలని పీసీసీ సభ్యుడు కర భగవాన్‌రెడ్డి, జమ్మికుంట బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు మొలుగూరి సదయ్య కోరారు. నూతనంగా ఎన్నికైన కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు చింతల రాజిరెడ్డి (శ్యాంసుందర్ రెడ్డి) అధ్యక్షతన మండల కేంద్రంలో గురువారం నిర్వహించిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో వారు మాట్లాడారు. రానున్న ఎన్నికలల్లో కాంగ్రెస్ పార్టీ టికెట్ బల్మూరి వెంకట్‌కే వస్తుందని, ఎవరూ ఆందోళన చెందొద్దని సూచించారు. పార్టీ నాయకులంతా ఏకతాటిపై వెంకట్ గెలుపుకోసం ప్రతీ ఒక్కరూ కృషి చేయాలని సూచించారు. కొంత మంది అగ్రనాయకుల వ్యవహారం వల్ల పార్టీ కార్యకర్తల్లో ఆందోళన నెలకొందని, అలాంటి దానికి ఎవరూ తొందర పడొద్దని సూచించారు. పార్టీ వ్యతిరేక విధానాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. నూతనంగా ఎన్నికైన అధ్యక్షుడు శ్యాంసుందర్‌రెడ్డిని శాలువా కప్పి సన్మానించారు. కాంగ్రెస్ సీనియర్ నాయకులు, మాజీ మండల అధ్యక్షుడు గంగాడి రాజిరెడ్డి, కుర్మిండ్ల తిరుపతి, వివిధ గ్రామాల అధ్యక్షులు, నాయకులు పాల్గొన్నారు.

సీసీ కెమెరాలు పరిశీలించిన టౌన్ ఏసీపీ



నవతెలంగాణ - కరీంనగర్ క్రైం

వన్ టౌన్ పరిధిలో గల బస్టాండ్‌లో గురువారం కరీంనగర్ టౌన్ ఏసీపీ నరేందర్‌తో పాటు వన్ టౌన్ సీఐ రవికుమార్ తమ సిబ్బందితో సీసీ కెమెరాల పనితీరును పరిశీలించారు. పని చేయని వాటిని తీసివేసి, కొత్త కెమెరాలను ఏర్పాటు చేయాలని ఆర్టీసీ అధికారులను ఆదేశించారు. నగరంలో పూర్తి కెమెరాలను పరిశీలించనున్నట్లు పోలీసులు తెలిపారు.

సమగ్ర శిక్షా ఉద్యోగులకు కనీస వేతనాలు ఎందుకు అమలు చేయడం లేదు

బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, ఎంపీ బండి సంజయ్ కుమార్



దీక్షకు సంఘీభావం తెలుపుతున్న బండి సంజయ్

నవతెలంగాణ - కరీంనగర్

రాష్ట్రంలో కాంట్రాక్ట్ ఉద్యోగులే ఉండబోరని ప్రకటించిన కేసీఆర్‌కు ఏమాత్రం చిత్తశుద్ధి ఉన్నా తెలంగాణ సమగ్ర శిక్షా ఉద్యోగులను విద్యాశాఖలో విలీనం చేసి రెగ్యులరైజ్ చేయాలని బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, ఎంపీ బండి సంజయ్ కుమార్ డిమాండ్ చేశారు. కరీంనగర్ కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న తెలంగాణ సమగ్ర శిక్షా ఉద్యోగుల శిబిరం వద్దకు గురువారం బండి సంజయ్ వెళ్లి సంఘీభావం తెలిపారు. బీజేపీ అధికారంలోకి వచ్చిన వెంటనే సమగ్ర శిక్షా ఉద్యోగుల సమస్యలను పరిష్కరిస్తామని, రాష్ట్ర ప్రభుత్వ మ్యాచింగ్ గ్రాంట్‌ను వెంటనే విడుదల చేస్తామని హామీ ఇచ్చారు. అనంతరం మాట్లాడుతూ..సమగ్ర శిక్షా ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్తంగా 22 వేల మంది ఉద్యోగులు 14 రోజులుగా సమ్మె చేస్తున్నా ప్రభుత్వం పట్టించుకోవడం దారుణం అన్నారు. వెంటనే వాళ్లను విద్యాశాఖలో విలీనం చేయాలని, హెల్త్ కార్డులివ్వాలని, ఉద్యోగ భద్రత ఇవ్వాలన్నారు. రాష్ట్రంలో కాంట్రాక్ట్ ఉద్యోగులే ఉండబోరని ప్రకటించిన కేసీఆర్‌కు ఏమాత్రం చిత్తశుద్ధి ఉన్నా మాట నిలబెట్టుకోవాలని తెలిపారు.

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి

- డీఎంహెచ్‌వో డాక్టర్ శ్రీధర్

నవతెలంగాణ-మల్లాపూర్

గ్రామాల్లో ఇంటి పరిసరాలు ప్రతి ఒక్కరూ పరిశుభ్రంగా ఉంచుకోవాలని జిల్లా వైద్య ఆరోగ్య అధికారి పుప్పాల శ్రీధర్ అన్నారు. గురువారం మండలంలోని రాఘవపేట గ్రామంలో ఇటీవల ఒక వ్యక్తికి డెంగ్యూ పాజిటివ్ రాగ ఇంటి పరిసరాలను పరిశీలించారు. ఈ సందర్భంగా చుట్టుపక్కల స్ప్రే చేయించి, నిల్వ ఉన్న నీటిలో ఆయిల్ బాయిల్స్ వేశారు అనంతరం ఆయన మాట్లాడుతూ.. ఇంటి చుట్టుపక్కల నీరు నిలువ ఉండకుండా చూసుకోవాలని అన్నారు. అకాల వర్షాలకు ఇంటి పరిసర ప్రాంతాలలో ఉన్న కుండీలు,



ఫ్రిజ్జులు, కూలర్లు తదితర వాటిలో నీటి నిల్వ ఉండకుండా చూసుకోవాలన్నారు.. డ్రై డే ఫ్రైడే ప్రతిరోజు చేపట్టాలని అధికారులకు సూచించారు. ఆయన వెంట అసిస్టెంట్ మలేరియా ఆఫీసర్ సత్యనారాయణ, సిహెచ్ఓ రామ్మోహన్, సబ్ యూనిట్ ఆఫీసర్ నిద్ర విలయత్ బేగ్, సూపర్ వైజర్ శ్రీనివాస్, సిబ్బంది శ్రీనివాస్, విక్రమ్, విజయలక్ష్మి ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

కవిత వాస్తవాలు తెలుసుకొని మాట్లాడాలి

- ప్రశ్నించే ముందు ఆలోచించుకోవాలి
- ఎమ్మెల్సీ తాటిపర్తి జీవన్ రెడ్డి

నవతెలంగాణ-జగిత్యాల

ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత వాస్తవాలు తెలుసుకుని, ప్రశ్నించే మందు ఆలోచించాలని కరీంనగర్ పట్టభద్రుల ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి అన్నారు. జగిత్యాల జిల్లా కేంద్రంలోని ఇందిరా భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఎమ్మెల్సీ మాట్లాడారు. బుధవారం జరిగిన బీఆర్ఎస్ ఆత్మీయ సమ్మేళనంలో ఎమ్మెల్సీ కవిత చేసిన వ్యాఖ్యలను జీవన్‌రెడ్డి ఖండించారు. జిల్లాలోని అన్ని గ్రామాలకు రోడ్లు వేశామని, తాగునీరు, విద్యుత్ సరఫరా సౌకర్యం కల్పించి, మౌలిక వసతులకు పెద్దపీట జీవన్‌రెడ్డి పేర్కొన్నారు. బీఆర్ఎస్ ఆత్మీయ సమ్మేళనం నిర్వహించుకున్న మామిడి మార్కెట్‌ను రైతుల కోసం 25 ఎకరాల్లో ఏర్పాటు చేశామని గుర్తు చేశారు. ఎన్నికలు రాగానే యావర్ రోడ్డు అంశం తెరపైకి తీసుకువస్తున్నారని, కాంగ్రెస్ పాలనలో యావర్ రోడ్డును 40ఫీట్ల నుంచి 60 ఫీట్లకు పెంచామని తెలిపారు. 2017లో అప్పటి మున్సిపల్ చైర్‌పర్సన్ తాటిపర్తి విజయలక్ష్మి ఆధ్వర్యంలో మున్సిపల్ మంత్రి కేటీఆర్‌కు యావర్ రోడ్డును 100ఫీట్లకు పెంచాలని ప్రతిపాదన చేశామని, యావర్ రోడ్డు విస్తరణ పనులు పూర్తి చేస్తే కాంగ్రెస్ పార్టీకి పేరు వస్తుందనే అక్కసుతో అనుమతి ఇవ్వలేదని ఆరోపించారు. ఎన్నికల్లో యావర్ రోడ్డు అంశాన్ని ఉపయోగించుకున్నారని,



మాట్లాడుతున్న ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి

కేవలం ప్రభుత్వ కార్యాలయాలు ఉన్న చోట మాత్రమే రోడ్డు యావర్ రోడ్డు వెడల్పు చేశారని, ప్రయివేట్ ఆస్తులు ఉన్న చోట వెడల్పు చేయలేదన్నారు. ఉమ్మడి రాష్ట్రంలో స్థలం సేకరించి, నాలుగు వేల ఇళ్ల నిర్మాణం చేపడితే వివిధ దశల్లో నిలిచిపోయిన ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేస్తే కాంగ్రెస్ పార్టీకి పేరు వస్తుందని, పూర్తి చేయకుండానే అదే స్థలంలో డబల్ బెడ్రూమ్ ఇండ్ల నిర్మాణం తెరపైకి తీసుకొచ్చి ఐదేళ్లు గడుస్తున్నా ఇంకా కొలిక్కి రాలేదని విమర్శించారు. మున్సిపల్ బలోపేతానికి కృషి చేస్తున్నామని చెప్పుకుంటున్న నాయకులు యావర్ రోడ్డు వెడల్పులో స్థలం కోల్పోతున్న వారికి పరిహారం చెల్లించేందుకు నిధులు విడుదల చేయకుండా, టీడీఆర్ తెరపైకి తీసుకువచ్చారని విమర్శించారు. బోర్నపల్లి వంతెన నిర్మాణం కోసం నిధులు విడుదల చేయాలని 2014లో సీఎం కేసీఆర్‌కు విన్నవించుకోగా, వంతెన మంజూరు చేశారని, సీఎం కేసీఆర్ సైతం పలు సందర్భాల్లో బోర్నపల్లి వంతెన అంశాన్ని ప్రస్తావించారు గుర్తు చేశారు. జగిత్యాల మున్సిపల్ చైర్‌పర్సన్ పదవిని బీసీ మహిళకు అప్పగించామని ఎమ్మెల్సీ కవిత గొప్పలు చెప్పుకోవడం విడ్డూరంగా ఉందన్నారు. బీసీ మహిళకు కేటాయించిన స్థానంలో బీసీలను కాకపోతే వేరే వారికి ఇస్తారా అని ప్రశ్నించారు. కుటుంబ పాలన గురించి కవిత మాట్లాడడం విడ్డూరంగా ఉంది. ఎవరిదీ కుటుంబ పాలనలో తెలంగాణ ప్రజలకు తెలుసాని పేర్కొన్నారు. పోడు భూముల పట్టాల పంపిణీపై రాహుల్‌గాంధీ అప్డేట్ కావాలనే వ్యాఖ్యను ఖండిస్తూ.. మీ లాగా స్కాంల్లో అప్డేట్ కావడం మాకు సాధ్యం కాని పని అని ఎద్దేవా చేశారు. ఎమ్మెల్సీ కవిత జగిత్యాలలోని ఆత్మీయ సమ్మేళనంలో బీజేపీ నాయకత్వంపై ఒక్క విమర్శ చేయలేదని, కవిత మద్యం కేసులో పీకల్లోతు కూరుకుపోయి ఉందని విలేకరులు అడిగిన ప్రశ్నకు సమాధానంగా చెప్పారు. ఇకనైనా వాస్తవాలు తెలుసుకొని, మాట్లాడాలని, అవాకులు.. చెవాకులు పేలడం సరికాదని ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి హితవు పలికారు. కార్యక్రమంలో పీసీసీ ప్రచార కమిటీ సభ్యులు బండశంకర్, జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు తాటిపర్తి విజయలక్ష్మీ దేవేందర్‌రెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు గాజంగి నందయ్య, కాంగ్రెస్ జగిత్యాల రూరల్ మండలాధ్యక్షుడు జున్ను రాజేందర్, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు కొత్త మోహన్, మున్సిపల్ ఫ్లోర్ లీడర్ కల్లెపల్లి దుర్గయ్య, యూత్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు గుండా మధు తదితరులు పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరూ ఓటర్‌గా నమోదు చేసుకోవాలి

నవతెలంగాణ-జగిత్యాల

అర్హత కలిగిన ప్రతి ఒక్కరూ తమ పేరును ఓటరుగా నమోదు చేసుకోవడంతో పాటు, మరో ముగ్గురిని ఓటరుగా నమోదు చేయాలని జిల్లా కలెక్టర్, ఎన్నికల అధికారి షేక్ యాస్మిన్ భాషా సూచించారు. స్వీప్ కార్యక్రమాలలో భాగంగా పోలీసు, జిల్లా యంత్రాంగం ఆధ్వర్యంలో స్థానిక విరూపాక్ష గార్డెన్‌లో జిల్లాలోని కళాశాల విద్యార్థులకు యువత- మంచి భవిత కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ... తన పేరుతో పాటు మరో ముగ్గురి పేర్లను నమోదు చేయిస్తే బాలురు, బాలికలకు వేరు వేరుగా ప్రశంసా పత్రాలను అందిస్తామని తెలిపారు.18 ఏండ్లు ఆ పైబడిన యువత తమ పేర్లను ఓటరు జాబితాలో సమీపంలోని బూత్ స్థాయి అధికారులు, ఓటరు హెల్ప్ లైన్ యాప్ ద్వారాగాని నమోదు చేసుకోవాలని అన్నారు. ప్రతీ సంవత్సరం జనవరి ఒకటి నాటికి 18 ఏళ్లు నిండిన వారు తమ పేరును నమోదు చేసుకోవడానికి భారత ఎన్నికల కమిషన్ ఆదేశాలు ఇచ్చిందన్నారు. ప్రత్యేక ఓటరు నమోదు



పాల్గొన్న అధికారులు, విద్యార్థులు

కార్యక్రమాన్ని నిరంతరం కొనసాగుతుందని తెలిపారు. ప్రస్తుతం అక్టోబర్ 1, 2023 నాటికి 18 ఏండ్లు నిండే వారు తమ పేరును నమోదు చేసుకోవచ్చని అన్నారు. జిల్లా వ్యాప్తంగా సుమారు 30 వేల మంది యువత పేర్లు నమోదు చేయవసి ఉండగా, ఇప్పటి వరకు 15 వేల మంది పేర్లు నమోదు చేశామని తెలిపారు. ఇంకా విద్యా సంస్థలు, పలు ప్రాంతాలలోని యువత పేర్లు నమోదుకు ఈ నెల 19 చివరి తేదని అన్నారు. ఓటరు జాబితాలో నమోదు అయిన పేర్లు, ఫోటో, తదితర సమాచారం తప్పుగా గాని, శాశ్వతంగా వెళ్లిపోయిన, పోలింగ్ కేంద్రాలు మార్పులు, తదితర



ప్రతిజ్ఞ చేస్తున్న కలెక్టర్, ఎస్పీ, జిల్లా అధికారులు

అంశాలపై కలెక్టర్ వివరించారు. జిల్లా ఎస్పీ ఎ. భాస్కర్ మాట్లాడుతూ, దేశ ప్రగతిలో యువత భాగస్వాములు కావాలని అన్నారు. ప్రజాస్వామ్య పరిరక్షణలో ఓటు శాతం పెంచేందుకు అర్హత ఉన్న ప్రతీ ఒక్కరి పేరును ఓటరు జాబితాలో నమోదు చేసుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో స్వీప్ నోడల్ అధికారి, ఎస్సీ కార్పొరేషన్ ఈడి కే. లక్ష్మీ నారాయణ, జిల్లా సంక్షేమశాఖ అధికారి డాక్టర్ భోనగిరి నరేష్, సహాయ నోడల్ అధికారి శ్రీనివాస్‌గౌడ్, డీఎస్పీ వెంకటస్వామి, ఆర్‌వో నారాయణ, ఎస్‌కెఎన్ ఆర్ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ అశోక్ పాల్గొన్నారు.

ఇద్దరు అంతర్ జిల్లా దొంగల అరెస్టు

నవతెలంగాణ-ధర్మపురి

జగిత్యాల జిల్లాలోని దేవాలయాలను లక్ష్యంగా పెట్టుకుని చోరీలకు పాల్పడుతున్న ఇద్దరు అంతర్ జిల్లా దొంగలను పోలీసులు గురువారం అందజేశారు. ధర్మపురి పోలీసు స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో జగిత్యాల డీఎస్పీ వెంకటస్వామి వివరాలను వెల్లడించారు. ఇద్దరు అంతర్ జిల్లా ముఠా సభ్యులు గురువారం రాయపట్నం శివారులోని భారత్ పెట్రోల్ బంక్ వద్ద వాహనాల తనిఖీలు చేస్తుండగా అనుమానాస్పదంగా కనిపించడంతో వారిని అదుపులోకి తీసుకుని, విచారిచగా, వారిపై 21 చోరీ కేసులు ఉన్నట్టు తెలిసిందన్నారు. వారి వద్ద నుంచి రెండు బైక్‌లు, 9.900 నగదు, ఒక ఇనుప రాడు, మూడు సీసీ కెమెరాకు సంబంధించిన మూడు డివిఆర్లు, రెండు సెల్ ఫోన్లు, స్వాధీన పరుచుకున్నట్టు డీఎస్పీ తెలిపారు. హన్మకొండ జిల్లా, గోపాల్‌పూర్ ఎల్లమ్మ కాలనీకి చెందిన పాశం ప్రణీత్, అలియాస్ చింటూ, అదే జిల్లాకు చెందిన వడ్డేపల్లి,



వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ వెంకటస్వామి

జవహర్ కాలనీకి చెందిన మహమ్మద్ ఉమర్ ఫరూక్ ధర్మపురి పట్టణంలో రెండు ఇండ్లలో చోరీతో పాటు తిమ్మాపూర్‌లోని ఆంజనేయస్వామి గుడి, రాయపట్నంలోని శివాలయంలో, దొంగతనాలకు పాల్పడినట్టు పేర్కొన్నారు. అలాగే జగిత్యాల, వెల్గటూర్, గొల్లపల్లి, కొడిమ్యాల, మంచిర్యాల జిల్లా, జన్నారం, దండేపల్లి, మంచిర్యాలలోని, లక్ష్మీదేవి సత్యనారాయణస్వామి, షిరిడి సాయిబాబా గుడి, పెద్దపల్లి జిల్లాలోని, కాల్వ శ్రీరాంపూర్, సందిల్లా, గ్రామంలో శివాలయం, పెద్దపల్లిలోని పెద్దమ్మ తల్లి గుడి, పాలితం గ్రామంలో హనుమాన్ గుడి, ధర్మారంలోని హనుమాన్ గుళ్ళలో దొంగతనాలకు పాల్పడినట్టు తెలిపారు. ఇవే కాకుండా గతంలో కరీంనగర్, రుగ్గొండి, వరంగల్, కాజీపేట, మట్వాడ. గీసుకొండ, ఇంత్ జార్గంజ్, మర్రిపేడ, మహబూబ్‌నగర్, సుబేదారి, పోలీస్ స్టేషన్ల పరిధిలో పలు దేవాలయాల్లో దొంగతనాలకు పాల్పడి జైల్‌కు వెళ్లి బైల్‌పై వచ్చినట్టు చెప్పారు. జిల్లా ఎస్పీ ఆదేశాలతో ఇద్దరి పట్టుకున్నట్టు తెలిపారు. ధర్మపురి సిఐ రమణమూర్తి, సిసిఎస్ సిఐ జి. వెంకటేశ్వర్లు, పర్యవేక్షణలో దొంగలను పట్టుకున్న ఎస్సై దత్తాత్రే, ఎస్సై రామకృష్ణ, గొల్లపల్లి ఎస్సై నరేష్ కుమార్, బుగ్గారం ఎస్సై సందీప్, వెలగటూరు ఎస్సై శ్వేత, కానిస్టేబుళ్లు రమేష్ నాయక్, ఎండి సలీం, కిరణ్, ఆదిల్, తిరుపతి నాయక్, ముస్తఫా, ఇతర సిబ్బందిని ఎస్పీ అభినందించారు.

బీజేపీ నాయకుల నిరసన

నవతెలంగాణ-బుగ్గారం

రాష్ట్ర ప్రభుత్వ వైఫల్యాలను నిరసిస్తూ బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి చేపట్టిన దీక్షను పోలీసులు భగ్నం చేయగా దానికి నిరసనగా గురువారం బిజెపి మండల శాఖ అధ్య క్షుడు మెడవేణి శ్రీధర్ ఆధ్వర్యంలో స్థానిక చౌరస్తాలో ప్రభుత్వ వైఖరికి నిరసన తెలిపారు. ఈ కార్యక్రమంలో పార్టీ ఉపాధ్యక్షులు మందపల్లి శ్రీనివాస్, మండల పార్టీ ప్రధాన కార్యదర్శి పంచిత లక్ష్మణ్, యువ మోర్చా అధ్యక్షులు చీపిరిశెట్టి మధు, వెలు గొండ లక్ష్మణ్, పంచిత రంజిత్ పాల్గొన్నారు.



నిరసన తెలుపుతున్న బీజేపీ నాయకులు

జగిత్యాలటౌన్ :జగిత్యాల పట్టణంలో బీజేపీ రాష్ట్ర నాయకులు ముదిగంటి రవీందర్‌రెడ్డి ఆధ్వర్యంలో నల్ల బ్యాడ్జీలతో నిరసన వ్యక్తం చేశారు. బిజెపి నాయకులు ఎసిఎస్ రాజు, అల్లాల భగవంత్‌రావు, సీపెల్లి రవీందర్, లింగపేట శ్రీనివాస్, చిట్టి చంద్రశేఖరరావు, అంకార్ సుధాకర్, బడేశంకర్, కిషోర్ సింగ్, మాడిశెట్టి మల్లేశం, లక్ష్మారెడ్డి, గట్టుపల్లి జ్ఞానేశ్వర్, కుర్మాచలం సతీష్, మహేందర్, తదితరులు ఉన్నారు.

మల్లాపూర్ :మండల కేంద్రంలో స్థానిక అంబేద్కర్ కూడలి వద్ద బిజెపి పార్టీ మండల అధ్యక్షుడు ముధం సత్యనారాయణ గౌడ్ ఆధ్వర్యంలో నిరసనగా తెలిపారు. పందిరి నాగారాజ్, శివరాత్రి అంజమ్మ, మండ స్వామి, చింతకిది రాజ్, సారుగు దేవయ్య, ఎర్రరాజ్, బద్ది శ్రీనివాస్, గొల్లేన వెంకటేష్, లక్ష్మారెడ్డి, సంగి సాయి, నరేందర్, కొండ శేఖర్, ముస్కురి నర్సయ్య, దశాగౌడ్, మెరుపు జలపలి పాల్గొన్నారు.

మెట్‌పల్లి :మెట్‌పల్లి పాత బస్టాండ్ వద్ద బీజేపీ నాయకులు నిరసన తెలిపారు. ఈ కార్యక్రమంలో అసెంబ్లీ కన్వీనర్ చెట్లపెల్లి సుఖేందర్‌గౌడ్, బిజెపి రాష్ట్ర కార్యక సభ్యులు సాంబార్ ప్రభాకర్, కోరుట్ల నియోజకవర్గ నాయకురాలు జెఎన్ సునీత, కోరుట్ల నియోజకవర్గ నాయకులు ఆకుల లింగారెడ్డి, పార్లమెంటు కో-కన్వీనర్ గుంటుక సదాశివం, బిజెపి జిల్లా ప్రధాన కార్యదర్శి యాదగిరిబాబు, బీజేవైఎం రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ధోనికేలా నవీన్, జిల్లా కార్యవర్గ సభ్యులు గంప శ్రీనివాస్, బీజేవైఎం జిల్లా ఉపాధ్యక్షులు సుంకెట విజయ్ పాల్గొన్నారు.

ఏఐసీసీ పరిశీలకుడికి స్వాగతం పలికిన కాంగ్రెస్ నాయకులు

నవతెలంగాణ -మెట్‌పల్లి

నిజామాబాద్ పార్లమెంట్ పరిధి ఏఐసీసీ పరిశీలకుడు బిఎం నాగరాజుకు గురువారం మెట్‌పల్లి పట్టణ కాంగ్రెస్ పార్టీ నాయకులు కొమిరెడ్డి కరంచంద్, విజయ్ ఆజాద్, పార్టీ నాయకులు, కార్యకర్తలు ఘన స్వాగతం పలికారు. టీపీసీసీ ఆదేశాలతో నిజామాబాద్ పార్లమెంటు పరిధిలోని నియోజకవర్గాల సమీక్ష సమావేశాలు నిర్వహించగా పార్టీ సీనియర్ నాయకులు జిల్లా కిషన్ సేల్ అధ్యక్షులు వాకిటి సత్యం రెడ్డి, ఎర్రోళ్ల హనుమాన్లు యాదవ్, యామ రాజయ్య, అల్లూరి లింగారెడ్డి, అల్లూరి గంగారెడ్డి, న్యాయవాది సురభి అశోక్, ఎండి రైసుద్దీన్, తిప్పిరెడ్డి నర్సారెడ్డి, వంగ అశోక్ యాదవ్, సంగు గంగాధర్, తోట భీమయ్య, బత్తుల ప్రసాద్, తేలు నరేష్, నూతల లక్ష్మారెడ్డి, నీలి చెట్టిరెడ్డి, అంబటి హనుమంత రెడ్డి, ధ్యావతి గంగాధర్, తాండ్ర నర్సయ్య, కడకుంట్ల గంగాధర్, ఎండి జాకీర్, గంగుల శ్రీనివాస్ పాల్గొన్నారు.



స్వాగతం పలుకుతున్న కరంచందు

ఆర్యవైశ్య పట్టణాధ్యక్షుడికి సన్మానం

నవతెలంగాణ -మెట్‌పల్లి

మెట్‌పల్లి పట్టణ ఆర్యవైశ్య సంఘ అధ్యక్షుడిగా ఎన్నికైన మైలారపు రాంబాబు సంతోషి దంపతులను స్నేహాలయా కిట్టి పార్టీ సభ్యులు గురువారం ఘనంగా సన్మానించారు. ఆర్యవైశ్య మహిళలు అన్ని రంగాల్లో అభివృద్ధి చెందేలా కృషి చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో స్నేహాలయ సంఘ సభ్యులు పాల్గొన్నారు.



విద్యార్థులతో ఉపాధ్యాయులు

జాతీయ క్యాడెట్ కాడ్స్ ప్రారంభం

నవతెలంగాణ-కోరుట్ల

పట్టణంలోని గౌతమ పాఠశాలలో గురువారం జాతీయ క్యాడెట్ క్యాడ్స్ (ఎన్‌సీసీ) కార్యక్రమాన్ని కమాండెంట్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు దేహదారుఢ్యం కలిగి ఉండాలని, ప్రతి ఒక్కరూ దేశానికి సేవ చేయాలని పిలుపు నిచ్చారు.

అంగన్‌వాడీ టీచర్ల ర్యాలీ



ర్యాలీ నిర్వహిస్తున్న కార్యకర్తలు

నవతెలంగాణ-కోరుట్ల

పట్టణంలోని అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలు ఏఐటీయూసీ ఆధ్వర్యంలో ర్యాలీ తీశారు. తమ సమస్యలు పరిష్కరించాలని నినాదించార. ఈ సందర్భంగా ఏఐటీయూసీ రాష్ట్ర అధ్యక్షురాలు సాయి ఈశ్వరి మాట్లాడుతూ.. ప్రభుత్వ ఉద్యోగులకు విరమణ తరువాత ఎలాగైతే పెన్షన్ ఇస్తున్నారో తమకు ఇలాంటి భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు.

ఎస్‌జీఎఫ్ క్రీడలు ప్రారంభం



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న ఎంపీపీ

నవతెలంగాణ -మెట్‌పల్లి

మెట్‌పల్లి పట్టణంలోని విజయసాయి సెంట్రల్ హై స్కూల్ ఎస్‌జీఎఫ్ క్రీడలను ఎంపీపీ మారు సాయిరెడ్డి గురువారం ప్రారంభించారు. క్రీడలు మానసికోల్లాసానికి ఎంతో ఉపయోగ పడుతాయన్నారు. ఈ కార్యక్రమంలో స్కూల్ కరెస్పాండెంట్ పుల్ల లక్ష్మి ప్రదీప్‌గౌడ్, మనస్విని కపిల్, మాజీ చైర్మన్ సుదర్శన్ నాయకులు నల్ల తిరుపతిరెడ్డి ఉపాధ్యాయులు అశోక్, కొమురయ్య, జ్ఞానేశ్వర్, ఆల్ రౌండర్ గంగాధర్, నాగేంద్ర, ప్రశాంత్, రాజు, వంశీ మహేందర్, నాగరాజ్, స్వామి, విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యుద్ఘాతంతో మేక మృత్యువాత

నవతెలంగాణ-మల్లాపూర్



ప్రమాదవశాత్తు విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌కు తగిలి మేక మృత్యువాత పడింది. ఈ ఘటన మండల కేంద్రంలో జరిగింది. గ్రామానికి చెందిన జాలరెడ్డి మేకలను మేపేందుకు అటవీ ప్రాంతాలకు తీసుకెళ్తుండగా గ్రామ శివారులో ఉన్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ తీగలు తగిలి మేక మృతి చెందిందని బాధితుడు తెలిపారు. సుమారుగా 10000 రూపాయల నష్టం వాటిల్లిందని ప్రభుత్వం స్పందించి ఆదుకోవాలని అన్నారు.

వీరమరణం పొందిన సైనికులకు నివాళి

నవతెలంగాణ-జగిత్యాల టౌన్ :

జగిత్యాల జిల్లా కేంద్రంలోని తాహసిల్ చౌరస్తాలో ఉగ్రవాద దాడిలో వీర మరణం పొందిన సైనికులకు భారత్ సురక్షా సమితి నాయకులు కొవ్వొత్తులతో నివాళులర్పించారు. రిటైర్డ్ ఆర్మీ టి. రవి, భారత్ సురక్ష సమితి జగిత్యాల ప్రధాన కార్యదర్శి అక్కనపెల్లి కాశీనాథం మాట్లాడుతూ.. బుధవారం జమ్ము కాశ్మీర్‌లోని అనంత నాగులో జరిగినటువంటి ఉగ్రవాదులకు సైనికులకు జరిగినటు వంటి కాల్పుల్లో భారత్ దేశ సైనికులు వీరమరణం పొందడం చాలా బాధాకరం అని పేర్కొన్నారు. వారి ఆత్మకి శాంతి చేకూరాలని కోరారు. ఈ కార్యక్రమంలో భారత్ సురక్ష సమితి రాష్ట్ర ఉపాధ్యక్షులు, బిజెపి సీనియర్ నాయకులు, మాజీ కౌన్సిలర్ ఎసిఎస్ రాజు, జిల్లా ఉపాధ్యక్షులు వేముల పోచమల్లు, జిల్లా కార్యదర్శి సింగం గంగాధర్, తునికి అంజయ్య, శీల గంగారం, గాజోజు సంతోష్, సిరిపురం గంగాధర్ పాల్గొన్నారు.

రాజారాంపల్లిలో పశువైద్య శిబిరం



పశువులకు వేస్తున్న టీకాలు

నవతెలంగాణ -ఎండపల్లి

మండలంలోని రాజారా ంపల్లి గ్రామంలో గురువారం పశువైద్యశాఖ ఆధ్వర్యంలో వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా పశువులకు గాలి కుంటు వ్యాధి నివారణ టీకాలు వేశారు. పశుపోషకులు, గ్రామాల్లో నిర్వహిస్తున్న వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని పశు వైద్యాధికారిణి శ్రీప్రియ సూచించారు. కార్యక్రమంలో పశువైద్య సిబ్బంది నాగరాజు, స్థానిక సర్పంచ్ గెల్లు చంద్రశేఖర్ యాదవ్, ఎంపీటీసీ గాజుల మల్లేశం, ఉపసర్పంచ్ సంఘ రాములు, వార్డుమెంబర్ అమ్ముల నరేష్‌యాదవ్, రైతులు పాల్గొన్నారు.

సీఎంను కలిసిన బీఆర్ఎస్ కోరుట్ల అభ్యర్థి డాక్టర్ సంజయ్

నవతెలంగాణ-మెట్‌పల్లి

హైదరాబాద్‌లోని ప్రగతి భవన్‌లో సీఎం కేసీఆర్‌ను బీఆర్ఎస్ కోరుట్ల అభ్యర్థి డాక్టర్ కల్వకుంట్ల సంజయ్ కుమార్ గురువారం కలిసి పుష్పగుచ్చం అందజేసి, టికెట్ కేటాయించినందుకు కృతజ్ఞతలు తెలిపారు.



జ్యోతి హై స్కూల్‌లో హిందీ దివస్



కేక్ కట్ చేస్తున్న ఉపాధ్యాయులు

నవతెలంగాణ-జగిత్యాలటౌన్

జగిత్యాల పట్టణంలోని జ్యోతి హై స్కూల్ ఐఐటి అకాడమీలో హిందీ దివస్ వేడుకలు గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల డైరెక్టర్ బీయ్యల హరి చరణ్‌రావు మాట్లాడుతూ.. ' హిందీ దివస్ లేదా జాతీయ హిందీ దినోత్సవం 1949లో భారత రాజ్యాంగ సభ ద్వారా హిందీని అధికారిక భాషగా స్వీకరించిన రోజుకు గుర్తుగా ప్రతి సంవత్సరం సెప్టెంబర్ 14న జరుపుకుంటారని తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్లు బియ్యల హరి చరణ్‌రావు, శ్రీధర్‌రావు, మౌనికరావు, అజిత, హిందీ భాష పండితులు యూనిస్ ఖాన్, శ్రీనివాస్, స్వరూప, పర్వీన్, రిజ్వాన, అనిల్‌కుమార్ విద్యార్థులూ పాల్గొన్నారు.



హిందీ ఆకృతిలో కుర్చోన్న విద్యార్థులు

కోరుట్ల :పట్టణంలోని భీముని దుబ్బలో ఉన్న సాయి జీనియస్ పాఠశాలలో గురువారం జాతీయ హిందీ దినోత్సవం నిర్వహించారు. విద్యార్థులకు హిందీపై వ్యాస రచన పోటీ నిర్వహించి బహుమతులను కరస్పాండెంట్ చౌక్రి రమేష్ అందజేశారు. ఈ సందర్భంగా విద్యార్థులు హిందీ ఆకృతితో కూర్చుని ఆకట్టుకున్నారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ సుధా, విద్యార్థులు పాల్గొన్నారు.

ఏడీఏకు లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఘన సన్మానం



ఏడిఏను సన్మానిస్తున్న లయన్స్ క్లబ్ అధ్యక్షుడు

నవతెలంగాణ-మల్లాపూర్

మల్లాపూర్ మండల వ్యవసాయ అధికారి వన తరపున లావణ్య మెట్‌పల్లి డివిజన్ ఏడీఏగా ఇటీవల అదనపు బాధ్యతలు స్వీకరించారు. కాగా మల్లాపూర్ లయన్స్ క్లబ్ అధ్యక్షుడు కనక సంజీవ్ గురువారం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ఏవో లావణ్య మెట్పల్లి ఏడీఏగా బాధ్యతలు స్వీకరించి రానున్న రోజుల్లో జిల్లా స్థాయి అధికారిణిగా ఎదగాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఏతంఓ గజానంద్, వంశీ, లయన్స్ క్లబ్ సభ్యులు, మోర సతీష్, పుప్పల మహేష్, తిప్పర్తి రామకిషన్, ఆడేపు ఆనందు తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రంలో మళ్లీ బీఆర్ఎస్ ప్రభుత్వమే..



పార్టీలోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే

నవతెలంగాణ-మల్లాపూర్ :

తెలంగాణలో మళ్లీ బీఆర్ఎస్ ప్రభుత్వమే అని కోరుట్ల నియోజకవర్గం ఎమ్మెల్యే కల్వకుంట్ల విద్యాసాగర్ రావు అన్నారు. గురువారం మండలంలోని రేగుంట గ్రామంలో బిజెపి కాంగ్రెస్ పార్టీ నుంచి సుమారు 100 మంది యువకులు, సంఘాల నాయకులు పెద్ద ఎత్తున బిఆర్ఎస్‌లో చేరగా కండువా కప్పి ఆహ్వానించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. తెలంగాణలో బిఆర్ఎస్ పార్టీ మూడోసారి విజయం సాధిస్తుందని అన్నారు. మూడోసారి విజయం సాధించిన బిఆర్ఎస్ పార్టీ ముఖ్యమంత్రి కేసీఆర్ బాధ్యతలు స్వీకరించి చరిత్రలో తిరుగులేని నాయకుడు అవుతాడని పేర్కొన్నారు. ఈ సందర్భంగా గ్రామస్తులు మాట్లాడుతూ.. సంజయ్‌కుమార్ నామినేషన్‌కు కావాల్సిన నగదు అందజేస్తామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో జడ్పీటీసీ శ్రీనివాస్, గ్రామ సర్పంచ్ కుందేళ్ళ నరసయ్య, బిఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు తోట శ్రీనివాస్, నాయకులు కాటి పెల్లి ఆదిరెడ్డి, గణవేని మల్లేష్, కలసాని రాజన్న తదితరులు ఉన్నారు.

బీఆర్ఎస్ కార్యకర్తలకు ప్రమాద బీమా అందజేత



మృతుడి భార్యకు చెక్కును అందిస్తున్న మంత్రి కొప్పుల ఈశ్వర్

నవతెలంగాణ -ఎండపల్లి

ఎండపల్లి మండలం చర్లపల్లి గ్రామానికి చెందిన బీఆర్ఎస్ పార్టీ కార్యకర్త పొన్నం గంగాధర్ గౌడ్ 2023 మే నెలలో రోడ్డు ప్రమాదంలో మరణించాడు. బిఆర్ఎస్ పార్టీ ప్రమాద బీమా సభ్యత్వం ద్వారా మంజూరు అయిన 2 లక్షల రూపాయల చెక్కును, గురువారం మృతుడి భార్య జమునకు మంత్రి కొప్పుల ఈశ్వర్ అందించారు. ఈ సందర్భంగా మంత్రి కొప్పుల ఈశ్వర్ మాట్లాడుతూ.. బీఆర్ఎస్ సభ్యత్వం కలిగిన ప్రతి కార్యకర్తకు ప్రమాద బీమా అందిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షులు సింహాచలం జగన్, బీఆర్ఎస్ నాయకులు పడిదం మొగిలి, కో -ఆప్షన్ ఎండి రియాజ్, జిల్లా లేబర్ బోర్డు కమిటీ మెంబర్ సిగిరి ఆనంద్, యూత్ ప్రధాన కార్యదర్శి గొల్లపల్లి రాజు, ఉపసర్పంచ్ అలగం తిరుపతి, బట్టు రామస్వామి, కాటురావి, గ్రామశాఖ అధ్యక్షుడు శ్రావన్, పడిదం వెంకటేష్ పాల్గొన్నారు.

స్వచ్ఛ సర్వేక్షన్ రాష్ట్ర అవార్డు అందుకున్న చింతలపేట్ సర్పంచ్ అర్చన

నవతెలంగాణ -మెట్‌పల్లి

స్వచ్ఛ సర్వేక్షన్-2023 రాష్ట్ర అవార్డుకు ఎన్నికైన మెట్‌పల్లి మండలం చింతలపేట్ గ్రామ సర్పంచ్ మ్యాకల అర్చన గురువారం హైదరాబాద్‌లో గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు చేతుల మీదుగా అవార్డు, ప్రశంసా పత్రాన్ని అందుకున్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో భీమేష్, ఎంపీవో మహేశ్వర్ రెడ్డి, సుదర్శన్ పాల్గొన్నారు.



మధ్యాహ్న భోజనం లేక అలమటిస్తున్న విద్యార్థులు

మధ్యాన్న భోజన కార్మికుల సమ్మె ప్రభావం

నవతెలంగాణ-తంగళ్ళపల్లి



మధ్యాహ్న భోజన అమలుకాక విద్యార్థులు అలమటిస్తున్నారు. మధ్యాహ్న భోజన కార్మికులు సమ్మెలోకి వెళ్లడంతో ప్రభుత్వ పాఠశాలల్లో మధ్యాహ్న భోజన నిర్వాహణ లేకుండా పోయింది. తంగళ్ళపల్లి మండల కేంద్రంలోని ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు మధ్యాహ్న భోజనం లేక గురువారం అలమటించిపోయారు. ఆ పాఠశాల ఉపాధ్యాయులు సెల్‌ఫోన్ల నుండి టిఫిన్ బాక్సులు తీసుకురావాలని వాట్సాప్ ద్వారా తల్లిదండ్రులకు మెసేజ్ ను అందజేశారు. సమా చారం అందుకున్న తల్లి దండ్రులు వెంటనే టిఫిన్ బాక్సులు తీసుకుని పాఠశాలలకు పరుగులు తీశారు. టిఫిన్ బాక్సులు తిని హమ్మయ్య అని విద్యార్థులు ఊపిరి పీల్చుకున్నారు. ఇప్పటికైనా మధ్యాహ్న భోజన పథకం ద్వారా విద్యార్థులకు భోజనం అందించాలని విద్యార్థులు. వారి తల్లిదండ్రులు ప్రభుత్వాన్ని, అధికారులను కోరుతున్నారు.

హామీలు అమలు చేయమంటే..అక్రమ అరెస్టులా..?

కేసీఆర్ దిష్టిబొమ్మను దహనం చేసిన బీజేవైఎం నాయకులు

నవతెలంగాణ-తంగళ్ళపల్లి

ఇచ్చిన హామీలను ప్రభుత్వం నెరవేర్చాలని, ప్రశ్నించే గొంతులను అణగదొక్కుతూ అక్రమ అరెస్టులు చేస్తున్నారని బీజెవైఎం మంల అధ్యక్షుడు కోల ఆంజనేయులు మండిపడ్డారు. అక్రమ అరెస్టులకు నిరసనగా తంగళ్ళపల్లి మండల కేంద్రంలో గురువారం సీఎం కేసీఆర్ దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు సంతోష్, బీజేవైఎం మండల ఉపాధ్యక్షుడు ప్రకాష్, మంచిగట్ల ప్రసాద్, సాయి, సిల్వర్ ప్రశాంత్, ఇటికల రాజు, మహేందర్, రంగు అరుణ్ పాల్గొన్నారు.

స్వగ్రామం చేరిన వలసజీవి మృతదేహం

మంత్రి కేటీఆర్ ప్రత్యేక చొరవ

నవతెలంగాణ -తంగళ్ళపల్లి



పరశురాములు

బ్రతుకుతెరువు కోసం పొట్టచేత పట్టుకొని పరాయి దేశం పోయిన ఓ వలసజీవి బ్రతుకుపోరులో గుండెపోటుతో తనువుచాలించిన మృతదేహం మంత్రి కేటీఆర్ చొరవతో స్వగ్రామం చేరింది. ఇంటికి చేరుకున్న ఆ మృత దేహాన్ని చూసిన కుటుంబసభ్యులు శోకసముద్రంలో మునిగి పోయారు. వివరాల్లోకి వెళితే మండలంలోని మండేపల్లి గ్రామానికి చెందిన లింగం పరశురాములు (34) గత రెండు నెలల క్రితం పరాయి దేశమైన దుబాయ్ వలస వెళ్లాడు. కొద్ది కాలం క్రితమే దుబాయ్ నుంచి ఇంటికి వచ్చి కుటుంబంతో సంతోషంగా గడిపి తిరిగి వెళ్ళిన రెండు నెలలకే ఈనెల 9న దుబాయిలో గుండెపోటుతో మరణించాడు. మతునికి భార్య అనూష, కూతురు నిషిత ఉన్నారు. వనస జీవి మృతదేహం స్వగ్రామం చేరడంతో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి.

పేద ప్రజల బతుకులు మారలేదు

జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు ఆది శ్రీనివాస్

నవతెలంగాణ- సిరిసిల్ల రూరల్



మాట్లాడుతున్న ఆది శ్రీనివాస్

బంగారు తెలంగాణ పేరు చెప్పి అధి కారంలోకి వచ్చి... టీఆర్ఎస్‌ను బీఆర్ఎస్‌గా పేరు మార్చారే తప్ప పేద ప్రజల బతుకులు మారలేదని జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు ఆది శ్రీనివాస్ అన్నారు. సిరిసిల్లలోని ఆర్డీవో కార్యాలయం సమీపంలో అంగన్వాడీ టీచర్ల సమ్మెలో గురువారం ఆయన పాల్గొని మాట్లాడుతూ తెలంగాణ వస్తే ధర్నాలు, సమ్మెలు ఉండవన్న కేసీఆర్ రాష్ట్రంలో ఉద్యోగులంతా ధర్నలు,సమ్మెలు చేసే పరిస్థితికి తీసుకొచ్చారన్నారు. తెలంగాణ రాష్ట్రంలో కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ అనే పదం ఉండదన్న కేసీఆర్ మాటలు ఏమైనాయని ప్రశ్నించారు. ప్రజలను మోసం చేస్తున్న అధికార పార్టీని గట్టిగా నిలదిసే సమయం ఆసన్నమైందన్నారు. వచ్చేది కాంగ్రెస్ ప్రభుత్వమే మీ సమస్యలన్నీ పరిష్కరిస్తామని అంగన్వాడీలు చేస్తున్న సమ్మె గురించి రేవంత్ రెడ్డికి వివరించారు. సిరిసిల్ల పర్యటనకు రానున్న మంత్రి కేటీఆర్ అంగన్వాడీ టీచర్ల శిబిరం వద్దకు వచ్చి చర్చలు జరపాలని డిమాండ్ చేశారు.

నేడు టెట్ పరీక్ష

నవతెలంగాణ- సిరిసిల్ల రూరల్

జిల్లాలో నేడు నిర్వహించనున్న టెట్ పరీక్షలను సజావుగా నిర్వహించేందుకు జిల్లా యంత్రాంగం అన్ని ఏర్పాట్లు పూర్తి చేసింది. ఈ పరీక్షలు 15న ఉదయం 9.30 గంటల నుండి మధ్యాహ్నం 12 గంటల వరకు మొదటి పేపర్, మధ్యాహ్నం 2.30 నుండి సాయంత్రం 5 గంటల వరకు రెండవ పేపర్ పరీక్షలు నిర్వహించన్నారు. రాజన్న సిరిసిల్ల జిల్లాలో మొదటి పేపర్‌కు 3378 మంది విద్యార్థులు, రెండవ పేపర్ 2937 మంది హాజరుకానున్నారు. ఈ పరీక్షల నిర్వహణకు సిరిసిల్లలో మొదటి పేపర్ వ్రాసేవారికి 15 సెంటర్లు, సెకండ్ పేపర్ వ్రాసేవారికి కొరకు 14 సెంటర్లు ఏర్పాటు చేశారు. పరీక్షలకు హాజరయ్యే అభ్యర్థులు అరగంట ముందే పరీక్ష కేంద్రంలో ఉండాలని అధికారులు సూచించారు. అభ్యర్థులు ఎలక్ట్రానిక్, పరికరాలు, సెల్ ఫోన్లు తీసుకురావద్దని తెలిపారు.హాల్‌టికెట్‌లలో ఏమైనా తప్పులుంటే జిల్లా విద్యాశాఖ అధికారి కార్యాలయంలో సరైన పత్రాలతో హాజరై సవరించుకోవాలని సూచించారు.

నేడు సిరిసిల్లకు మంత్రి కేటీఆర్ రాక

నవతెలంగాణ- సిరిసిల్ల రూరల్

రాష్ట్ర మంత్రి కేటీఆర్ నేడు సిరిసిల్ల నియోజకవర్గంలో పర్యటించనున్నారు.శుక్రవారం ఉదయం 11.45 గంటలకు సీఎం కేసీఆర్ చేతుల మీదుగా ప్రారంభించనున్న మెడికల్ కళాశాల కార్యక్రమంలో లో పాల్గొననున్నారు. మధ్యాహ్నం 12 గంటలకు మెడికల కళాశాల మంజూరి చేసినందుకు గాను సిరిసిల్ల సెస్ కార్యాలయం నుంచి అంబేద్కర్ చౌరస్తా వరకు సీఎం కేసీఆర్‌కు కృతజ్ఞత తెలుపుతూ నిర్వహించే ర్యాలీలో కేటీఆర్ పాల్గొంటారు. మధ్యాహ్నం 12.30గంటలకు అంబేద్కర్ చౌరస్తాలో సీఎం కేసీఆర్‌కు కృతజ్ఞతలు తెలుపుతూ ప్రసంగించనున్నారు.

తాళం వేసి రెండు ఇండ్లలో చోరి

నవతెలంగాణ-చందుర్తి:

తాళం వేసిన రెండు ఇండ్లలో గుర్తు తెలియని వ్యక్తులు చొరబడి నగదు బంగారం చోరిచేసిన ఘటన మండలంలోని గోస్కులపల్లిలో గురువారం మధ్యాహ్నం చోటు చేసుకుంది. గ్రామస్తులు, పోలీసులు తెలిపినా వివరాల ప్రకారం గ్రామానికి చెందిన మర్రిపెల్లి హన్మాండ్లు, మర్రిపెల్లి సత్తయ్య అనే ఇద్దరు అన్నతమ్ములు. వ్యవసాయ పనులకు వెళ్లగా గుర్తు తెలియని వ్యక్తులు ఇంట్లోకి చొరబడి హన్మాండ్లు ఇంట్లో నుండి ఎనిమిది తులాల బంగారం, ఇరవై వేల రూపాయల నగదు, సత్తయ్య ఇంట్లో నుండి ఐదు తులాల వెండి గొలుసు చోరికి గురైందని తెలిపారు. బాధితుల ఫిర్యాదుల మేరకు ఘటన స్థలానికి పోలీసులు చేరుకుపి పరిసరాలను పరిశీలించారు. వేలి ముద్ర నమూనాలను సేకరించారు. కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

విద్యతోనే దేనినైనా సాధించవచ్చు.

.నవ తెలంగాణ-ముస్తాబాద్.

విద్యతోనే దేనినైనా సాధించవచ్చని ముస్తాబాద్ ఎంపీపీ జనగామ శరత్ రావు అన్నారు. గురువారం విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ ముఖ్యమంత్రి కేసీఆర్, మంత్రి కేటీఆర్ సిరిసిల్ల జిల్లాను కోహినూర్ వజ్రం వలె వెలగదీస్తున్నారని అన్నారు. మంత్రి కేటీఆర్ మెడికల్ కళాశాలను మంజూరు చేసి ఈ ప్రాంత విద్యార్థుల అభివృద్ధికి ఎంతో కృషి చేశారన్నారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ శ్రీనివాస్ సెస్ డైరెక్టర్ అంజి రెడి. మండల శాఖ అధ్యక్షులు సురేందర్ రావు, పోతుగల్ సర్పంచ్ గౌతమ్ రావు , నాయకులు నవీన్, నర్సింహులు, ఆంజనేయులు, కో ఆప్షన్ సభ్యులు సాదుల్ పాప పాల్గొన్నారు.

సఫాయి కార్మికులకు సబ్బులు, నూనె పంపిణీ

నవ తెలంగాణ-ముస్తాబాద్.

మేజర్ గ్రామ పంచాయతీ ముస్తాబాద్ సపాయి కార్మికులకు గురువారం సర్పంచ్ సుమతి సబ్బులు, కొబ్బరి నూనె పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ సుమతీ మాట్లాడుతూ ప్రభుత్వం ప్రతినెల సపాయి కార్మికులకు సబ్బులు, నూనే అందజేయడానికి నిధులు మంజూరు చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో ఈవో శ్రీనివాస్, జూనియర్ అసిస్టెంట్ బిక్షపతి, బిల్ కలెక్టర్ నరేష్, కాంట్రాక్టు ఉద్యోగులు రవి ,రాజు, భాగ్య, నరసింహులు సపాయి కార్మికుల పాల్గొన్నారు.


డబుల్ బెడ్ రూమ్‌ల ఎంపికపై తహశీల్దార్ కు వినతి

నవతెలంగాణ-ఇల్లంతకుంట:

మండలములోని వల్లంపట్లలో డబుల్ బెడ్రూం ఇండ్ల అవకతవకలపై గురువారం తహశీల్దార్ కు వార్డు సభ్యులు వినతిపత్రం సమర్పించారు. ఇండ్లు లేని అర్హులకు కేటాయించకుండా అనర్హులకు కెటాయించినట్లు వాపోయారు. ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు పాల్గొన్నారు.

గెలుపు వేట.. రాజకీయ నేతల ఆట

ఊపందుకుంటున్న రాజకీయ వ్యూహాలు



నవతెలంగాణ- సిరిసిల్ల రూరల్

రాబోయే శాసనసభ ఎన్నికల్లో గెలుపు పీఠాన్ని అందుకునేందుకు రాజకీయ పార్టీల నేతల ఆట మొదలైంది.రాజకీయ పార్టీలు అభ్యర్థుల వేటలో పడ్డాయి. ఇప్పటికే ఆయా పార్టీలు ప్రచారం ముమ్మరం చేశాయి. తమ విజయలక్ష్మిని చేరేందుకు రాజకీయ పార్టీలన్నీ సిద్ధమైనాయి. తాజా నేపథ్యంలో సిరిసిల్ల రాజకీయం మరింత రసవత్తరంగా మారబోతుంది.

ప్రధాన రాజకీయ పార్టీల నేతలు, స్వతంత్రులు పోటీలో నిలిచేందుకు అవసరమైన ఏర్పాట్లలో నిమగ్నమవుతున్నారు. అధికార బీఆర్ఎస్ అభ్యర్థిగా కల్వకుంట్ల తారక రామారావు పేరును ప్రకటించారు. కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా కేకే మహేందర్‌రెడ్డి పేరు వినిపిస్తోంది. కేకే పేరు అధికారికంగా కాకుండా అనాధికారికంగా ఖరారు చేసినట్లే తెలుస్తోంది ఇప్పటికే కేకే మహేందర్ రెడ్డి సిరిసిల్ల నియోజకవర్గంలోని పలు ప్రాంతాల్లో తిరుగుతూ హస్తం గుర్తుకు ఓటు వేయాలని ప్రచారం ముమ్మరం చేస్తున్నాడు. బీజేపీ నుండి పోటాపోటి ఉంది. ఇప్పటి వరకే 15 మందికి అభ్యర్థులు టికెట్ కోసం దరఖాస్తు చేసుకున్నారు. పద్మశాలి సామాజిక వర్గానికి చెందిన లగిశెట్టి శ్రీనివాస్‌కు దక్కుతుందనే ప్రచారం సాగుతుంది. ఆ ఇద్దరు నేతలూ.. బీఆర్ఎస్ లో పనిచేసిన వారే... కేకే మహేందర్‌రెడ్డి, లగిశెట్టి శ్రీనివాస్ ఇద్దరూ కూడా గతంలో టీఆర్ఎస్ ఆవిర్భావ తొలిరోజుల్లో టిఆర్ఎస్‌లో పనిచేసిన వారే కావడం గమనార్హం. పార్టీ ఆవిర్భావంలో ప్రస్తుత ముఖ్యమంత్రి కే. చంద్ర శేఖర రావుకు వెన్నంటి ఉండి సేవలు చేసిన వ్యక్తి ప్రస్తుతం కాంగ్రెస్ పార్టీ నుంచి పోటీ చేయడానికి సిద్ధమైన కేకే మహేందర్ రెడ్డి అని చెప్పవచ్చు. సెస్ వైస్ చైర్మన్‌గా పని చేసిన లగ్గిశెట్టి శ్రీనివాస్ ఆ సమయంలో టిఆర్ఎస్ పార్టీలో ఉండి పదవి అనుభవించాడు. మంత్రి కేటీఆర్ తనను పట్టించుకోవడంలేదని అలిగి కొద్ది బీజేపీ చేరారు. మంత్రి కేటీఆర్‌తో ఇతనికి విభేదాలు వచ్చినప్పటికీ బీఆర్ఎస్ ముఖ్య నేతలు మాత్రం నిత్యం లగిశెట్టి శ్రీనివాస్‌లోనే ఉంటారు.

మొదలైన కాంగ్రెస్ ప్రచారం..

సిరిసిల్ల నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ అన్నీ పార్టీల కంటే ఒక అడుగు ముందుకు వేసి ఎన్నికల ప్రచారం మొదలు పెట్టిందని చెప్పుకోవచ్చు. గతంలో మంత్రి కేటీఆర్ పై పోటీ చేసి ఓటమిపాలైన కేకే మహేందర్ రెడ్డి మళ్ళీ ఈ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ తరవున పోటీ చేయడానికి ప్రచారం మొదలుపెట్టాడు. సిరిసిల్ల నియోజకవర్గంలోని గ్రామాల్లో ఎన్నికల కోలాహలమే కనిపిస్తుంది. ముఖ్యంగా అధికార టీఆర్ఎస్ తో పాటు కాంగ్రెస్ పార్టీ ఈ ఎన్నికలను అత్యంత ప్రతిష్టాత్మకంగా తీసుకుంటున్నాయి. ఆయా పార్టీల అధిష్టానాలు ఇస్తున్న సలహాలు సూచనలకు తోడుగా స్థానికంగా ఉన్న పరిస్థితులకు తగినట్టుగా వ్యూహ ప్రతి వ్యూహాలతో ఓటర్ మనస్సుని గెలిచే ప్రయత్నంలో ముందుకు సాగుతున్నారు. ప్రత్యర్థి ఎత్తులను చిత్తు చేసేలా మాటల తూటాలు హామీల ఊసులతో ఆకట్టుకునే పంతాలో ఇన్నాళ్లు పయనించారు. ఎదుటి పార్టీ నుంచి నాయకుల్ని కార్యకర్తల్ని తమ పార్టీలో చేర్చుకుని బలాన్ని పెంచుకునేలా వ్యూహరచనల్ని అమలు చేస్తున్నారు. కుల సంఘాల మద్దతును కూడ గట్టుకునేలా పావులు కదులుతున్నారు

మంత్రి పర్యటనకు ఆటంకాలు కలిగేనా..!

నవతెలంగాణ- సిరిసిల్ల రూరల్



రాష్ట్ర ఐటీ పురపాలక శాఖ మంత్రి నేడు సిరిసిల్లలో పర్యటించనున్నారు ప్రధానంగా అంబేద్కర్ చౌరస్తాలో భారీ బహిరంగ సభను ఏర్పాటు చేయడానికి బీఆర్ఎస్ శ్రేణులు సిద్ధమయ్యారు. రాష్ట్ర ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర రావు సిరిసిల్లలోని రెండవ బైపాస్ రోడ్డులో నూతనంగా నిర్మించిన వైద్య కళాశాలను ప్రారంభించనుండడంతో రాష్ట్ర మంత్రి ప్రత్యేకంగా ఈ కార్యక్రమానికి సిరిసిల్లకు రానున్నారు. కానీ ఆయన చుట్టూ నిరసనల వలయం కనిపిస్తుంది. గత కొద్ది రోజుల నుంచి పర్మినెంట్ చేయాలని అంగన్వాడీ టీచర్లు ఆయాలు నిరవధిక సమ్మెను చేపటట్టారు. ప్రభుత్వం ఎలాంటి చర్చలు జరపకపోగా ఆ సమస్య అలాగే ఉండిపోయింది రోజురోజుకు వారి ఉద్యమం ఉధతం అవుతుంది. గురువారం భారీ ర్యాలీ చేపట్టి వారి ఇబ్బందులను ప్రజలకు వివరించారు. మధ్యాహ్న భోజనం నిర్వాహకులు కమిషన్ పెంచాలని వేతనాలు ఇవ్వాలని నిరసన కార్యక్రమాలు చేపడుతున్నారు. మరో పక్క సమగ్ర శిక్షణ ఉద్యోగులు గత 18 రోజుల నుంచి నిరాహార దీక్షలు చేస్తున్నారు. వారికి వామపక్ష పార్టీల మద్దతు తోపాటు వివిధ రాజకీయ పార్టీల మద్దతు కనిపిస్తుంది. దీక్షలు, నిరసనలు చేపట్టిన వారందరికీ అధికార పార్టీ మినహా మిగతా రాజకీయ పార్టీలన్నీ మద్దతు, సంఘీభావం ప్రకటిస్తున్నాయి.

మంత్రి కేటీఆర్ నేడు సిరిసిల్లకు వచ్చేనా

సిరిసిల్ల పట్టణంలో కార్యాలయం సమీపంలో అంగన్వాడీ టీచర్లు ఆయాలు దీక్షలు చేస్తున్నారు. సమగ్ర శిక్ష అభియాన్ ఉద్యోగులు ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాల సమీపంలో దీక్షలు చేస్తున్నారు. కలెక్టరేట్ సమీపంలో మధ్యాహ్న భోజన నిర్వాహకులు నిరసనలు చేస్తున్నారు. ఇవన్నీ ఆందోళనలు ప్రభుత్వంపై నిరసనలు జరుగుతున్న సమయంలో సిరిసిల్లకు మంత్రి కేటీఆర్ వస్తాడా..? అనే ప్రశ్న ప్రజల్లో వ్యక్తం అవుతుంది. ఇంటలిజెన్స్ నుంచి సేకరించిన సమాచారాన్ని బట్టి మంత్రి పర్యటన ఖరార్ అయ్యే అవకాశం ఉంది. ఇక్కడి పరిస్థితులు అనుకూలంగా లేకపోతే మంత్రి పర్యటన ఉండకపోవచ్చు. తప్పనిసరి మంత్రి రావాలనుకుంటే మాత్రం అంగన్వాడి టీచర్లు ఆయాల శిబిరం, సమగ్ర శిక్ష అభియాన్ ఉద్యోగుల దీక్ష, మధ్యాహ్న భోజనం నిర్వాహకుల శిబిరాలను పోలీసులు రాత్రికి రాత్రే ఎత్తివేసి అవసరం అయితే వారిని ఎక్కడికక్కడే అదుపులోకి తీసుకొని మంత్రి పర్యటనకు పోలీసులు సిద్ధం చేయవచ్చని ప్రజలు చర్చించుకుంటున్నారు. ఇప్పటికే స్పెషల్ బ్రాంచ్ పోలీసులు ఎప్పటికప్పుడు సమాచారాన్ని సేకరించి పోలీసు ఉన్నతాధికారులకు అందిస్తున్నారు.

రైతాంగ పోరాటాలను ఎంతో స్ఫూర్తి దాయకం

నవ తెలంగాణ-వీర్నపల్లి



కర పత్రాలను ఆవిష్కరిస్తున్న సీపీఐ(ఎం) నేతలు

రైతాంగ సాయుధ పోరా టాలను తెలియజేసేందుకే వారో త్సవాలను సభలు నిర్వహి స్తున్నామని సీపీఐ(ఎం) జిల్లా కమిటి సభ్యులు అరుణ్ కుమార్ అన్నారు. వీర్నపల్లి మండలంలో సీపీఐ(ఎం), సీఐటీయూ ఆధ్వ ర్యంలో తెలంగాణ రైతంగా సాయుధ పోరాట వారోత్సవాల ముగింపు సభ కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు మల్లారపు అరుణ్ కుమార్ మాట్లాడుతూ భూమికోసం, భుక్తి కోసం, వెట్టి చాకిరి ముక్తి కోసం నైజాం నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా మట్టి మనుషులు చేసిన మహోన్నత ఉద్యమం వీర తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటమన్నారు. సిరిసిల్లలో బీవై నగర్‌లో జరిగే బహిరంగ సభను విజయవంతం చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు జాలపెల్లి మనోజ్ కుమార్, సీఐటీయూ నాయకులు రాజేశం, నర్సయ్య, రమేష్, మల్లారపు దినకర్, గంగారాం, తదితరులు పాల్గొన్నారు

ఎస్సీ, ఎస్టీ విద్యార్థులు వ్యాపారవేత్తలుగా ఎదగాలి

జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి

నవ తెలంగాణ సిరిసిల్ల రూరల్



మాట్లాడుతున్న కలెక్టర్ అనురాగ్ జయంతి

జిల్లాలోని ఎస్సీ, ఎస్టీ విద్యార్థులను వ్యాపారవేత్తలుగా ఎదిగేలా ప్రోత్స హించాలనీ జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి డిక్కీ ప్రతినిధులకు సూచిం చారు.గురువారం సాయంత్రం కలెక్టరేట్ లోని తన ఛాంబర్ లో డిక్కీ ప్రతినిధులలో సమావేశం నిర్వహించారు. ఎస్సీ, ఎస్టీ ల అభ్యున్నతికి కేంద్ర , రాష్ట్ర ప్రభుత్వాలు దళిత బంధు, టి – ప్రైడ్, అంబేద్కర్ సోషల్ ఇన్నోవేషన్ స్కీం వంటి అనేక పథకాలు అమలు చేస్తున్నాయన్నారు. వీటి గురించి విద్యార్థులకు తెలియ జేయాలన్నారు. వారికి ఆసక్తి ఉన్న రంగాలలో రాణించేలా శిక్షణ ఇచ్చి ప్రోత్సహించాలని చెప్పారు. సమాజానికి ఉపయోగడే కొత్త ఆవిష్కరణలు చేసే విద్యార్థులను ప్రోత్సహించాలని చెప్పారు. సమావేశంలో రాష్ట్ర డిక్కీ ప్రెసిడెంట్ దాసరి అరుణ, రాష్ట్ర ఫోటోగ్రఫీ వర్టికల్ హెడ్ శేఖర్, రాజన్న సిరిసిల్ల జిల్లా డిక్కీ సమన్వయ కర్త ఎస్ మురళి, రంగారెడ్డి జిల్లా డిక్కీ సమన్వయ కర్త సంతోష్, ఎస్సీ కార్పొరేషన్ ఇ డి వినోద్ తదితరులు పాల్గొన్నారు

డ్రైవర్లకు ఇన్సూరెన్స్ కార్డుల పంపిణి: ఎస్సై

నవతెలంగాణ - ఎల్లారెడ్డిపేట



కార్డులు పంపిణీ చేస్తున్న కేకే

ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలో గురువారం ఆటో డ్రైవర్లకు కాంగ్రెస్ పార్టీ సిరిసిల్లా నియోజకవర్గం ఇంచార్జీ కేకే మహేందర్ రెడ్డి ఇన్సూరెన్స్ కార్డులను డ్రైవర్లకు పంపిణి చేశారు. ఈ కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి సింగిలి సంపత్ రెడ్డి, రాష్ట్ర ఉపాధ్యక్షులు నూనె సుధాకర్, సిరిసిల్ల జిల్లా అధ్యక్షులు సుధాకర్, ఉపాధ్యక్షులు మెట్టు రమేష్, మండల పార్టీ అధ్యక్షులు సద్ది లక్ష్మారెడ్డి, నాయకులు దొమ్మాటి నర్సయ్య, పందిర్ల లింగం గౌడ్, మర్రి శ్రీనివాస్ రెడ్డి, చెన్నిబాబు, అనవేని రవి, ఎండి రఫీక్, బానోతు రాజు నాయక్, రాజేందర్, రాంరెడ్డి, చెరుకు ఎల్లయ్య, పరుశరాములు, మహేందర్, బుచ్చా గౌడ్ తిరుపతిరెడ్డి, భూమిరెడ్డి, బాలయ్య, సురేష్, రవి పాల్గొన్నారు.

యువకుని దారుణ హత్య

వివాహేతర సంబంధమే ప్రధాన కారణం

ఘటన స్థలాన్ని పరిశీలించిన డీఎస్పీ నాగేంద్రచారి

నవతెలంగాణ -చందుర్తి:



మృతుని ఫైల్ ఫోటో

ఓ యువకుడు దారుణ హత్య గురైన జరిగిన ఎసంఘటన రాజన్న సిరిసిల్ల జిల్లా చందుర్తి మండలం మాల్యాలలో బుధవారం రాత్రి చోటుచేసుకుంది. సీఐ కిరణ్ కుమార్ తెలిపిన వివరాల ప్రకారం గ్రామానికి చెందిన ఓ వివాహిత మహిళ భర్త మల్లేశ్ బ్రతుకుదెరువు కోసం గల్ఫ్ వెళ్ళాడు. అదే గ్రామానికి చెందిన పడిగేలా నరేష్ (25)అనే యువకుడుతో సదరు మహిళకు పరిచయం ఏర్పడింది. ఆ పరిచయం వివాహేతర సంబందానికి దారి తీసింది. ఈ విషయంలో మల్లేశ్ పలు మార్లు నరేష్‌ను మందలించాడు. ఎలాగైనా నరేష్‌ను హత్య చేయాలని పథకం పన్నారు. మల్లేశ్ తన భార్యకు తెలువకుండా ఈ నెల8న గల్ఫ్ నుండి మల్యాలకు వచ్చాడు, ఈ క్రమంలో బుధవారం రాత్రి నరేష్ రమాదేవి ఇంటికి వెళ్ళాడు. ఇద్దరు అర్ధ నగ్నంగా ఉండగా, మల్లేశ్ కత్తితో ద్విచక్ర వాహనంపై వచ్చి నేరుగా ఇంట్లోకి వెళ్లి కత్తితో దాడి చేశాడు. నరేష్ అక్కడికక్కడే మతిచెందాడు. మల్లేశ్ పరారీ లో ఉన్నాడు. మృతుని తల్లి లసుమవ్వ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. పోస్ట్ మార్టం నిమిత్తం సిరిసిల్ల ఏరియా ఆస్పత్రికి తరలించారు.

వన్‌పల్లికి గ్రామీణ అవార్డ్

నవతెలంగాణ-వీర్నపల్లి



మంత్రి నుండి అవార్డు అందుకున్న సర్పంచ్

మండలంలోని వన్‌పల్లి గ్రామనికి స్వచ్ఛ సర్వేక్షణ గ్రామీణ అవార్డులో భాగంగా హైదరబాద్ లో స్వచ్ఛ సర్వేక్షణ కార్యక్రమంలో గ్రామీణ నీటి సరఫార మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు, ప్రిన్సిపాల్ సెక్రెటరీ సందీప్ కుమార్ సుల్తానీయా చేతుల మీదుగా సర్పంచ్ జోగినిపల్లి లత మల్లేశంకు అవార్డ్ అందజేశారు.ఈ కార్యక్రమంలో ఎంపీడీవో నరేష్, గ్రామ పంచాయతి కార్యదర్శి తదితరులు ఉన్నార్ను


సభకు అధిక సంఖ్యలో రావాలి

నవతెలంగాణ - ఎల్లారెడ్డిపేట

రాజన్న సిరిసిల్లా జిల్లా అంబెద్కర్ చౌరస్తా వద్ద బీఆర్ఎస్ జిల్లా శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం ఉదయం 11 గంటలకు పెద్ద ఎత్తున నిర్వహించ తలపెట్టిన కృతజ్ఞత ర్యాలీ,సభకు ఎల్లారెడ్డి మండల కేంద్రం నుంచి భారీగా తరలిరావాలని బీఆర్ఎస్ పార్టీ పట్టణ అధ్యక్షులు బండారి బాల్ రెడ్డి గ్రామ ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశంలో ప్రజాప్రతినిధులు,నాయకులు పాల్గొన్నారు

బీఎస్పీ జెండా ఆవిష్కరణ

నవతెలంగాణ - ఎల్లారెడ్డిపేట



జెండా ఆవిష్కరణలో పాల్గొన్న బీఎస్పీ నేతలు

ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలో బహుజన సమాజ్ పార్టీ జెండా పండుగ కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. మండల అధ్యక్షుడు నీరటిభాను ఆధ్వర్యంలో మండల కేంద్రంలోని బొప్పాపూర్, సింగారం, బండ లింగంపల్లి, తిమ్మాపూర్, గుండారం గ్రామాల్లో ర్యాలీ నిర్వహించారు .బీఎస్పీ నాయకులు పాల్గొన్నారు.

మార్కెట్ కమిటీ ఛైర్మన్‌ను సన్మానించిన పాత్రికేయులు.

నవతెలంగాణ-ముస్తాబాద్:



చైర్మన్ ను సన్మానిస్తున్న పాత్రికేయులు.

నూతనంగా నియమితులైన మార్కెట్ కమిటీ చైర్మన్ అక్క రాజు శ్రీనివాసును ముస్తాబాద్ మండల పాత్రికేయులు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా అక్క రాజు శ్రీనివాస్ మాట్లాడుతూ పాత్రికేయులు సమాజంలో ఫోర్త్ ఎస్టేట్ గా ఉంటూ ప్రజల కోసం అహర్నిశలు కృషి చేస్తున్నారని అన్నారు. ప్రజలకు ప్రభుత్వానికి మధ్య వారిది ఉంటున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో మండల పాత్రికేయులు అవధూత శేఖర్, కూర సంతోష్, తడక లక్ష్మీనారాయణ, పరుశరాములు, శంకర్, రమేష్,వెంకట్ రెడ్డి, శ్రీనివాస్ పాల్గొన్నారు.

నామాపూర్ గ్రామానికి గ్రామీణ అవార్డు

నవతెలంగాణ-ముస్తాబాద్:

హైదరాబాదులోని తెలంగాణ స్టేట్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ రూరల్ డెవలప్మెంట్ రాష్ట్రవ్యాప్తంగా ఉన్న గ్రామాలను పరిశీలన చేయగా ముస్తాబాద్ మండలం నామాపూర్‌కు స్వచ్ఛ సర్వేక్షన్ గ్రామీణ అవార్డు దక్కిందని ఎంపీడీవో రమాదేవి తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏపీఓ ఆనంద్, కార్యదర్శి సౌమ్య ఎంపీవో ఆరిఫ్ బాష పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లోకి చేరేందుకు యువత ఆశక్తి: కేకే

నవతెలంగాణ-గంభీరావుపేట:



పార్టీలోకి ఆహ్వానించిన కేకే మహేందర్ రెడ్డి

కాంగ్రెస్ పార్టీ సిద్ధాంతాలకు ఆకర్షితులై యువకులు, మహిళలు పార్టీలోకి చేరేం దుకు సుముఖత చూపుతున్నారని సిరిసిల్ల నియోజకవర్గం ఇంచార్జ్ కేక మహేందర్ రెడ్డి అన్నారు.గంభీరావుపేట మండల కేంద్రంలో మండల కాంగ్రెస్ అధ్యక్షుడు హమీద్, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు పాపా గారి రాజు గౌడ్ ఆధ్వర్యంలో యువ నాయకుడు లక్కం బాబు అనుచరులతో కలిసి కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జీ కేకే మహేందర్ రెడ్డి కాంగ్రెస్ పార్టీ కండువాలు కప్పి కాంగ్రెస్ పార్టీలోకి ఆహ్వానించారు.

జండా పండుగ

గంభీరావుపేట మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు హమీద్ ఆధ్వర్యంలో కొత్తపలి, రాజుపేట గ్రామాలలో కాంగ్రెస్ పార్టీ జెండా పండుగ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు

సీఎం సహాయ నిధి చెక్కుల పంపిణీ

నవతెలంగాణ-రుద్రంగి

రుద్రంగి బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు దెగావత్ తిరుపతి , గ్రామశాఖ అధ్యక్షుడు దయ్యాల కమలాకర్ ఆధ్వర్యంలో పార్టీ కార్యాలయంలో ఎంపీపీ గంగం స్వరూప మహేష్, జెడ్పీటీసీ గట్ల మీనయ్య చేతుల మీదుగా ఐదుగురు లబ్ధిదారులకు రూ.1.64 లక్షలు విలువైన చెక్కులను పంపిణీ చేశారు..ఈ కార్యక్రమంలో, సెస్ డైరెక్టర్ ఆకుల గంగారాం, ఆలయ చైర్మన్ కొమిరె శంకర్, అల్లూరి రాజిరెడ్డి, కో అప్షన్ జమిలా బేగం, ఎంపీటీసీ మంచే లావణ్య రాజేశం, మాజీ జెడ్పీటీసీ అంబటి గంగాధర్, నాయకులు పుదారి శ్రీనివాస్, చెప్యాల గణేష్, దయ్యాల నారాయణ, ప్రశాంత్, పాల నర్సయ్య, పొగుల నర్సయ్య, అంబటి రాములు,వోద్యరపు మోహన్, సింగారపు గంగరాజం, దాసరి గంగరాజం, దయ్యాల పెద్దులు, బొడ్డు మల్లేశం, ఇర్జం రాజేశం, ఆకుల గంగారాం తదితరులు పాల్గొన్నారు

బహిరంగ సభను విజయవంతం చేయాలి

నవతెలంగాణ- రుద్రంగి

సిరిసిల్ల జిల్లా కేంద్రంలో శుక్రవారం జరగబోయే భారీ బహిరంగ సభకు విజయవంతం చేయాలని ఎంపీపీ గంగం స్వరూప మహేష్, జెడ్పీటీసీ గట్ల మీనయ్య కోరారు.గురువారం పార్టీ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు దెగావత్ తిరుపతి గ్రామశాఖ అధ్యక్షుడు దయ్యాల కమలాకర్ ఆధ్వర్యంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో వారిద్దరూ మాట్లాడుతూ భారీ బహిరంగ సభకు బీఆరెస్ పార్టీ శ్రేణులు ప్రజలు విద్యార్థులు స్వచ్ఛందంగా తరలి రావాలని కోరారు..ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

సిరిసిల్లలో ట్రాఫిక్ ఆంక్షలు

నవ తెలంగాణ-సిరిసిల్ల రూరల్

సిరిసిల్ల పట్టణంలో పబ్లిక్ సమావేశం ఉండడంతో పోలీసులు ట్రాఫిక్ ఆంక్షలు విధించడంతో పాటు ట్రాఫిక్ డైవర్షన్ లు ఏర్పాటు చేయడం జరిగిందని పోలీసులు పేర్కొన్నారు. టెట్ పరీక్ష ఉన్న అభ్యర్థులకు శుక్రవారం ఉదయం 9:30 నుండి 12:00 వరకు మధ్యాహ్నం 02:30 నుండి 05:00 వరకు ఉన్నందున సిరిసిల్ల పట్టణంలో ట్రాఫిక్ ఆంక్షలు ఉన్న నేపథ్యంలో ఒక గంట ముందే పరీక్ష కేంద్రాలను చేరుకోవాలని పోలీసులు వివరించారు. అదేవిధంగా మొదటి పరీక్ష అయిపోయిన తరువాత పరీక్ష కేంద్రాలకు దూరంగా వెళ్లకుండా పరీక్ష కేంద్రాల వద్దే ఉండాలన్నారు. కృతజ్ఞత ర్యాలీకి ఎల్లారెడ్డిపేట్ రూట్ నుండి మీటింగ్ వచ్చే ప్రజలు కొత్త బస్టాండ్ ప్రాతంలో వాహనాలు నిలిపి మీటింగ్ స్థలానికి చేరుకోవచ్చు అన్నారు. వేములవాడ, రగుడు రూట్ నుండి వచ్చే ప్రజలు చంద్రంపెట్ వద్ద గల కళ్యాణ లక్ష్మి గార్డెన్ వద్ద వాహనాలు నిలిపి మీటింగ్ స్థలానికి చేరుకోవచ్చన్నారు. తంగళ్ళపల్లి రూట్ నుండి మీటింగ్ ప్రదేశానికి వచ్చే ప్రజలు పద్మనాయక ఫంక్షన్ హాల్ లేదా బతుకమ్మ ఘాట్ వద్ద గల పార్కింగ్ ప్రదేశంలో వాహనాలు నిలిపి మీటింగ్ స్థలానికి చేరుకోవచ్చని తెలిపారు. రగుడు నుండి వెంకటాపూర్ బైపాస్ రూట్ , రగుడు నుండి తంగళ్ళపల్లి రూట్ గల బైపాస్ ఓపెన్ గా ఉంటుందని వివరించారు.

ఎన్నికలు సజావుగా జరిగేలా సహకరించాలి

సీఐ సదన్ కుమార్

నవతెలంగాణ-ఇల్లంతకుంట:

త్వరలో జరుగబోయే సాధారణ ఎన్నికలు సజావుగా జరిగేలా అందరూ సహకరించాలని సీఐ సదన్ కుమార్ పేర్కొన్నారు . మండల కేంద్రములో ఉన్న రైతు వేదికలో వివిధ రాజకీయ పార్టీల నాయకులతో ఏర్పాటు చేసిన అవగాహన కార్యక్రమములో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు . ఎన్నికల నిబంధనలను ఎవరు ఉల్లంఘించిన కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు ఈ కార్యక్రమంలో తహశీల్దార్ జావేద్ అహ్మద్ ,ఎసై సుధాకర్ , వివిధ పార్టీల నాయకులు ,పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

డ్రైవింగ్ లైసెన్స్ పొందుటకు సువర్ణావకాశం

నవతెలంగాణ- ఇల్లంతకుంట:



ఇల్లంతకుంట ఎసై సుధాకర్

మండల పరిధిలోని యువకులకు సిరిసిల్ల జిల్లా పోలీస్ శాఖ వినూత్న అవకాశాన్ని కల్పిస్తుందని స్థానిక ఎసై సుధాకర్ తెలిపారు . ఆటోలు , బైకులు నడుపుతున్న లేదా డ్రైవింగ్ చేయాలన్న ఉత్సాహం ఉన్న యువకుల కోసం ప్రత్యేక డ్రైవింగ్ లైసెన్స్ మేళాను ఏర్పాటు చేస్తున్నట్లు పేర్కొన్నారు . డ్రైవింగ్ లైసెన్స్ లేని వ్యక్తులు తమ యొక్క ఆధార్ కార్డును, ౮ ఏడవ తరగతి ఆపైన చదివిన పాస్ సర్టిఫికెట్ తీసుకొని పోలీస్ స్టేషన్లో తమ పేర్లను నమోదు చేసుకోవాలన్నారు . మండలంలోని యువకులు డ్రైవింగ్ లైసెన్స్ కోసం మధ్యవర్తులను గాని బ్రోకర్లను గాని సంప్రదించవద్దని నేరుగా పోలీస్ స్టేషన్లో తమ వివరాలు సమర్పించినట్లయితే సులువుగా సజావుగా డ్రైవింగ్ లైసెన్స్ వచ్చేటట్టు చూడడం జరుగుతుందన్నారు . శుక్రవారం సాయంత్రం లోపు వివరాలను నమోదు చేయిం చుకోవాలని అయన తెలిపారు.

రోడ్డు బాగు చేయాలని నిరసన

నవతెలంగాణ-ఇల్లంతకుంట

బీటీ రోడ్డును బాగు చేయాలని యువజన సంఘాల నాయకులు గురువారం నిరసన తెలిపారు. ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ వైఖరిపై తోపుడు చక్రాల బండిపై చిత్రపటాన్ని పెట్టి లాగుతూ నిరసన వ్యక్తం చేశారు..ఈ కార్యక్రమంలో బొల్లారం ప్రసన్న, మామిడి హరీష్, రాజు, గుంటి మహేష్, కంచ మహేందర్, బొల్లం.రాంసాగర్, శ్రీనివాస్, సురేష్, నవీన్, చొప్పరి వంశీ, సుధీర్ రెడ్డి, మధు, శ్రీనివాస్, శేఖర్, ప్రశాంత్, అజయ్ పాల్గొన్నారు.

ఘనంగా హింది దినోత్సవం

నవతెలంగాణ - ఎల్లారెడ్డిపేట

హింది దినోత్సవాలలో భాగంగా ఎల్లారెడ్డిపేట మండలంలోని అల్మాస్‌పూర్ కేజీబీవీ పాఠశాల, గుండారం పాఠశాలలో హింది ఉపాధ్యాయుడు అంజయ్యను ఘనంగా సన్మానించారు. ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు పాఠశాల స్పెషల్ అధికారిణి అజంతా హింది ఉపాధ్యాయురాలు శాహేదా పర్వీన్‌లు బహుమతులు అందజేసి అభినందించారు.

ఉద్యమకారులను ఆదుకోవాలి



ధర్నా చేస్తున్న ఉద్యమకారులు

నవతెలంగాణ-పెద్దపల్లి టౌన్: పెద్దపల్లి జిల్లాలో తెలంగాణ కోసం అనేక ఉద్యమాలు చేసి జీవితాలనే కోల్పోయిన ఉద్యమకారులను ఆదుకోవాలంటూ తెలంగాణ ఉద్యమకారుల ఫోరం ఆధ్వర్యంలో బస్టాండ్ వద్ద రాజీవ్ రహదారిపై రాస్తారోకో చేశారు. ఈ సందర్భంగా ఉద్యమకారుల ఫోరం నాయకులు మాట్లాడుతూ ఇటీవల కరీంనగర్ రూరల్ మండలానికి చెందిన కుక్క మల్లన్న అనే ఉద్యమకారుడు ఉద్యమకాలంలో అనేక ఉద్యమాలు చేసి అప్పుల పాలై అప్పులను తీర్చలేక కరీంనగర్ అమరవీరుల స్తూపం వద్ద పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడగా బుధవారం మృతిచెందాడన్నారు. మల్లన్న కుటుంబానికి ప్రభుత్వం 50 లక్షల ఎక్స్‌గ్రేషియా అందించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఉద్యమకారుల ఫోరం నాయకులు గుండేటి ఐలయ్య యాదవ్, బింగి రాజు, జ్యోతి రెడ్డి, నూనె రాజేశం, ముంజంపల్లి లక్ష్మణ్, శ్రీనివాస్, మల్లేశం, సాగర్ రెడ్డి, రాములు, లక్ష్మణ్, రమేష్, రవి, లలిత, శంకర్, రవి, ఓదెలు తదితరులు పాల్గొన్నారు.

నాగారం గ్రామపంచాయతీకి అవార్డు ప్రదానం



అవార్డు అందుకుంటున్న నాగారం గ్రామ సర్పంచ్ మల్లేష్

నవతెలంగాణ-మంథని: స్వచ్ఛ సర్వేక్షన్ గ్రామీణ 2023లో పెద్దపల్లి జిల్లా మంథని మండలం నాగారం గ్రామపంచాయతీ 2000 జనాభా కలిగిన కేటగిరీలో రాష్ట్ర ప్రభుత్వం రాష్ట్రస్థాయిలో నాగారం గ్రామపంచాయతీకి అవార్డు ప్రదానం చేశారు. ఈ అవార్డును రాష్ట్ర మంత్రి దయాకర్‌రావు చేతుల మీదుగా నాగారం గ్రామ సర్పంచ్ బూడిద మల్లేష్ అందుకున్నారు. అవార్డు గ్రహీతలకు రాష్ట్ర ప్రభుత్వం వెంటనే పదిలక్షల రూపాయల ఎంజీఎన్ఆర్ఈజీఎస్ నుంచి విడుదల చేయాలని పంచాయతీరాజ్ శాఖ మంత్రి దయాకర్ రావు ప్రకటించారు. ఈ కార్యక్రమంలో నాగారం గ్రామ సర్పంచ్ మల్లేష్,పంచాయతీ కార్యదర్శి పల్లె అనిల్ ను పూలమాలలు,శాలువ, మెమెంటుతో సత్కరించారు.ఈ కార్యక్రమంలో జిల్లా పరిషత్ సీఈవో శ్రీనివాస్, డిపిఓ చంద్రమౌళి, ఎస్బీఎం రాఘవులు, రేణుక, ఎంపీడీవో రమేష్ పాల్గొన్నారు.

నిరుద్యోగులను మోసం చేసిన కేసీఆర్‌కు బుద్ధి చెప్తాం

- బీజేపీ ఆధ్వర్యంలో కేసీఆర్ దిష్టిబొమ్మ దహనాలు
- రాస్తారోకో, ధర్నాలు

నవతెలంగాణ - పెద్దపల్లి టౌన్

నిరుద్యోగులకు కేసీఆర్ చేసిన మోసాన్ని నిరసిస్తూ నిరాహార దీక్ష చేస్తున్న కేంద్ర మంత్రి, బీజేపీ తెలంగాణ అధ్యక్షుడు కిషన్‌రెడ్డిని దీక్షా స్థలి నుంచి అక్రమంగా తరలించడాన్ని నిరసిస్తూ బీజేపీ నాయకులు గురువారం రాజీవ్ రహదారిపై రాస్తారోకో చేసి కేసీఆర్ దిష్టిబొమ్మ దహనం చేశారు. ఈ సందర్భంగా బీజేపీ నాయకులు మాట్లాడుతూ ఇందిరాపార్క్ వద్ద 24 గంటల నిరాహార దీక్ష చేస్తున్న బీజేపీ తెలంగాణ అధ్యక్షుడు కిషన్‌రెడ్డిని పోలీసులు అరెస్ట్ చేయడం సిగ్గుచేటన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యులు శిలారపు పర్వతాలు,అసెంబ్లీ కన్వీనర్ దాడి సంతోష్, నాయకులు పర్శ సమ్మయ్య, కొంతం శ్రీనివాస్ రెడ్డి,పిన్నింటి రాజు,తంగేడ రాజేశ్వర్ రావు, పోల్సాని సంపత్ రావు, రాజమహంత కృష్ణ,మేకల శ్రీనివాస్ యాదవ్, పల్లె సదానందం, వెల్లంపల్లి శ్రీనివాస రావు, శిలివేరు ఓదెలు, జంగ చక్రధర్ రెడ్డి, మౌటం నర్సింగం, కొమిరిశెట్టి రమేష్, ఎండి ఫహీం పాల్గొన్నారు.

మంథని: బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి నిరుద్యోగులకు మద్దతుగా మండల కేంద్రంలోని అంబేద్కర్ చౌక్‌లో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు చంద్రుపేట సునీల్‌రెడ్డి ఆధ్వర్యంలో నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సునీల్ రెడ్డి మాట్లాడుతూ ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖరరావు రాష్ట్రంలో నిరుద్యోగులకు ఇంటికో ఉద్యోగం ఇస్తానని, నిరుద్యోగ భృతిని కల్పిస్తానని హామీ నెరవేరలేదన్నారు. ఈ కార్యక్రమంలో సీనియర్ బీజేపీ నాయకులు, యువ నాయకులు, వివిధ మోర్చా నాయకులు పాల్గొన్నారు.

ఓదెల: మండల కేంద్రంలో గురువారం బీజేపీ నాయకులు కారంగుల శ్రీనివాస్ ఆధ్వర్యంలో భారతీయ జనతా పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు, కేంద్ర మంత్రివర్యులు కిషన్ రెడ్డి అక్రమ అరెస్టును ఖండిస్తూ కేసీఆర్ దిష్టిబొమ్మ దహనం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో నిరుద్యోగ యువకులకు ఉద్యోగాలు భర్తీ చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు కొలనూరు ఎంపీటీసీ కారెంగుల శ్రీనివాస్, మండల ఉపాధ్యక్షుడు ఎంబడి మల్లేష్, మండల ప్రధాన కార్యదర్శి తీర్థాల కుమారస్వామి, భుద్దే రాజన్న, బోడకొండ సతీష్, మార్క శ్రీనివాస్, మెరుగు సారంగం, రామినేని సతీష్, రెడ్డిరాజుల సాయి,బిజెపి నాయకులు తదితరులు పాల్గొన్నారు.



పెద్దపల్లి టౌన్: దిష్టి బొమ్మ దహనం చేస్తున్న బీజేపీ నాయకులు

సుల్తానాబాద్: భారతీయ జనతా పార్టీ ఆధ్వర్యంలో పట్టణంలోని పూసాల చౌరస్తా వద్ద గురువారం సీఎం కేసీఆర్ దిష్టిబొమ్మ దహనం చేశారు. ఈ కార్యక్రమానికి బీజేపీ జిల్లా అధికార ప్రతినిధి చౌదరి మహేంద్ర యాదవ్, కామని రాజేంద్రప్రసాద్ మాజీమండల అధ్యక్షుడు కొమ్ము తిరుపతి యాదవ్, ఓబీసీ మోర్చా పెద్దపల్లి జిల్లా ప్రధాన కార్యదర్శి చాతరాజు రమేష్, కిసాన్ మోర్చా జిల్లా అధ్యక్షుడు గడ్డం మైపాల్ రెడ్డి, పట్టణ ఉపాధ్యక్షుడు ఎలివేని తిరుపతి యాదవ్, భూసారపు సంపత్ మారలేని రమేష్, పట్టణ అధ్యక్షుడు ఎల్లంకి రాజు, ఎలిగేటి సతీష్, సలిగంటి కొమురయ్య, మేకల రమేష్ పాల్గొన్నారు

తపాలా బీమాతో మరింత ధీమా

- తపాలాశాఖ పెద్దపల్లి డివిజన్ సూపరింటెండెంట్ ప్రభాకర్



ఓదెల: అవగాహన కల్పిస్తున్న సబ్ డివిజనల్ ఇన్‌స్పెక్టర్ మోహన్

నవతెలంగాణ - పెద్దపల్లి టౌన్: కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన తపాలా బీమాతో మరింత ధీమా ఉంటుందని తపాలాశాఖ పెద్దపల్లి డివిజన్ సూపరింటెండెంట్ పసునూరి ప్రభాకర్ అన్నారు. బుధవారం స్థానిక ఆర్ ఆర్ గార్డెన్ లో ఏర్పాటు చేసిన ప్రత్యేక శిబిరంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేవలం రూపాయలు 396/-తో ప్రమాద బీమా చేసుకున్నవారికి 10,00,000/- ప్రమాద భీమా లభిస్తుందన్నారు. పెద్దపల్లికి చెందిన ఆటో డ్రైవర్‌గా పనిచేస్తున్న చల్ల వెంకటేశ్వర్లు ఆటో ప్రమాదంలో మృతి చెందగా, బాధిత కుటుంబానికి తపాలా శాఖ ద్వారా మంజూరైన 10 లక్షల భీమా చెక్ ను అందించారు. ఈ కార్యక్రమం లో అసిస్టెంట్ సూపరింటెండెంట్ సునీల్ కుమార్, మేనేజర్ శ్రీనివాస్,సబ్ డివిజనల్ ఇన్‌స్పెక్టర్ నరేష్, మోహన్, అజహరుద్దీన్, శ్రీనివాస్, రీజనల్ హెడ్ భాస్కర్ నాయక్ పాల్గొన్నారు.

ఓదెల: పోస్టల్ శాఖ పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని పోస్టల్ శాఖ జమ్మికుంట సబ్ డివిజనల్ ఇన్‌స్పెక్టర్ మోహన్ తెలిపారు. డాక్ కమ్యూనిటీ డెవలప్మెంట్ ప్రోగ్రామ్‌లో భాగంగా గురువారం ఓదెల మండలం పోత్కపల్లి సబ్ పోస్ట్ ఆఫీస్ పరిధిలోని వివిధ గ్రామాల ప్రజలకు అవగాహనా కల్పించారు. ఈ కార్యక్రమంలో సబ్ పోస్ట్ మాస్టర్ ఏ స్వామి, విద్యాసాగర్, వివిధ గ్రామాల బ్రాంచ్ పోస్ట్‌మాస్టర్లు, అసిస్టెంట్ బ్రాంచ్ పోస్ట్ మాస్టర్లు పాల్గొన్నారు.

పంట రుణాల మాఫీ సహాయ కేంద్రం ఏర్పాటు

నవ తెలంగాణ-పెద్దపల్లి: పంట రుణాల మాఫీ 2018 సంబంధించి రైతుల సందేహాలను నివృత్తి చేసేందుకు జిల్లా కలెక్టరేట్‌లో వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో పంట రుణమాఫీ సహాయ కేంద్రాన్ని ఏర్పాటు చేశామని కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. పంట రుణమాఫీపై రైతులు తమ సందేహాల నివృత్తి కోసం సమీకృత కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన పంట రుణాల మాఫీ సహాయ కేంద్రం సెల్ ఫోన్ నంబర్ 7569942652 నందు సంప్రదించాలని కలెక్టర్ ఆ ప్రకటనలో తెలిపారు.

మాయ మాటలకు మోస పోకండి

- ఎమ్మెల్యే దాసరి మనోహర్‌రెడ్డి



పార్టీలో చేరిన వారితో ఎమ్మెల్యే

నవతెలంగాణ-పెద్దపల్లి: ఎన్నికల్లో లబ్ధి పొందాలని ప్రతి పక్ష నాయకులు చెప్పిన మాయ మాటలకు మోస పోకండి అని ఎమ్మెల్యే దాసరి మనో హర్‌రెడ్డి పేర్కొన్నారు. ఇంటింటా ప్రచారంలో భాగంగా జిల్లా కేంద్రంలోని 6వవార్డులో గడప గడపకు వెళ్లి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను, అభివృద్ధి వివరించారు. ప్రతిపక్షాలు అధికారంలో ఉన్న సమయంలో నియోజకవర్గ అభివృద్ధిని మర్చిపోయారన్నారు. రాబోయే రోజుల్లో మరింత అభివృద్ధి చేసేందుకు అసెంబ్లీ ఎన్నికల్లో కారు గుర్తుకు ఓటేసి మరో అవకాశం ఇవ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు పెద్ది గీతాంజలి వెంకటేష్, పెంచాల రమాదేవి, శ్రీధర్, పట్టణ అధ్యక్షుడు ఉప్పు రాజ్‌కుమార్ పాల్గొన్నారు.

గ్రామస్తుల సహకారంతోనే రాష్ట్రస్థాయి అవార్డు

- గర్రెపల్లి సర్పంచ్‌కి అవార్డు ప్రదానం చేసిన మంత్రి



సర్పంచ్ వీరగోని సుజాతకు అవార్డు అందజేస్తున్న మంత్రి దయాకర్ రావు

నవతెలంగాణ-సుల్తానాబాద్ రూరల్: మండంలోని గర్రెపల్లి గ్రామాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసినందుకు గాను సర్పంచ్ వీరగోని సుజాత రమేష్‌గౌడ్‌కు విశిష్ట గౌరవం దక్కింది. స్వచ్ఛ సర్వేక్షన్ గ్రామీణ 2023లో పెద్దపల్లి జిల్లా నుంచి సుల్తానాబాద్ మండలంలోని గర్రెపల్లి గ్రామ పంచాయతీ 5000 వేల జనాభా కలిగిన కేటగిరీలో రాష్ట్ర స్థాయిలో అవార్డు ప్రదానం చేశారు. గ్రామ సర్పంచ్ వీరగోని సుజాతకు పంచాయతీరాజ్ శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు అవార్డు ప్రదానం చేశారు. అవార్డు గ్రహీతలకు రాష్ట్ర ప్రభుత్వం వెంటనే 10లక్షల రూపాయలు విడుదల చేస్తున్నట్లు పంచాయతీరాజ్ శాఖ మంత్రి ప్రకటించారు. గర్రెపల్లి గ్రామం త్వరలోనే దేశంలోనే నెంబర్ వన్ గ్రామంగా నిలిపేందుకు కృషి చేయాలని సర్పంచ్ సుజాతకు మంత్రి శుభాకాంక్షలు తెలుపుతూ అన్నారు. సర్పంచ్ సుజాత మాట్లాడుతూ గర్రెపల్లి గ్రామపంచాయతీకి అన్ని విధా లుగా సహకరించిన ఎమ్మెల్యే దాసరి మనోహర్ రెడ్డికి, ఎమ్మెల్సీ భానుప్రసాద్‌రావుకు, సుల్తానాబాద్ ఎంపీపీ బాలాజీరావుకు, మరి యు ఇతర అధికారులకు గ్రామ ప్రజలకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధికారులతో పాటు ఎంపీడీవో శశికళ, ఏపీఓ ఫయాజ్ అలీ, మాజీ సింగిల్ విండో చైర్మన్ బీఆర్ఎస్ నాయకులు బీరగోని రమేష్‌గౌడ్‌ల పాల్గొన్నారు.

ప్రతిపక్ష పార్టీల పాత్ర విఫలం

- జడ్పీ చైర్మన్ పుట్ట మధూకర్



విద్యార్థులతో మాట్లాడుతున్న జడ్పీ చైర్మన్ పుట్ట మధుకర్

నవతెలంగాణ-రామగిరి: సమస్యల పరిష్కారంలో ప్రతిపక్ష పాత్ర పోషించాల్సిన ప్రతిపక్ష పార్టీలు పూర్తిగా విఫలం అయ్యాయని బీఆర్ఎస్ మంథని ఎమ్మెల్యే అభ్యర్థి, జడ్పీ చైర్మన్ పుట్ట మధూకర్ ఎద్దేవా చేశారు. రామగుండం రీజియన్-3 ఏరియా పరిధిలోని రామగిరి మండలం సెంటనరీకాలనీలోని సింగరేణి సంస్థ నుంచి లీజుకు తీసుకొని వాణి సెకండరీ స్కూల్ వారు నిర్వహించే పాఠశాలను గురువారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా పుట్ట మధు మాట్లాడుతూ సింగరేణి సంస్థ లీజుకు తీసుకొని వాణి సెకండరీ స్కూల్ సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించే పాఠశాలలో కనీస వసతులు లేకుండా విద్యార్థులను గాలికి వదిలేశారని ఆయన ఆరోపించారు. నెల రోజుల్లోగా పాఠశాలలో సకల సౌకర్యాలు కల్పించేలా సింగరేణి సంస్థ చర్యలు తీసుకోవాలని లేని పక్షంలో ఆందోళన, ఉద్యమాలు చేపట్టాల్సి వస్తుందని ఆయన హెచ్చరించారు. అలాగే ఈ ప్రాంతంలో ప్రజాప్రతినిధులు, టీబీజీకేఎస్‌నాయకులు నిత్యం కార్మికుల బిడ్డలు చదువుకునే పాఠశాలను పర్యవేక్షించాలన్నారు. ఆయన వెంట జడ్పీటీసీ మేదరవేణి శారద-కుమార్‌యాదవ్, నాయకులు రవీందర్, పీవీరావు, గౌతమ్ శంకరయ్య ఈసంపల్లి రమేష్, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఖయ్యూం, సింగరేణి ఎస్-ఎస్ఓ లక్ష్మీనారాయణ ఉన్నారు.

వృత్తి విద్య కోర్సుల్లో శిక్షణ పొందిన వారికి రాత పరీక్ష

నవతెలంగాణ-రామగిరి: సింగరేణి సేవా సమితి తరపున గత ఆర్థిక సంవత్సరం(2022-23) మహిళలకు టైలరింగ్, మగ్గం వర్కు, బ్యూటిషియన్ మొదలగు వృత్తివిద్య కోర్సు లలో శిక్షణ ఇచ్చింది. వారికి ఖాదీ గ్రామోద్యోగ మహావిద్యాలయ హైదరాబాద్ వారు గురువారంసెంటినరీకాలని కమ్యూనిటీ హాలులో రాత పరీక్ష నిర్వహించారు. 150 మంది మహిళలు రాత పరీక్షలకు హాజరయ్యారు. ఈ పరీక్షల నిర్వహణను పర్సనల్ మేనేజర్ ఎం రవీందర్ రెడ్డి ముఖ్యఅతిధిగా హాజరై పరిశీలించారు. ఈ కార్యక్రమంలో డీవైఎంలు మారుతి, సునీల్, సీనియర్ పిఓ రాజేశం, జూనియర్ ఇన్స్ట్రక్టర్ రాజయ్య వివిధ కోర్సుల శిక్షకులు అశ్విని, సుధ, భాగ్యలక్ష్మి, స్వప్న, పద్మ, ఆస్మ పాల్గొన్నారు.

అక్కినేని పురస్కారానికి రాజేష్ ఎంపిక



నవతెలంగాణ-గోదావరిఖని టౌన్: వృత్తిరీత్యా హైదరాబాద్ లో ఉంటున్న గోదావరిఖనికి చెందిన ప్రముఖ కళాకారుడు, తార ఆర్ట్స్ అకాడమీ నిర్వాహకుడు సంకె రాజేష్ అక్కినేని అంతర్జాతీయ ప్రత్యేక పురస్కారానికి ఎంపికయ్యాడు.2014లో అమెరికాలో స్థాపించబడిన అక్కినేని ఫౌండేషన్ ఆఫ్ అమెరికా ఈనెల 17న హైదరాబాద్ లోని రవీంద్ర భారతిలో నిర్వహిస్తున్న డాక్టర్ అక్కినేని నాగేశ్వరరావు శతజయంతి వేడుకల్లో అతిధులు ప్రఖ్యాత చలనచిత్ర నటులు, నిర్మాత మురళీమోహన్, తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ సలహాదారులు డాక్టర్ కేవీ రమణ చేతుల మీదుగా ఈ పురస్కారాన్ని అందుకోనున్నాడు. ఈ మేరకు ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షులు తోటకూర ప్రసాద్, అధ్యక్షులు మురళి వెన్నెం, కార్యదర్శి రవి కొండబోలు నుండి రాజేష్ ఆహ్వాన పత్రాన్ని అందుకున్నారు.

పకడ్బందీగా ఓటు నమోదు కార్యక్రమం

- ఆర్డీవో హనుమా నాయక్



పోలీసులతో సమావేశమైన ఆర్డీవో హనుమానాయక్

నవతెలంగాణ-మంథని: ఓటు నమోదు కార్యక్రమం పకడ్బందీగా జరగాలని మంథని డివిజన్ తహసీల్దాకు ఆర్డీవో హనుమానాయక్ ఆదేశించారు. గురువారం మంథని రెవెన్యూ డివిజన్ కార్యాలయంలో ఆర్డీవో హనుమానాయక్ అధ్యక్షతన తహసీల్దార్లతో ఓటర్ జాబితా గురించి ముఖ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఓటర్ నమోదు ప్రక్రియకు ఈ నెల19 చివరి తేదీ అన్నారు. ఈ కార్యక్రమంలో మంథని ఎమ్మార్వో రాజయ్య, డివిజన్ ఎమ్మార్వోలు పాల్గొన్నారు.

- మట్టి విగ్రహాలను ప్రతిష్టించాలి

గణేష్ నవరాత్రి ఉత్సవాల సందర్భంగా ప్రజలు మట్టి విగ్రహాలను ప్రతిష్టించి పర్యావరణాన్ని ప్రతి ఒక్కరూ కాపాడాలని మంథని ఆర్డీవో హనుమాన్ నాయక్ సూచించారు. గురువారం వినాయక చవితి పండగ సందర్భంగా సంబంధిత శాఖల అధికారులతో మంథని ఆర్డీవో హనుమా నాయక్ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అన్ని శాఖల అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.

సెక్యూరిటీ గార్డులకు రక్షణ కోట్‌లు ఇవ్వాలి

- తెలంగాణ కాంట్రాక్ట్ కార్మిక సంఘం అధ్యక్షుడు శ్రీనివాస్



నవతెలంగాణ-గోదావరిఖని: సింగరేణిలో పనిచేస్తున్న ప్రైవేటు సెక్యూరిటీ గార్డులందరికీ వర్షం, చలి వల్ల డ్యూటీల వద్ద ఇబ్బందులు కలగకుండా రక్షణ కోసం వర్షం, చలి కోట్‌లను ఇవ్వాలని తెలంగాణ కాంట్రాక్ట్ కార్మిక సంఘం అధ్యక్షుడు మద్దెల శ్రీనివాస్ డిమాండ్ చేశారు. ఆర్జీ 1, 2 3లలో పనిచేస్తున్న వివిధ సంస్థలలో సెక్యూరిటీ సిబ్బంది ఎన్నో ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. సింగరేణి యాజమాన్యం వీరిపై ప్రత్యేక శ్రద్ధ వహించి రావలసిన హక్కులని పరిష్కరించి వీరికి భరోసా కల్పించాలని అన్నారు. రేయింబవళ్లు సింగరేణి ఆస్తులను కాపాడటంలో, భద్రతను కల్పించడంలో నేడు ప్రైవేటు సెక్యూరిటీ గార్డుల శ్రమ కీలకంగా ఉందని తెలిపారు. భాస్కర్, సురేష్, రాజు, సుదర్శన్, సందీప్ తదితరులున్నారు.

హెల్ప్ లైన్ సేవలు విస్తృతంగా అమలు చేయాలి

- స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ జే.అరుణశ్రీ



మాట్లాడుతున్న అరుణ శ్రీ

నవతెలంగాణ-పెద్దపల్లి: జిల్లాలో మహిళల, బాలుర సంక్షేమానికి సంబంధించిన హెల్ప్ లైన్ సేవలు మరింత విస్తృతంగా అమలు చేయాలని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ జే. అరుణశ్రీ అన్నారు. గురువారం స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ జే.అరుణశ్రీ సమీకృత కలెక్టరేట్‌లోని తన చాంబర్ లో మహిళ, శిశు, దివ్యాంగుల సంక్షేమశాఖ పని తీరుపై సమీక్షించారు. మహిళ, శిశు, దివ్యాంగుల సంక్షేమశాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సఖీ కేంద్రం, బాలల పరిరక్షణ విభాగం, చైల్డ్ వెల్ఫేర్ కమిటీ, డిస్ట్రిక్ట్ హెడ్ ఫర్ ఎంపవర్మెంట్ ఆఫ్ ఉమెన్ విభాగాలు అందిస్తున్న సేవల వివరాలను అదనపు కలెక్టర్ తెలుసుకున్నారు. మహిళ హెల్ప్ లైన్ నంబర్ 181, చైల్డ్ హెల్ప్ లైన్ నంబర్ 1098లను విస్తృత ప్రచారం చేయాలన్నారు. వివిధ శాఖలకు చెందిన అధికారులు పాల్గొనే విధంగా సర్క్యులర్ జారీ చేయాలని అదనపు కలెక్టర్ జిల్లా సంక్షేమ అధికారిని ఆదేశించారు. ఈ సమావేశంలో జిల్లా సంక్షేమ అధికారి రౌఫ్ ఖాన్, సంబంధిత అధికారులు, పాల్గొన్నారు.

మచ్చుపేటను సందర్శించిన వైద్య బృందం



గ్రామంలో సందర్శిస్తున్న వైద్య బృందం

నవతెలంగాణ-ముత్తారం: మండలంలోని మచ్చుపేట గ్రామంలోని మండల వైద్యాధికారి డాక్టర్ అమరేందర్ ఆధ్వర్యంలో వైద్య బృందం గురువారం సందర్శించారు. వైద్య బందం సభ్యులు సబ్ యూనిట్ ఆఫీసర్ తిరుపతయ్య హెచ్ఈవో నరసింహారెడ్డి, పిహెచ్ఎన్ లలిత, ఏఎన్ఎంలు శోభారాణి, పుష్పలత, ఎంఎల్‌హెచ్‌పి దీప్తి, ఆశాలు, లత, కల్పన, రజిత, శశికళలు రెండు టీములుగా విడిపోయి గ్రామంలో సందర్శించారు. మొత్తం గ్రామంలో 110 మంది పరీక్షించి, 11 మంది వ్యాధి గ్రస్తులను గుర్తించారు. గ్రామంలో శానిటేషన్ పనులు చేయిస్తూ, దోమల పిచికారి చేపట్టారు. సూపర్ వైజర్ వీరేష్, పశుల శ్రీనివాస్ ఉన్నారు.

ప్రభుత్వం వెంటనే రెగ్యులర్ చేయాలని నిరసన



నిరసన తెలుపున్న అసిస్టెంట్ ప్రొఫెసర్లు

నవతెలంగాణ-గోదావరిఖని టౌన్: తెలంగాణ రాష్ట్రంలోని 12 విశ్వవిద్యాలయాలలో పనిచేస్తున్న రెగ్యులర్, సెల్ఫ్ ఫైనాన్స్ కాంట్రాక్ట్ అసిస్టెంట్ ప్రొఫెసర్ లని ప్రభుత్వం వెంటనే రెగ్యులర్ చేయాలని స్థానిక యూనివర్సిటీ పీజీ కళాశాల గోదావరిఖనిలో కాంట్రాక్ట్ అసిస్టెంట్ ప్రొఫెసర్లు ప్లే కార్డులతో నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. జూనియర్, డిగ్రీ మరియు పాలిటెక్నిక్ కళాశాలలో పనిచేసిన కాంట్రాక్ట్ అధ్యాపకులను క్రమబద్ధీకరించిన ప్రభుత్వం యూనివర్సిటీలలో పని చేస్తున్న కాంట్రాక్ట్ అసిస్టెంట్ ప్రొఫెసర్లను మాత్రం క్రమబద్ధీకరించడం లేదని, కాంట్రాక్ట్ అసిస్టెంట్ ప్రొఫెసర్లు తమ నిరసన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో కాంట్రాక్ట్ అధ్యాపకులు డాక్టర్ వై ప్రసాద్, డాక్టర్ చెరుకు రవి, నార్ల అజయ్ కుమార్, కే.సావిత్రి, సల్మా, సుల్తానా, యాదయ్య పాల్గొన్నారు.

అంగన్‌వాడీ ఉద్యోగులపై వేధింపులు ఆపాలి



నిరసన వ్యక్తం చేస్తున్న నాయకులు

నవతెలంగాణ-మంథని: సమ్మెలో పాల్గొంటున్న అంగన్వాడి ఉద్యోగులపై వేధింపులు ఆపాలని సీడీపీవో కార్యాలయాన్ని సీఐటీయూ ఆధ్వర్యంలో ఉద్యోగులు, నాయకులు ముట్టడించారు. తెలంగాణ అంగన్వాడి టీచర్స్ అండ్ హెల్పర్స్ జేఏసీ పిలుపు మేరకు సమ్మెలో భాగంగా అంగన్వాడి ఉద్యోగులు తమ న్యాయమైన డిమాండ్ల కోసం సమ్మె చేస్తున్న ప్రభుత్వం స్పందించకపోవడంతో ఉద్యోగులు కార్యాలయాన్ని ముట్టడించారు. ఈ సందర్భంగా సీఐటీయూ నాయకులు బూడిద గణేష్, జి.జ్యోతి మాట్లాడుతూ చట్టబద్ధంగా సమ్మె చేస్తున్నా అంగన్వాడి ఉద్యోగులపై సమ్మె విరమించాలని అధికారులు అంగన్వాడి టీచర్లకు ఫోన్లు చేసి వేధిస్తున్నారని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు సందీప్, అంగన్వాడీ యూనియన్ జిల్లా అధ్యక్షురాలు బీ వనజారాణి, శోభ, వై సుగుణ, సిహెచ్ హరిత, టి.కృష్ణ కుమారి, స్వరూప, సులోచన, కొండమ్మ, అంగన్వాడీ టీచర్లు, ఆయాలు, పాల్గొన్నారు.

సింగరేణి బకాయిలను వెంటనే చెల్లించాలి



మాట్లాడుతున్నా రాజారెడ్డి

నవతెలంగాణ-యైటింక్లయిన్ కాలనీ: సింగరేణికి బకాయి పడ్డ 22 వేల కోట్ల రూపాయలను రాష్ట్ర ప్రభుత్వం వెంటనే చెల్లించాలని సీఐటీయూ రాష్ట్ర అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు తుమ్మల రాజారెడ్డి, మంద నరసింహరావు పిలుపునిచ్చారు. గురువారం ఓసీపీ-3 లోని గేట్ మీటింగ్లో వారు మాట్లాడుతూ కోల్ ఇండియా లో ఆగస్టు నెల వేతనాలతో 11వ వేతన ఏరియర్స్ చెల్లించామని సర్క్యులర్ ఇచ్చిన సింగరేణి యాజమాన్యం ఈనెల 21న చెల్లించడానికి సర్క్యులర్ జారీ చేసిందని అంతేకాకుండా సంస్థకు రావలసిన బకాయిలను ప్రభుత్వం ఎన్నికల కోడ్ రాకముందే ఇవ్వాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్జీ-2 కార్యదర్శి ఉల్లి మొగిలి, ఎస్ వెంకన్న, వి రాజేశం, ఎస్ రాజన్న, ఎస్ వెంకటేశ్వర్లు, ఎస్ సాంబరాజు, జి సురేష్, అంజనేయులు, భూమయ్య పాల్గొన్నారు.

ఒకే యూనియన్ గుర్తింపు కొనసాగడం అన్యాయం



మాట్లాడుతున్న ఏఐటీయూసీ నాయకులు

నవతెలంగాణ-గోదావరిఖని: సింగరేణిలో ఆరవ సారి గుర్తింపు సంఘం ఎన్నికలు జరిగి ఆరేండ్లు కావస్తుందని, కాలపరిమితి ముగిసినా కూడా ఒకే యూనియన్ గుర్తింపు కొనసాగడం అన్యాయమని సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ ఏఐటీయూసీ ఉప ప్రధాన కార్యదర్శి మడ్డి ఎల్లాగౌడ్, కేంద్ర కార్యదర్శి కే.స్వామి, బ్రాంచి సహాయ కార్యదర్శి రంగు శ్రీనివాస్ లు పేర్కొన్నారు. గురువారం గోదావరిఖని భాస్కర్ రావు భవన్‌లో జరిగిన ఏఐటియుసి కార్యకర్తల సమావేశంలో వారు పాల్గొని జరగాల్సిన ఎన్నికల గురించి ఏఐటీయూసీ యూనియన్ కోర్టునాశ్రయించవలసిన దుస్థితి ఏర్పడిందని వారు అన్నారు. సింగరేణి లో గుర్తింపు సంఘం ఎన్నికలు నిర్వహించాలని ఎన్నో సార్లు విజ్ఞప్తులు చేసినా యాజమాన్యం ఏదో ఒక కుంటి సాకుతో వాయిదా వేస్తూ అధికార పార్టీ తాబేదార్ల కు లబ్ధి చేకూరేలాగా ప్రవర్తిస్తుందని వారు విమర్శించారు. ఏఐటీయూసీ పట్టుబట్టి చేస్తున్న ప్రయత్నాల వల్ల కదలిక వచ్చి ఈ నెల 11న డిప్యూటీ చీఫ్ లేబర్ కమిషనర్ హైదరాబాద్ వద్ద చర్చలు జరుగగా వెంటనే ఎన్నికల షెడ్యూల్ విడుదల చేయాలని ఏఐటీయూసీ, బి.ఎం.ఎస్ యూనియన్‌లు డిమాండ్ చేసినాయని వారు తెలిపారు. ఈ సమావేశంలో ఏఐటియుసి నాయకులు ఎస్ వెంకట్ రెడ్డి, గౌతం గోవర్దన్, ఎం.ఎ.గౌస్, తాని రాజబాబు, బుర్ర భాస్కర్, పడాల కనకరాజు, కొండ్ర రాజయ్య, లక్ష్మి నారాయణ, మోరే సమ్మయ్య, బూడిద మల్లేశ్, కాలువల జగన్, జైపాల్ రెడ్డి, గట్టయ్య, ఆఫీసు కార్యదర్శి రమేష్‌కుమార్ పాల్గొన్నారు.

యూట్యూబర్స్ అసోసియేషన్ వార్షికోత్సవం



సమావేశంలో మాట్లాడుతున్న నాయకులు

నవతెలంగాణ-పెద్దపల్లి టౌన్: తెలంగాణ యూట్యూబర్స్ అసోసియేషన్ ప్రథమ వార్షికోత్సవ వేడుకలు గురువారం పెద్దపల్లి ప్రెస్‌క్లబ్ లో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మారం తిరుపతి యాదవ్, బత్తుల లక్ష్మయ్య యాదవ్, అమరేందర్, దయానంద్ గాంధీ, మ్యాజిక్ రాజా హాజరయ్యారు. ఈ సందర్భంగా జిల్లాలోని ఒక్కొక్క నియోజకవర్గానికి ఐదుగురు చొప్పున విశిష్ట కళా సేవలు అందించిన కళా నైపుణ్య ప్రతిభ గల యూట్యూబర్లను అసోసియేషన్ నాయకులు సన్మానించారు. ఈ కార్యక్రమంలో పెద్దపల్లి జిల్లా గౌరవ అధ్యక్షులు దామర శంకరయ్య, జిల్లా అధ్యక్షులు కొమ్ము కుమార్ యాదవ్, ప్రధాన కార్యదర్శి కంది సంపత్, కార్యనిర్వాహక అధ్యక్షులు సాదుల శ్రీనివాస్, ముఖ్య సలహాదారులు బుర్ర గడ్డ రవికుమార్ గౌడ్, వ్యవస్థాపక సభ్యులు జి అనిల్ కుమార్, ఎండి బాబా, అట్ల సతీష్ పాల్గొన్నారు.

తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట వారోత్సవాలు



జెండా ఆవిష్కరిస్తున్న సీపీఐ నాయకులు

నవతెలంగాణ ఓదెల: మండల కేంద్రంలో సీపీఐ (ఎం) ఆధ్వర్యంలో తెలం గాణ సాయుధ పోరాట వారోత్సవాలను గురువారం నిర్వహించారు. సీపీఐ మండల కార్యదర్శి కోడం స్వామి ఆధ్వర్యంలో జెండా ఆవిష్కరించి ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 1947 సెప్టెంబర్ 11న రావి నారాయణరెడ్డి, బద్దం ఎల్లారెడ్డి, మొహిద్దిన్ పోరాటాల ఫలితంగానే నిజాం నవాబు పాలన అంతమైందన్నారు. ఈ కార్యక్రమంలో ఆళ్ల శ్రీనివాసరెడ్డి, మండల సహాయ కార్యదర్శి పల్లెగట్టయ్య, జిల్లా కౌన్సిల్ సభ్యులు సూత్రాల స్వామి, ఓదెల గ్రామశాఖ కార్యదర్శి సమ్మెట నాగేందర్, పొత్కపల్లి గ్రామ శాఖ కార్యదర్శి తుమ్మల సదయ్య, హరిపురం గ్రామ శాఖ కార్యదర్శి సమ్మయ్య పాల్గొన్నారు.

ఎస్సీ విద్యార్థులకు బీసీ హాస్టల్లో అడ్మిషన్స్ సౌకర్యం కల్పించాలి

నవ తెలంగాణ-పెద్దపల్లి: ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో చదువుతున్న ఎస్సీ, ఎస్టీ విద్యార్థులకు అదే కళాశాల ప్రాంగణంలో ఉన్న బీసీ హాస్టల్‌లో అడ్మిషన్స్ సౌకర్యం కల్పించాలని ఎస్ఎఫ్ఐ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో జిల్లా కలెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. జిల్లా అదనపు కలెక్టర్‌కు వినతి పత్రం అందజేశారు. అనంతరం ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు జిల్లాల ప్రశాంత్ సీపీఐ రవీందర్లు మాట్లాడుతూ జిల్లా కేంద్రంలో ఎస్సీ కళాశాల హాస్టల్ ఏర్పాటు చేయాలని గత కొన్ని సంవత్సరాలుగా చేస్తున్న పోరాట ఫలితంగా ఎస్సీ కళాశాల హాస్టల్ సాంక్షన్ అయ్యాయని అన్నారు. కానీ ప్రభుత్వ బాలికల కళాశాల హాస్టల్ ప్రారంభించడంలో జిల్లా అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని వెంటనే ఎస్సీ కళాశాల హాస్టల్ ప్రారంభించి దూర ప్రాంత విద్యార్థులకు అకాంటేషన్ కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు విజ్ఞాన్, శ్రీకాంత్, అజయ్, రమ్య, మీనాక్షి, నిహారిక, మానస పాల్గొన్నారు.

ఔట్‌సోర్సింగ్ కార్మికుల సమస్యలపై పోరాటం

నవతెలంగాణ-గోదావరిఖని: ఓట్‌సోర్సింగ్ కార్మికుల సమస్యలపై పోరాటం చేస్తామని తెలంగాణ లేబర్ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు గొర్రె రమేష్ అన్నారు. గురువారం సింగరేణి వివిధ విభాగాలలో పనిచేస్తున్న ఔట్‌సోర్సింగ్ కార్మికులను తిలక్‌నగర్ డౌన్‌లో కలుసుకున్నారు. ఈ సందర్భంగా వాళ్ళు ఎదుర్కొంటున్నటువంటి సమస్యలు తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు అల్లెపు తిరుపతి, చెరుకు పైడి, కన్నం భాను చందర్, సరిగంటు ఓదెలు, వర్మ తదితరులున్నారు.

ఉత్పత్తి లక్ష్యాలపై సమీక్ష సమావేశం

నవతెలంగాణ-యైటింక్లయిన్ కాలనీ: రాబోయే ఆర్థిక సంవత్సరం వరకు సింగరేణిలోని వివిధ గనులు సాధించవల్సిన బొగ్గు ఉత్పత్తి, ఓబీ తొలగింపు లక్ష్యాలను గురువారం ఆర్జీ-2 ఏరియాలో కాన్ఫరెన్స్ హాల్‌లో ఏరియా జనరల్ మేనేజర్ ఎన్వీ సూర్యనారాయణ అధ్యక్షతన సమీక్ష సమావేశం నిర్వహించారు. ఓసీపీ-3 వకీల్‌పల్లి గని ఉత్పత్తి లక్ష్యాలపై జీఎం కార్పొరేట్ కమిటీ కన్వీనర్ జక్కం రమేష్ ఆధ్వర్యంలో కమిటీ సభ్యులు జీఎం ఓసీపీలు డీవీఎస్ సూర్యనారాయణ రాజు, ఏజీఎం ఐఈ బి.రవి, ఏజీఎం మాచారయ్య,మేనేజర్ వినోద్ కుమార్,అడిషనల్ మేనేజర్ దిలీప్ కుమార్ ఏరియా ముఖ్య అధికారులు చర్చించారు. ఈ సమావేశంలో వకీల్‌పల్లి ప్రాజెక్ట్ అధికారి శ్రీనివాస్‌రెడ్డి, ఓసీపీ-3 ప్రాజెక్ట్ అధికారి మదుసుధన్, ఎస్ఓ టు జీఎం అబ్దుల్ సలీం తదితరులు పాల్గొన్నారు.

ఎరడపల్లి పల్లె దవఖానలో కేంద్ర బృందం తనిఖీ

నవతెలంగాణ - శంకరపట్నం



శంకరపట్నం మండలం ఎరడపల్లి గ్రామంలో పల్లె దవఖానాను గురువారం జాతీయ నాణ్యత ప్రమాణాల సూచిక బృందం డాక్టర్ సుశీల్ దేవనీరు చావన్, డాక్టర్ సుస్మిత హల్దార్ తనిఖీ చేశారు. పల్లె దవఖానాలో అందిస్తున్న వైద్య సేవలపై తనిఖీ నిర్వహించి,కే ంద్ర ప్రభుత్వానికి నివేదికలు సమర్పిస్తారని.. దీంతో మరిన్ని సౌకర్యాలు చేకూరుతాయని డీపీఓ తులసి రవీందర్ తెలిపారు. కేంద్ర బృందంతో పాటుగా డిప్యూటీ డీఎంహెచ్ఓ డాక్టర్ చందు, క్వాలిటీ మేనేజర్ సాగర్, హెల్త్ ఎడ్యుకేటర్ పంజాల ప్రతాప్, ఎంపిహెచ్ఈఓ ఎం రామనాథం, మండల వైద్యాధికారి డాక్టర్ వేణుగోపాల్, ఎరడపల్లి డాక్టర్ సురేష్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

అధికార పార్టీకి మాజీ ఎమ్మెల్యే ఆరెపల్లి రాజీనామా..

త్వరలో భవిష్యత్ కార్యాచరణ ప్రకటిస్తాని వెల్లడి

నవతెలంగాణ - కరీంనగర్

మానకొండూరు మాజీ ఎమ్మెల్యే మాజీ ప్రభుత్వ విప్ ఆరెపల్లి మోహన్ అధికార పార్టీకి రాజీనామా చేశారు. బీఆర్ఎస్ పార్టీకి, ప్రాథమిక సభ్యత్వానికి రాజీనామా చేసినట్లు గురువారం కరీంనగర్ ప్రెస్‌భవన్‌లో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. 2019 పార్లమెంట్ ఎన్నికల సందర్భంగా అధికార పార్టీకి చెందిన కరీంనగర్ జిల్లా కేంద్ర సహకార బ్యాంక్ అధ్యక్షుడు కొండూరు రవీందర్‌రావు, పోలీస్ హౌసింగ్ సొసైటీ చైర్మెన్ కోలేటి దామోదర్, అప్పటి పార్లమెంట్ అభ్యర్థి బోయినపల్లి వినోద్ కుమార్ అభ్యర్థన మేరకు తాను బీఆర్ఎస్‌లో చేరినట్లు తెలిపారు. బీఆర్ఎస్ ద్వారా రాష్ట్రం అభివృద్ధి చెందుతుందని, బంగారు తెలంగాణ సహకారం అవుతుందని భావించానని చెప్పారు. తెలంగాణ ఏర్పడి తొమ్మిది సంవత్సరాలు పూర్తయినప్పటికీ అమరవీరుల ఆశయాలు నెరవేరలేదని ఆరోపించారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలలో బీసీలు, దళితులకు పూర్తిగా న్యాయం జరగలేదని చెప్పారు. ప్రజల ఆకాంక్షలు నెరవేర్చడంలో టీఆర్ఎస్ ప్రభుత్వం విఫలమైందని ఆరోపించారు. మానకొండూర్ నియోజకవర్గం కరీంనగర్ జిల్లా అభివృద్ధితో పాటు ప్రజా సమస్యల పరిష్కారం కోసం నిరంతరం పాటుపడాలనే తపనతో ప్రజల గొంతుకగా మారాలనే ఉద్దేశంతో అధికార పార్టీకి రాజీనామా చేయాలనే నిర్ణయానికి వచ్చినట్లు చెప్పారు.



మాట్లాడుతున్న ఆరెపల్లి మోహన్

సుదీర్ఘ ప్రస్థానం...

ఆరెపల్లి మోహన్ విద్యార్థి దశ నుంచే ఎన్ఎస్‌యూఐ నాయకునిగా రాజకీయ ప్రస్థానం ప్రారంభించారు. మానకొండూర్ మేజర్ గ్రామ పంచాయతీ సర్పంచ్‌గా 19 ఏళ్ల పాటు పని చేశారు. అనంతరం తిమ్మాపూర్ జెడ్పీటీసీ సభ్యునిగా ఎన్నికైన ఆయన, జిల్లా పరిషత్ చైర్మెన్‌గా పదవి బాధ్యతలు చేపట్టారు. జెడ్పీ చైర్మెన్‌గా రెండేళ్లు పని చేసిన అనంతరం 2019లో మానకొండూరు శాసనసభ్యులుగా కాంగ్రెస్ నుంచి పోటీ చేసి గెలుపొందారు. అప్పటి ప్రభుత్వంలో విప్‌గా బాధ్యతలు నిర్వహించారు.

పాత పార్టీలోకే..

అధికార పార్టీకి రాజీనామా చేసిన ఆరెపల్లి మోహన్ తిరిగి కాంగ్రెస్‌లో చేరేందుకు ప్రయత్నాలు చేస్తున్నారు. శాసనసభ్యులు శ్రీధర్ బాబు, భట్టి విక్రమార్క, ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి తదితరుల సమక్షంలో ఆయన పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డితో చర్చలు జరిపారు. తొలుత అధికార పార్టీకి రాజీనామా చేసిన తర్వాత కాంగ్రెస్‌లో చేరిక విషయం మాట్లాడుకోవాలని వారు ఓ నిర్ణయానికి వచ్చారు.

15 రోజుల క్రితమే...

అధికార పార్టీ టికెట్ల కేటాయింపు ప్రక్రియ పూర్తయిన వెంటనే ఆరేపల్లి మోహన్ ఆ పార్టీకి రాజీనామా చేయాలని నిర్ణయానికి వచ్చారు. మానకొండూర్ నియోజకవర్గానికి సంబంధించి తన మిత్రులు, శ్రేయోభిలాషులతో ఆయన సుదీర్ఘ చర్చలు జరిపారు. అనంతరం 15 రోజుల క్రితం అధికార పార్టీకి రాజీనామా చేయాలనే ఉద్దేశంతో పత్రికా విలేకరుల సమావేశం నిర్వహించాలని నిర్ణయించారు. విషయం తెలిసిన వెంటనే బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు జీవి రామకృష్ణారావు, ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు బోయినపల్లి వినోద్ కుమార్ ఆరేపల్లి మోహన్‌కు ఫోన్ చేసి ఆయనను బుజ్జగించారు. దీంతో తాత్కాలికంగా రాజీనామా నిర్ణయాన్ని వాయిదా వేసుకున్న ఆయన, బీఆర్ఎస్‌లో కొనసాగడం వల్ల ఉపయోగం లేదని భావించి, తిరిగి పాత పార్టీలోకి వెళ్లాలనే నిర్ణయానికి వచ్చినట్లు సమాచారం.

కిచెన్‌షెడ్‌ను పరిశీలించిన ఎంపీపీ



నవతెలంగాణ - రామడుగు

మండలంలోని గోపాలరావుపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మన ఊరు - మనబడి కార్యక్రమంలో భాగంగా నిర్మించిన కిచెన్ షెడ్డును ఎంపీపీ కలిగేటి కవిత గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా సదరు కాంట్రాక్టర్ నిధులు వెచ్చించి నిర్మాణం పూర్తి చేసినా బిల్లులు రాలేదని ఎంపీపీ ముందు ఆవేదన వ్యక్తం చేశారు. వెంటనే ఎంపీపీ సంబంధిత ఇంజనీరింగ్ అధికారులకు ఫోన్ చేసి మాట్లాడారు. వారం రోజుల్లో బిల్లులు చెల్లిస్తామని పంచాయతీరాజ్ ఈఈ శ్రీనివాసరావు హామీ ఇచ్చినట్లు ఆమె తెలిపారు. ఆమె వెంట ఎంపీటీసీల ఫోరం మండల అధ్యక్షుడు ఎడవెల్లి నరేందర్‌రెడ్డి, పాఠశాల ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయుడు ప్రకాష్, ఎస్ఎంసి చైర్మన్ బుర్ర సాయిలుగౌడ్ ఉన్నారు.

రెండు వైన్ షాప్‌లలో చోరీ



ఇల్లందకుంట : వైన్ షాప్‌లో ఆధారాలు సేకరిస్తున్న రూరల్ సీఐ

నవతెలంగాణ - ఇల్లందకుంట

ఇల్లందకుంట మండల కేంద్రంలో సిరిసేడు ప్రధాన రహదారిలో ఉన్న మారుతి వైన్స్, సాయినాథ్ వైన్స్‌లో బుధవారం అర్ధరాత్రి దాటిన తరువాత చోరీ జరిగింది. వెనుక వైపు ఉన్న తలుపులను పగలగొట్టి దొంగతనానికి పాల్పడ్డారని షాపుల యజమానులు తెలిపారు. మారుతి వైన్స్‌లో రూ.55వేలు, సాయినాథ్ వైన్స్‌లో 26వేలు దొంగిలించారని యజమానులు పురెళ్ళ రాకేష్, గాండ్ల సంపత్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. జమ్మికుంట రూరల్ సీఐ కిషోర్ పరిశీలించి కేసు నమోదు చేశారు. క్లూస్‌టీంతో ఆధారాలు సేకరించి దర్యాప్తు చేస్తున్నట్టు చెప్పారు.

జమ్మికుంట మండలం కొత్తపెల్లిలో

నవతెలంగాణ - జమ్మికుంట

జమ్మికుంట మున్సిపల్ పరిధి కొత్తపెల్లి గ్రామంలోని సిరి వైన్స్‌లో గురువారం ఉదయం రెండు గంటలకు చోరీజరిగింది. నిర్వాహకులు, పోలీసుల కథనం మేరకు.. దుండగులు షాపు వెనుకాల ఉన్న కిటికీని పగలగొట్టి లోపలికి వెళ్లి షాపులోని విలువైన మద్యం బాటిళ్లు, నగదును ఎత్తుకెళ్లారు. షాపు యజమాని ఫిర్యాదు మేరకు సీసీ కెమెరాలు పరిశీలించి విచారణ చేపట్టినట్లు పట్టణ సీఐ బర్పాటి రమేష్ తెలిపారు. ఒకే రోజు ఇల్లంతకుంట జమ్మికుంట వైన్ షాపులలో గుర్తుతెలియని దుండగులు దొంగతనం చేయడం పట్ల పట్టణవాసులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

కోతుల దాడిలో అంగన్వాడీ టీచర్‌కు గాయాలు

నవతెలంగాణ - సైదాపూర్



108 వాహనంలో అంగన్వాడి టీచర్

మండలంలోని వెన్నంపల్లి జిల్లా పరిషత్ పాఠశాల ఆవరణలో అంగన్వాడీ టీచర్ గుంటి తిరుపతమ్మపై గురువారం కోతులు దాడిచేశాయి. ఆమెకు చేయి విరగ్గా పాఠశాల ఉపాధ్యాయులు 108 ద్వారా చికిత్స నిమిత్తం హుజురాబాద్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. పాఠశాల ఆవరణలో కోతుల బెడద ఎక్కువగా ఉండడంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని పాఠశాల ప్రధానోపాధ్యాయుడు శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు.

మేనేని రోహిత్‌రావుకు తప్పిన ప్రమాదం

నవతెలంగాణ - కరీంనగర్

టీపీసీసీ రాష్ట్ర అధికార ప్రతినిధి, కరీంనగర్ నియోజకవర్గ నాయకుడు మేనేని రోహిత్‌రావుకు పెను ప్రమాదం తప్పింది. హైదరాబాద్‌లోని గాంధీభవన్‌లో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ వైఖరి చార్జిషీట్‌పై టీపీసీసీ కార్యవర్గం నిర్వహించిన సమావేశంలో పాల్గొని కరీంనగర్‌కి తిరుగి వస్తుండగా తూంకుంటలో రోహిత్ రావు వాహనానికి ఒక ఆవు ఎదురుగా వచ్చి ఢీ కొట్టింది. దీంతో వాహనం ముందు భాగం ధ్వంసమైంది. ఈ ప్రమాదంలో రోహిత్ రావు స్వల్ప గాయాలతో బయటపడ్డారు. రోహిత్ రావు మాట్లాడుతూ.. తను ఆరోగ్యంగానే విశ్రాంతి తీసుకుంటున్నాని తెలిపారు.

ఇక నా ఫోకస్ కరీంనగర్ పార్లమెంట్ పైనే..

-బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, ఎంపీ బండి సంజయ్ కుమార్

నవతెలంగాణ - కరీంనగర్



మాట్లాడుతున్న బండి సంజయ్

ఇకపై కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గంపైనే ప్రత్యేక దీష్టి సారిస్తున్నట్లు బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, ఎంపీ బండి సంజయ్ కుమార్ చెప్పారు. అందులో భాగంగానే ఎక్కువ సమయం ఈ నియోజకవర్గానికే కేటాయిస్తున్నట్లు చెప్పారు. వచ్చే ఎన్నికల్లో బీజేపీ దమ్ము చూపిద్దామని, పార్లమెంట్ నియోజకవర్గంలోని 7 అసెంబ్లీ స్థానాలను గెలుచుకుంటామని అన్నారు. గురువారం కరీంనగర్‌లోని స్థానిక ఈఎస్ ఫంక్షన్ హాలులో బీజేపీ కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గం పరిధిలోని నేతలతో సంస్థాగత బలోపేతంపై సమావేశం నిర్వహించారు. మండలాధ్యక్షులు, జిల్లా ఆఫీస్ బేరర్స్, జిల్లా ఇన్‌చార్జీలు హాజరయ్యారు. మాజీ ఎమ్మెల్యేలు సుద్దాల దేవయ్య, బొడిగె శోభ, జిల్లా ఇన్‌చార్జి మీసాల చంద్రయ్య, మోహన్ రెడ్డి, రాష్ట్ర కార్యదర్శి పాపారావు, జిల్లా అధ్యక్షులు గంగాడి కర్ణృష్ణారెడ్డి, పార్లమెంట్ కన్వీనర్ బోయినిపల్లి ప్రవీణ్ రావు, బొమ్మ శ్రీరాం, ఎర్రం మహేశ్ తదితరులు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఈ నెల 17న తెలంగాణ విమోచన దినోత్సవంతో పాటు నరేంద్రమోదీ పుట్టిన రోజును పురస్కరించుకుని పార్టీ తరపున చేపట్టాల్సిన కార్యక్రమాలతో పాటు త్వరలో చేపట్టబోయే బస్ యాత్ర లాంటి అంశాలపై చర్చించారు. అనంతరం బండి సంజయ్ మాట్లాడుతూ.. పార్టీ రాష్ట్ర అధ్యక్షుడిగా ఉంటూ రాష్ట్రమంతా తిరగాల్సి రావడంతో కరీంనగర్ పార్లమెంట్‌కు ఎక్కువ సమయం కేటాయించలేకపోయిన, ఇక ఇప్పుడు ఏమీ పనిలేదు, తాను ఇక కరీంనగర్ పార్లమెంట్ పరిధిలోనే ఉంటా, బీజేపీ దమ్మేందో చూపిస్తా, ఎక్కువ సమయం పార్లమెంట్‌కే ఇస్తా, పార్టీ ఆదేశిస్తే కరీంనగర్‌తో పాటు ఎక్కడైనా పోటీ చేస్తా అన్నారు. ఇక నుంచి మీరంతా టైమివ్వాలి, డబ్బు ఎన్నటికీ శాశ్వతం కాదు.. డబ్బులకు ఆశపడితే జనం మనసులను గెలవలేరని అన్నారు. బ్లాక్ మెయిల్ చేసే రాజకీయాలను వెరవను, త్యాగాలను వెనుకాడని జిల్లా ఇది అన్నారు. జమిలి ఎన్నికలొస్తాయా, అసెంబ్లీ ఎన్నికలొస్తాయా అనే దానిపై సంబంధం లేకుండా నిరంతరం ప్రజల్లో ఉండాలన్నారు. ఇప్పుడు అధ్యక్ష పదవి లేదు కాబట్టి రాబోయే ఎన్నికల్లో గెలిచి కరీంనగర్ ప్రజల రుణం తీర్చుకుంటానన్నారు. కరీంనగర్ పార్లమెంట్ పరిధిలోని 7 అసెంబ్లీ స్థానాలను బీజేపీ గెల్చుకోవాలి ఎందుకంటే బీఆర్ఎస్ పట్ల తీవ్రమైన వ్యతిరేకత నెలకొందని, కాంగ్రెస్ ఊసే లేదన్నారు. ఇక్కడి బీఆర్ఎస్ ఎమ్మెల్యే ఎంఐఎం నాయకులను తీసుకెళ్లి అసదుద్దీన్ ఒవైసీని కలిశారు, ఇట్లాంటోళ్లనా గెలిపించేది ప్రజలంతా ఆలోచించాలని కోరారు. 7న విశ్వకర్మ జయంతి సందర్భంగా ప్రతి అసెంబ్లీ నియోజకవర్గంలో పెద్దఎత్తున ఫ్లెక్సీలు ఏర్పాటు చేయాలని, కేంద్రం విశ్వకర్మలకు ప్రకటించిన ప్యాకేజీని జనంలోకి తీసుకెళ్లాలని తెలిపారు.

అంగన్వాడీ ఉద్యోగుల పట్ల ప్రభుత్వ వేధింపులు ఆపాలి

ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి టేకుమల్ల సమ్మయ్య

నవతెలంగాణ - కరీంనగర్



మాట్లాడుతున్న ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి టేకుమల్ల సమ్మయ్య

అంగన్వాడీల సమ్మె పట్ల రాష్ట్ర ప్రభుత్వ వేధింపులు వెంటనే ఆపివేసి సమస్యల పరిష్కారానికి మార్గం చూడాలని ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి టేకుమల్ల సమ్మయ్య ప్రభుత్వానికి హితవు పలికారు. రాష్ట్ర వ్యాప్త అంగన్వాడీల సమ్మెలో భాగంగా గురువారం కలెక్టర్ కార్యాలయం నుంచి జిల్లా సంక్షేమ అధికారి కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించి ముట్టడించారు. ఈ సందర్భంగా సమ్మయ్య మాట్లాడుతూ.. రాష్ట్ర వ్యాప్తంగా 60 వేల మంది అంగన్వాడీ ఉద్యోగులు సమ్మె చేస్తుంటే ప్రభుత్వం స్పందించి చర్చలు జరిపి సమస్యలు పరిష్కరించాల్సింది పోయి అంగన్వాడీల ఆత్మగౌరవాన్ని దెబ్బతీసేలా బిల్వో డ్యూటీలు చేయాలనడం, వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొనాలని ఫోన్ వేధింపులు చేస్తున్నారని ఆరోపించారు. ప్రజాస్వామ్య పద్ధతుల్లో శాంతియుత వాతావరణంలో అంగన్వాడీ ప్రతినిధులు, యూనియన్ నాయకులతో చర్చలు జరిపి సమస్యలను పరిష్కరించి వారిని వెంటనే పర్మినెంట్ చేయాలని, ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బీకేఎంయూ రాష్ట్ర కార్యదర్శి కొయ్యడ సృజన్ కుమార్, తెలంగాణ అంగన్వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఎ.రజిత, డి.రజిత, నాయకులు భారతి, అరుణ, అనురాధ, విజయ, శారద, అంజలి, కరుణ, శైలజ, కవిత, పద్మ, సంధ్య తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా హిందీ భాషా దినోత్సవం

నవతెలంగాణ - చొప్పదండి



చొప్పదండి మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో జాతీయ భాష హిందీ భాషా దినోత్సవాన్ని ప్రిన్సిపాల్ ఎ.శరత్‌బాబు అధ్యక్షతన హిందీ ఉపన్యాసకులు ఎల్.కనకయ్య ఆధ్వర్యంలో గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ పాఠశాల స్థాయి నుండి విద్యార్థులకు హిందీ భాషా పట్ల మక్కువ ఏర్పడే విధంగా ఉపాధ్యాయులు కృషి చేయాలన్నారు. కళాశాలలో హిందీలో ఎక్కువ మార్కులు సాధించిన విద్యార్థులకు నగదు పారితోషికం అందజేశారు. అంతకుముందు విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో కళాశాల ఉపన్యాసకులు ఎ.లక్ష్మణ్ కుమార్, ఎ.శ్రీనివాస్, డి.రాజశేఖర్, డి.మనోహరస్వామి, జె.రాజేందర్‌రెడ్డి, ఎ.ఐలయ్య, ఎ.శ్రీనివాస్, కొండయ్య, కే.రాజమౌళి, ఎన్ఎస్ఎస్ యూనిట్ బాధ్యులు కే.సబితారాణి పాల్గొన్నారు.

అచీవర్స్ పాఠశాలలో

నవతెలంగాణ - కరీంనగర్



స్థానిక కోతిరాంపూర్‌లోని అచీవర్స్ యాక్టివ్ పాఠశాలలో హిందీ దివస్ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థినీ విద్యార్థులు హిందీలో తమ భాషా నైపుణ్యాన్ని పాటలు, నాటికల ద్వారా వ్యక్తపరిచారు. అనంతరం పాఠశాల డైరెక్టర్ సీహెచ్.వెంకటేశ్వర్లు మాట్లాడుతూ.. హిందీ భాష గొప్పతనాన్ని వివరించారు. పాఠశాల ప్రిన్సిపాల్ సీహెచ్.పల్లవి మాట్లాడుతూ.. హిందీ భాష ఆవశ్యకత తెలిపి జాతీయ భాషగా ప్రతి ఒక్కరూ నేర్చుకొని మాట్లాడాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో పాఠశాల సిబ్బంది, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

మానేరులో..



కరీంనగర్‌లోని మానేరు విద్యా సంస్థలలో గురువారం హిందీ భాషా దినోత్సవం ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు దేశంలోని అన్ని రాష్ట్రాలకు చెందిన సంస్కృతి, సంప్రదాయాలు, కట్టుబొట్టులను వేషధారణల ద్వారా అద్భుతంగా ప్రదర్శన చేశారు. ఈ సందర్భంగా పాఠశాలలలోని విద్యార్థులకు వ్యాసరచన, డ్రాయింగ్ పోటీలను నిర్వహించారు. కార్యక్రమంలో మానేరు విద్యాసంస్థల చైర్మెన్ కడారి అనంతరెడ్డి, డైరెక్టర్ కడారి సునీతారెడ్డి, ప్రిన్సిపాల్స్, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

అర్విన్‌ట్రీ పాఠశాలలో..



నగరంలోని అర్విన్‌ట్రీ పాఠశాలలో హిందీ దివస్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. పాఠశాలల చైర్మెన్ బి.రమణరావు, డైరెక్టర్ బి.విజయలక్ష్మి పాల్గొని హిందీ భాష గొప్పదనాన్ని వివరించారు. విద్యార్థులు ప్రదర్శించిన హిందీ నాటికలు, పద్యాలు, ఉపన్యాసాలు ఎంతగానో ఆకట్టుకున్నాయి. అనంతరం రమణరావు మాట్లాడుతూ.. విద్యార్థులంతా హిందీ భాషను నేర్చుకోవాలని అన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

మైనార్టీల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

ఎమ్మెల్యే రసమయి బాలకిషన్



కుట్టుమిషన్లు అందజేస్తున్న ఎమ్మెల్యే రసమయి బాలకిషన్

నవతెలంగాణ - తిమ్మాపూర్ : మైనార్టీల అభివృద్ధి, సంక్షేమమే తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమని మానకొండూరు ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ అన్నారు. తిమ్మాపూర్ మండలంలోని మహాత్మనగర్ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో నియోజకవర్గ స్థాయి లబ్దిదారులకు 100 కుట్టుమిషన్లను బీఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు జీవి.రామకృష్ణారావుతో కలసి ఎమ్మెల్యే పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ మైనార్టీల అభివృద్ధి సంక్షేమ కోసం సీఎం కేసీఆర్ అనేక సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టారని, ఏ రాష్ట్రంలో లేని విధంగా తెలంగాణ రాష్ట్రంలో మైనార్టీలకు పెద్దపీట వేస్తున్నారని అన్నారు. మైనార్టీ స్కూల్ గాని, షాదీ ముబారక్ లాంటి అనేక పథకాలను ప్రవేశపెట్టారని తెలిపారు. లబ్దిదారులు మాట్లాడుతూ మైనార్టీల అభివద్ధి కోసం సీఎం కేసీఆర్ కషి చేస్తున్నారని, ఎల్లవేళలా రుణపడి ఉంటామని హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో సిరిసిల్ల జెడ్పీ వైస్ చైర్మన్ సిద్ధం వేణు, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు కేతిరెడ్డి దేవేందర్‌రెడ్డి, మండల అధ్యక్షుడు రావుల రమేష్, అత్మ కమిటీ చైర్మెన్ పాశం అశోక్‌రెడ్డి, జెడ్పీటీసీ శేఖర్‌గౌడ్, ప్రజాప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు.

ఎస్‌జీటీల బదిలీలు మ్యానువల్‌గా చేపట్టాలి

ఎస్‌జీటీ ఫోరం రాష్ట్ర అధ్యక్షుడు అనిల్ కుమార్‌రెడ్డి

నవతెలంగాణ - చొప్పదండి : తెలంగాణ రాష్ట్రంలో ఎస్‌జీటీ ఉపాధ్యాయ బదిలీలను మ్యానువల్ పద్ధతిలో జరపాలని తెలంగాణ రాష్ట్ర ఎస్‌జీటీ ఫోరం రాష్ట్ర అధ్యక్షుడు ఆలుమల్ల అనిల్ కుమార్‌రెడ్డి అన్నారు. గురువారం విలేకరులతో మాట్లాడుతూ అక్రమాలు జరగకుండా, పోస్టులు బ్లాక్ చేయ కుండా మ్యానువల్‌గా ఉపాధ్యాయులను కౌన్సెలింగ్‌కు పిలిచి సీనియార్టీ ఆధా రంగా, పాఠశాలకు ఆన్లైన్లో అప్పటికప్పుడు బదిలీల ఉత్తర్వులు ఇవ్వాలన్నారు.

ఓటర్లకు అవగాహనా కార్యక్రమం



నవతెలంగాణ - హుజురాబాద్ : పట్టణంలో మున్సిపల్ చైర్ పర్సన్ గందె రాధిక ఆధ్వర్యంలో గురువారం ప్రజలకు ఓటరు అవగాహనా కార్యక్రమం నిర్వహించారు. పురపాలక సంఘ కౌన్సిల్ సభ్యులు, సిబ్బంది, మెప్మా ఆర్పీలు, పట్టణ ప్రజలు పురపాలక సంఘ కార్యాలయం నుండి స్థానిక అంబేద్కర్ చౌరస్తా వరకు ఓటరు అవగాహనా ర్యాలీ నిర్వహించి ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ సల్వాది సమ్మయ్య, వార్డు సభ్యులు, పురపాలక సంఘ సిబ్బంది, మెప్మా ఆర్పీలు, పారిశుధ్య సిబ్బంది పాల్గొన్నారు.

పోషన్ అభియాన్ కార్యక్రమం

నవతెలంగాణ - సైదాపూర్ : గర్భిణులు, బాలింతలు, చిన్నారుల ఆరోగ్యంపై రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందని ఇన్‌చార్జి సర్పంచ్ ఓదేలు అన్నారు. సైదాపూర్ మండలంలోని బొమ్మకల్ అంగన్వాడీ కేంద్రంలో గురువారం పోషన్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా గర్భిణులకు సీమంతం, చిన్నారులకు అక్షరాభ్యాసం అన్నప్రాసన చేశారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్వైజర్ జ్యోతి, వార్డు సభ్యులు, ఏఎన్ఎం సునీత, అంగన్వాడీ టీచర్స్ అరుణ, కాంత, నిర్మల పాల్గొన్నారు.

బదిలీలు పారదర్శకంగా చేపట్టాలి

నవతెలంగాణ - వీణవంక : ఉపాధ్యాయుల బదిలీలు, ప్రమోషన్లు పారదర్శకంగా నిర్వహించాలని తపస్ జిల్లా ప్రధాన కార్యదర్శి గాన్నమనేని రంగారావు డిమాండ్ చేశారు. తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం(తపస్) ఆధ్వర్యంలో మండలంలోని పలు పాఠశాలలలో గురువారం సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని చేపట్టారు. కార్యక్రమంలో బాధ్యులు పోలు సత్యనారాయణ, కట్కోజ్వల రవి కిరణ్, పోలాడి సత్యనారాయణ రావు, ఓదెల శివకుమార్ పాల్గొన్నారు.

వైద్య విద్యార్థికి సన్మానం



నవతెలంగాణ - తిమ్మాపూర్ : మండలంలోని మన్నెంపల్లి గ్రామానికి చెందిన కామెర వినయ్ మహబూబాబాద్‌లోని ప్రభుత్వ మెడికల్ కళాశాలలో ఎంబిబిఎస్ ప్రవేశం పొందిన సందర్భంగా నేతకాని మహార్ సంక్షేమ సంఘం తిమ్మాపూర్ మండల కమిటీ అధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో నేతకాని మండ ల అధ్యక్షుడు దుర్గం అశోక్, ఉపాధ్యక్షులు గోదరి రవి, జేజేల సంపత్, ప్రధాన కార్యదర్శి కామెర సంపత్, సంయుక్త కార్యదర్శి గోదరి సంతోష్, సభ్యులు అక్కేపల్లి కొమురయ్య, కామెర రాజ్ కుమార్, మీడియా సెల్ పాములగారి రాజ్ కుమార్, అంబేద్కర్ సంఘం అధ్యక్షుడు కామెర రవి పాల్గొన్నారు.

'పెన్షన్ ఒకటో తేదీన జమ చేయాలి'

నవతెలంగాణ - జమ్మికుంట : పెన్షనర్లు అందరికీ ప్రతి నెల ఒకటవ తేదీన వారి బ్యాంకు ఖాతాలో పెన్షన్ డబ్బులు జమ చేయాలని పెన్షనర్ల సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు చందుపట్ల జనార్ధన్ అన్నారు. గురువారం పట్టణంలోని చాణిక్య డిగ్రీ, పీజీ కళాశాలలో ఎస్‌టీఓ జమ్మికుంట పరిధిలోని పెన్షనర్ల టిపిపిఆర్పిఎ కార్యవర్గ సమావేశం గరిగ చంద్రయ్య అధ్యక్షతన నిర్వహించారు. చందుపట్ల జనార్ధన్, ప్రధాన కార్యదర్శి కట్ట నాగభూషణాచారి మాట్లాడారు. జులై ఒకటవ తేదీ నుండి కొత్త పీఆర్సీ ఏర్పాటు చేసి, ఐఆర్ ఇవ్వాలని కోరారు. సకాలంలో మెడికల్ రీయంబర్స్‌మెంట్ ఒదే విధంగా చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పై అంశాలపై కార్యవర్గ సభ్యులు చర్చించి ఏకగ్రీవంగా ఆమోదించి తీర్మానించినట్లు తెలిపారు. సభ్యులు మామిడోజు సత్యనారాయణ, రామచంద్రం, ఈశ్వరయ్య, సుధాకర్, దేవయ్య, సారభద్ర స్వామి, రాజయ్య, తదితరులు ఉన్నారు.

విశ్వకర్మ ఉత్సవాలకు తరలిరండి

నవతెలంగాణ - తిమ్మాపూర్ : కరీంనగర్ పట్టణంలో కమాన్ చౌరస్తాలోని వీరబ్రహ్మేంద్ర స్వామి ఆలయంలో 15 నుండి 17 వరకు జరిగే విశ్వకర్మ బ్రహ్మోత్సవాలకు ప్రతి ఒక్కరూ హాజరుకావాలని రామక్రిష్ణకాలనీ విశ్వబ్రాహ్మణ సంఘం ప్రతినిధులు కోరారు. గురువారం రామక్రిష్ణకాలనీలో జరిగిన సమావేశంలో కరపత్రాలను పంపిణీ చేసారు. కార్యక్రమంలో గ్రామ ఉపసర్పంచ్ గుజ్జుల ప్రణీత్‌రెడ్డి, సంఘం అధ్యక్షుడు పాలోజు నాగభూషణం, ప్రధాన కార్యదర్శి శ్రీరామోజు పెద్దశ్రీనివాస్, ఎదులాపురం రవీంద్రాచారి, వేములవాడ నర్సింహచారి, సుగుర్తి బ్రహ్మచారి, తెలుకుంట్ల రాము, శ్రీరామోజు కమలాకర్, పెందోట అనంతచారి, కర్ణకంటి శ్రీనివాస్, వేములవాడ శ్రీనివాస్, అలవాల రాజయ్య పాల్గొన్నారు.

బీజేపీ నాయకుల నిరసన

నవతెలంగాణ - గంగాధర : బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి అరెస్టుకు నిరసనగా గంగాధర మండలం మధురానగర్ చౌరస్తాలో ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలు నిరసన తెలిపారు. కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు కోల అశోక్, నాయకులు ఎడవల్లి శశిధర్‌రెడ్డి, మల్యాల వినయ్‌సాగర్, మిట్ట మధు, శ్రీపతి రాజేంద్రప్రసాద్, సుద్దాల రవీందర్‌రెడ్డి, గుండెలి మల్లేశం, దాసరి అంజనేయులు, తాళ్ల రాజశేఖర్, మారుతి, రోడ్ల అనిల్‌రెడ్డి పాల్గొన్నారు.

నవతెలంగాణ - శంకరపట్నం : బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు జి.కిషన్‌రెడ్డి ఇందిరాపార్క్ వద్ద చేపట్టిన ఉపవాస దీక్షను పోలీసులు భగ్నం చేసి నాయకులను అరెస్టు చేయడాన్ని ఖండిస్తూ గురువారం ఆ పార్టీ మండల అధ్యక్షుడు ఏనుగుల అనిల్ ఆధ్వర్యంలో కరీంనగర్ - వరంగల్ జాతీయ రహదారిపై రాస్తారోకో చేశారు. కార్యక్రమంలో నాయకులు జంగా జైపాల్, దాసరపు నరేందర్, ఎలకపల్లి సంపత్, కొయ్యడ అశోక్, సుధగోని శ్రీనివాస్, జూనపట్ల రాజిరెడ్డి, పలకల రాజిరెడ్డి, గొల్లిపెల్లి శ్రీనివాస్, గౌరవేణి శ్రీనివాస్, కనకం సాగర్, బిజిలి సారయ్య, చుక్కల శ్రీకాంత్, శివారెడ్డి, సాయి, సంపత్, తదితరులు పాల్గొన్నారు.



5,571 పీఎస్‌హెచ్‌ఎం పోస్టులను మంజూరు చేయాలి

- ఎస్జీటీయూ రాష్ట్ర కమిటీ డిమాండ్

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలో 5,571 ప్రాథమిక పాఠశాలల ప్రధానోపాధ్యాయులు (పీఎస్‌హెచ్‌ఎం) పోస్టులను మంజూరు చేసి ప్రస్తుత పదోన్నతులతోపాటు భర్తీ చేయాలని సెకండరీ గ్రేడ్ ఉపాధ్యాయ సంఘం (ఎస్జీటీయూ) రాష్ట్ర కమిటీ డిమాండ్ చేసింది. గురువారం హైదరాబాద్‌లో ఆ సంఘం రాష్ట్ర కమిటీ సమావేశాన్ని నిర్వహించారు. అనంతరం ఎస్జీటీయూ రాష్ట్ర అధ్యక్షులు కరివేద మహిపాల్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి అరికెల వెంకటేశం ఒక ప్రకటన విడుదల చేశారు. 317 జీవో బాధితులకు న్యాయం చేయాలని కోరారు. పండితుల అప్‌గ్రేడేషన్‌కు సంబంధించి కోర్టు తీర్పును వెలువరించి అర్హత గల ఎస్జీటీలకు అవకాశం కల్పించాలని సూచించారు. సీపీఎస్ విధానాన్ని రద్దు చేయాలని పేర్కొన్నారు. 13 జిల్లాల ఎస్జీటీ స్పౌజ్‌లకు ఒకే జిల్లాలో పోస్టింగ్ ఇవ్వాలని తెలిపారు. పాఠశాలల్లో స్వచ్ఛ కార్మికులను నియమించాలని డిమాండ్ చేశారు. పీఆర్సీలో ఎస్జీటీలకు, ఎస్ఏలకు మధ్య వేతన వ్యత్యాసాన్ని తగ్గించాలని పేర్కొన్నారు.

బీజేపీ బైకు ర్యాలీ

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

సికింద్రాబాద్ లోని పరేడ్ గ్రౌండ్స్‌లో సెప్టెంబర్ 17న జరగనున్న విమోచన దినోత్సవాల్లో భాగంగా శుక్రవారం బైకు ర్యాలీ నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమంలో కేంద్ర మంత్రి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు జి. కిషన్ రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించనున్నారు. సికింద్రాబాద్ పరేడ్ గ్రౌండ్స్ నుంచి పరకాల సమీపంలోని అమరధామం వరకు చేపట్టనున్నట్టు ఆ పార్టీ నేతలు తెలిపారు. 17న జరిగే సభకు కేంద్ర హోంశాఖమంత్రి అమిత్ షా హాజరవుతున్నట్టు పేర్కొన్నారు.

మహిళా బిల్లుపై ఉద్యమిస్తారనే భయంతోనే..

- కవితకు ఈడీ మళ్లీ నోటీసులు : తెలంగాణ ఫుడ్స్ చైర్మెన్ మేడే రాజీవ్‌సాగర్

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

పార్లమెంటులో మహిళా బిల్లు గురించి ఉద్యమిస్తారనే భయంతోనే బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవితపైకి కేంద్ర ప్రభుత్వం ఈడీని ప్రయోగిస్తున్నదని తెలంగాణ ఫుడ్స్ చైర్మెన్ మేడే రాజీవ్‌సాగర్ విమర్శించారు. ఇప్పటికే రెండు సార్లు క్లీన్ చిట్ వచ్చిన తర్వాత తిరిగి నోటీసులివ్వడంపై ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రత్యేక పార్లమెంటు సమావేశాల నుంచి ప్రజల దృష్టి మళ్లించేందుకే ఇలాంటి ప్రయత్నాలని ఆయన దుయ్యబట్టారు. కోడి గుడ్డు మీద ఈకలు పీకినట్టు అనవసరమైన విషయంలో కవితను తీవ్ర ఇబ్బందులకు గురి చేస్తున్నారని ఆయన విమర్శించారు.

మహిళా రిజర్వేషన్‌పై కాంగ్రెస్ పార్టీ వైఖరేంటి?

మహిళా రిజర్వేషన్‌పై కాంగ్రెస్‌పార్టీ వైఖరి ఎంటో తెలుపాలని తెలంగాణ ఫుడ్స్ చైర్మెన్ మేడే రాజీవ్ సాగర్ గురువారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. ఆ తర్వాతనే తెలంగాణలో సోనియా, రాహుల్‌గాంధీలు అడుగుపెట్టాలని డిమాండ్ చేశారు. తెలంగాణ ప్రజలకు ఆ పార్టీ ఇచ్చే దొంగ డిక్లరేషన్లు కాదని మహిళ రిజర్వేషన్‌పై క్లారిటీ కావాలని పేర్కొన్నారు. పార్లమెంట్ సమావేశాల్లో మహిళా రిజర్వేషన్ బిల్లు కోసం కేంద్రంపై ఎందుకు ఒత్తిడి తీసుకు రావటం లేదని ప్రశ్నించారు.

విన్నవించినా పట్టించుకోవడం లేదు

- సమస్యలను పరిష్కరించడం లేదు
- సెప్టెంబర్ 21 నుంచి 27 వరకు
- రాష్ట్రవ్యాప్తంగా నిరసన ప్రదర్శనలు : టీవీవీపీ ఎంప్లాయిస్ జేఏసీ



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

సమస్యలను పరిష్కరించాలని ఎన్నిసార్లు విన్నవించుకున్నా సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదని తెలంగాణ వైద్య విధాన పరిషత్ ఎంప్లాయిస్ జేఏసీ (టీవీవీపీ జేఏసీ) అసంతృప్తి వ్యక్తం చేసింది. ఈ మేరకు జేఏసీ ముఖ్య సలహాదారు డాక్టర్ టి.వినయ్ కుమార్, చైర్మెన్ డాక్టర్ ఎం.కె.రవూఫ్, కన్వీనర్ ఎస్.సోమమల్లయ్య, కో చైర్మెన్ సత్యనారాయణరెడ్డి (ఏఐటీయూసీ), బైరపాక శ్రీనివాస్ (సీఐటీయూ) తదితరులు వైద్యారోగ్యశాఖ వైద్యారోగ్యశాఖ కార్యదర్శి రిజ్వీకి లేఖను అందజేశారు. తమ వద్ద ప్రత్యామ్నామేది లేదనీ, డిమాండ్ల పరిష్కారం కోసం తక్షణం పోరాటమార్గాన్ని ఎంచుకుంటున్నామని స్పష్టం చేశారు. సెప్టెంబర్ 21 నుంచి 27 వరకు రాష్ట్రవ్యాప్తంగా అన్ని టీవీవీపీ ఆస్పత్రుల్లో నిరసన ప్రదర్శనలు చేస్తామనీ, అదే విధంగా అక్టోబర్ 10న హైదరాబాద్‌లోని టీవీవీపీ కమీషనర్ కార్యాలయం ముందు ధర్నా నిర్వహిస్తామని తెలిపారు. వైద్య విధాన పరిషత్‌ను వెంటనే రద్దు చేసి డైరెక్టర్ ఆఫ్ సెకండరీ హెల్త్ సర్వీసెస్‌గా మార్చాలనీ, ఉద్యోగులకు 010 పద్దు కింద ట్రెజరీ ద్వారా జీతాలివ్వాలని డిమాండ్ చేశారు. మెడికల్ కాలేజీలుగా అప్‌గ్రేడ్ చేసిన టీవీవీపీ వైద్యశాలల్లోని ప్రమోషన్ పోస్టులను యధావిధిగా ఉంచి ప్రమోషన్స్ ఇవ్వాలని కోరారు. అవసరమున్న పోస్టులను క్రియేట్ చేస్తూ స్టాఫ్ రిస్ట్రక్చర్ చేయాలి. కాంట్రాక్టు ఉద్యోగులందరిని రెగ్యులరైజ్ చేయాలి. టీవీవీపీ ఉద్యోగులు డీఎంఈలో అబ్జార్బ్ కావడానికి ఆప్షన్ ఇవ్వాలి. 317 జీవో అమలు చేసి వెంటనే ప్రమోషన్స్ ఇవ్వాలి. ప్రతి జిల్లాకు ఒక డీసీహెచ్ఎస్ పోస్టు చొప్పున 33 జిల్లాలకు క్రియేట్ చెయ్యాలి. వైద్య విధాన పరిషత్‌లో ప్రమోషన్స్ లేని కేటగిరి ఉద్యోగులకు పదోన్నతి వసతిని కల్పించాలి.10. వైద్య విధాన పరిషత్తులో పనిచేస్తున్న కాంట్రాక్టు, ఔట్సోర్సింగ్ సిబ్బందికి ప్రతి నెల మొదటి తేదీన జీతాలివ్వాలి. కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ ఉద్యోగులకు పీఆర్సీని అమలు చేయాలని ....వారు డిమాండ్ చేశారు.

కేటీఆర్‌కు కృతజ్ఞతలు : డాక్టర్ ఎన్.సుధాకర్ రావు

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

ఆరోగ్యశ్రీ ట్రస్ట్ చైర్మెన్‌గా నియమితులైన నేపథ్యంలో డాక్టర్ ఎన్.సుధాకర్ రావు మంత్రి కేటీఆర్‌కు కృతజ్ఞతలు తెలిపారు. మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావుతో కలిసి గురువారం హైదరాబాద్ ప్రగతి భవన్‌లో మంత్రి కేటీఆర్‌ను ఆయన కలిశారు. ఈ సందర్భంగా కేటీఆర్ సుధాకర్ రావుకు శుభాకాంక్షలు తెలిపారు. కేటీఆర్‌ను కలిసిన వారిలో ఎమ్మెల్సీ కడియం శ్రీహరి తదితరులు ఉన్నారు.

బీహార్‌లో బోటు బోల్తా..12 మంది గల్లంతు

పాట్నా : బీహార్‌లోని ముజఫర్‌పూర్ జిల్లా బాగ్మతి నదిలో గురువారం ఘోర ప్రమాదం జరిగింది. 30 మంది విద్యార్థులతో వెళుతున్న బోటు నదిలో బోల్తాపడింది. ఈ ఘటనలో ఆరుగురు చిన్నారులుసహా 12 మంది గల్లంతైనట్లు అధికారులు తెలిపారు.

హైదరాబాద్‌లో డ్రగ్స్ ముఠా అరెస్ట్

నిందితుల్లో ముగ్గురు నైజీరియన్లు, వినియోగదారులు, సినీ నిర్మాత

- బేబీ సినిమాపై నగర పోలీస్ కమిషనర్ సీవీ సీరియస్ • సినిమా టీంకు నోటీసులిస్తాం.. • ఇక నుంచి ప్రతి సినిమాపై నిఘా



నవతెలంగాణ-సిటీబ్యూరో

హైదరాబాద్ నగరంలో డ్రగ్స్ విక్రయిస్తున్న.. కొనుగోలు చేసిన ఎనిమిది మందిని గురువారం నార్కోటిక్ విభాగం పోలీసులు అరెస్టు చేశారు. వీరిలో ముగ్గురు నైజీరియన్లు, మాదక ద్రవ్యాలు వినియోగిస్తున్న ఐదుగురు, ఓ సినీ నిర్మాత ఉన్నారు. వీరి నుంచి 50 గ్రాముల ఎండీఎంఏ, 8 గ్రాముల కొకైన్, 24 ఎక్టసీ పిల్స్‌ను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. బంజారాహిల్స్‌లోని పోలీస్ కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో విలేకరుల సమావేశంలో హైదరాబాద్ సీపీ సీవీ ఆనంద్ వివరాలు వెల్లడించారు.

గత నెల 11న నార్కోటిక్ విభాగం పోలీసులు గుడిమల్కాపూర్, మాదాపూర్లో దాడి చేసి ముగ్గురిని అరెస్టు చేశారు. ఈ కేసులో బాలాజీ, సినీ ఫైనాన్షియర్ వెంకట రత్నారెడ్డి, మురళిని అరెస్టు చేసి, రిమాండ్‌కు తరలించారు. నిందితులిచ్చిన సమాచారంతో హైదరాబాద్ నార్కోటిక్ విభాగం ప్రత్యేక దృష్టి సారించింది. నైజీరియాకు చెందిన అమోబి చుక్వుడి మూనాగోలు, ఇగ్వావ్ మిచెల్, థామస్ అనఘాకాలు బిజినెస్ వీసా, మెడికల్ వీసాపై ఇండియాకు వచ్చారు. 2015లో ఒకరు, 2020 మరొకరు, 2022లో ఇంకొక్కరు ఇండియా వచ్చి ఢిల్లీ, బెంగళూర్‌లో మకాం వేశారు. సులువుగా డబ్బులు సంపాదించాలని నైజీరియా దేశానికి చెందిన వారి నుంచి డ్రగ్స్ కొనుగోలు చేస్తూ మన దేశవ్యాప్తంగా వారి కమ్యూనిటీ మెంబర్స్‌కు, విద్యార్థులకు (నైజీరియన్లకు) ఆన్‌లైన్‌లో డ్రగ్స్ విక్రయించడం మొదలుపెట్టారు. హైదరాబాద్‌పై దృష్టి సారించిన నిందితులు నగరంలోని యువకులను, విద్యార్థులను ఎంచుకుని డ్రగ్స్ కొకైన్, ఎండీఎంఏ తదితర డ్రగ్స్‌ను సరఫరా చేస్తున్నారు. ఈ క్రమంలో నగరానికి చెందిన దేవరకొండ సురేష్‌రావు, కొల్లి రాంచంద్, కూరపాటి సందీప్, పగళ్ల శ్రీకర్ కృష్ణప్రణీత్‌తోపాటు (డైరెక్టర్) అనుగు సుశాంత్ రెడ్డికి డ్రగ్స్ సరఫరా చేస్తున్నారు. దీన్ని గుర్తించిన పోలీసులు 8 మందిని అరెస్టు చేశారు. విలేకరుల సమావేశంలో వెస్ట్‌జోన్ ఎస్పీ డీ.సునితారెడ్డి, డీఎస్పీ నర్సింగ్‌రావు, ఇన్‌స్పెక్టర్ పీ.రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

బేబీ సినిమాపై సీరియస్

ఇటీవల విడుదలైన బేబీ సినిమాపై నగర పోలీస్ కమిషనర్ సీవీ ఆనంద్ సీరియస్ అయ్యారు. డ్రగ్స్ కల్చర్ ప్రోత్సహించేలా సన్నివేశాలతో సినిమా ఉందని అభిప్రాయం వ్యక్తం చేశారు. ఆ సినిమాను చూసిన నిందితులు అలా పార్టీ చేసుకున్నారని చెప్పారు. సినిమాల్లో అలాంటి సన్నివేశాలను చిత్రీకరించినప్పుడు 'హెచ్చరిక కింద వేసే ప్రకటన' కూడా వెయ్యకుండా డైరెక్ట్‌గా ప్లే చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. బేబీ సినిమా టీంకు నోటీసులు జారీ చేస్తామన్నారు. ఇక నుంచి ప్రతి సినిమాపై నిఘా వేస్తామన్నారు. అభ్యంతరకర సన్నివేశాలు ఉంటే ఊరుకునేది లేదని సీపీ హెచ్చరించారు.

ఎస్ఎస్ఏ కాంట్రాక్టు ఉద్యోగులను పర్మినెంట్ చేయాలి

- తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ డిమాండ్

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

విద్యాశాఖలో ఎస్ఎస్ఏలో కాంట్రాక్టు పద్ధతిలో పనిచేస్తున్న ఉద్యోగులను పర్మినెంట్ చేయాలనీ, అప్పటి వరకూ కనీస వేతన స్కేలు అమలు చేయాలని ప్రభుత్వాన్ని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షులు జె.వెంకటేశ్ డిమాండ్ చేశారు. గురువారం ఈ మేరకు సచివాలయంలో రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారికి వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఆయన ఎస్ఎస్ఏలో వివిధ హోదాల్లో 20 ఏండ్ల నుంచి పనిచేస్తున్న 22 వేలకుపైగా కాంట్రాక్టు ఉద్యోగుల సమస్యలను సీఎస్ దృష్టికి తీసుకెళ్లారు. వారు రోస్టర్, మెరిట్, రూల్ ఆఫ్ రిజర్వేషన్ ఆధారంగా ఎంపికై ఉద్యోగ భద్రతకు అర్హత కలిగి ఉన్నారన్నారు.

వారిలో అత్యధిక మంది దళిత, గిరిజన, బలహీన తరగతుల, దిగువ మధ్యతరగతి కుటుంబాలకు చెందినవారే ఉన్నారని చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల కాలంలో కాంట్రాక్ట్ లెక్చరర్స్, రెవెన్యూ తదితర శాఖల్లోని ఉద్యోగుల్లో కొందరిని రెగ్యులరైజ్ చేసినప్పటికీ ఎస్ఎస్ఎ కాంట్రాక్ట్ సిబ్బందిని క్రమబద్ధీకరించకపోవడం వివక్ష చూపడమేనన్నారు. ఎస్ఎస్ఏలో పనిచేసే ప్రతి కాంట్రాక్టు ఉద్యోగికి జీవిత బీమా రూ.10 లక్షలు, ఆరోగ్య బీమా రూ.5 లక్షల సౌకర్యం కల్పించాలని కోరారు. విద్యాశాఖ నియామకాల్లో 30 శాతం వెయిటేజ్ కల్పించాలని విన్నవించారు.

కొమ్రంభీం, మంచిర్యాల జిల్లాల్లో పలు చోట్ల భారీ వర్షాలు

- నేడూ పలు జిల్లాలకు భారీ వర్షసూచన • బంగాళాఖాతంలో బలపడ్డ అల్పపీడనం

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

రాష్ట్రంలో గురువారం రాత్రి 10 గంటల వరకు కొమ్రంభీం ఆసిఫాబాద్, మంచిర్యాల జిల్లాల్లో పలు చోట్ల భారీ నుంచి అతిభారీ వర్షాలు పడ్డాయి. ములుగు జిల్లాలో అక్కడక్కడా భారీ వర్షం పడింది. శుక్రవారం కూడా కొమ్రంభీం ఆసిఫాబాద్, మంచిర్యాల, ఆదిలాబాద్, నిర్మల్, నిజామాబాద్ జిల్లాల్లో భారీ వర్షాలు పడే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం హెచ్చరించింది. ఈ మేరకు ఎల్లో హెచ్చరికను కూడా జారీ చేసింది. హైదరాబాద్ నగరంలోనూ వచ్చే 24 గంటల పాటు ఆకాశం మేఘావృతమై తేలికపాటి నుంచి మోస్తరు వానలు పడే సూచనలున్నాయి. అక్కడక్కడా ఉరుములతో కూడిన జల్లులు కురిసే అవకాశముంది. బంగాళాఖాతంలో ఏర్పడ్డ అల్పపీడనం మరింత బలపడింది. ఇది చురుగ్గా ముందుకు సాగుతున్నది. ఉత్తర ఒడిశా, పశ్చిమబెంగాల్ తీరాల్లో ఉంది. అది రాబోయే 48 గంటల్లో ఒడిశా, ఛత్తీస్‌గఢ్ మీదుగా కదిలే అవకాశముంది. గురువారం రాత్రి 10 గంటల వరకు రాష్ట్రంలో 252 ప్రాంతాల్లో వర్షపాతం నమోదైంది.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండండి

- 24 గంటల కాల్ సెంటర్ ఏర్పాటు చేయాలి : వైద్యారోగ్య శాఖ ఉన్నతాధికారుల సమీక్షలో ఆదేశాలు



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలనీ, 24 గంటల కాల్ సెంటర్‌ను ఏర్పాటు చేయాలని వైద్యారోగ్యశాఖ ఉన్నతాధికారులు ఆదేశించారు. రాష్ట్రంలో కొన్ని రోజులుగా ఎడతెరిపిలేకుండా వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో సీజనల్ వ్యాధుల పరిస్థితిపై గురువారం వైద్యారోగ్య శాఖ ఉన్నతాధికారులు సమీక్ష నిర్వహించారు. ఈ సమీక్షలో వైద్యారోగ్యశాఖ కార్యదర్శి రిజ్వీ, డీపీహెచ్ శ్రీనివాసరావు, డీఎంఈ రమేశ్‌రెడ్డి, టీవీవీపీ కమిషనర్ అజయ్ కుమార్, అన్ని జిల్లాల డీఎంహెచ్‌వోలు, డీసీహెచ్‌లు, టీచింగ్ హాస్పిటళ్లు, జిల్లా దవాఖానల సూపరింటెండెంట్లు, ప్రోగ్రాం ఆఫీసర్లు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఉన్నతాధికారులు మాట్లాడుతూ డెంగీ కేసులు పెరుగుతున్నట్టు జరుగుతున్న ప్రచారంలో వాస్తవం లేదు. రాష్ట్రంలో ఫీవర్ కేసులు ఆందోళనకర స్థాయిలో లేవు. ఇప్పటివరకు ఒక్క మరణం కూడా నమోదు కాలేదని స్పష్టం చేశారు. ఎడతెరిపిలేని వర్షాల నేపథ్యంలో ఎలాంటి పరిస్థితులు వచ్చినా తట్టుకునేలా దవాఖానలు సిద్ధంగా ఉండాలనీ, జ్వర బాధితుల వివరాలను ఎప్పటికప్పుడు పోర్టల్‌లో నమోదు చేయాలి. ఆ డేటా ఆధారంగా డీఎంహెచ్‌వోలు హైరిస్క్ ఏరియాలను గుర్తించి జాగ్రత్త చర్యలు చేపట్టాలని ఆదేశించారు. జ్వరాలు నమోదయ్యే చోట పల్లె, బస్తీ దవాఖానలను అప్రమత్తం చేయాలనీ, ల్యాబ్ రిపోర్టులను కచ్చితంగా 24 గంటల్లోగా అందించాలనీ, ఒకవేళ రోగికి అనుమానిత లక్షణాలు ఉంటే రిపోర్టుల కోసం ఎదురుచూడకుండా వెంటనే చికిత్స ప్రారంభించాలని సూచించారు. అవసరమైతే జ్వరాల కోసం ప్రత్యేక ఓపీ కౌంటర్లు ఏర్పాటు చేయాలనీ, పిల్లలకు జ్వరాలపై ప్రత్యేక నిఘా ఉంచాలని కోరారు. మలేరియా విభాగం అడిషనల్ డైరెక్టర్‌ను కొత్తగూడెం పంపి, అక్కడి పరిస్థితిని సమీక్షించాలని ఆదేశించారు.

ములుగులో డెంగీ కేసులపై దుష్ప్రచారం

ములుగు జిల్లాలో డెంగీతో వారం రోజుల్లోనే 10 మంది మరణించారంటూ కొన్ని మీడియా సంస్థల్లో అవాస్తవాలు ప్రచారం చేస్తున్నారని జిల్లా అధికారులు ఈ సందర్భంగా పేర్కొన్నారు. ఈ ఏడాది జూన్ నుంచి జిల్లాలో వైద్యారోగ్య సిబ్బంది అప్రమత్తంగా ఉన్నారని పేర్కొన్నారు. గ్రామాల్లో క్యాంపుల నిర్వహణ, ఇంటింటి సర్వే, జ్వరాలపై అవగాహన చేపట్టినట్టు వారు తెలిపారు. ఇప్పటివరకు 398 క్యాంపులు నిర్వహించి 24,678 మందికి వైద్య పరీక్షలు నిర్వహించినట్టు చెప్పారు. అందులో 1,392 మంది జ్వర బాధితులను, 28 మంది మలేరియా బాధితులను గుర్తించామన్నారు. ఈ నెలలో డెంగీతో నలుగురు మరణించారని చెప్పారు. అయితే వారు గుండె జబ్బులు, ఊపిరితిత్తుల సమస్యలు, జాండిస్, సికిల్‌సెల్ అనీమియా వంటి దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్నట్టు వివరించారు.

రాష్ట్రంలో డ్రగ్స్ కల్చర్ : బీఎస్పీ

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

రాష్ట్రంలో డ్రగ్స్ కల్చర్ పెరుగుతున్నదనీ, దాన్ని అరికట్టడంలో సీఎం కేసీఆర్ పూర్తిగా విఫలమయ్యారని బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షులు ఆర్.ఎస్ ప్రవీణ్ కుమార్ ఆరోపించారు. గురువారం ముస్లీం యునైటెడ్ ఫెడరేషన్ (ఎంయూఎఫ్) ఆధ్వర్యంలో హైదరాబాద్‌లోని ఇందిరాపార్క్ ధర్నాచౌక్‌లో డ్రగ్, మర్డర్ కల్చర్‌తోపాటు అధిక వడ్డీ వసూళ్లకు వ్యతిరేకంగా నిర్వహించిన ధర్నాలో ఆయన మాట్లాడారు. హైదరాబాద్ నగరంలో మత్తు పదార్థాల సరఫరా వ్యాపారం రూ.కోట్లల్లో జరుగుతున్నదన్నారు. దీన్ని అరికట్టడంలో ప్రభుత్వం విఫలమైందని విమర్శించారు. సెలబ్రేటీలు, రాజకీయ నాయకులు, విద్యార్థులు,యువత మత్తు పదార్థాలకు బానిసలవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కాంగ్రెస్ ఎంపీ రేవంత్ రెడ్డి ఐటీ మంత్రి కేటీఆర్ పై డ్రగ్స్ తీసుకుంటున్నారనే ఆరోపణలున్నాయని తెలిపారు. రాష్ట్రంలో మద్యం అమ్మకాలపై ఉన్న శ్రద్ధ, మత్తు పదార్థాలను కంట్రోల్ చేయడంలో లేదని ఆరోపించారు.

భూస్వాములను తరిమికొట్టిన చరిత్ర ఎర్రజెండాది..

సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు జాన్‌వెస్లీ



నవతెలంగాణ-హయత్ నగర్

తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటంలో మూడు వేల గ్రామాల్లో భూస్వాములను తరిమికొట్టి సుమారు 10 లక్షల ఎకరాల భూమిని పేదలకు పంచిన చరిత్ర ఎర్రజెండాకు ఉందని సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు జాన్‌వెస్లీ అన్నారు. వీర తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట వారోత్సవాల సందర్భంగా గురువారం రంగారెడ్డి జిల్లా మన్సూరాబాద్ డివిజన్‌లో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. సాయుధ పోరాటంలో సుమారు నాలుగు వేల మంది ప్రాణం కోల్పోయారన్నారు. అప్పట్లో భూస్వాములు అన్ని రకాల కులస్తులతో వెట్టి చాకిరీ చేయించుకున్నారన్నారు. ఈ క్రమంలో వెట్టి చాకిరీకి వ్యతిరేకంగా.. దున్నే వాడిదే భూమి అనే నినాదంతో ఎర్రజెండా ఆధ్వర్యంలో కమ్యూనిస్టులు పోరాటం చేసి భూస్వాముల భూములను పేదలకు పంచి పెట్టారని గుర్తు చేశారు. నిజాం సర్కారులాగా.. ఈనాడు తెలంగాణ ప్రభుత్వం ఉందని, పేదలకు ఇండ్లు, ఇండ్ల స్థలాలు, పథకాలు సక్రమంగా అమలు కావట్లేదన్నారు. అందరికీ విద్యా, వైద్యం అందించాలని కోరారు. తల దాచుకోవడానికి 100 చదరపు గజాల భూమి కోసం వెళ్తే కేసులు పెట్టడం, మహిళలు అని చూడకుండా జైలుకు పంపుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మరోవైపు కేంద్ర ప్రభుత్వం హిందూత్వం పేరుతో తెలంగాణలో ఓట్లు రాబట్టేందుకు యత్నిస్తోందన్నారు. మనకు రావాల్సిన హక్కుల కోసం పోరాటం చేయాలని, మన కోసం మన వాడికి ఓటు వేసుకోవాలని అప్పుడే రాజ్యాంగం పరిపాలన చేస్తామని చెప్పారు. కేంద్రం ఇష్టానుసారంగా ప్రభుత్వ సంస్థలను కార్పొరేట్ కంపెనీలకు అమ్ముతోందని ఆవేదన వ్యక్తం చేశారు. భవిష్యత్‌లో సీపీఐ(ఎం) చేపట్టే పోరాటాలకు సంసిద్ధం కావాలని పిలుపునిచ్చారు. వచ్చే ఎన్నికల్లో ఓటును నోట్ల కోసం, మందు, బీరు, బిర్యానీ కోసం అమ్ముకోవద్దని సూచించారు. సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు చంద్రమోహన్, పగడాల యాదయ్య, నాయకులు ఏర్పుల నర్సింహ, హయత్‌నగర్ సర్కిల్ కార్యదర్శి కీసరి నర్సిరెడ్డి, సరూర్‌నగర్ సర్కిల్ కార్యదర్శి వెంకన్న, ఎల్‌బీనగర్ సర్కిల్ కార్యదర్శి ఎల్లయ్య, వీరయ్య తదితరులు పాల్గొన్నారు.

భూస్వాములను రక్షించేందుకే భారత సైన్యాలు



- తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టి.సాగర్

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

జాగీర్దార్లు, జమీందార్లు, దొరలు, పటేల్, పట్వారీలు తదితర భూస్వాములకు అండగా నిలబడేందుకు భారత సైన్యాలు హైదరాబాద్ సంస్థానంలోకి వచ్చాయని తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టి.సాగర్ స్పష్టం చేశారు. తెలంగాణ రైతు సంఘం ఆధ్వర్యంలో "తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట చరిత్రను వక్రీకరిస్తున్నదేవరు"? అనే అంశంపై ఆ సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి మూడ్ శోభన్ అధ్యక్షతన గురువారం వెబినార్ జరిగింది. ఈ సందర్భంగా సాగర్ మాట్లాడుతూ.. నైజాం సంస్థానం కేంద్ర ప్రభుత్వ ఆధీనంలోకి వచ్చిన తర్వాత కూడా నిజాం నవాబునే గద్దెపై కూర్చోపెట్టారన్నారు. కేంద్ర బలగాలు నిజాం నవాబును గద్దె దించడానికి రాలేదని స్పష్టం అవుతున్నదని తెలిపారు. ఏ నాగరిక దేశం కూడా తన పౌరులపైకి సైన్యాలను పంపదన్నారు. భారత ప్రభుత్వం మాత్రం తెలంగాణ సంస్థానంలోని భూస్వాములకు అండగా నిలబడేందుకు సైన్యాన్ని గ్రామాల్లోకి పంపించిందని చెప్పారు. రూమీటోపీ, షేర్వాణీలతో పట్టణంలో ఉన్న దొరలు, భూస్వాములు, పటేల్, పట్వారీలు తెల్ల బట్టల ధరించి, నెత్తిపై ఖద్దరు టోపీ పెట్టి మిల్ట్రీ సహకారంతో గ్రామాలోకి వచ్చారన్నారు. ఆ తర్వాత బీభత్సకాండ ప్రారంభించారని చెప్పారు. భూస్వాములు మిలిటరీ, పోలీసుల సహకారంతో అత్యంత పాశవికంగా ప్రజలపై దాడులు చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. విలీనానికి ముందు ఆ తర్వాత మతోన్మాదం, భూస్వాములు ప్రజలపై తీవ్ర నిర్బంధాన్ని పెంచారన్నారు. నాటి పోరాటంతో ఎలాంటి సంబంధంలేని మతోన్మాదులు ఆ చారిత్రక పోరాటానికి మత రంగు పులమాలని కుయుక్తులు పన్నుతున్నదని చెప్పారు.

నేడు టెట్

- నిమిషం ఆలస్యమైతే నో ఎంట్రీ
- 4,78,055 మంది అభ్యర్థులు
- 2,052 పరీక్షా కేంద్రాల ఏర్పాటు

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

శుక్రవారం రాష్ట్రవ్యాప్తంగా ఉపాధ్యాయ అర్హత పరీక్ష (టెట్) రాతపరీక్ష జరగనుంది. ఇందుకోసం విద్యాశాఖ అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు. టెట్‌కు 4,78,055 మంది అభ్యర్థులు దరఖాస్తు చేశారు. వారికోసం రాష్ట్రవ్యాప్తంగా 2,052 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఇందులో పేపర్-1కు 2,69,557 మంది దరఖాస్తు చేస్తే వారికోసం 1,139 పరీక్షా కేంద్రాలు, పేపర్-2కు 2,08,498 మంది దరఖాస్తు చేయగా, వారి కోసం 913 పరీక్షా కేంద్రాలున్నాయి. శుక్రవారం ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు పేపర్-1, మధ్యాహ్నం 2.30 నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు పేపర్-2 రాతపరీక్షలను రాష్ట్రవ్యాప్తంగా 33 జిల్లాల్లోనూ జరగనుంది. అభ్యర్థులు పరీక్ష ప్రారంభానికి గంట ముందే పరీక్షా కేంద్రాలకు చేరుకోవాలని అధికారులు సూచించారు. నిమిషం ఆలస్యమైనా పరీక్షా కేంద్రాల్లోకి అనుమతి ఉండబోదని స్పష్టం చేశారు. టెట్‌లో వచ్చిన మార్కులకు ఉపాధ్యాయ నియామకాల్లో 20 శాతం వెయిటేజీ ఉన్న విషయం తెలిసిందే. అందుకే ఇందులో వచ్చే మార్కులకు ఎంతో ప్రాధాన్యత ఉన్నది. ఈ పరీక్షల నిర్వహణ కోసం 2,052 మంది చీఫ్ సూపరింటెండెంట్లు, 2,052 మంది డిపార్ట్‌మెంటల్ అధికారులు, 22,572 మంది ఇన్విజిలేటర్లు, 10,260 మంది హాల్ సూపరింటెండెంట్లను నియమించారు. పరీక్షా కేంద్రాల్లో ఫర్నీచర్, చీఫ్ సూపరింటెండెంట్ గదిలో సీసీ కెమెరాల ఏర్పాటు, అసౌకర్యం కలగకుండా నిరంతర విద్యుత్ సరఫరా వంటి చర్యలను అధికారులు తీసుకున్నారు. బ్లాక్ బాల్‌పాయింట్ పెన్నుతోనే ఓఎంఆర్ గడులను నింపాల్సి ఉంటుంది. అభ్యర్థులు హాల్‌టికెట్‌ను తప్పనిసరిగా తెచ్చుకోవాలి.

మహిళా లోకాన్ని చైతన్య పర్చండి

- సీఎం కేసీఆర్‌కు అండగా నిలవండి : మంత్రి ఎర్రబెల్లి



నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

'మహిళా లోకాన్ని చైతన్య పరచండి. మహిళలు ఆర్థికంగా నిలదొక్కుకున్నప్పుడే సమాజం బాగుపడుతుంది. మహిళల్ని బలోపేతం చేయడమే లక్ష్యంగా సీఎం కేసీఆర్ పని చేస్తున్నారు. ఆయనకు అండగా నిలవండి' అని జిల్లా మహిళా సమాఖ్యల పదాధికారులకు రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు పిలుపునిచ్చారు. గురువారం హైదరాబాద్‌లోని రాజేంద్రనగర్‌లోని టీఎస్ఐఆర్డీలో జిల్లాల మహిళా సమాఖ్యల పదాధికారుల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా మంత్రి దయాకర్‌రావు మాట్లాడుతూ సీఎం కేసీఆర్ వచ్చాకే రాష్ట్రంలో మహిళా సంఘాలు బలోపేతమయ్యాయనీ, మన మహిళలు దేశంలోనే ముందంజలో ఉన్నారని చెప్పారు. దేశంలో ఎక్కడా లేని విధంగా ఇంటింటికీ నల్లాల ద్వారా తాగు నీరు అందిస్తున్న ఘనత మన రాష్ట్రానిదేనన్నారు. బహిరంగ మల విసర్జన రహిత రాష్ట్రంగా నిలవడం గర్వకారణమని చెప్పారు. కార్యక్రమంలో పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ ముఖ్య కార్యదర్శి సందీప్ కుమార్ సుల్తానియా, కమిషనర్ హనుమంతరావు, సెర్ప్ సీఈవో గౌతం, స్పెషల్ కమిషనర్ ప్రదీప్, ఎస్బీఎం డైరెక్టర్ సురేష్, డిప్యూటీ కమిషనర్లు రామారావు, రవీందర్, వివిధ జిల్లాల సమాఖ్యల పదాధికార మహిళలు తదితరులు పాల్గొన్నారు.

'సింజీన్' హైదరాబాద్‌లో ఉండటం గర్వకారణం

- ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి కేటీఆర్
- సింజీన్ ఇంటెల్ రీసెర్చ్ లాబోరేటరీ విస్తరణకు శంకుస్థాపన
- క్యాన్సర్ చికిత్స మందుల కేంద్రం ప్రారంభం



నవతెలంగాణ-శామీర్‌పేట

ఫార్మా రంగంలో సింజీన్ కంపెనీ యాజమాన్యం అంకితభావంతో పనిచేస్తున్నదని, ప్రగతి పథంలో దూసుకుపోతున్న ఈ కంపెనీ హైదరాబాద్‌లో ఉండటం గర్వకారణమని ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి కేటీఆర్ అన్నారు. మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా శామీర్‌పేట్ మండలం తుర్కపల్లిలోని జీనోమ్ వ్యాలీలో గురువారం కెమో ఇండియా ఫార్ములేషన్ ప్రయివేటు లిమిటెడ్ క్యాంపస్‌లో ఒలిగో న్యూక్లియోటైడ్స్ క్యాన్సర్ చికిత్స మందుల కేంద్రాన్ని మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావుతో కలిసి కేటీఆర్ ప్రారంభించారు. అనంతరం సింజీన్ ఇంటెల్ రీసెర్చ్ లాబోరేటరీ విస్తరణకు శంకుస్థాపన చేశారు. రాష్ట్రంలో కంపెనీ పెట్టేందుకు ముందుకొచ్చిన ప్రతినిధులను మంత్రులు అభినందించారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ.. హైదరాబాద్ నగరం శరవేగంగా అభివృద్ధి చెందుతోందన్నారు. నగరం లైఫ్ సైన్సెస్‌కు హబ్‌గా మారిందన్నారు. త్వరలో లైఫ్ సైన్స్ యూనివర్సిటీని ప్రారంభిస్తామని తెలిపారు.

ఏడున్నర ఎకరాల్లో సింజీన్ సైంటిఫిక్ సొల్యూషన్స్ కంపెనీ విస్తరణ చేపడుతున్నట్టు చెప్పారు. ఈ కంపెనీ హైదరాబాద్‌లో రూ.788 కోట్ల పెట్టుబడులు పెడుతున్నందుకు ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సింజీన్ ఇంటర్నేషనల్ లిమిటెడ్ చైర్‌పర్సన్ కిరణ్ మజుందార్‌షా, తెలంగాణ ప్రభుత్వ పరిశ్రమలు, వాణిజ్యం, ఐటీ శాఖల ముఖ్య కార్యదర్శి జయేష్ రంజన్, ఇండస్ట్రీయల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ కార్పొరేషన్ వైస్ చైర్మెన్, మేనేజింగ్ డైరెక్టర్ వెంకట నర్సింహారెడ్డి, తెలంగాణ లైఫ్ సైన్సెస్ చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ శక్తి నాగప్పన్, సింజీన్ ఇంటర్నేషనల్ చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్ మహేష్ భల్గత్ తదితరులు పాల్గొన్నారు.

ఆ తెగలో తొలి మహిళా పైలట్

జయశ్రీ... నీలగిరిలోని బడుగ తెగకు చెందిన ఈమె మొన్నటి వరకు ఓ సాధారణ యువతి. కానీ ఇప్పుడు ఆమె పేరు దేశవ్యాప్తంగా వినిపిస్తుంది. తన తెగ నుంచి మొదటి మహిళా పైలట్‌గా చరిత్ర సృష్టించింది. ఎన్నో కష్టాలు ఎదుర్కొని ఓ మంచి స్థాయికి ఎదిగిన వారిని మనం ఎంతో మందిని చూస్తూనే ఉన్నాం. అలాంటి వారి జాబితాలో చేరిన ఆమె విజయ గాథ నేటి మానవిలో...



తమిళనాడులోని నీలగిరి కొండల్లో పెద్దగా చదువుకోని గిరిజన గ్రామాలు పదుల సంఖ్యలో ఉన్నాయి. కానీ జయశ్రీ ఆ సంప్రదాయాన్ని బద్దలు కొట్టి పైలట్‌గా ఎదిగింది. ఆమె సొంతూరు నీలగిరి జిల్లా కొత్తగిరి సమీపంలోని కురుకుటి. ఫైటర్ ఎయిర్‌క్రాఫ్ట్‌లు, డిఫెన్స్ ట్రైనింగ్ ఎయిర్‌క్రాఫ్ట్‌లు నిత్యం అక్కడి కొండల చుట్టూ తిరుగుతూ ఉంటాయి.

ఆ ఊరి జనం వాటిని చూసి మురిసిపోతూ ఉంటారు. కానీ వాటిని ఎక్కే అవకాశమే వారికి లేదు. ఆ విమానాలను చూస్తూ పెరిగిన జయశ్రీ ఎప్పటికైనా పైలట్ అవ్వాలని కలలు కనేది. అయితే అందుకోసం ఏం చదువుకోవాలో చెప్పేందుకు ఆ ఊరిలో ఎవరూ లేరు. దాంతో తన కలను కొంత కాలం పక్కన పెట్టేసింది. జయశ్రీ తండ్రి జె. మణి రిటైర్డ్ గ్రామ నిర్వాహకుడు, తల్లి మీనామణి సంగీత విద్వాంసురాలు. తల్లి దగ్గర డ్యాన్స్, సంగీతం నేర్చుకుంది.

ఊహించని మలుపు

పైలెట్ కావాలనే కోరిక బలంగా ఉంది. కానీ మధ్యతరగతి కుటుంబంలో పుట్టిన ఆడపిల్ల కాబట్టి ఆ చదువుకు ధైర్యం చాలలేదు. కోయంబత్తూరులోని ఓ ప్రైవేట్ కాలేజీలో కంప్యూటర్ సైన్స్‌లో పీజీ చేసింది. జీవితంలో నిలదొక్కుకోవడానికి ఓ కంపెనీలో ఉద్యోగం సంపాదించింది. వ్యాపార విశ్లేషకురాలిగా మారింది. సాఫ్ట్‌వేర్‌ను అభివృద్ధి చేసింది. మెషీన్ లెర్నింగ్, డేటా అనలిటిక్స్‌లో నైపుణ్యం సాధించింది. కానీ కోవిడ్‌తో ఆమె జీవితం ఊహించని మలుపు తిరిగింది. లాక్‌డౌన్ సమయంలో ఇంటి నుంచి పని ఇవ్వడంతో జయశ్రీ తిరిగి గ్రామానికి వచ్చింది. ఇంటి నుండి పని చేయడం మొదట బాగానే ఉన్నా నాలుగు గోడలకు పరిమితం కావడం ఆమెకు ఇష్టం లేదు. ఆ ఉద్యోగం చేయాలా వద్దా అనే ఆలోచనలో పడింది. మొదట కాస్త బయపడిన ధైర్యంగా ముందుకు నడిచింది. అప్పుడే పైలట్ కావాలనే తన ఆలోచనను తల్లిదండ్రులతో పంచుకుంది.

కఠినమైన శిక్షణను...

కూతురి కోరికను తల్లిదండ్రులు అంగీకరించడమే కాదు అన్ని విధాలుగా ప్రోత్సహించారు. ఇదే తన తొలి విజయంగా జయశ్రీ భావించింది. ఉద్యోగాన్ని వదులుకుని కూనూర్ సమీపంలోని వెల్లింగ్‌టన్ ఆర్మీ పబ్లిక్ స్కూల్‌లో టీచర్‌గా చేరింది. అక్కడ పనిచేసిన 6 నెలల్లో ఏవియేషన్ గురించి నేర్చుకుంది. తర్వాత దక్షిణాఫ్రికా ఉల్కాన్ ఏవియేషన్ ఇన్‌స్టిట్యూట్‌లో దరఖాస్తు చేసి ఆహ్వానం అందుకుంది. చేస్తున్న ఉద్యోగం మానేసి వేరే ఏదో చేస్తుందని తెలుసుకున్న కొంత మంది బంధువులు 'ఇంత ఖర్చుపెట్టి అమ్మాయిని విదేశాలకు పంపడం అవసరమా' అన్నారు. అయినా అవేమీ పట్టించుకోకుండా ఓ అడుగు ముందుకేసింది. జోహన్నెస్‌బర్గ్ విమానాశ్రమంలో కఠినమైన శిక్షణను విజయవంతంగా పూర్తి చేసింది. ప్రైవేట్ పైలట్ లైసెన్స్ కూడా పొందింది. బడుగర్ తెగలో ఈ ఘనత సాధించిన తొలి యువతిగా కీర్తి ఘడించింది. ఇటీవలె తన శిక్షణ పూర్తి చేసుకుని జయశ్రీ గ్రామానికి తిరిగి రావడంతో గ్రామస్తులు సంబరాలు చేసుకున్నారు.



సామాజిక సేవలోనూ...

పైలట్‌గా 70 గంటల పాటు ఆకాశంలో చక్కర్లు కొట్టింది. కమర్షియల్ పైలట్ లైసెన్స్ కోసం ఆమె పరీక్ష రాయాలి. అలాగే శిక్షణా కాలంలో 250 గంటల పాటు విమానం నడపాలి. అందుకు తాను సిద్ధమేనని గర్వంగా చెబుతోంది. అయితే బడుగ తెగ నుంచి ఇంతటి గొప్ప విజయం సాధించిన జయశ్రీ ఎంతో మంది అమ్మాయిలకు స్ఫూర్తిగా నిలుస్తుం దని చెప్పొచ్చు. ఒకవైపు తన కల నిజం చేసుకు నేందుకు కష్టపడుతూనే మరోవైపు సామాజిక సేవ కూడా చేస్తుంది. ఓ ట్రస్ట్‌లో వాలంటీర్‌గా చేరి తాను నివసించే కొండ గ్రామాలలోని పేద పిల్లలకు చదువు చెబుతోంది. తనకున్న సాంకేతిక పరిజ్ఞానంతో పిల్లలకు, కళాశాల విద్యార్థులకు కృత్రిమ మేధస్సు విద్యలో శిక్షణనిస్తుంది. ఐటీ ఉద్యోగం చేస్తున్న సమయంలోనే ఈ సేవా కార్యక్రమాల కోసం కొంత సమయం వెచ్చించేది. పైలట్‌గా చేరినా తన సేవా కార్యక్రమాలు మాత్రం ఆపను అంటుంది.


బరువు నియంత్రణకు...

టీనేజ్ అమ్మాయిల దృష్టంతా ఎప్పుడూ బరువు తగ్గడం మీదే వుంటుంది. దానికోసం ఎవరు ఏం చెప్పినా పాటిస్తూ వుంటారు. కొందరయితే భోజనం మానేయటం వంటివి చేస్తుంటారు. అయితే బరువు పెరగకుండా వుండాలనుకోవటం మంచిదే.. అదే సమయంలో శరీరానికి కావలసిన పోషకాలు సమృద్ధిగా అందేలా కూడా చూసుకోవాలి. లేదంటే శారీరక అనారోగ్యంతో పాటు, ముఖ కాంతి కూడా తగ్గిపోతుంది. అంటే సరైన ఆహారం తీసుకోకపోతే అందం మీద కూడా ఆ ప్రభావం పడుతుంది. కాబట్టి విటమిన్లు, ఖనిజాలు, లవణాలు, ప్రోటీన్లు ఇతర ఎంజైములు శరీరానికి చక్కగా అందేలా చూస్తే అందం, ఆరోగ్యం కూడా సొంతం అవుతాయి.

మరి అవన్నీ అందాలంటే ఏం చేయాలి అంటే... రోజూ ఓ గుప్పెడు మొలకెత్తిన గింజలు తినటమే. వీటినుంచి పుష్కలంగా లభించే మాంసకృత్తులు అత్యంత సురక్షితమయినవి. వీటిలో కొవ్వు శాతం తక్కువ, పీచు పదార్థం ఎక్కువ. కొలస్ట్రాల్ అన్న మాటే ఉండదు. కాబట్టి బరువు పెరగకుండా ఉండాలన్నా, బరువు తగ్గాలన్నా రోజూ ఇవి తప్పక తీసుకోవాలి.

అంతే కాదు వీటిలో ఇంకా చాలా ప్రయోజనాలు దాగున్నాయి. ఈ గింజలకి ఇంత ప్రాధాన్యం ఎందుకూ అంటే మొలకెత్తే సమయంలో వీటిలో క్లోరోఫిల్ శాతం పెరుగుతుంది. ఇది రక్తహీనత తగ్గించటంలో సహాయపడుతుంది. అలాగే ఇవి మొలకెత్తే సమయం లో వీటిలో విటమిన్లు, పీచుపదార్థాల శాతం చాలా పెరుగుతుంది. పైగా సులువుగా జీర్ణం అవుతాయి, తిన్న ఆహారం జీర్ణం అయ్యేలా చేస్తాయి.

ఇంతకీ ఏవేవి తినాలి అంటే... గోధుమ, రాగి వంటి తృణ ధాన్యాలు, పెసలు, శెనగలు, బఠాణీ, రాజ్మా, సోయా బీన్స్ వంటి చిక్కుడు జాతి గింజలు తినటం మంచిది. అలా అని ఎక్కువగా కూడా తినకూడదు. టీనేజర్లు అరకప్పు మొలకెత్తిన ధాన్యాలను తింటే సరిపోతుంది. అది బ్రేక్‌ఫాస్ట్, లంచ్, డిన్నర్‌లలో ఎప్పుడయినా తినచ్చు. వీటిని నేరుగా తినటం, లేదా పొడి చేసుకుని సూపులో కలుపుకోవటం, జావగా చేసుకోవటం, లేదా రోటి పిండిలో, దోశల పిండిలో కలపటం వంటివి కూడా చేయవచ్చు. ఆరోగ్యం, అందం రెండింటిని కాపాడుకుంటూ బరువు తగ్గాలి అనుకుంటే ఈ మొలకెత్తిన గింజలు తినటం మొదలు పెట్టండి.



అందంగా మలుచుకోండి



అంతా బావుంది అనిపించినంతసేపూ కొత్తగా ఏమీ ఆలోచించలేం. లైఫ్‌లోనూ కొత్తగా ఏ మార్పూ రాదు. కానీ ఉన్న దాన్ని ఉన్నట్టు అంతా ఇష్టపడటం ఎంతో కాలం చేయలేం. ఏదో ఓ రోజున బోర్ అనిపిస్తుంది. ఇంకేదో కావాలనిపిస్తుంది. ఓ బ్రేక్, ఓ మార్పు కావాలని అనిపిస్తుంది. అదిగో అలా అనిపించింది అంటే అది లైఫ్‌లో సరికొత్త మార్పుకి శ్రీకారమే అని అంటున్నారు నిపుణులు. మరి అలా బ్రేక్ కావాలి, మార్పు కావాలి అనిపిస్తే అందుకు ఏం చేయాలంటే...

జీవితంలో కొత్తగా ఇంకేమన్నా మార్పులు జరిగితే బావుండును అనిపించగానే చాలా మంది.. ఏముంది ఇంతే, ఈ లైఫ్ ఇలా గడవాల్సిందే వంటి నైరాశ్యంలో పడిపోతారు ముందు. ఆ తర్వాత నెమ్మదిగా ఏం చేయొచ్చు అన్న విషయం కోసం ఆలోచిస్తారు. నిజానికి అందులో కొద్దిమంది మాత్రమే అనుకున్న దిశగా అడుగులు వేస్తారు. తాము కోరుకున్న మార్పుని తమ జీవితాల్లోకి ఆహ్వానిస్తారు. దాని నుంచి లభించే ఆనందాన్ని రుచి చూస్తారు. ఆ కొద్దిమందిలో మనం వున్నామా.. లేమా? అనేది మన ఆలోచనల మీద ఆధారపడి ఉంటుంది. అయితే ఆ లిస్ట్‌లో చేరాలంటే మనమేం చేయాలనేది నిపుణులు చెబుతున్నారు.

లైఫ్‌లో మార్పు కావాలని అనిపిస్తే ఆ మార్పు బయట ఎక్కడి నుంచో రాదు. అది మనలో రావాలని సూచిస్తున్నారు నిపుణులు. ముందుగా మన పరిధులు, పరిమితులు, పరిస్థితులు, వయసు వంటి వాటి గురించి ఆలోచించడం, భయపడటం, సందేహ పడటం మానేయాలి. వీటన్నిటినీ పక్కన పెట్టి ఏ మార్పు అయితే మీకు ఆనందాన్నిస్తుందని మీరు గాఢంగా నమ్ముతున్నారో ఆ మార్పు గురించి ఆలోచించండి. ఆ తర్వాత దానిని అమలు చేయడమెలాగో చూడండి. ప్రయత్నించండి. గట్టి సంకల్పం వుంటే ఏదీ అసాధ్యం కాదని గుర్తుంచుకోండి.

మీకు నచ్చిన ఓ కోర్స్ చేయడం, సగంలో ఆపేసిన హాబీని తిరిగి నేర్చుకోవడం, కొత్తగా ఓ హాబీని అలవర్చుకోవడం, ఈవినింగ్ కాలేజీలో చేరడం లేదా ఓ కొత్త భాషను నేర్చుకోవడం, సమాజసేవ, ఓ వ్యాపారం.. ఇలా ఏదైనా కావచ్చు. తప్పకుండా ఓ మంచి ప్రయత్నమే అవుతుంది. జీవితాన్ని ఇప్పటికంటే అందంగా మారుస్తుంది. నచ్చడం లేదంటూ పరిస్థితులను, జీవితాన్ని తిట్టుకుంటూ గడపటం, ఆ అసంతృప్తిని ఇంట్లో వారిపై చూపించడం, మనల్ని మనం బాధపెట్టుకోవడం కంటే జీవితాన్ని నచ్చినట్టు మార్చుకోవడం ఎంతో సులువు.

కేంద్ర మంత్రి నెం.1 అవినీతి పరుడు

న్యూఢిల్లీ : రాజస్థాన్‌కు చెందిన సీనియర్ నాయకుడు, మాజీ ముఖ్యమంత్రి వసుంధర రాజె విధేయుడు కైలాష్ మేఘ్వాల్ (89)ను పార్టీ ప్రాథమిక సభ్యత్వం నుంచి బీజేపీ సస్పెండ్ చేసింది. కేంద్ర న్యాయ శాఖ మంత్రి అర్జున్ రామ్ మేఘ్వాల్ నెంబర్ 1 అవినీతిపరుడని ఆరోపిస్తూ ఆయన్ని కేంద్ర క్యాబినెట్ నుంచి తప్పించాలని డిమాండ్ చేయడమే కైలాష్ చేసిన నేరం. అంతకుముందు పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు సీపీ జోషీ ఇచ్చిన షోకాజ్ నోటీసుకు కైలాష్ సమాధానం ఇవ్వలేదు. అంతేకాక విలేకరుల సమావేశాన్ని ఏర్పాటుచేసి అర్జున్ రామ్‌ను కేంద్ర క్యాబినెట్ నుంచి తొలగించాలని ప్రధాని నరేంద్ర మోడీని డిమాండ్ చేశారు. కైలాష్ గతంలో రాజస్థాన్ శాసనసభ స్పీకర్‌గా పనిచేశారు. గత నెలలో అర్జున్ రామ్‌పై ఆయన తీవ్రమైన అవినీతి ఆరోపణలు చేశారు. రాష్ట్రంలోని చురా జిల్లాలో అధికారిగా పనిచేసినప్పుడు అర్జున్ కోట్లాది రూపాయలను ముడుపులుగా పుచ్చుకున్నాడని చెప్పారు.

రాజస్థాన్ శాసనసభకు డిసెంబర్‌లో ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో కైలాష్, అర్జున్ మధ్య నెలకొన్న విభేదాలు బీజేపీని కలవరపరుస్తున్నాయి. పార్టీలో కింది స్థాయి నుంచి పై స్థాయి వరకూ అంతర్గత కుమ్ములాటలు జరుగుతున్నాయని కైలాష్ తెలిపారు. మాజీ ముఖ్యమంత్రి వసుంధర రాజెకు సన్నిహితంగా ఉండే నాయకులను లక్ష్యంగా చేసుకొని విమర్శల దాడి చేస్తున్నారని మండిపడ్డారు. తనను పార్టీ పట్టించుకోవడం లేదని, పరివర్తన్ యాత్రలో పాల్గొనేందుకు అనుమతించడం లేదని విమర్శించారు. అర్జున్ వ్యవహారంపై ఇప్పటికే ప్రధాని మోడీకి లేఖ రాశానని, ఆయన లోక్‌సభ సభ్యత్వాన్ని రద్దు చేయాల్సిందిగా ఎన్నికల కమిషన్‌ను కూడా కోరతానని చెప్పారు. రాబోయే శాసనసభ ఎన్నికలలో స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేస్తానని, బీజేపీ అభ్యర్థిని వేలాది ఓట్ల మెజారిటీతో ఓడిస్తానని తెలిపారు.

చరిత్రను వక్రీకరిస్తే కాలగర్భంలో కలుస్తారు

(మొదటిపేజి తరువాయి)

తొమ్మిదేండ్లు పూర్తయినా ఇప్పటికీ అందరికీ డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు, పెన్షన్లు, రేషన్ కార్డులు, ఇండ్ల స్థలాలు, ఉద్యోగాలు కల్పించడంలో విఫలమైందన్నారు. తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటం అణగదొక్కపడుతున్న వారి గొంతుక అన్నారు. భూమి కోసం, భుక్తి కోసం, వెట్టి చాకిరీకి వ్యతిరేకంగా, దున్నేవాడికే భూమి కావాలని నిజాంకు, దొరలకు వ్యతిరేకంగా కమ్యూనిస్టుల నాయకత్వంలో జరిగిన పోరాటాన్ని బీజేపీ వక్రీకరిస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. మహత్తర పోరాటాన్ని హిందూ ముస్లిం గొడవలుగా చూపెట్టాలని కుట్ర పన్నుతున్నదన్నారు. ఆ కుట్రను ప్రజానీకం మొత్తం తిప్పి కొట్టాలని పిలుపునిచ్చారు. ఏనాటికైనా సమ సమాజ స్థాపన ఎర్రజెండా నాయకత్వంలో జరుగుతుందని, అందరికీ అన్ని రకాల హక్కులు సిద్ధిస్తాయని అన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ(ఎం) రాష్ట్ర కమిటీ సభ్యులు డబ్బికార్ మల్లేష్, రైతు సంఘం జిల్లా అధ్యక్షులు వీరేపల్లి వెంకటేశ్వర్లు, నాయకులు రవి నాయక్, రాగిరెడ్డి మంగారెడ్డి, సీతారాములు, రెమడాల పరశు రాములు, వినోద్‌నాయక్, జిట్టంగి సైదులు, తెలంగాణ గిరిజన సంఘం జిల్లా కార్యదర్శి కుర్ర శంకర్ నాయక్, ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు కార్యదర్శులు నరేష్, ఖమ్మంపాటి శంకర్ తదితరులు పాల్గొన్నారు.

ఏమిటీ నిర్లక్ష్యం..?

- సిద్దిపేట కలెక్టర్‌ను ప్రశ్నించిన హైకోర్టు

హైదరాబాద్ : మల్లన్నసాగర్ నిర్వాసితుల నివాసాల కల్పనకు 102 ఎకరాల భూసేకరణకు చెందిన లేఖలు ఇవ్వమంటే ఎందుకు ఇవ్వడం లేదని సిద్దిపేట జిల్లా కలెక్టర్‌ను హైకోర్టు ప్రశ్నించింది. గత ఆదేశాల మేరకు లేఖ ఇవ్వలేకపోతే ఆ మేరకు అఫిడవిట్ వేయాలన్న చట్ట నిబంధనలు కూడా తెలియదా అని ప్రశ్నించింది. భూసేకరణ నిమిత్తం గెజిట్ 41 జారీ కోసం ప్రింటింగ్ ప్రెస్‌కు రాసిన లేఖను వచ్చే విచారణ నాటికి అందజేయాలని చెప్పింది. లేనిపక్షంలో పరిణామాలు తీవ్రంగా ఉంటాయనీ, కోర్టుకు వచ్చి వివరణ ఇవ్వాల్సిఉంటుందని హెచ్చరించింది.

కాంగ్రెస్ కసరత్తు

(మొదటిపేజి తరువాయి)

రచిస్తోంది. అందుకు గాంధీభవన్‌లో ఓ లైబ్రరీని సైతం ఏర్పాటు చేయబోతున్నది.

సభలను అడ్డుకునే సంస్కృతి ఇక్కడే : ఠాక్రే

ప్రతిపక్ష పార్టీల సభను అడ్డుకునే సంస్కృతిని తెలంగాణ రాష్ట్రంలో చూస్తున్నానని రాష్ట్ర కాంగ్రెస్ వ్యవహారాల ఇంచార్జి మాణిక్‌రావు ఠాక్రే చెప్పారు. సీడబ్ల్యూసీ సమావేశాలు దేశానికి మంచి సంకేతం ఇస్తామని ఆశాభావం వ్యక్తం చేశారు.

బీజేపీ, బీఆర్ఎస్ ఒక్కటై విజయభేరి సభను అడ్డుకునే ప్రయత్నం చేస్తున్నాయని విమర్శించారు.

నియోజకవర్గాల వారీగా చార్జిషీట్ విడుదల : సంపత్‌కుమార్

ఇప్పటికే బీఆర్ఎస్ ప్రభుత్వంపై కాంగ్రెస్ పార్టీ చార్జిషీట్ విడుదల చేశామని చార్జిషీట్ కమిటీ చైర్మెన్, ఏఐసీసీ కార్యదర్శి సంపత్ కుమార్ తెలిపారు. త్వరలో నియోజకవర్గాల వారీగా విడు దల చేస్తామన్నారు. అందులో ఎమ్మెల్యేలు చేసిన అరాచకాలు, అమలు కానీ హామీలు ఉంటాయని తెలిపారు. ఈ తొమ్మిదేండ్ల బీఆర్ఎస్ అసమర్థ పాలనను ప్రజల్లోకి తీసుకెళతామన్నారు. 'తిరగబ డుదాం...తరిమికొడదాం' కార్యక్రమాన్ని పోస్టు కార్డు ద్వారా ప్రతి ఇంటికి చేరవేయాలని కోరారు.

విజయభేరికి విస్తృత ప్రచారం :కుసుమకుమార్, చామలకిరణ్‌కుమార్‌రెడ్డి

తుక్కుగూడ విజయభేరి సభను విజయవంతం చేసేందుకు విస్తృత ప్రచారం చేస్తున్నామని కమ్యూనికేషన్ అండ్ మీడియా కమిటీ చైర్మెన్ కుసుమకుమార్, పార్టీ ఉపాధ్యక్షులు చామల కిరణ్‌కుమార్‌రెడ్డి చెప్పారు. సభకు ముఖ్యనేతలతోపాటు 29 రాష్ట్రాలు, ఏడు కేంద్ర పాలిత ప్రాంతాల్లో ఉన్న టీపీసీసీ, సీఎల్పీ నాయకులు వస్తున్నారని వివరించారు. ఏఐసీసీ మాదిరిగా గాంధీభవన్‌లో లైబ్రరీ,రీసెర్చ్ వింగ్ ఏర్పాటు చేస్తున్నామన్నారు.

తప్పనిసరిగా హాజరుకండి

న్యూఢిల్లీ: ఈ నెల 18 నుంచి 22 వరకు జరగనున్న పార్లమెంటు ప్రత్యేక సమావేశాలకు హాజరు కావాలని బిజెపి, కాంగ్రెస్ తమ ఎంపీలకు విప్‌లు జారీ చేశాయి. ఎంపీలు పార్లమెంట్‌కు హాజరు కావాలని, పార్టీ వైఖరికి మద్దతు ఇవ్వాలని కోరుతూ కాంగ్రెస్ విప్ జారీ చేసింది. ముఖ్యమైన బిల్లులపై చర్చించేందుకు, ప్రభుత్వ వైఖరికి మద్దతివ్వడానికి పార్లమెంట్‌కు హాజరు కావాలని బిజెపి తమ ఎంపీలను కోరింది. ఈ నెల 18 నుంచి ప్రారంభమయ్యే ఐదు రోజుల పార్లమెంట్ సమావేశాల్లో.. 75 ఏళ్ల పార్లమెంటు ప్రయాణం, విజయాలు, అనుభవాలు, జ్ఞాపకాలు, రాజ్యాంగ సభ నుంచి ఇప్పటి వరకు ప్రయాణంపై ప్రత్యేక చర్చను ప్రభుత్వం ప్రక్రియలో జాబితా చేసింది. చీఫ్ ఎలక్షన్ కమిషనర్, ఇతర ఎన్నికల కమిషనర్ల నియామకానికి సంబంధించిన బిల్లును కూడా ప్రభుత్వం ప్రొసీడింగ్స్‌లో జాబితా చేసింది. గత వర్షాకాల సమావేశాల్లోనే ఈ బిల్లును రాజ్యసభలో ప్రవేశపెట్టారు. పార్లమెంట్ ప్రత్యేక సమావేశాలు పాత భవనంలో కాకుండా కొత్త భవనంలో సభా కార్యక్రమాలు జరిగే అవకాశం ఉంది. లోక్‌సభకు జాబితా చేయబడిన ఇతర బిల్లులలో న్యాయవాదుల (సవరణ) బిల్లు, 2023 ప్రెస్ అండ్ రిజిస్ట్రేషన్ ఆఫ్ పీరియాడికల్స్ బిల్లు, 2023 ఉన్నాయి. ఈ బిల్లులన్నీ ఇప్పటికే రాజ్యసభ ఆమోదించింది. ఇవే కాకుండా.. 'పోస్టాఫీసు బిల్లు, 2023' కూడా లోక్‌సభ ప్రొసీడింగ్స్‌లో జాబితా చేయబడింది. ఈ బిల్లును ఆగస్టు 10న రాజ్యసభలో ప్రవేశపెట్టారు. ఈ జాబితా తాత్కాలికమైనదని.. మరిన్ని అంశాలను జోడించే అవకాశముందని సంబంధిత వర్గాలు తెలిపాయి. పాత పార్లమెంట్ భవనంలో ప్రత్యేక సమావేశాలు ప్రారంభం కానుండగా.. మరుసటి రోజు కొత్త భవనంలో సభా కార్యక్రమాలు జరిగే అవకాశం ఉంది. సెప్టెంబర్ 18న ప్రారంభమయ్యే ఐదు రోజుల పార్లమెంట్ ప్రత్యేక సమావేశాలకు ముందుగా.. ప్రభుత్వం ఈ నెల 17న అఖిలపక్ష సమావేశాన్ని ఏర్పాటు చేసింది.

చంద్రబాబు బెయిల్ కేసు 20కి వాయిదా

(మొదటిపేజి తరువాయి)

చేశారు. ర్యాలీ నిర్వహించేందుకు పోలీసుల నుంచి ముందుగా అనుమతి తీసుకున్నామని, అంగళ్లు కూడలికి ర్యాలీ చేరుకోగానే అధికారపార్టీ వాళ్లు కాన్వాయిపై రాళ్లు వేశారని పిటిషన్‌లో పేర్కొన్నారు.

వివరాలు సమర్పించేందుకు వారం రోజుల గడువు కావాలని పోలీసుల తరపున అదనపు పిపి దుష్యంత్ రెడ్డి కోరడంతో హైకోర్టు అనుమతినిచ్చింది.

నారాయణ కేసులు 25కు వాయిదా

రాజధాని అమరావతి ప్రాంతంలో అసైన్డ్ భూముల కొనుగోలు వ్యవహారంపై మాజీ మంత్రి పి నారాయణ, ఇతరులపై 2020లో సిఐడి నమోదు చేసిన కేసును సవాల్ చేసిన పిటిషన్‌పై హైకోర్టు విచారణ ఈ నెల 25కు వాయిదా పడింది. ఇదే తరహాలోని పిటిషన్లను కూడా ఈ వ్యాజ్యంతో జత చేయాలని రిజిస్ట్రీని ఆదేశించింది. పిటిషనర్లపై తొందరపాటు చర్యలు వద్దంటూ గతంలోని మధ్యంతర ఉత్తర్వులను మరోసారి పొడిగించింది. ఈ నెల 25న జరిగే విచారణలో ఇరుపక్షాలు వాదనలు వినిపించాలని ఉత్తర్వులు జారీ చేసింది.

చంద్రబాబుతో జనసేన నేత ములాఖత్

రానున్న ఎన్నికల్లో టీడీపీతో కలిసే జనసేన పోటీ చేస్తుందని ఆ పార్టీ అధినేత పవన్‌కల్యాణ్ స్పష్టం చేశారు. 'స్కిల్ స్కామ్‌లో తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరం సెంట్రల్ జైలులో రిమాండ్‌లో ఉన్న టీడీపీ అధినేత నారా చంద్రబాబునాయుడును బాలకృష్ణ, లోకేష్‌లతో కలిసి ఆయన గురువారం ములాఖత్ అయ్యారు. 40 నిమిషాల ములాఖత్ అనంతరం బాలకృష్ణ, లోకేష్‌లతో కలిసి ఆయన విలేకర్ల సమావేశం నిర్వహించారు.

ఈ సందర్భంగా పవన్ మాట్లాడుతూ.. 'గత ఎన్నికల్లో విధానాల పరంగా భిన్నమైన ఆలోచనలు ఉండటంతో విడిగా పోటీ చేశాం. మా నాన్న అస్థికలు కాశీలో కలపడానికి వెళ్లినప్పుడు ముంబైలో బాంబు దాడి జరిగింది. తరువాత పార్లమెంట్‌పై దాడి జరిగింది. దేశానికి బలమైన నాయకుడు కావాలనే ఆకాంక్షతో మోడీకి మద్దతు తెలిపాను. నాటి నుంచి నేటి వరకూ మోడీ పిలిస్తేనే వెళ్లాను' అని అన్నారు. చంద్రబాబు రిమాండ్ ముమ్మాటికీ రాజకీయ కక్షసాధింపే అని అన్నారు.

కవితకు మరోసారి ఈడీ నోటీసు

న్యూఢిల్లీ : ఢిల్లీ మద్యం కుంభకోణం కేసు మరోసారి చర్చనీయాంశమవుతోంది. గత కొద్ది రోజులుగా స్తబ్దతగా ఉన్న ఈ కేసు తెరపైకి వచ్చింది. ఈ కేసులో ఆరోపణలు ఎదుర్కొంటున్న బీఆర్ఎస్ ఎమ్మెల్సీ, సీఎం కేసీఆర్ కుమార్తె కల్వకుంట కవితకు తాజాగా ఈడీ నోటీసు జారీ చేసింది. నేడు (శుక్రవారం) విచారణకు హాజరుకావాలంటూ నోటీసులో పేర్కొంది. కవితను అరెస్టు చేస్తారని గతంలోనే వార్తలొచ్చాయి. కానీ అలాంటిదేమీ రగలేదు. దీంతో ప్రతిపక్షాలు విమర్శలు గుప్పించాయి. ఇది బీఆర్ఎస్, బీజేపీ ఒక్కటేనని ఆరోపణలకు తావిచ్చింది. ఇలాంటి తరుణంలో ఉన్నట్టుండి కవితకు నోటీసులు ఇవ్వడం మరోసారి చర్చకు దారి తీసింది.

సౌత్ గ్రూప్‌లో ఉన్నవాళ్లంతా అప్రూవర్లుగా మారిపోయారు. దీంతో ఈ కేసు మళ్లీ మొదటికొచ్చింది. ఇందులో భాగంగానే కవితకు ఈడీ మళ్లీ నోటీసులు ఇచ్చిందన్న చర్చ నడుస్తున్నది. తాజాగా మరోసారి ఈడీ నోటీసు ఇవ్వడంతో కవిత అరెస్టుపైనా ఊహాగానాలు వెల్లువెత్తుతున్నాయి.

ఆగని మృత్యుఘోష

(మొదటిపేజి తరువాయి)

వరద నీరు పోటెత్తడంతో భవనాల్లో నిద్రిస్తున్నవారు నిద్రలోనే మధ్యధరా సముద్రంలోకి కొట్టుకుపోయారు. మరణించిన వారి సంఖ్య, తప్పిపోయిన వారి సంఖ్య వేలల్లోనే ఉండవచ్చని డేర్నా మేయర్ అబ్దుల్ మేనమ్ తెలిపారు. విపత్తు కారణంగా నగరంలో మరణాల సంఖ్య 18,000 నుంచి 20,000 మధ్య ఉండవచ్చని అంచనా వేస్తున్నట్టు వెల్లడించారు. తప్పిపోయిన వారి కోసం విస్తృతంగా గాలిస్తున్నామన్నారు. అయితే వాస్తవానికి, మృతదేహాలను వెలికితీసేందుకు తమకు ప్రత్యేక బృందాలు అత్యవసరమని అన్నారు. శిథిలాల కింద నీటిలో పెద్ద సంఖ్యలో మృతదేహాలు ఉన్నందున అంటువ్యాధులు ప్రబలే అవకాశం ఉందని భయపడుతున్నట్టు తెలిపారు.

తన కుటుంబసభ్యులను 50 మందిని కోల్పోయానని హుసాది మీడియాకు వివరించారు. తన భార్య పిల్లలు, ఇతర బంధువుల కోసం పునరావాస కేంద్రాలు, ఆస్పత్రులు అన్నిచోట్ల వెతుకుతున్నాననీ, కానీ ఇప్పటివరకు వారి ఆచూకీ లభించలేదని కన్నీటి పర్యంతమయ్యారు. తనతోటి కార్మికులు, వారి కుటుంబసభ్యులు వరదకు సముద్రంలోకి కొట్టుకుపోయారని మరో వ్యక్తి మొహ్మద్ అదమ్ తెలిపారు. అర్ధరాత్రి సమయంలో ఒక్కసారిగా పెద్ద శబ్దంతో వరదనీరు ముంచెత్తిందని అన్నారు.

లిబియాకు సాయం అందించేందుకు పలు దేశాలు ముందుకొచ్చాయి. ఈజిప్ట్, టునీషియా, యూఏఈ, టర్కీ, ఖతార్ నుంచి సహాయక బృందాలు లిబియాకు చేరుకున్నాయి. రెండు ఫీల్డ్ ఆస్పత్రులను ఏర్పాటు చేసేందుకు అవసరమైన పరికరాలతో కూడిన ఓడను టర్కీ పంపింది. ఇటలీ మూడు విమానాల నిండా అత్యవసర సామగ్రి, సిబ్బందిని, రెండు నౌకలను పంపింది. డెర్నా ఓడరేవు శిథిలాలతో నిండిపోవడంతో అత్యవసరం కావచ్చని పేర్కొంది

సనాతన ధర్మాన్ని నాశనం చేస్తున్నారు

(మొదటిపేజి తరువాయి)

విమర్శించారు. కాగా ప్రధాని వ్యాఖ్యలపై కాంగ్రెస్ మండిపడింది. ప్రతిపక్షాలను దూషించడానికి ప్రభుత్వ కార్యక్రమాన్ని వాడుకున్నారని కాంగ్రెస్ నేత జైరాం రమేష్ ఎక్స్‌లో ట్వీట్ చేశారు. జీఏ-ఎన్డీఏ (గౌతమ్ అదానీ ఎన్డీఏ)కు మోడీ నేతృత్వం వహిస్తున్నారని అందరికీ తెలిసిన విషయమేనని వ్యాఖ్యానించారు.

ఆకర్షణీయమైన వీడియోలతో జీవితాల్లో మార్పు : డాక్టర్ అచ్యుత సమంత

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

ప్రార్థన, ఆర్ట్ ఆఫ్ లివింగ్ తదితర కార్యక్రమాలకు సంబంధించిన ఆకర్షణీయమైన వీడియోల ద్వారా జీవితాల్లో మార్పు తీసుకొచ్చినట్టు కళింగ ఇన్ స్టిట్యూట్ ఆఫ్ ఇండస్ట్రియల్ టెక్నాలజీ (కేఐఐటీ), కళింగ ఇన్ స్టిట్యూట్ ఆఫ్ సోషల్ సైన్సెస్ (కేఐఎస్ఎస్) వ్యవస్థాపకులు, లోక్‌సభ సభ్యుడు డాక్టర్ అచ్యుత సమంత తెలిపారు. గురువారం హైదరాబాద్‌లోని అడ్మినిస్ట్రేటివ్ స్టాఫ్ కాలేజ్ ఆఫ్ ఇండియా (అస్కీ)లో "ట్రాన్స్‌ఫార్మింగ్ లైవ్స్ త్రూ ఎడ్యుకేషన్: ది కేఐఐటీ అండ్ కేఐఎస్ఎస్ స్టోరీ" అనే అంశంపై ఆయన ప్రసంగించారు. ఈ సందర్భంగా ఆయన కేఐఐటీ, కేఐఎస్ఎస్‌ల ప్రస్థానాన్ని వివరించారు. ఈ కార్యక్రమానికి అస్కీ చైర్మెన్ కె.పద్మనాభయ్య స్వాగతం పలికారు.

నవతెలంగాణ
జాతీయ ఇంజనీర్స్ దినోత్సవం
వరంగల్ । శుక్రవారం 15 । సెప్టెంబర్ । 2023
ప్రత్యేక అనుబంధం
మోక్షగుండం విశ్వేశ్వరయ్య జన్మదినం

నవచిత్రం

క్లీన్ ఫ్యామిలీ ఎంటర్‌టైనర్



కథానాయకుడు నాని లేటెస్ట్‌గా నటిస్తున్న పాన్ ఇండియా చిత్రం 'హాయ్ నాన్నా'. ఈ చిత్రానికి సంబంధించిన మ్యూజికల్ ప్రమోషన్స్ గ్రాండ్‌గా ప్రారంభం కానున్నాయి. ఇందులో భాగంగా మేకర్స్ గురువారం ఈ సినిమాలోని మొదటి పాట 'సమయమా..'ను విడుదల చేసే తేదీని అనౌన్స్ చేశారు. ఈ పాట ఈనెల 16న విడుదల కానుంది. ఈ పాటను అనౌన్స్ చేస్తూ తెలిపే పోస్టర్‌లో నాని చిరునవ్వుతో ఆనందంగా కనిపిస్తున్నారు. నూతన దర్శకుడు శౌర్యువ్ దర్శకత్వం వహించిన ఈ చిత్రాన్ని వైర ఎంటర్‌టైన్‌మెంట్స్‌పై మోహన్ చెరుకూరి, డాక్టర్ విజయేందర్ రెడ్డి తీగల నిర్మిస్తున్నారు. ఈ చిత్రానికి హేషమ్ అబ్దుల్ వహాబ్ సంగీతం అందించారు. మృణాల్ ఠాకూర్ కథానాయికగా నటిస్తుండగా, బేబీ కియారా ఖన్నా ఈ కంప్లీట్ ఫ్యామిలీ ఎంటర్‌టైనర్‌లో కీలక పాత్రలో కనిపించనుంది. 'గ్లింప్స్ సినిమాపై పాజిటివ్ బజ్ క్రియేట్ చేసింది. గతంలోని నాని సినిమాల మాదిరిగానే 'హాయ్ నాన్న' చార్ట్‌బస్టర్ ఆల్బమ్‌గా ఉంటుంది. డిసెంబర్ 21న తెలుగు, తమిళం, కన్నడ, మలయాళం, హిందీ భాషల్లో ఈ సినిమా ప్రేక్షకుల ముందుకు రానుంది' అని చిత్ర బృందం తెలిపింది. ఈ చిత్రానికి డీవోపీ: సాను జాన్ వర్గీస్.


మింగిల్ కన్నా సింగిల్ బెటర్

సితార ఎంటర్‌టైన్‌మెంట్స్ నుంచి రాబోతున్న యూత్‌ఫుల్ ఎంటర్‌టైనర్ 'మ్యాడ్'. సూర్యదేవర నాగ వంశీ సమర్పిస్తున్న ఈ సినిమాతో సూర్యదేవర హారిక నిర్మాతగా, కళ్యాణ్ శంకర్ దర్శకుడిగా పరిచయమవుతున్నారు. ఫార్చ్యూన్ ఫోర్ సినిమాస్ పై సాయి సౌజన్య ఈ చిత్రానికి సహ నిర్మాతగా వ్యవహరిస్తున్నారు. ఈ వినోదాత్మక చిత్రంలో నార్నే నితిన్, సంగీత్ శోభన్, రామ్ నితిన్, శ్రీ గౌరీ ప్రియా రెడ్డి, అనంతిక సనీల్‌కుమార్, గోపికా ఉద్యాన్ ప్రధాన పాత్రలు పోషిస్తున్నారు.గురువారం ఈ సినిమా నుంచి 'ప్రౌడ్సే బోలో ఐ యామ్ సింగిల్' అనే పాటను చిత్ర బృందం విడుదల చేసింది. జీవితంలో మింగిల్ కాకుండా.. సింగిల్‌గా సంతోషంగా, గర్వంగా ఎలా ఉండవచ్చో ప్రధాన పాత్రలకు వివరిస్తున్నట్టుగా ఈ పాట సాగింది. ఈ సాంగ్‌లోని మ్యూజిక్ ఎవరితోనైనా కాలు కదిపించేలా ఉంది. ఇక సాహిత్యం యువత మెచ్చేలా.. ముఖ్యంగా లింగభేదాలు లేకుండా ప్రతి ఒక్కరినీ అలరిస్తోంది. ఈ పాట ప్రేక్షకుల్లో, ముఖ్యంగా యువతలో సినిమా చూడాలనే ఆసక్తిని రెట్టింపు చేసేలా ఉంది. ఈ చిత్రానికి సంబంధించిన మరిన్ని వివరాలు త్వరలో వెల్లడికానున్నాయి అని చిత్రయూనిట్ తెలిపింది. ఈ చిత్రానికి సంగీతం: భీమ్స్ సిసిరోలియో, ఎడిటర్: నవీన్ నూలి, డీఓపీ: షామ్‌దత్ సైనుద్దీన్, దినేష్ కృష్ణన్ బి, ఆర్ట్: రామ్ అరసవిల్లి, అడిషనల్ స్క్రీన్ ప్లే: ప్రవీణ్ పట్టు, ప్రణయ్ రావు తక్కళ్లపల్లి, ఫైట్ మాస్టర్: కరుణాకర్.



Printed And Published By Nandayala Narsimha Reddy On Behalf Of Navatelangana Printers Private Limited, Printed At Nava Telangana Printers Private Limited Near Manair Hanuman Temple, Godavarikhani Bypass Road, Housing Board Colony, Karimnagar-505001, Telangana State, Published At Navatelangana Printers Private Limited, Near Manair Hanuman Temple, Godavarikhani Bypass Road, Housing Board Colony, Karimnagar-505001, Telangana State. Editor : R.Sudha Bhaskar. TEL TEL/2015/60887.

నవచిత్రం



క్లీన్ ఫ్యామిలీ ఎంటర్‌టైనర్

కథానాయకుడు నాని లేటెస్ట్‌గా నటిస్తున్న పాన్ ఇండియా చిత్రం 'హాయ్ నాన్నా'. ఈ చిత్రానికి సంబంధించిన మ్యూజికల్ ప్రమోషన్స్ గ్రాండ్‌గా ప్రారంభం కానున్నాయి. ఇందులో భాగంగా మేకర్స్ గురువారం ఈ సినిమాలోని మొదటి పాట 'సమయమా..'ను విడుదల చేసే తేదీని అనౌన్స్ చేశారు. ఈ పాట ఈనెల 16న విడుదల కానుంది. ఈ పాటను అనౌన్స్ చేస్తూ తెలిపే పోస్టర్‌లో నాని చిరునవ్వుతో అనందంగా కనిపిస్తున్నారు. నూతన దర్శకుడు శౌర్యువ్ దర్శకత్వం వహించిన ఈ చిత్రాన్ని వైర ఎంటర్‌టైన్‌మెంట్స్‌పై మోహన్ చెరుకూరి, డాక్టర్ విజయేందర్ రెడ్డి తీగల నిర్మిస్తున్నారు. ఈ చిత్రానికి హేషమ్ అబ్దుల్ వహాబ్ సంగీతం అందించారు. మృణాల్ ఠాకూర్ కథానాయికగా నటిస్తుండగా, బేబీ కియారా ఖన్నా ఈ కంప్లీట్ ఫ్యామిలీ ఎంటర్‌టైనర్‌లో కీలక పాత్రలో కనిపించనుంది. 'గ్లింప్స్ సినిమాపై పాజిటివ్ బజ్ క్రియేట్ చేసింది. గతంలోని నాని సినిమాల మాదిరిగానే 'హాయ్ నాన్న' చార్ట్‌బస్టర్ ఆల్బమ్‌గా ఉంటుంది. డిసెంబర్ 21న తెలుగు, తమిళం, కన్నడ, మలయాళం, హిందీ భాషల్లో ఈ సినిమా ప్రేక్షకుల ముందుకు రానుంది' అని చిత్ర బృందం తెలిపింది. ఈ చిత్రానికి డీవోపీ: సాను జాన్ వర్గీస్.








జపాన్ డబ్బింగ్ షురూ

హీరో కార్తీ ప్రస్తుతం 'జోకర్' ఫేమ్ రాజు మురుగన్ దర్శకత్వంలో నటిస్తున్న అవుట్ అండ్ అవుట్ అడ్వెంచరస్ థ్రిల్లర్ చిత్రం 'జపాన్'. డ్రీమ్ వారియర్ పిక్చర్స్ పతాకంపై ఎస్ఆర్ ప్రకాష్‌బాబు, ఎస్ఆర్ ప్రభు సంయుక్తంగా నిర్మిస్తున్నారు. తాజాగా ఈ సినిమాకి సంబంధించి డబ్బింగ్ పనులు ప్రారంభం అయ్యాయి. కార్తి తన పాత్రకు డబ్బింగ్ చెబుతున్న వీడియోని మేకర్స్ విడుదల చేశారు. ఈ వీడియో చాలా ఆసక్తికరంగా ఉంది. కార్తి డబ్బింగ్ చెబుతుంటారు. కానీ టేక్ ఎంతకీ ఓకే అవ్వదు. చివరికి టైటిల్ రోల్ జపాన్ గెటప్‌తో వచ్చి చెప్పడంతో ఓకే అవుతుంది. ఈ వీడియో యూనిక్ కాన్సెప్ట్‌తో రూపొందిస్తున్న ఈ చిత్రంలో కార్తి డిఫరెంట్ లుక్స్‌లో కనిపించబోతున్నారు. కార్తీ సరసన అను ఇమ్మాన్యుయేల్ హీరోయిన్‌గా నటిస్తోంది. సునీల్ కీలక పాత్రలో కనిపించనున్న ఈ చిత్రంలో సినిమాటోగ్రాఫర్ విజయ్ మిల్టన్ తొలిసారిగా నటిస్తున్నారు. దీపావళి కానుకగా ఈ సినిమా ప్రేక్షకుల ముందుకు రానుంది.








మింగిల్ కన్నా సింగిల్ బెటర్

సితార ఎంటర్‌టైన్‌మెంట్స్ నుంచి రాబోతున్న యూత్‌ఫుల్ ఎంటర్‌టైనర్ 'మ్యాడ్'. సూర్యదేవర నాగ వంశీ సమర్పిస్తున్న ఈ సినిమాతో సూర్యదేవర హారిక నిర్మాతగా, కళ్యాణ్ శంకర్ దర్శకుడిగా పరిచయమవుతున్నారు. ఫార్చూన్ ఫోర్ సినిమాస్ పై సాయి సౌజన్య ఈ చిత్రానికి సహ నిర్మాతగా వ్యవహరిస్తున్నారు. ఈ వినోదాత్మక చిత్రంలో నార్నే నితిన్, సంగీత్ శోభన్, రామ్ నితిన్, శ్రీ గౌరీ ప్రియా రెడ్డి, అనంతిక సనీల్‌కుమార్, గోపికా ఉద్యాన్ ప్రధాన పాత్రలు పోషిస్తున్నారు.గురువారం ఈ సినిమా నుంచి 'ప్రౌడ్సే బోలో ఐ యామ్ సింగిల్' అనే పాటను చిత్ర బృందం విడుదల చేసింది. జీవితంలో మింగిల్ కాకుండా.. సింగిల్‌గా సంతోషంగా, గర్వంగా ఎలా ఉండవచ్చో ప్రధాన పాత్రలకు వివరిస్తున్నట్టుగా ఈ పాట సాగింది. ఈ సాంగ్‌లోని మ్యూజిక్ ఎవరితోనైనా కాలు కదిపించేలా ఉంది. ఇక సాహిత్యం యువత మెచ్చేలా.. ముఖ్యంగా లింగభేదాలు లేకుండా ప్రతి ఒక్కరినీ అలరిస్తోంది. ఈ పాట ప్రేక్షకుల్లో, ముఖ్యంగా యువతలో సినిమా చూడాలనే ఆసక్తిని రెట్టింపు చేసేలా ఉంది. ఈ చిత్రానికి సంబంధించిన మరిన్ని వివరాలు త్వరలో వెల్లడికానున్నాయి అని చిత్రయూనిట్ తెలిపింది.

ఈ చిత్రానికి సంగీతం: భీమ్స్ సిసిరోలియో, ఎడిటర్: నవీన్ నూలి, డీఓపీ: షామ్‌దత్ సైనుద్దీన్, దినేష్ కృష్ణన్ బి, ఆర్ట్: రామ్ అరసవిల్లి, అడిషనల్ స్క్రీన్ ప్లే: ప్రవీణ్ పట్టు, ప్రణయ్ రావు తక్కళ్లపల్లి, ఫైట్ మాస్టర్: కరుణాకర్.












మాయే చేసే..


నందమూరి కళ్యాణ్ రామ్ కథానాయకుడిగా నటిస్తున్న పీరియాడిక్ స్పై థ్రిల్లర్ 'డెవిల్'. 'ది బ్రిటీష్ సీక్రెట్ ఏజెంట్' అనేది ట్యాగ్ లైన్. అభిషేక్ నామా ఈ మూవీని డైరెక్ట్ చేస్తూ నిర్మిస్తున్నారు. లేటెస్ట్‌గా ఈ సినిమా నుంచి 'మాయే చేసే..' అనే పాటను ఈనెల 19న విడుదల చేయబోతున్నట్లు మేకర్స్ తెలిపారు. ఐకాన్ మ్యూజిక్ నుంచి ఈ సినిమాలోని పాటలను రిలీజ్ చేస్తున్నారు. 'ఈ చిత్రంలోని పాటలు ప్రేక్షకులను మంత్ర ముగ్ధులను చేస్తాయి. 'మాయే చేసే..' పాటను సింగర్ సిద్ శ్రీరామ్ పాడగా, హర్షవర్ధన్ రామేశ్వర్ సంగీతాన్ని అందించారు. సత్య ఆర్.వి పాటను రాశారు. ఇది ప్రారంభం మాత్రమే. నవంబర్ 24న ఈ చిత్రాన్ని ప్రపంచవ్యాప్తంగా గ్రాండ్ రిలీజ్ చేస్తున్నారు' అని చిత్ర యూనిట్ తెలిపింది.











Printed And Published By Nandayala Narsimha Reddy On Behalf Of Navatelangana Printers Private Limited, Printed At Nava Telangana Printers Private Limited Near Manair Hanuman Temple, Godavarikhani Bypass Road, Housing Board Colony, Karimnagar-505001, Telangana State, Published At Navatelangana Printers Private Limited, Near Manair Hanuman Temple, Godavarikhani Bypass Road, Housing Board Colony, Karimnagar-505001, Telangana State. Editor : R.Sudha Bhaskar. TEL TEL/2015/60887.